THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_206220
UNIVERSAL
LIBRARY

Osmania University Library

Call No T928.94834 Accession No T9742

S77P

Author

Title

This book should be returned on or before the date last marked below

శృంగార శ్రీనాథము

గ్రంథకర్త :
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

*

శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి
సంపాదకులు
డా॥ వేటూరి ఆనందమూర్తి

*

మణిమంజరి ప్రచురణలు
వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్ట్
హైదరాబాదు

Sri Prabhakara Sampurna Grandhavali-2
Manimanjari Prachuranalu
Sringara Sreemadhamu
By the late Sri Veturi Prabhakara Sastri

First Edition 1923
Second Edition 1985
Copies 1000

Title Design : Seela Veerraju

All Rights Reserved
Veturi Prabhakara Sastri Memorial Trust
2-2-18/15/D/1, Bagh Amberpet
Hyderabad-500013

Price Rs 50/—
(For members Rs 25/—)

Published by :
Manimanjari Prachuranalu
Veturi Prabhakara Sastri Memorial Trust, Hyderabad

Printed at
Master Art Printers
1-1-694/2/A, Gandhinagar
Hyderabad-500380.

శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి-౨

శృంగార శ్రీనాథము

గ్రంథకర్త

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

●

గ్రంథ ప్రశంస

డా॥ వానిలి వెంకటలక్ష్మీనరసింహారావు

డా॥ ముక్కామల రాధాకృష్ణశర్మ

●

మణిమంజరి ప్రచురణలు

వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్ట్

హైదరాబాదు.

వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్ట్‌వారి

మణిమంజరి ప్రచురణలు

(శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి గ్రంథములు)

1. ప్రబంధ రత్నావళి 15/- సభ్యులకు 8/-
   Prabandharatnavali 15-00 Proc, Dr. Public Libraries 11550/Te/300/1727.
2. నీతినిధి 18/- 9/-
   Neeti Nidhi - 18/- Proc. Dr. Public Libraries R-C-No. 5-E1/84 dt. 4-4-84
3. తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర 10/- 5/-
4. కామధేనువు కథ 10/- 5/-
   (ఇప్పుడే వెలువడినది)
5. కుమారసంభవము 25/- 12/-
   వ్యాఖ్య—సమర్శ; పాఠపరామర్శ
6. శృంగార శ్రీనాథము (పునర్ముద్రణము) 50/- 25/-
7. వేటూరివారి పీఠికలు—*I* 60/- 30/-
   (పునర్ముద్రణము)

[ట్రస్టు సభ్యులకు సగము ధరకే ఎప్పటికప్పుడు ఆచ్చయిన గ్రంథము అందజేయబడును.]

"మణిమంజరి" విశేష సంచికలు (ఒక్కొక్కటి) 15/- మొత్తము (1నుండి10వరకు) పది సంచికలు.

Manimanjari - 15/- Proc. Dr. Public Libraries.
R-c-No. 2-E 1/82 dt. 21-7-82.
Proc. Dr. School Education, Hyderabad.
R-C-No. 1672/64/82 dt. 28-7-82.
Recommended for Schools & Colleges.

ప్రతులకు : వివరాలకు

మేనేజింగ్ ట్రస్టీ; వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్ట్
2-2-18/15/D/1, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్-500013

శ్రీరస్తు

శృంగార శ్రీనాథము.

శ్రీనాథ చరిత్రము.

కర్త:
వేటూరి ప్రభాకరశాస్త్రి

వేటూరి శంకరశాస్త్రిచే
ప్రకటింపబడినది.

ప్రథమ ముద్రణ 2000 ప్రతులు.

కాపీరైట్ రిజిస్టర్డు]

వెల రు. 2.

బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
కె. కోదండరామయ్యచే ముద్రింపబడియె—1923.

M. Venkatarangaiya, M. A.
Professor of History and Economics.

Maharaja's College.
Vizianagram.
17-3-1924

ఆర్యా,

మీరు రచించిన 'శృంగార శ్రీనాథ'మను గ్రంథమును రెండవపర్యాయము చదివిముగించి ఈ యుత్తరమును వ్రాయుచున్నాను. ఇట్టి గ్రంథమిదివరకు మన భాషలో నెవరుగాని రచించి యుండలేదని నా దృఢాభిప్రాయము. ఈ కార్యమును కొన సాగించుటలో మీరు గావించిన పరిశోధన పరిశ్రమ పర్యంతీత ములు. మీతోటి పరిచయ భాగ్యము నాకిదివరకు కలుగక పోయినను మీ గ్రంథ పఠనము వలన నాకు కలిగిన పరమానంద మును సూచించుటకై నేనీ యుత్తరమును వ్రాయుచున్నాను. ఈ పర్యాయము నేను చెన్నపట్టము వచ్చినప్పుడు మీ దర్శనము చేసెదను. మీ నుండి ఎన్నియో క్రొత్త విషయములను నేర్చుకొన వలయునని కుతూహలపడుచున్నాను.

చిత్రగించవలెను.

ఇట్లు,
తమ విధేయుడు
మామిడిపూడి వెంకటరంగయ్య

మనవి

శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళిలో రెండవ కుసుమముగా ఇప్పుడీ ''శృంగార శ్రీనాథము'' పునర్ముద్రింపబడినది. ఈ గ్రంథము తొలి అచ్చు కూర్పు 1922-23లో జరిగినది. దానికి శ్రీముక్త్యాల సంస్థానాధీశ్వరులు నాడొసగిన ద్రవ్యసహాయ మొకింత తోడుపడినది. అట్లే అరవై మూడేండ్ల పిదప అమూల్యమైన ఈ చారిత్రక పరిశోధన గ్రంథమును పునర్ముద్రణకు తెచ్చుటలో నేటికి ఆంధ్రప్రదేశ ప్రభుత్వమువా రొసగిన ఆర్థికసహాయమును కొంత చేయూత నిచ్చినది. అట్టి ద్రవ్యసహాయమే వేళకందనిచో నాటికి నేటికి ఈ గ్రంథ ప్రకటనము అసాధ్యమే అయ్యేడిది.

నాడు శ్రీప్రభాకరులు తమ తొలిపలుకులో నిట్లు వ్రాసిరి.

''ఈ గ్రంథమును నేను బదియేండ్లకుఁ బూర్వము రచించి యచ్చునకుఁ దెచ్చుటకై యత్నించుటలో నప్పు డంతరశ్ప్రాయమయ్యెను. ఆగొడవ నిప్పుడు తడవనేల? తడవయినను నేఁడిట్లు ప్రపురిఁపగల్గినందుకయి సంతోషించుచున్నాడను.....

చరిత్రభాగమని గ్రంథవిమర్శభాగమని యీ గ్రంథమును దొలుత రెండు భాగములుగా రచియించితిని. కాని గ్రంథ బాహుళ్యముచే ఇపుడు ప్రథమ భాగము మాత్రమే ప్రకటించితిని. విమర్శ భాగము వేరొక గ్రంథముగా వెల్లడింప వలసియున్నది. తొలుత నే నీ ప్రథమ భాగమున వ్రాసిన విషయములు కొన్ని .... గ్రంథము పెద్దదియగుచున్నదన్న భీతిచే....అనేకాంశముల నచ్చునందు హర్షిస్వీకరించితిని. అనుబంధమునఁ జూపఁదగిన చరిత్ర సాధనములు నెన్నిటినో యట్లె పెట్టితిని....''

సుప్రసిద్ధులగు గ్రంథకర్తలకు వేళకు తగిన ద్రవ్యసహాయమందకను అచ్చువేసికొనుట కవకాశములు లేకను అపూర్వ రచన లెన్ని యెట్లు ప్రణష్టమై పోవుచుండినవో, నేటికిని పోవుచున్నవో, యెరుగుటకీ 'శృంగార శ్రీనాథము'ను ఒక గొప్ప ఉదాహరణముగా పేర్కొనవచ్చును.

ప్రభాకరులు శృంగార శ్రీనాథమును 1912 ప్రాంతములలోనే చరిత్ర భాగమనీ—గ్రంథవిమర్శ భాగమనీ రెండు విభాగములుగా ఒక గొప్ప పరిశోధన గ్రంథమును రచించిరి. గ్రంథమునైతే రచించిరిగానీ ముద్రించుటకు సొమ్మేదీ? ఆ ప్రయత్నమున కొన్నేండ్లేగాదు మొత్తము గ్రంథమే నష్టమైపోయినది. ఇది శ్రీ శాస్త్రిగారే (1922లో) అందిచ్చిన సమాచారము. పరిశోధకులు వారి తొలి పలుకును జాగ్రత్తగా పరిశీలింపవలసియున్నది.

నిరుత్సాహ నిహతులైనను రచయిత తామే గనుక వారే తిరిగి యెట్లో గ్రంథమున తొలివిభాగమును మాత్రము పునర్నిర్మించగలిగినట్లున్నారు; ఆదీ అప్పటికి కూర్పదగిన విధమున. ఫలితముగా వెలువడినదే ముద్రింపబడిన గ్రంథ భాగము. దాని రెండవ భాగమును తిరిగి వారు నాడు పునర్నిర్మించనూ లేదు. అచ్చుకు తేవలసిన ఆవశ్యకముకు కలుగలేదు. అనంతరకాలమున వారి దృష్టి యోగమార్గమునను ఆర్తులైనవారి నాదుకొనటలోనూ లగ్నమై 'సాహిత్యాది వ్యవహారములకు సుదూరమైన కార్యకలాపము'లందు నిష్ణమై యుండినది. కనుక తొలినాటి వారి ఇచ్ఛ పిదప నెరవేరనూలేదు.

ప్రణష్టమై పోయినది పోగా గ్రంథరూపమున నేడు మనకు దక్కినదింత మాత్రమే.నాడు చేజారిపోయిన సంపూర్ణగ్రంథ మది ఏనాటికైనలభించునేని అది ఆంధ్రుల యదృష్టము!

జరిగిన విషయ మిది కదా మరి యెరిగినవా రేమందురో వినుమని శ్రీ ప్రభాకరుల కడగొట్టు సోదరు లిద్దరినీ—పినతండ్రిదు పూజ్యులు డా।। చంద్రశేఖర శాస్త్రి (85 సం।। గారినీ, డా।। శంకరశాస్త్రి (83 సం।।)గారినీ-మొన్న కలిసి (5—10-85 నాడు)అడిగితిని. వారు పలికిన సాక్ష్యానికి సారాంశమిది.

'అన్నయ్య వెస్లీ మిషన్ హైస్కూలులో ఉద్యోగం విరమించి ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో చేరిన కాల మది. స్కూలు వదలి కొత్త ఉద్యోగంలో ప్రవేశించే సందర్భంలో అప్పటి హెడ్మాష్టరు జె.యస్.ఎం. హూపర్ అన్నయ్యమీదిఅభిమానంతో ఆయనకొక 'అలెగ్జాండ్రా' పెన్ను బహూకరించారు వీడ్కోలుసభ పెట్టి. ఆ విషయం ప్రస్తావిస్తూ ఆ బంగారు పాశీకలంతో అన్నయ్య అప్పుడు కళ్లేపల్లికి, నాన్నకు, ఓ ఉత్తరం రాశాడుకూడా. ఆ కలాన్ని అన్నయ్య ప్రీతితో వాడుకొనే

వాడు. దాంతోనే అన్నయ్య అరటిమొవ్వల్లాంటి తెల్లటి కాగితాలమీద శృంగార శ్రీనాథం రాస్తుండేవాడు. గురుజాడ అప్పారావుగారి కొడుకు రామదాసు కిచ్చాడు అన్నయ్య ఆ పుస్తకాన్ని అచ్చువేయించే ఏర్పాటుచేస్తానంటే. ఆయన అశ్రద్ధ వల్ల అదికాస్తాపోయింది. ఆపని సాగలేదు "

అప్పారావుగారికి, ప్రభాకరశాస్త్రిగారికి, రామదాసుగారికి మైత్రి బాగాఉండే దనీ, వారిమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలూ బాగాసాగేవనీ ఉత్తరాలూ బోలెడుండేవనీ వారే చెప్పారు. ఆ లేఖలను ఎవరు తీసుకొన్నారో ఏమైనవోగానీ ఈనాడు మా సేకరములో అవి ఏవీ మిగలలేదు. విజయనగరంలో అప్పారావు పంతులుగారి యింటి నుండి శ్రీ చల్లా సూర్యనారాయణగారికి (18–10–1911) వ్రాసిన లేఖ ఒకటి మాకీమధ్య లభ్యమైనది. (చూ. మణిమంజరి 9-పు, 112) ఆఫీసుపనిమీద నాడు వారాప్రాంతాలకు వెళ్ళి కొన్నాళ్ళక్కడ ఉన్నట్లు తెలుస్తున్నది. ఆ సమీప కాలంలోనే మదరాసులో రామదాసుగారికి శాస్త్రిగారీ గ్రంథాన్ని ఇచ్చిన సంఘటన జరిగియుండును.

ఆనాడు కూపర్ ఏమి ఉద్దేశించి ఆ బంగారుపాళీకలాన్ని ప్రభాకరుల కిచ్చినాడోకానీ పాశ్చాత్య సాహిత్య విమర్శలోని ప్రామాణికతను పరతరించు కొని స్వర్ణపేటికలో నిక్షేపించుకోదగిన గొప్ప విమర్శ పరిశోధన గ్రంథం తెలుగు వాఙ్మయరంగాన వెలసినది. జాన్ మోర్లే సంపాదకత్వంలో వెలువడిన "English men of letters" అనే గ్రంథమాలికలోని గ్రంథకుసుమాలతో శృంగార శ్రీనాథము పోటిపడే రీతినున్నదని విజ్ఞులానాడే ఈ గ్రంథమును ప్రశంసించినారు.

మరి ప్రభాకరుల అంతర్యామి నిర్దేశమెట్టిదోకాని బదుకు సాగించుకొనుట కేర్పడిన వాఙ్మయ సేవలో 'అరకుడుపు సాగునట్లు పనిచేయుటకే మెసలనిచ్చినది గాని అంతకెక్కువగ పనిచేయుటకుగాని అంతకెక్కువగ సాధించుటకుగాని' ఆయనకు చోటియ్యకేపోయెను. పర్యవసానముగా వాఙ్మయరంగమున 'క్రీడావినోద మనుభవింపవలెనని కొండంత కోరిక చెలరేగుచున్నను ఆదినుండి కూడ దాని కర్థాంతరములు, ప్రతిషేధములు తటుచుగా నడ్డతగులుచు నిరుత్సాహమునేగొల్పు చుండినవి.

శ్రీ శాస్త్రిగారి జీవితమది యొగ వాఙ్మయ మార్గముల సంగమ స్థానము. ఉభయరంగములండును వారికృషి మౌలికము,బహుమూల్యము,చిరస్మరణీయము.

వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్ ట్రస్టువారు రెండేండ్లలో రానున్న ప్రభాకర శతజయంతి వత్సరము (1988)కోగా శ్రీవారి గ్రంథముల నన్నిటిని పునర్ముద్రింప తలంపుగొని కృషిచేయుచున్నారు. అచ్చుకిచ్చిన నాలుగు గ్రంథములలో శృంగార శ్రీనాథము, వేటూరివారిపీఠికలు ముగిసినవి వ్యాసమంజరి, చాటుపద్య మణిమంజరి అచిరకాలములోనే వెలువడనున్నవి. సహృదయులైన పాఠకుల సహకారమున, తెలుగువారి ఔదార్యముమూలమున, వ్యవస్థను పటిష్ఠ మొనరించుకొని తక్కినవాటినీ త్వరలో ప్రకటింపగల్గుదుమనియే విశ్వసించుచున్నాము.

1984 ఆరంభములోనే ఆరంభించినా అనివార్యకారణాలవలన ముద్రణము ముగించుటకెంతో ఆలస్యము జరిగినది. అందుకు మన్నింపు కోరుతూ ఈ విషయమున మాతో సహకరించినవారికందరికిని కృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాము. ముఖ్యముగా మేము కోరినవెంటనే అంగీకరించి గ్రంథమును గూర్చి ప్రశంసారూపమైన పరిచయవ్యాసములు వ్రాసి పంపిన మిత్రులు డా।। వానిలి వేంకట లక్ష్మీనరసింహారావుగారికిని, డా।। ఎం. రాధాకృష్ణశర్మగారికిని మా ధన్యవాదములు. మా కోరికను మన్నించి గ్రంథమును అచ్చుకిచ్చేముందు ప్రథమ ముద్రణము నొకమారు చూచి ముద్రణ స్థాలిత్యములను సరిపరచి తోడ్పడిన మిత్రులు డా।। రవ్వా శ్రీహరిగారికి మా కృతజ్ఞతలు. గ్రంథమును ముద్రించుతరి బాధ్యతను వహించి తమ ప్రెస్సులో అచ్చుపని మెచ్చుపనిగా నిర్వహించిన చిరంజీవి వానిలి వసంతకుమార్‌గారికి మా అభినందనలు.

ఆడిగిన వెంటనే యజ్ఞావకాశము ఆర్థికసహాయ మందించిన ఆంధ్రప్రదేశ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలశాఖవారికిని, ప్రత్యేకముగా, సహృదయులైన శ్రీ పి.వి.ఆర్.కె ప్రసాద్ IAS గారికిని, శ్రీ ఈరంకి వెంకటసుబ్బారావు గారికిని మా కృతజ్ఞతాభివందనము లర్పిస్తున్నాము. ఇంగ్లీషు మణిమంజరి ప్రచురణలను చదివి మెచ్చి ట్రస్టువారు చేపట్టిన కార్యభారమున పాలుపంచుకొని సత్యుత్తమైన సహాయ సహకారము లందిస్తున్న మిత్రులందరికిని మా వందనములు.

భవదీయుడు,

—వేటూరి ఆనందమూర్తి
గ్రంథ సంపాదకుడు

తొలిపలుకు

శ్రీనాథుఁడు శృంగారప్రియుఁడు. కావుననే తనకావ్యమున కాతఁడు శృంగారనైషధమని పేరిడినాఁడు. ఆయన కభిమతమగుటచే నీగ్రంథమున కావిధముననే నేనును శృంగారశ్రీనాథమని పేరిడితిని. ఇది నిక్కమగు చరిత్ర గ్రంథ మనఁ గాదు. చరిత్రగ్రంథమునఁ జెప్పఁబడు విషయములెల్ల నవియట్లే నడచినవని నిరూపింపఁ దగియుండవలెను. అందుకుఁలుగా దొరకిన చరిత్ర సాధనములకుఁ దొండిక కల్పించి సంభావ్యముగా శ్రీనాథునిచరిత్రము నిందు నేను సంధానించితిని. ఇందలి విషయములెల్ల నిట్లే నడిచిన వనఁగాదు. కాని, యుపలబ్ధము లయిన చరిత్రసాధనముల కివి యవిరోధములయి యనుకూలము లయి సంభావ్యములయి యుండఁగలవని మాత్రము జెప్పనగును. ఈ కారణముచే శ్రీనాథచరిత్రమనుట సనిగా నుండదని తలఁచి విడిచి పయిపేరు కయికొంటివి. శృంగార మీగ్రంథము పేరనేగాని లో నెక్కడను గావరాదు. ఈ పేరు నేటిబీఱ వంటిదే.

చరిత్రభాగమని గ్రంథవిమర్శభాగమని యీగ్రంథమును దొలుత రెండు భాగములుగా రచియించితిని. కాని గ్రంథబాహుళ్యముచే నిప్పుడు ప్రథమభాగము మాత్రమే ప్రకటించితిని. విమర్శభాగము వేఱొక గ్రంథముగా వెల్లడింపవలసి యున్నది. తొలుత నే నీప్రథమభాగమున వ్రాసిన విషయములు కొన్ని యిటీవల శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు మొదలగువా రాంధ్రులచరిత్రము మొదలగు వానియందు వేఱుగా నెఱిఁగి వెల్లడించిరి. అట్టివానిఁగొన్నింటి నిందు సంక్షేపించితివి; చర్వితచర్వణమేలయని. మఱియు గ్రంథము పెద్దదియగు

చున్నదన్న భీతిచే రెడ్డిరాజులచరిత్రము మొదలగు విషయములం దపూర్వముగా నేఁ బ్రాసిన యనేకాంశముల నచ్చునందు బ్రహస్వీకరించితిని.*

అనుబంధమునఁ జూపఁదగిన చరిత్రసాధనముల నెన్నిటినో యట్టిపెట్టితిని. ఇతరత్ర ముద్రితములయిన శ్రీనాథశాసనాదులను నేనిందు విడనాడితిని. ప్రసక్తములయిన చాటుధారలను బెక్కింటిఁ బరిత్యజించితిని. అవికొన్ని చాటు పద్యమణిమంజరి ప్రథమ ద్వితీయభాగములందున్నవి. పెక్కుపద్యములిప్పు డచ్చున కెక్కరానివిగా నున్నవి. "శ్రీనాథుని శృంగార వర్తనము" అనుపేర రచించిన ప్రకరణము నిందు ముద్రింపక మూలనుంచితిని.

ఈగ్రంథమునకు వలయుప్రధానసాధనముల నేను ప్రాచ్యలిఖితపుస్తక భాండారమునుండి పరిగ్రహించితిని. మఱియు శ్రీ చిలకూరి వీరభద్రరావు పంతులుగారు, మానవల్లి రామకృష్ణకవిగారు, జయంతి రామయ్య పంతులుగారు, వేపారామేశం పంతులుగారు, కొవ్వట్రాజు లక్ష్మణరావుపంతులుగారు, రంగస్వామి సరస్వతిగారు, ననువారి తోడ్పాటునుగూడఁ గొంత పడసితిని. శ్రీ వీరభద్రరావుగారి రండ్రుల చరిత్రమున శ్రీనాథ విషయము వ్రాయుటేకాక వేఱుగా శ్రీనాథుని చరిత్రమును గూడ విరచించిరి. కడచిన సంవత్సరమున నే నీగ్రంథమును ముద్రింపఁబట్టి పునఃపరిశోధనము చేయుచు శ్రీ వీరభద్రరావుగారి యొద్దనుండి వారు రచించిన శ్రీనాథచరిత్రము గైకొంటిని. వారి గ్రంథము నాకుఁగొన్నిపట్టులందు గొప్పసాహాయ్యము చేసినది. శ్రీ రామకృష్ణకవిగారు వారికడనున్న యపూర్వశాసన సంచయమును బదియేండ్లకుఁబూర్వము నాకొక మాఱొసఁగిరి. రెడ్లచరిత్రవిషయము లందుఁ గొన్ని యపూర్వాంశములను దాని వలన నేను గ్రహింపఁగలిగితిని. ఇటీవల నా శాసనములు దాక్షారామాది స్థలములనుండి దొరతనమువారు గైకొనివచ్చిరి. కొన్ని ప్రాచ్యలిఖిత పుస్తక శాలలోఁగూడ నున్నవి. పదియేండ్లకుఁబూర్వము శ్రీ జయంతిరామయ్యపంతులు

---

* రెడ్లచరిత్రమింక నెంతయేని వ్రాయవలసియున్నది. వ్రాసినదానిఁ గూడ నేనిందు విడనాడితిని అది ప్రత్యేకగ్రంథముగా వెలువడఁదగినది. ఒకనెల కాలేదు. నేనును నామిత్రుఁడు బి. యస్. శర్మ బి. యె., బి యల్. గారును, రెడ్లతామ్రశాసనములు రెండుకలవనివిని, గుంటూరునుండి తూములూరు కొల్లిపర

గారికడ నుండి నేనొకశాసనము ప్రాతప్రతినిగైకొని (పేజీ 127 చూ. అను బంధముకూడ చూ.) గ్రంథమున నుదాహరించితిని. ప్రాచ్యలిఖితపుస్తకాలలో నది తప్పులతో నున్నది. దానిఁబట్టి యిటీవల నాశాసనముఁగూర్చి మతభేదము లేర్పడినవి. ఇప్పుడా శాసనశిలయున్న చోటి కరిగి నేను దానిపాఠములను స్పష్టపఱుచుకొనివచ్చితిని. అది శ్రీరామయ్యపంతులుగారు నాకొసంగిన పాఠము ప్రకారముననే కలదు. బహుకాలమునకు ముందే నిర్దుష్టముగా నా శాసనమును రామయ్యపంతులుగారు వ్రాసికొని వచ్చియుంచుట నాకనుకూలమయ్యెను. ఇండియన్ ఆంటిక్వరీ, ఎపిగ్రాఫికాఇండికా, శాసనపరిశోధకుల రిపోర్టులు, మొదలగు చరిత్రసాధనముల నడిగినప్పుడెల్ల న్యాయమూర్తి వేపా రామేశం పంతులుగారు నాకొసఁగుచు వచ్చిరి. ఆంధ్రుల చరిత్రములు కవుల చరిత్రములు పరిషత్పత్రికలు, తాము రచించిన వ్యాసములు, కడచిన వత్సరము తడవుకాలము నాకడ నుండనిచ్చియుఁ గొన్ని చరిత్రాంశములందుఁ జర్చించియు శ్రీ కె. వి. లక్ష్మణరావుపంతులుగారు నాకు సాహాయ్యముచేసిరి. మూడేండ్లకుముందు దొరతనమువారి నిదేశమున శ్రీ రంగసామిసరస్వతిగారు శాసనములకొఱకును, నేను గ్రంథములకొఱకునునయి గుంటూరుమండలమునఁగలసి సంచరించితిమి. అప్పుడు శ్రీనాథశాసనములు కొన్ని క్రొత్తవి దొరకినవి మఱికొన్ని విషయములందుఁగూడ సరస్వతిగారి సాహాయ్యము నేను బడసితిని. ఇట్టి యుపకారములకయి పయివారియెడఁ గృతజ్ఞతాబద్ధుఁడనగుచున్నాఁడను. నాపుట్టుకకుఁగూడఁ బూర్వమే యంధ్రకవిచరిత్రముఁగూర్చి యధికముగాఁ బరిశ్రమించి మంచి గ్రంథము రచించినవారగుటచే వీరేశలింగముపంతులుగారి నిక్కుడ వినుతించుచున్నాఁడను. వారు కీర్తిశేషులు.

యను గ్రామములకు నివ్వులుచెఱుచుచున్న వేసవిగాడ్పులలో వెదలి విచారించితిమి. తూములూరులో నొకగొప్ప తామ్రశాసన మొక కోమటిబిడ్డని యింటనున్నది. ఎంతవేడినను నాతఁడాశాసనమును జూపినవాఁడుగాఁడు లేదు పొమ్మనెను. నేఁడు కాదనెను. కరగించితిననెను. ఏమేమో అనెను. మేమేమిచేయఁగలము! తూములూరులో దొరికిన తామ్రశాసనము నాయింటివారు చూడఁగూడదని, కీడు వచ్చునని పెద్దగోతిలో పూడిచి పెట్టిరని తెలిసినది. అలసి తిరిగి వచ్చితిమి:

ఈగ్రంథమును నేను ఐదియేండ్లకుఁబూర్వము రచించి యచ్చునకుఁ దెచ్చుటకై యత్నించుటలో నప్పుడంతరితప్రాయమయ్యెను. ఆగొడవ నిప్పుడు తడవనేలఁ తడవయినను నేఁడిట్లు ప్రచురింపఁగల్గినందుకయి పరితోషించుచున్నాఁడను.

శ్రీ ముక్త్యాలసంస్థానాధీశ్వరులగు శ్రీ రాజావాసిరెడ్డి చంద్రమౌళీశ్వర ప్రసాదబహద్దరుజమీందారుగారు నా యీ గ్రంథస్థితి నెఱిఁగి నిర్వ్యాజముగాఁ గొంతద్రవ్యము నొసఁగి శీఘ్రతరముగా నీగ్రంథము ముద్రితమగునట్లు చేసిరి. సత్త్వమధురస్వభావులయిన శ్రీవారికి నాయురారోగ్య రాజ్యాభ్యుదయసిద్ధిగా నీశ్వరుని ప్రార్థించుచు వారియెడఁ గృతజ్ఞతాబద్ధుడఁ నగుచున్నాఁడను.

ఈ గ్రంథము మొదటి నలువదియైదువుటలు మద్రాసునను కడమవి బెజవాడను ముద్రితమయినవి. బెజవాడలో వడివడిగా నాపరోక్షమున గ్రంథ ముద్రణము సాధ్యమగువంతవఱకుఁ జక్కఁగాజరిపిన యాంధ్రగ్రంథాలయ ముద్రాలయము వారిని సంభావించుచున్నాఁడను. ప్రధాన ప్రమాదములు కొన్ని సరిపఱిచితిమి. ఇంక నెన్నియున్నవో! ఎఱిఁగినవారు తెలుపుదురేని ద్వితీయ ముద్రణమున సవరించుకొందును.

పెదకళ్లేపల్లి,
రుధిరోద్గారి నిజజ్యేష్ఠము.

వేటూరి ప్రభాకరశాస్త్రి.

విషయసూచిక

ప్రథమ ప్రకరణము

కులగోత్రములు	4
తాత తండ్రులు	6
జన్మదేశము	,,
జీవితకాలము	9
పేరు	16
బాల్యము	17
విద్యాభ్యాసము : గురువు	,,
అభ్యసించిన విద్యలు	26
కుటుంబస్థితి	29
బాంధవము	30
బమ్మెరపోతన	32

ద్వితీయ ప్రకరణము

కొండపీటిరెడ్లు	38
ప్రోలయవేమారెడ్డి	41
అరపోతారెడ్డి	43
అనవేమారెడ్డి	47
కొమరగిరిరెడ్డి	49
కాటయ వేమన	51
పెదకోమటి వేమారెడ్డి	54
రెడ్డిరాజులయోగ్యత	56

తృతీయ ప్రకరణము

రాజాశయము	58

గ్రంథ రచనము	60
మరుత్తరాట్చరిత్రము	61
శాలివాహన సప్తశతి	,,
పండితారాధ్య చరితము	62
పెదకోమటి వేమని వైదుష్యము	63
పెదకోమటి వేమారెడ్డి కృతులు	64
ఆస్థాన కవీశ్వరులు	68
మంత్రికొండ్రు విద్వాంసులు	71
శ్రీనాథుడు : విద్యాధికారి	72
శృంగారనైషధ రచనాకాలము	78
హరవిలాస విషయము	80
తెలుగుచేత	87
సంస్కృత వ్యాఖ్యలు	,,
గద్యవిధము	89
అష్టప్రథ	90
గృహరాజసౌధము	92
కొండపిటి గాడిద	95
శాసనకృతులు	,,
కుమ్మనూతుల శాసనము	96
పొన్నపల్లి తామ్రశాసనము	97
కసుకుర్తి తామ్రశాసనము	100
కల్వపాములు ,,	101
పినపాడు ,,	102
పొన్నపల్లి ,,	103
పొట్లపాటి ,,	104
ఫిరంగిపురపు శిలాశాసనము	105
నందమూరు తామ్రశాసనము	106
ఆలపాడు ,,	107
పుల్లరిబోడు శిలాశాసనము	,,

రుద్రవరము తామ్రశాసనము 108
మూలగూరమ్మ కొండమీదిశాసనము ,,
పెదకోమటివేముని కాశీయాత్ర 109
పెదకోమటి వేమారెడ్డి యిక్కట్టులు 111
దేవరకొండ ప్రయాణము 112
రాచవేమన 114

చతుర్థ ప్రకరణము

కొండపిటి విప్లవము 115
శ్రీనాథునిచిక్కులు 117
కాంచీ ప్రయాణము ,,
హర విలాసము 118
అవచితిప్పయ 120
గద్యాంధ్రము 121
భీమఖండ రచనము 122
తెల్లాప్రగడ యాత్రాశయము 131
విస్సనగుండ్రాతి ప్రాప్తి 133

పంచమ ప్రకరణము

కనకాభిషేకము 136
డిండిమ భట్టారకులు 137

షష్ఠ ప్రకరణము

కర్ణాట దేశాటనము 164
సర్వజ్ఞ సింగభూపతి విషయము 165
సింగ భూపతి గ్రంథములు 171
రసార్ణవసుధాకరము ,,
చమత్కారచంద్రిక 174
అమరుశ్యాఖ్య 177
సర్వజ్ఞవిలాసము 178
సర్వజ్ఞసింగ భూపతి దర్శనము 179

సప్తమ ప్రకరణము

కాళింగ రచనము : వేమవీరభద్రారెడ్ల ప్రాపు	184
వేమవీరభద్రారెడ్ల యవసానము	196
అన్నదేవచోడుని వీరకృత్యములు	198
శ్రీనాథునకు మరల చిక్కులు	201
పంటమైలారుని యాశ్రయము	,,
పల్నాడు ప్రయాణములు	202
మొరసరాజ్యము	204

అష్టమ ప్రకరణము

పల్నాటి వీరచరిత్రము	205
పాటలు – పదాలు	213
కాటమ రాజు కథ	216
పీఠికాపురము	218
రావిపాటి త్రిపురాంతకుడు	219
వల్లభరాయడు	220
పోలికలు	222
దోషములు	228
శివరాత్రి మాహాత్మ్యము	232
విశాపవృత్తి మతము	,,
శాంతవిశాపవృత్తి	233
మఱికొన్ని గ్రంథములు	236
నందనందన చరిత్ర	,,
వల్లభాభ్యుదయము	237
కామశాస్త్రము	,,
ధనంజయ విజయము	238

నవమ ప్రకరణము

అవసానము 248
రెడ్ల వంశపృష్ఠము 248–249
స్వభావము 252
మతము 259
ఇతరకవులుచేసిన ప్రశంసలు 261
నాగ్నజిత్తీపరిణయము ,,
తారకబ్రహ్మరాజీయము ,,
మొల్లరామాయణము 262
వసుచరిత్రము ,,
శృంగార శాకుంతలము ,,
సాంబోపాఖ్యానము ,,
పట్టమెట్టసోమనాథ సోమయాజి 263
చారుచంద్రోదయము ,,
బహుళాశ్వచరిత్ర ,,
జానకీరాఘవము 264
చంద్రలేఖావిలాపము ,
బాలభాగవతము ,,
ఇందుమతీ పరిణయము ,,
ప్రబంధరాజవిజయవేంకటేశ్వరవిలాసము 265
అరుణాచలపురాణము ,,
రాజరాజాభిషేకము ,,
సమకాలము కవులు 266
పరిసమాప్తి 268

అనుబంధము

శ్రీరామాభిషేకపద్యములు 271
వెలుగోటివారి వంశచరిత్ర ,,
శ్రీనాథుని గ్రంథములకాలనిర్ణయము 275

శాసనములు	277
సింహాచలంమీద	280
బల్లేపల్లిలో	,,
చెఱుకుమిల్లిలో	282
కల్వపాముల	283
కసుపట్లు	284
పొన్నుపల్లి	285
పొన్నుపల్లె II	286
నందమూరు	287
ఆలపాడివేమునరం	288
రుద్రవరం	289
మూలగూరమ్మకొండ	290
కొండూరు	291
నవనాథ చరిత్ర పీఠిక నుండి	292
దాక్షారామశాసనము	293

డా॥ వి.వి.యల్. నరసింహారావు, డైరెక్టర్,
ఆం. ప్ర. ప్రాచ్యలిఖిత గ్రంథాలయ-పరిశోధనాలయము,
హైదరాబాద్–1.

ప్రభాకర శ్రీనాథము

''లోక నౌకకు కవీశ్వరులే కర్ణధారులు''

''బహుదేశములు తిరిగి, బహుళ శాస్త్రముల నెఱిగి, రసవత్కావ్య రచించి రాజాధిరాజుల పూజలు గొని, విద్వద్గోష్ఠులం దాటి తేఱి, విద్యావివాదములందు విజయము లంది, భువనత్రితకీర్తియై, పూర్ణపూరుషాయుష జీవియై, దివిజ కవి వరు గుండియలు దిగ్గురనునట్లు స్వర్లోక ప్రస్థానము సలిపిరి'' ''శ్రీనాథ కవి సార్వభౌముని వంటివాడు, ప్రఖ్యాత చరిత్రుడు–ఆంధ్ర కవీశ్వరులం దింకొక డగపడడు.''

యథాశక్తి సామగ్రోపలబ్ధి ఆసుకవిం చ్రమని చరిత్రము వినిపించుటయే ''శృంగారశ్రీనాథ'' గ్రంథకర్త శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తద్గ్రంథ రచనమున ఉద్దేశించిన లక్ష్యము.

గ్రంథ మీనాటిది కాదు; ఆరు దశాబ్దులుగా తెలుగువాడు శ్రీనాథుని చరిత్రముపై రుచులు పెంచిన గ్రంథము. చిరపరిచితమైన తద్గ్రంథమునకు ప్రకృత మిది పునర్ముద్రణము. ప్రథమ ముద్రణ ము 1923 లో. ద్వితీయ 1912 నాటికే సిద్ధమైయున్నట్లు తెలియుచున్నది

నిక్కి మరసిన ఇట్టి ప్రసిద్ధ గ్రంథములకు పరిచయవాక్యము లనావశ్యకములు. ఈ గ్రంథకర్త ప్రతిభాపాండిత్యములను వారసుడగు చరిత్రకారుడును, నాకు మార్చి మిత్రులుడు అగు ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారు నా యెడగల ప్రత్యయము పురస్కరించుకొని ఈ పరిచయ వాక్యములు వ్రాయుపని నప్పగించిరి.

గ్రంథనామము :

శ్రీనాథుడు 'నైషధీయ చరితము' తెనిగించి దానికి 'శృంగారనైషధ'మని పేరు పెట్టెను. అట్లే శ్రీ శాస్త్రిగారు శ్రీనాథ చరిత్రము ప్రచురింప తలపెట్టి ఈ గ్రంథమునకు "శృంగారశ్రీనాథ" మని పేరుపెట్టిరి. శృంగారనైషధము, శృంగార శాకుంతలము మొదలగు పేరులవలె నిదియు హృదయ రంజకముగా నున్నది. కాని శ్రీనాథుడు కేవల శృంగారియా? ఆను సందేహమున కీది తావీయకపోలేదు. 'శ్రీనాథుడు శృంగారియా?' అను నొక గ్రంథమే వెలువడుట సువిదితము.

శ్రీ శాస్త్రిగారును గ్రంథమున వాచ్యముగనే శ్రీనాథుడు పరమ శృంగారి యను భావమును వ్యక్తపరిచిరి. "నిరంతరము దేశాటనము సేయుచు విషయ లౌల్యమున వర్తించుచు వచ్చినవాడగుటచే నితనికి సంసారమునం దర్హమగు నానందము లభింపకపోయెడి దేమో యని సంశయము కల్గుచున్నది." (పుట 29) "శ్రీనాథునికి వైషయిక వాంఛ లత్యున్నతములు. భోగపరాయణతమెండు ప్రౌఢ నిర్భర వయఃపరిపాక కాల మగుటచే నాత డప్పుడు('భీమఖండ' రచన నాటికి) శృంగారరస సముద్రమున తెప్పదేలుచున్నాడు." (పుట 133) అంతమాత్రమున శ్రీనాథుని జీవితమంతయు శృంగారమయమని చెప్పలేము. శ్రీశాస్త్రిగారును అట్లు చెప్పలేదు. మీదు మిక్కిలి "శ్రీనాథున కద్వైతమందే తాత్పర్యము. అయినను శైవమతమునం దభిమాన విశేషము కలదు" (పుట 24) "ఎంత శృంగారియైనను చిరుతనాటినుండియు శైవమతాసక్తి గల్గియే యుండెననుటకు పండితారాధ్యచరిత్ర రచన మొక తార్కాణము. (పుట 83) పెక్కుమార్లాతడు పంచబ్రహ్మషడంగ మంత్రములతో ప్రాసాద పంచాక్షరిని స్మరించుచుండును." (పుట 24) అనియు స్పష్టముగా నాతని ఆత్మతత్త్వము నావిష్కరించినారు ఇంతకును మానవస్వభావమున రాగయోగములును రక్తిముక్తులును సహజ లక్షణములే యగుటచే రసజ్ఞులగు కవులయం దవి భక్తి కంగములగుట మిక్కిలియు సహజము లగుచుండును. శ్రీనాథుడు చవిచూచిన దుదాత్త శృంగారము ఆది భోజుని శృంగార ప్రకాశమున చెప్పబడిన తదుదాత్త శృంగారము పురుషార్థ పరాయణుడైన జీవికి కార్తీయము మోక్షమునకు ముందరి మెట్టగునది మరవరాని సత్యము. శ్రీనాథు డీరహస్య మెరిగిన ప్రౌఢ

కనుక యథోచిత శృంగార సంభావన మాతని కనివార్యమే యయ్యెను. ప్రభాకరు లది పసిపట్టి ఆతని చరిత్రమునకు 'శృంగార శ్రీనాథ'మని పేరు పెట్టుట సముచితమే. అంతేకాక 'అలంకార' మను నర్థాంతరముగల శృంగార శబ్దము మనోజ్ఞార్థమును స్ఫురింపజేయుట హృదయ రంజకమైన శ్రీనాథుని చరిత్రముగల గ్రంథమని స్పష్టముచేయుచున్నది. శ్రీ శాస్త్రిగారన్నట్లు శృంగార మీ గ్రంథమున నేఱుబీరలో నేయి వంటిదే.

ఈ దృష్టితో చూచినచో గ్రంథమునందు శ్రీనాథుని శృంగార విషయము లల్పములై చారిత్రిక విషయము లనల్పముగ గోచరించును. ప్రథమ ప్రకరణము శ్రీనాథుని కులగోత్రాదికముతోడను, ద్వితీయప్రకరణము రెడ్డిరాజుల విశేషముల తోడను తృతీయ చతుర్థములు రాజాశ్రయ గ్రంథ రచనాది విశేషములతోడను, పంచమము కవకాభిషేకముతోడను, షష్ఠము కర్ణాటదేశాటనాదికముతోడను, సప్తమము కాశీఖండ రచనాది విశేషములతోడను, అష్టమము పల్నాటి వీర చరిత్రాది రచనా విశేషములతోడను నండి, యావద్గ్రంథము చారిత్రిక విశేషముల తోడను రచనా విశేషములతోడను గూడియున్నది.

గ్రంథము పేరు పెంపుల ముచ్చట ముగించి గ్రంథస్థ విషయమును పరామర్శించుట మేలు.

గ్రంథస్థ విషయ పరామర్శ :

శ్రీనాథుని జన్మస్థలము గురించియు జననకాలము గురించియు గ్రంథముల రచనాకాలమును గురించియు శ్రీ శాస్త్రిగారు స్పష్టమైన అభిప్రాయములు వెలువరించిరి. చెప్పదలచిన అంశములను సందేహాస్పదముగ చెప్పనలవాటు వారికి లేనేలేదు.

శృంగారనైషధ రచనాకాలము : "పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చిన తర్వాతనే (క్రీ. శ. 1403 తర్వాతనే) శ్రీనాథుడు క్రీ 1410, 1415 ప్రాంతముల శృంగార నైషధమును రచించెనని నేను నిశ్చయించుచున్నాడను." (పుట 78)

హర విలాస రచనాకాలము : "హర విలాసము శ్రీనాథుని యవసాన కాలపు గ్రంథ మనుటను నేనంగీకరింపను. మఱియు నది కొమరిగిరి జీవిత కాలమందే రచింపబడిన దనుటను గూడ నంగీకరింపజాలను" (పుట 80)

శ్రీనాథ పినవీరనలు సమకాలికులని వ్రాసిన గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారి వ్రాత నుటంకించుచు శాస్త్రిగా రిట్లు వ్రాసిరి. "శ్రీ శ్రీరామమూర్తి పంతులుగారు వ్రాయగూడని వ్రాత వ్రాసినారు. ఆ యవప్రథ యడగార్ప దగినది" (పుట 90)

శ్రీ శాస్త్రిగారు తమ యభిప్రాయముల నింత కృతనిశ్చయముతో వ్రాయు నలవాటు గలవారు. ఖండితముగ చెప్ప వీలుగాని యంశములను "కొంచె మించు మించుగ" నని తామే వేరొక్కనుట గుర్తింపదగిన యంశము.

శ్రీనాథుని "జన్మకాల మాంగ్ల శాకాబ్దము లు సహస్రమును మూడు నూర్ల పనిన మీద నెన్పదేను కొంచెమించు మించుగనగు"నని చెప్పిరి. (పుట 8) డాక్టరు కొర్లపాటి శ్రీరామమూర్తిగారు తమ 'శ్రీనాథుడు' గ్రంథమున శాస్త్రిగారి 'యించు మించు'ను పాతిక సంవత్సరములు ముందునకు నెట్టి శ్రీనాథుని జనన కాలమును క్రీ 1380 అని నిర్ణయించిరి. ఈ పాతిక సంవత్సరములే శృంగారనైషధ రచనా కాలమునకును ఆన్వయించుటచే తత్కాలమును క్రీ 1895 అని నిర్ణయించుటకు వీలుకలిగెను.

శ్రీనాథుని గ్రంథరచనాకాల నిర్ణయమునకు మిక్కిలి తోడ్పడినది ఆతని "చిన్నారి పొన్నారి చిఱుత కూకటి" పద్యము (కా. ఖం, 1–7). చిఱుత కూకటులు మొలచు కాలమేది? నూనూగు మీసాలు పొడము వయసేది? నిండు జవ్వన మనగా నెన్నేండ్ల ప్రాయము? ప్రౌఢనిర్భర వయః పరిపాక మనగా నిక్కచ్చిగా నెన్నేండ్లు? .... ఇట్టి ప్రశ్నలకు జవాబులు చెప్పుకొనుచు చేయు పరిగణనము ఉజ్జాయింపు లెక్క యే కాని నిక్కచ్చిగా నిన్నేండ్లని చెప్పుటకు వీలుపడునదికాదు. 'ప్రాయమితకు మిగుల కైవ్రాలకుండ' ఆనునప్పుడును 'కైవ్రాలుట యనగా కేలు వంగుటయా? వాలుటయా?' అని ప్రశ్నించుకొని తేల్చుకొను జవాబులును నట్టివే. ఒక మహాకవి కవితాధోరణిలో వర్ణనాత్మకముగ చెప్పిన సందర్భము సూచనామాత్రమేకాని ఖచ్చితముగ నిన్ని యేండ్లని చెప్పునది కాదు. దానిని పట్టుకొని లాగి ఖచ్చితముగ కాలనిర్దేశము చేయుటకంటె కొంచెమించుగ స్థూల నిర్దేశము చేయుటే సరవము, సమంజసము. శ్రీ శాస్త్రిగారట్టి ప్రయత్నమే చేసిరి.

శ్రీనాథుని జన్మస్థల నిర్ణయమునకు తోడ్పడు వద్యభాగము ''వారిధి తటీ కాల్పట్టణాధీశ్వరున్'' అనునది; భీమఖండము నందలిది ఇందలి కాల్పట్టణము -'కాలిపట్టణము', 'కాలీపట్టణము', 'కాళీపట్టణ'ముగా మార్పులుచెంది 'కాళీ పట్నము'గా పిలువబడుచున్నది. మచిలీపట్నమునకు తూర్పున సముద్రతీరమున నీగ్రామ మిప్పుడును గలదు. కాళీపట్నము నింటిపేరుగలవారు కూడ మచిలీ పట్నము మొదలైన తావుల పలువురు నేటికిని గలరు. కాళీపట్నమునకు పది మైళ్ళ దూరమున 'కలపట' మను గ్రామము కూడ గలదు. 'కాల్పట్టణ'మనగా 'కాళీపట్టణమో'. 'కలపట'మో కావచ్చును. శాస్త్రిగారి మొగ్గు కాళీపట్టణమువై పే నున్నట్లు తెలియును. కాని శ్రీనాథుడు పేర్కొన్న గ్రామము కలపటము కూడ కావచ్చునని పేర్కొని, సందిగ్ధముగనే వదలివైచిరి. (వుట 8). కృతనిశ్చ యము లేని తావుల నిట్లు వదలుటయు పరిశోధకుల చిత్తశుద్ధికి నిదర్శనము.

పరిశోధన ప్రపణులగు శాస్త్రిగారి జీవితమంతయు దాదాపు దానికే వినియుక్తమైనట్లు కనిపించును. మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయ మున పండితులుగా ముప్పది యేండ్లు చేసిన కృషి యంతయు అట్టిదే. బసవ పురాణ, ఉదృటారాధ్య చరిత్ర, హరవిలాస, క్రీడాభిరామ, రంగనాథరామాయణ, సుగ్రీవ విజయాది గ్రంథముల పరిష్కారము ప్రత్యేకముగ పేర్కొనదగిన యంశము. ప్రాచీన తాళపత్ర పరిశీలన సమయమున బయల్పడిన చాటువులే అనేకములు 'చాటువద్య మణిమంజరి' కెక్కినవి. శ్రీనాథుని చాటువులు అట్లు ప్రచారము నందినవే.

శ్రీశాథ చాటువులలో పెక్కు లింకను వంశ్యములే అలబ్ధ గంథములలో మరుత్తరాట్చరిత్రయు, శాలివాహన సప్తశతియు, పండితారాధ్యచరిత్రమును, ధనంజయ విజయమును, నందనందనచరిత్రము, వల్లభాభ్యుదయమును గలవు. ఈ గ్రంథములు పూర్తిగా కాలగర్భమునుండి బయల్వడినచో శ్రీనాథుని గురించి అనేకవిషయములింకను తెలియగలవు. ఉపలబ్ధగ్రంథములైన శృంగారనైషధ, హరవిలాస, భీమఖండ, కాశీఖండ, శివరాత్రి మాహాత్మ్యాదులవలననే శ్రీనాథుని కవితామూర్తి విరాణ్మూర్తియై అచ్చెరువు గొల్పుచున్నది. తర్క వ్యాకరణ సాంఖ్య జ్యోతిషాద్యనేక శాస్త్రప్రవీణుడగు ఆ పండితకవి ప్రభాకరశాస్త్రిగారి పరి శోధనకు ప్రధానపురుషు డగుటలో అచ్చెరువులేదు.

వైదర్భీ మార్గము :

సర్వగుణ సమాకలితమైన వైదర్భీ రీతిలో ఇతరగుణము లన్నియు నంతర్భవించునను భావము కలవాడు శ్రీనాథుడు. ఐహగుణ ప్రస్తావముగల నైషధీయ చరిత శ్లోకములను కొన్నిటిని సంక్షిప్తపరిచి ఆతడు వైదర్భిని మాత్రమే ఆదరించుట గుర్తింపగలము. నలునకు సరస్వతి చింతామణి మంత్ర ముపదేశించిన సందర్భములోని ఈక్రింది శ్లోకము పరిశీలనార్హము.

'గుణా మాస్థానీ నృవతిజన నారీతి విదితాం
రస స్ఫీతా మంత స్తవ చ తవ వృత్తే చ కవితుః
భవిత్రీ వైదర్భీ మధిక మధికంతం రచయితుం
పరిరంభ క్రీడాచరణ శరణా మన్వహ మహమ్. [నై చ. 14-88]

ఇందలి గుణ రీతి రస వృత్త వైదర్భీ పరిరంభ (శ్లేషము) శబ్దసందర్భ ములు కావ్య శాస్త్రాన్విత పరిభాషా సందర్భములే; శ్లిష్టమైక కథ కన్వయించు చున్నవి. ఇంతటి గంభీరార్థము గల సందర్భమును శ్రీనాథుడు సంక్షిప్తపరిచి ఒక్క వైదర్భితో తృప్తిపడినాడు.

"వైదర్భివోలె కవితా వైదర్భి నరేంద్ర నీకు వశమయ్యెడు సూ
ర్యోదయవేళ జపింపు కృతాదరమున నస్మదీయమగు మంత్రంబున్"
(శృ. నై. 6-24)

కవితా వైదర్భిని వలచినవారి ప్రత్యయ మిట్లేయుండు ననిపించును. శ్రీనాథకవితా వైదర్భికి ముగ్ధులైన శాస్త్రిగారు 'శృంగార శ్రీనాథము' చరిత్రాంశ ములతో పాటు శ్రీనాథుని కవితా వైదుష్యములనుకూడ వైదర్భి మార్గముననే హృదయంగమముగా వివరించిరి.

తృతీయ ప్రకరణమందలి 'శ్రీనాథుడు : విద్యాధికారి' అను నంశము నందును, పంచమ ప్రకరణమ దలి 'కనకాభిషేకము, దిండిమభట్టారకులు' మొదలగు సందర్భములలోను శాస్త్రిగారు శ్రీనాథుని విద్యావైదుష్యములకు అక్షర నీరాజన మర్పించుచు చరిత్రాంశములను పొందుపరిచిరి. పౌఢ దేవరాయని కొలువులో ప్రవేశించుట శ్రీనాథునకు దుస్సాధముకాగా

"పౌఢ దేవేంద్రరాయభూపాలవరుని
సమ్మఖంబున దయచూడు ముమ్మనుకవి!"

అని శ్రీనాథు డభ్యర్థించినట్లుకలదు. ముమ్మసుకవి సాహాయ్యముతోనే శ్రీనాథుడు పొగిధరాయని సభయందు ప్రవేశింపగల్గెను. ముమ్మకవి చరిత్ర పరిశీలింపగా నాతడు పండార్వేయ సంప్రదాయమునకు చెందినవాడుగా కన్పట్టును. ఆతడు 'సుకవి' యనియు సహృదయుడనియు శ్రీనాథుడు గుర్తి చెను. సభాపర్వేశ వందర్భమున వలికిన పద్యములు (పుటలు 156, 157) శ్రీనాథుని ఆత్మ ప్రత్యయమునకు ఆత్యంత ప్రబల సాక్ష్యములు. శ్రీ శాస్త్రిగా రీసందర్భములను సాహితీ సౌరభము గుబాళించునట్లు వర్ణించిరి.

''అఖండ పండితుడగు డిండిమభట్టారకునితో డీకొని వాదించి యోడించి యాతని లోహడిండిమమును పగుల గొట్టించి మన శ్రీనాథ కవీశ్వరుడు తానార్జించిన యళోడిండిమము నాంధ్ర మండలమం దెల్ల నెడతెగక సార్వకాలము మ్రోగించుచున్నాడు".

''నాటి కాలమున పండితు లెట్లు నిరంకుశులై డీకొనుచుండెడివారో స్వతంత్రులగు నప్పటి రాజులు విద్యాప్రియులై వారియం దెంత గౌరవప్రపత్తులు కలిగి సత్కారము లొదవించుచుండెడివారో తలంచితిరా!'' (పుట 163) శాస్త్రిగారి యీ పెచ్చరికతో గూడిన సంప్రశ్నము సార్వకాలికమై అన్వయించును.

పరిశీలనార్హ విషయములు :

శ్రీనాథుడు సర్వజ్ఞసింగభూపాలుని సందర్శించిన సందర్భము కవిసార్వభౌముని పాండిత్యమునకే కాక లౌక్యమునకును విదర్శనమే. సింగభూపాలుని ప్రస్తుతించు శ్రీనాథుని పద్యమునకు రెండర్థములు చెప్పు ధోరణి కొంత అతిమాత్రమనిపించును (పుట 181) ఇది శ్రీనాథు డుద్దేశించినది కాకపోవచ్చును సింగభూపాలుని సాహిత్య సౌభాగ్యమును శ్రీనాథుడు మనసార అభినందించియే యుండును.

"అహో సాహిత్య సౌభాగ్యం శ్రీ సింగధరజీవతే : '' ఇత్యాదిగా చమత్కార చంద్రికలో విశ్వేశ్వర సరస్వతిచే ప్రస్తుతింపబడిన నవనవోన్మేష ప్రజ్ఞగలవాడు సింగభూవతి. అట్టివానిని మనసార ప్రస్తుతింపకున్నచో అది శ్రీనాథుని ఆర్జవమునకు వంకయే.

సర్వజ్ఞ సింగభూపాలుని చరిత్ర నన్వేషించి, శ్రీ శాస్త్రిగారు వివరించిన తీరు మిక్కిలి మనోజ్ఞముగా నున్నది. చారిత్రికాంశములలో శ్రీ శాస్త్రిగారి అభిప్రాయములతో భేదించినవారును గలరు.

''రసార్ణవ సుధాకర కర్త సింగభూపతియు, శ్రీనాథులచే దర్శింపబడిన సింగభూపతియు భిన్నులు. మొదటివానికి సర్వజ్ఞ బిరుదము లేదు. వారిరువురు తాతా మనుమలు. తాత శక. 1820 ప్రాంతమునను మనుమడు శక. 1870 ప్రాంతమునను నున్నవారగుదురు. మల్లినాథుడు, శ్రీనాథుడు, పోతరాజు సర్వజ్ఞ సింగభూపతిని దర్శించిరి'' (శృ శ్రీ. పుట 179)

'సర్వజ్ఞ సింగభూపాలు'డను వ్యాసములో డా॥ జి. వి. కృష్ణారావుగారు మరికొన్ని విశేషములను తెలిపిరి. ''సర్వజ్ఞ బిరుదాంకితుడు, పండిత పక్షపాతి అయిన ప్రభువు కవులకూ, పండితులకూ ఆశ్రయ మివ్వకుండా ఉంటాడా? విశ్వేశ్వర కవిచంద్రుడు, బొమ్మకంటి అవ్వయార్యుడు ఇతని ఆస్థాన కవులు. శ్రీనాథు డాప్రభువును సందర్శించి సమ్మానం పొందాడు.

ఐమ్మెర పోతన ఇతని కాలములో వాడేవనీ భోగినీ దండకం ఇతనికే అంకితమిచ్చాడనీ కొందరు భావిస్తున్నారు. ఇది కేవలం భ్రాంతి. పోతనామాత్యుడు మూడవ సింగభూపాలునకు మాత్రమే సమకాలికుడు'' ('నవతోరణము' పుట–101).

ఈ యంశములు సుదూరము పరిశీలింపదగినవి.

మూడవ సింగభూపాలు డనగా చినసింగభూపతియను నామాంతరముగల వేరగిరి యగునా? వెలుగోటివారి వంశచరిత్రమున ప్రసక్తుడగు నీ వేదగిరి రసార్ణవసుధాకరకారుని వాల్గవ కుమారుడు కావలెను. కాని ఇతనికి చినసింగభూపతియను నామాంతరము కేవల కల్పితమని శ్రీ శాస్త్రిగారు సోదాహరణముగా నిరూపించినారు. (పుట–168) అగుచో పోతన రెండవ సింగభూపాలుడగు సర్వజ్ఞ బిరుదాంకితునకే సమకాలికుడని భావింపదగియున్నది.

పోతన శ్రీనాథులు బావమరదులను కథకు ఆకరము మృగ్యము.

"కమ్మని గ్రంథంబొక్కటి యిమ్ముగ నే నృపతికైనఁ గృతి యిచ్చినఁ గో
కొమ్మని యీయరె యర్థం బిమ్మహి దున్నంగ నేల యిట్టి మహాత్ముల్ ?"
(పుట–182)

ఇందరి మహాత్ముడు పోతనయే యనుటయు నిర్ధారితమైనయంశము కాదు. అందువలననే శ్రీ శాస్త్రిగారు ఇది "శ్రీనాథుడు చెప్పినదిగా వినవచ్చు" పద్య మని మాత్రమే పేర్కొనిరి

శ్రీనాథుని చాటుకవితా సరస్వతి–దేశిసాహితి :

శ్రీనాథుని చాటువులు చారిత్రికదృష్టితో చూచినను, కవితాదృష్టితో చూచినను చాటుకవితకే మకుటాయమానము లనిపించును ఆ మహాకవి లోకజ్ఞతకు అయన చాటువు లన్నియు నిదర్శనములే. ఆశువుగాచెప్పిన ఆ పద్యములలో ప్రతిపదమును పరివృత్త్యసహిష్ణువై పరమచమత్కారభాజనముగా నుండుట ఒక విశేషము. పల్నాటిసీమను గూర్చి చెప్పిన పద్యములలోని భావములు వైయక్తికములు. చెప్పదలచుకొన్నది తెగవేసి చెప్పుట శ్రీనాథుని తత్త్వము. కవులకు చిల్లిగవ్వ యీయని మెతుకు దొరలను గూర్చి యేమన్నాడు ? "కుతుకలి కోయు దొంగలకు .... మతకపు లంజె తొత్తులకు .... మహ్లదార్లకున్ కొతక యిత్తు; రింతె; కవికోటుల కిత్తురె ? చత్తు; రంతెపో మెతుకు దొరల్" అన్నాడు (పుట–183). ఇట్టి చాటువులు చరిత్ర దృష్టితో చూచినప్పుడుగాని, సాంఘిక దృష్టితో చూచినప్పుడుగాని అమూల్య సిక్షేపములే యనిపించును. మొరసరాళ్లు విస్తారముగా గలిగి మొరవరాజ్యమని చెప్పబడు కర్నూలు మండలమును గూర్చి చెప్పిన పద్యములును ఆట్టివే (పుట –204). పల్నాట తాను విడిచేసిన ఒక పురోహితునిల్లు అశుభ్రముగా నుండుట చూచి అచ్చట పురోహితుల కొంపలే అంత అనునట్లు వ్రాసిన పద్యమును ఆట్టిదే (పుట–208).

ఇట్టి పద్యములు నుదాహరించుచు శ్రీ శాస్త్రిగారు వదివంకలేని శ్రీనాథ చాటు కవితా వరస్వతిని పహృదయహృదయకేదారముల ప్రవహింపజేసిరి.

ప్రాచీనమగు తెలుగుసాహిత్యముగో శ్రీనాథుని రచనలు పండిత పామరులెల్లరి నలరించునవిగా నున్నవి. మార్గపద్ధతిలో రచింపబడిన పద్యకృతులే కాక దేశి పద్ధతిలో రచింపబడిన ద్విపదకృతులు, పాటలు, పదములు మొదలైనవే యిందుకు

నిదర్శనము. సార్వజనీనమైన శ్రీనాథ సరస్వతిని శ్రీ శాస్త్రిగారు శ్రద్ధాభక్తులతో లోకమునకు నివేదించిరి. పల్నాటి వీరచరిత్రము, కాటమరాజు కథ మొదలైన రచనలనుగూర్చి కూడ వివరించిరి. సులభశైలిలో రచింపబడిన పెక్కు చాటు పద్యములవలెనే శ్రీనాథుని పదరచనలు కూడ సర్వజన బోధకముగా నుండు సులభశైలిలోనే రచింపబడుట విశేషము. శ్రీనాథుడు త్రొక్కని కవితా మార్గము కాని, అనుసరింపని కవితావక్రియుగాని ఆనాటికి లేదన్నచో అత్యుక్తి కానేరదు. ఈ అంశమును విరించుటకే శ్రీ శాస్త్రిగారు శ్రీనాథుని దేశి సాహిత్యమునుకూడ క్షోదక్షమముగ పరిశీలించిరి.

గ్రంథపరిష్కరణము-శాస్త్ర విధి :

పల్నాటి వీరచరిత్రము నిర్దుష్టముగా ప్రచురింపవలసిన ఆక్కర యెంతేని గలదని శాస్త్రిగారిఆవేదనము నిర్దుష్టమునగా మూలప్రతులను సంస్కరించు వందర్భములలో మూఁ మేదో సంస్కరణమేదో స్పష్టముగా తెలుపుటయని భావము. శ్రీ ఆక్కరాజు ఉమాకాంత పండితులు ప్రచురించిన పల్నాటిచరిత్రము (బాలుని కథ)ఈ దృష్టితో చూచిన శాస్త్రిగారికి తృప్తినింపలేదు ''ఈగ్రంథ సంపాదకులు యథేచ్ఛముగా గ్రంథమును మార్చిరి. కొంత చేర్చిరి. ఆ మార్పులు చేర్పులు తిన్నగా తెలుపరయిరి'' (పుట-209) అని చెప్పుచు గ్రంథ పరిష్కార విషయమున పరిష్కర్త అవలంబింపవలసిన పద్ధతులను శ్రీ శాస్త్రిగారిట్లు ప్రకటించిరి.

''ప్రాచీన గ్రంథములను ముద్రించునప్పుడు గ్రంథకర్తల రచనములను మార్పకుండుట న్యాయ్యము. కవి ప్రయుక్త పాఠము గుర్తింప కుదురనప్పుడు గ్రంథకర్త మతానురోధమున నుచిత సంస్కారము చేయదగును. గ్రంథపాఠము లున్నప్పుడు కథాసమన్వయమునకై పూరణములు సయితము చేయదగును. ఆ పూరణము లేవో తెలియదగినట్లు చిహ్నితములుగా నుండవలెను.'' (పుట-209)

శాస్త్రిగారి ఈ సూచన ప్రాచీన గ్రంథపరిష్కర్తలగు ప్రస్తుత పరిశోధకులెల్లరికిని అవశ్య మనుసరణీయము.

శాస్త్రిగారు పరిష్కరించి ప్రచురించిన పలు గ్రంథములు తాము ప్రవచించిన పరిష్కార సూత్రమునకు విధేయముగనే యున్నవి.

గ్రంథ కర్తృత్వ విర్ణయమున శాస్త్రిగారవలంబించెడు పద్ధతి అంతర్బహిస్సాక్ష్యములు రెండును సేకరించుకొనుచు బ్రహ్మభేద్యముగా కన్పట్టుచుండును. 'క్రీడాభిరామ' కర్త శ్రీనాథుడేయని శాస్త్రిగారి కృతనిశ్చయము ఇందు కెన్నియో ఉపపత్తులు చూపిరి. "ఈ గ్రంథము శ్రీనాథుని కృతియయి వెల్లడి కాగలిగినందుల కెంతయు సంతోషించుచున్నాడను. ఇందు పల్నాటి వీరచరిత్ర పాటలు, పంబవాగ్గ పాటలు మొదలగునవి పర్ణించుటచూపట్టు కవిత్వోత్సాహమును బట్టి మాడుగా శ్రీనాథుని కట్ట రచన మిక్కిలి రుచితముయినట్లు తోచుచున్నది. అత డిట్టి రచనలెన్నో రచించినట్లైతిహ్యములు గలవు" (పుట-282)

క్రీడాభిరామ గ్రంథమునందు పినుకొండ వల్లభరాయడే తత్కర్తయని చెప్పబడియున్నది. ఆముక్తమాల్యదయందును కృష్ణరాయడే తత్కర్తయని చెప్పబడియున్నది. ఆత్మస్తుతి దోష మంటకుండుటకై తన్నుద్దేశించు పద్యములు పెద్దన మనుచరిత్రమునుండి సందర్భశుద్ధితో కృష్ణరాయ డుద్ధరించుకొనినాడు. వల్లభరాయడు గ్రంథాంతమందైనను ఇట్టి జాగరూకత వహించినవాడు కాడు. హరిహరరాయ రత్నభాండాగారాధ్యక్ష పుత్రుడగు సీతడు పలువురు రాజకవులకు వలెనే తన కృతిని సందిగ్ధ కర్తృత్వమునుండి సంరక్షించుకొనలేక పోయెను. హర్షభోజు లదృష్టశాలులు.

విషయ నిరూపణ విధి-రచనావధి :

శ్రీ శాస్త్రిగారు చెప్పదలచిన విషయము కుండబ్రద్దలు గొట్టినట్లు చెప్పుదురు. చారిత్రకాంశముల విషయమున దొంకతిరుగుళ్లు పనికిరావనియు వారి అభిప్రాయము. కావ్యమండలి ధ్వనివలెకాక చరిత్ర సత్యములు వాచ్యములుగా నుండుటయే క్షేమము శాస్త్రిగారు సత్కవియయ్యును చరిత్రాంశములు వివరించుతాపుల కవితాధోరణి నవలంబింపక పొడిపొడి లేతలెనుగు మాటలలో ఇండితముగ చెప్పుదురు. ఇది మెచ్చుకొనదగిన యంశము. "శృంగారశ్రీనాథ" మంతయు ఇందుకు నిదర్శనమే.

శ్రీనాథుడు మార్గదేశి పద్ధతులలో మనోజ్ఞకృతు లనేకము రచించుటయేకాక పెదకోమటి వేమభూపాలు నొద్ద విద్యాధికారిగా నున్న కాలమున శాసనకృతులను గూడ రచించియున్నాడు. ఫిరంగిపురశాసనము వానిలో మకుటాయ

మానము. శ్రీశాస్త్రిగారు శ్రీనాథకృతులను పరిశీలించినతీరు శ్రీనాథ సమగ్ర విద్యామూర్తి నావిష్కరించునదిగా నున్నది.

అలభ్యమగు అపూర్వ కృతి :

శ్రీనాథకృతులలో ననేకములు కాలగర్భమున కలసిపోయినవి. లభించిన గ్రంథములే విశ్వరూప ప్రదర్శన సమర్థములై యున్నవి. మరుత్తరాట్చరిత్రాదుల వలె మరుగున పడిన గ్రంథములు మరికొన్నియు గల వనిపించును. పదునారవ శతాబ్దాంతమున వీపూరి వేంకటాచార్యుడు రచించిన ''విశ్వకర్మపురాణ'' మను పద్యకావ్యము సవతారికలో ఈ క్రింది పద్యము కలదు.

''శ్రీనాథుం డొనరించె నంచు విబుధుల్ చెప్పగ్ దగన్ విన్నదే
కా నెందున్ గన మా జగద్గురుని సత్కారుణ్య దివ్యప్రభా
వానూన స్థిర శేముషీమహిమ'' – [వి.క.పు. అవతారిక]*

'వేంకటాచార్యునికంటె పూర్వులు ఎవరేని విశ్వకర్మ పురాణము రచించినవారున్నారా ? యను సందియము నిర్మూలనకై పై పద్యము చెప్పబడినది.'' విశ్వకర్మ వృత్తమునే శ్రీనాథుడు గ్రంథముగా రచించినట్లు పెద్దలుచెప్పగా వినియుంటి'' నని చెప్పుచు ఆ గ్రంథము కనిపించుటలేదనియు చెప్పెను. సందర్భము ననుసరించి పై పద్యమందలి జగద్గురుడు విశ్వకర్మయని స్పష్టము. ఇంతకును పై పద్యకావ్యకర్త ఎవ్వరోకాదు, ప్రౌఢ దేవరాయల ఆస్థాన కవియై శ్రీనాథునిచే సుకవిగా ప్రస్తుతింపబడిన ముమ్మనకు వీమ్మట నాల్గవ తరము వాడగు వీపూరి వేంకటాచార్యుడు. ఈతడు తన విశ్వకర్మపురాణములో స్వీయ వంశావతారము వర్ణించుచు విశ్వకర్మమూలపురుషుడుగా గల ఆయన గోత్రజులలో నాగన తరువాత ముమ్మన నాల్గవ తరమువాడని చెప్పెను. ఇతడే ప్రౌఢదేవరాయల యొద్ద ఆస్థానకవిగను ధర్మాధికారిగను ఉండి శ్రీనాథుడు రాయలకొలువు ప్రవేశించుటకు సాయపడినముమ్మన. ముమ్మనను గూర్చి విశ్వకర్మ పురాణమున నిట్లున్నది.

''ఆ ముమ్మన నిజకవితా శేముషి మెప్పించి యందె సింధుర తురగ స్తోమంబులు భూషణములు గ్రామంబులు ప్రౌఢదేవరాయల వలనన్'' (వి.క.పు)*

---

*డా. కొండూరు వీరరాఘవాచార్యులు : శ్రీ వీరరాఘవ వ్యాసావళి
(పుటలు 168 ; 170)

వాస్తు శిల్ప కవిత్వాది దశక్రియా పరిజ్ఞాత యగు ఈ ముమ్మనుకవి ప్రేరణచే శ్రీనాథుడు విశ్వకర్మ పురాణము ప్రాసియుండవచ్చును. శాలివాహన సప్త శత్యాదులవలె అదియు కాలగర్భమున కలసిపోయి యుండవచ్చును. ఎన్నటికేని అయల్పడుచో శ్రీనాథ కవితామూర్తి మరింత దర్శనీయము కాగలదు.

యుగకర్తకు ఉజ్జ్వల కవితా నీరాజనము:

శ్రీనాథ రచనా ప్రభావము తత్కాలముండలి కవుల ప్రతనే కాక ఆర్వాచీను లగు నెందరిపైననో ప్రసరింపకపోలేదు. కనుకనే శ్రీనాథు డొక యుగకర్తగా తెలుగు సాహిత్యమును కొత్త పుంతలకు త్రొక్కించినవాడుగా గౌరవింపబడు చున్నాడు.

జీవితములో చిరకాలము కవిగా విద్యాధికారిగా మహాపండితుడుగా రాజ భోగము లనుభవించి, చరమజీవితమున కటకటపడుచుండియు, గంభీరోక్తులతో ''దివిజకవిరదు గుండియల్ బిగ్గరనగ ఆపుగుమన్నాడు శ్రీనాథు డమరపురికి'' అనిఅనగలిగిన ధీరుడొక్క శ్రీనాథుడే అట్టి శ్రీనాథుని చరిత్రమును నవరససాహిత్య గ్రంథముగా మలచిన ప్రతిభాప్రభాకరులు శ్రీశాస్త్రిగారు. ప్రతిప్రకరణము మొదటను పొందుపరిచిన పద్యములు శ్రీశాస్త్రిగారివే. అవి వారి కవితా సామర్థ్యమున కెత్తిన కరదీపికలుగా నున్నవి.

నవ్యత-ప్రామాణికత :

1923లో 'శృంగారశ్రీనాథము' వెలువడినప్పటినుండి శ్రీనాథ కృతులను గూర్చియు చరిత్రమును గూర్చియు అనేక సమీక్షాగ్రంథములు వెలువడినవి. అయినను శ్రీశాస్త్రిగారి గ్రంథ మీనాడు చదువుచున్నను ననవనముగనే హృదయము నలరించును. నూతన పరిశోధితాంశము లనేకము వెలువడినను తన నవ్యతను కోల్పోని గ్రంథము గౌరవార్హము. గ్రంథము వెలువడిన సంవత్సర కాలములో దీనిని రెండు పర్యాయములు చదివి ముగించి, ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్యగారు 17-9-1924న శ్రీశాస్త్రిగారికి వ్రాసిన జాబులోని ఈ వాక్యములు గుర్తుంచుకొనదగినవి. ''ఇట్టి గ్రంథ మిదివరకు మన భాషలో నెవరుగాని రచించి యుండలేదని నా దృఢాభిప్రాయము. ఈకార్యము కొనసాగించుటలో మీరు గావించిన పరిశోధన పరిశ్రమ వర్ణనాతీతములు....మీనుండి యెన్నియో క్రొత్త

విషయములను సేర్చుకొనవలయునని కుతూహలపడుచున్నాను'' చరిత్ర – ఆర్థిక శాస్త్రములలో సుప్రసిద్ధుడగు నొక ఆచార్యుని పలుకు లివి.

నిజమునకు శ్రీశాస్త్రిగారు తమ గ్రంథమును తొలుత చరిత్రభాగమని గ్రంథవిమర్శ భాగమని రెండు భాగములుగా రచించి, గ్రంథ బాహుళ్య భీతిచే ప్రథమభాగము మాత్రమే ముద్రించిరి. 1912 నాటికే సిద్ధమైయున్న ఆ వ్రాత ప్రతి నచ్చుకకు తెచ్చు ప్రయత్నములో ఆది అంతరిత పాయమై ప్రణష్టమైనదట ! ''ఆగొడవ నిప్పుడు తడవనేల'' యని తెచ్చికోలు నోదార్పుతో శాస్త్రిగారు నిర్విణ్ణులైరి.

ప్రభాకర వాఙ్మయ యజ్ఞము :

తెనుగునాట గ్రంథముద్రణ మొక మహాయజ్ఞముగా పరిణమించినది. సాహిత్య విమర్శ గ్రంథముల జాతకము మిక్కిలియు శోచనీయము. అయినను పట్టువిడువక శాస్త్రిగారి పుత్రుడు డా. ఆనందమూర్తిగారు ఈ గ్రంథమును నేటికైన పునర్ముద్రణకు తేగలుగుట మెచ్చుకొనదగిన యంశము ఆముద్రితమై శాస్త్రిగారి సాహిత్య యోగ వాఙ్మయ మెంతయోగలదు. దానిని కొంత కొంత 'మణిమంజరి' పత్రికా సంచికలలో ప్రచురింపగలుగుచున్నారు. అట్టి ప్రచురణల నాంధ్రసజ్జన సంపన్ను లవశ్య మాదరింపవలెను. వేటూరి ప్రభాకర శాస్త్రి మెమోరియల్ ట్రస్టువారు వాఙ్మయయోగ పరిశోధన మార్గమున చేయు కృషి ఆసాధారణమైనది. దీని ప్రసక్తి ప్రకృత గ్రంథ పరిచయ సందర్భమున సముచితమే యనుకొందును.

ప్రతిభాప్రభాకరులైన శ్రీశాస్త్రిగారు పెద్దకాలము మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున పండితులుగా పనిచేసిరి నేడును ప్రస్తుత మాంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున పనిచేయువాడనగుటచే కృషి సామ్యమును పుర స్కరించుకొని ఈ గ్రంథమున కీముందుమాటలు వ్రాయ సాహసించితిని. ఇందుకు కారణభూతమైన డా. ఆనందమూర్తిగారి ఔదార్యమునకు కృతజ్ఞతలు.

హైదరాబాద్
6 10. 1985.

వాసిలి వేంకటలక్ష్మీనరసింహారావు

Dr. M. RADHAKRISHNA SARMA
Professor and Head
Dept of Ancient Indian History,
Culture and Archaeology
Osmania University

The Reprinting Of The Valuable Work

"Sringaara Sreenaathamu" of Veturi Prabhakara Sastri Garu should receive the attention of pandits and public interested in the history, culture and literature of Andhras. Professor M. Venkatarangaiya, having gone through the work, wrote in a letter dated 17th September 1924 thus .. "It is my firm belief that no one has written such a work as this in our (Telugu) language. The research and efforts that have gone behind the work cannot be expressed in words" These words written some sixty years ago could be taken to be true even today.

'Sringaara Sreenaathamu', ofcourse, is a study of the life, works and times of the renowned poet of the Telugus belonging to the medieval period, Srinatha. The uniqueness of the book of Sri Prabhakara Sastri is that through his expert writing he has made it a historical research work of a literary personage whose life was intertwined subtly with the political events and social ethos of the times

Historical methodology, with surprising clarity, has been enunciated by Sri Prabhakara Sastri even in the 1920 's. In the foreword to his work he says"... This cannot be a true historical work; for one to be called so should adduce

evidence that each event mentioned is a fact. I have merely collected available historical materials and gave a shape of history of Srinatha. For this reason only I have not named it as history, but, preferred to give the present title of "Sringaara Sreenaathamu". The manner in which the author tackled the historical value of the "Palnativiracharitramu" is a typical example even to the present-day researcher as to how research writing should be. Relevant words of C P. Brown are quoted and made apt use of (Chapter VIII). In this context Sri Prabhakara Sastri elaborated the research maxim "It is proper that while printing ancient works no changes are made in the text of the authors."

The author makes it clear both in his foreword to the book, as well as in many discussions in the work itself that he is not publishing his entire text. The original work written some ten years prior to the date of the first edition in manuscript seems to consist of two parts, the Historical and the Criticism, of which only the former part is being published. He proposed to publish the 'Criticism' part separately. Today when liberal research grants are available, the work of Sri Prabhakara Sastri in its entirety should be brought out in a single volume. This would serve as an excellent source book for the medieval history and culture of Andhras. It is after the publication of such works of pioneers as this that an attempt to bring out works on "Historiography of Andhra" or "Andhra Historians" could be done. The Prabhakara Sastri Parisodhaka Mandali which is in possession of late Sastri's writings should bring out the comprehensive volume on "Sringaara Sreenathamu" with financial assistance of the Government of Andhra Pradesh.

Historians of Medieval Andhra had been concentrating their studies on the history of the Kakatiyas and the Vijayanagar dynasties. Excepting for a few significant studies the history and contribution of several dynasties that ruled Andhra in the post Kakatiya period have not been researched into. In-depth examination of literary and archaeological sources and attempt at the coordination between the two have yet to be seriously done. The relations that existed between the various kingdoms and regions of Andhra during the period between A. D. 1300 to 1600 A. D. are very vital for the understanding of Andhra history and culture of the later periods as it was now that Telugu lanaguage and culture took a mature form and the new elements of Islamic culture got introduced. Srinatha lived during these times. Life and works of Srinatha truly mirror his times. For instance as Sri Prabhakara Sastri with deep insight remarks that 'Palnativiracharitramu' of Srinatha truly reflects Andhra country, Andhra language, Andhra customs and manners, in a word 'Andhraness'. (Chapter 8). I find that "Sringaara Sreenathamu" is a source book for matter and methodology for researchers delving into the period.

Taking into account the period covered in the work, it is encyclopaedic. The work is divided into nine chapters, The first chapter reviews the conditions in Andhra during the 14 th and the greater part of 15 th century A. D, which is the period when Srinatha lived. Srinatha's caste, gotra, genealogy, nativity, period of life, name, boyhood, early education, family conditions and relationships are systematically dealt with The interesting problem of the contemporaneity of Srinatha and Potana is examined.

The second chapter discusses the history of the Reddis of Kondaveedu making use of both literary and

epigraphic sources. The Contribution of these Reddis to Telugu culture is briefly and beautifully put in the concluding paragraph of the chapter. Literary patronage of the rulers and literary output of the poet are now extensively discussed in the third chapter. A thorough examination of inscriptions from the view-point of history of literature is made Maruttaratcharitra, Salivahana Saptasati, Panditaradhya-Charitamu, Sringaaranaishadhamu, Haravilasamu- the significant works of the author are discussed in many of their aspects. The collapse of the Reddi kingdom of Kondaveedu also marks the end of a stage in the life of Srinatha.

The fourth chapter takes the life and times of Srinatha from this point, and mainly examines his work 'Bhima khandamu'

The fifth, sixth and seventh chapters deal with the best years of the life of Srinatha. It is here that his encounter with Dindimabhattu is picturesquely described and discussed in detail.

Chapter eight covers the theme and historical importance of Palnativiracharitra, the folk literary compositions of the poet, Katamarajukatha, Kreedabhiramamu, Sivaratri-mahatmyamu and miscellaneous works.

In the final chapter the sad days of the poet at the end, his character and personality, personal religion, other poets' estimate of him and his contemporary poets are covered. The author in a tribute to the poet concludes what if he died in penury! when riches had not succeeded in making the name of others permanent, the name of Srinatha is living for eternity due to the merits of his Poetry.

The suggestion of Sri Veturi Prabhakara Sastri that a memorial should be raised for Srinatha in Andhradesa should be seriously and sincerely taken up by the government and the public. ''Srinatha Peethamu', established at Guntur recently appears to be one such step taken in that direction. Let us hope that it fulfills the hope of Sri Sastri.

When one goes through Sri Veturi Prabhakara Sastri's 'Sringaara Sreenathamu'' one realises why it was remarked 'Desa Bhashalandu Telugu lessa?' It is indeed sweet.

Hyderabad
30-10-1985

Radhakrishna Sarma

గ్రంథ పరిచయము

[రుధిరోద్గారి సం॥ శ్రావణమాస శు॥ 2 ఆం॥ పత్రిక సారస్వతానుబంధమున శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు శృంగార శ్రీనాథమును సమీక్షించి వ్రాసిన వ్యాసభాగమిది]

ఈ గ్రంథమును ప్రభాకరశాస్త్రి గారు పదేండ్లకు పూర్వమే వ్రాసినను నాంధ్రప్రపంచమునకు దానిని జదివి యానందింపగల భాగ్యమిపుడు గలిగినది. శృంగారప్రియుడైన శ్రీనాథుని చరిత్రమునకు శృంగార శ్రీనాథమను నామకరణము సార్థకము....

తొమ్మిది ప్రకరణముల గ్రంథమునందును శ్రీనాథకవీంద్రుని చరిత్రమును హృద్యముగను విచక్షణోపేతముగను వ్రాసి శాస్త్రిగారు రంధ్రకవిజీవితహారమున కొక యమూల్యమైన మణిని సమకూర్చి కృతార్థులైరి....

ప్రతిభగల మహాకవి జీవితమును పట్టించుట సుతరసాధ్యముగాదు. కవి కాలమును కవిహృదయమును గ్రహింపగల పండితులు మాత్రమే ఈ కార్యమును నిర్వహించుటకు సమర్థులు. ప్రభాకరశాస్త్రిగారు శ్రీనాథుని పరిస్థితులను హృద్యమును గనుగొనుటకు జేసిన పరిశ్రమను గ్రంథమంతయును విశదపరచి యున్నది. శ్రీనాథుని భోగాభిలాషను విపరీత దృష్టితో నవలోకించిన వీరేశలింగము పంతులుగారి భావములను శ్రీరామమూర్తిగారి భావములను, శ్రీనాథ ప్రియులైన ప్రభాకరశాస్త్రిగారికి నిరాదరణీయములైనను శాస్త్రిగారి భక్తియును నతిశయోక్తిని బోషించినది. శ్రీనాథుడు 500 వేండ్లక్రితము జీవించియుండెను. ఆ సుకవీంద్రుని జీవితమును బరిశీలించునపు డాకాలపు స్థితిగతులను ప్రమాణముగ గైకొని పరిశీలించుట ధర్మము ప్రస్తుత పరిస్థితులను ప్రమాణముగ గైకొని పరిశీలించుట యనుచితము. ప్రభాకరశాస్త్రిగారిట్టి లక్ష్యములోనే గ్రంథమును రచించిరి. గ్రంథమునందు సహజముగను పునరుక్తిదోషమున్నను శ్రీనాథుని జీవిత గ్రహణమునందభిరుచిని బుట్టించుచున్నది. ఆంధ్రులకు చిరపరిచితములైన శాస్త్రిగారి మంచిశైలియును విషయాన్వేషణ సామర్థ్యమును దీనియందును గన్పట్టుచున్నవి. ప్రకరణారంభమునందు రసవంతములైన పద్యములను జేర్చి పద్యభావమును ప్రకరణమునందు హృద్యముగ విస్తృతముచేసిరి....శృంగార శ్రీనాథమునందు ప్రాచ్య పాశ్చాత్య విధానములు మేళగించి కవి జీవిత రచనము క్రొత్తపుంపును దెచ్చినవి. గ్రంథము హృద్యముగ నున్నది ...

శృంగారశ్రీనాథము

శృంగారశ్రీనాథము

శ్రీగురు చరణం శరణమ్.

గీ. శ్రీనిరంతరానంద నిశ్శ్రేయసార్థ
సాధకము సర్వకిల్బిషబాధకము స
మగ్రవిజ్ఞానదము మహామహిమఘనము
శరణ మగు మాకు సద్గురుచరణయుగము.

దివ్యప్రకాశమగు శబ్దజ్యోతిని వెలయించి మానవుల జ్ఞాననేత్ర మునకు లోకవృత్తాంతమును శాశ్వతముగాఁ గన్పఱుచు కవీశ్వరుల ప్రతిభాశక్తికి నమస్కారము. శబ్దజ్యోతి లేని నాఁడును, దానిని గవీశ్వరులు శాశ్వతముగా నుద్దీపింపఁజేయని నాఁడును లోకము చీకటి గొనును. లోకనౌకకుఁగవీశ్వరులే కర్ణధారులు. సంసారయాత్రలోఁ గవీశ్వరులే కవితామృతప్రపల వెలయించి యశ్రమమున లోకము నానందోద్దేశమున కంజె వేయించుచున్నారు. రసానందానుభవము వెలయుచుండునంతవఱకు లోకమున నీ కవీశ్వరుల ఘనత యనితర లభ్యమై సభ్యమై యొప్పుచుండును వారియున్నతజీవితము లోకమున కున్మార్గ దర్శకము. దాని నారాధించుట లోకమునకు మేలుకూర్చు కొనుట. ప్రాచీనాంధ్రకవీశ్వరుల జీవితచరిత్రములను విపులముగా వెలయించి వారికీర్తిమూర్తులను గీర్తింపవలెననియు, దత్కవితా విమర్శ మూలమున నంధ్రవాణికిఁ గొంతయారాధనము చేయవలె ననియు నాకుఁ గొండంత కోరికకలదు. ఈ కోరికను దీఱుచుకొను

టకై చేయు నాయత్నమునఁ దొలుతఁ దోఁచినవాఁడు శ్రీనాథకవి సార్వభౌముఁడు. బహుదేశములుతిరిగి, బహుశాస్త్రములనెఱిఁగి, రస వత్కవిత రచించి. రాజాధిరాజుల పూజలఁగొని, విద్వద్గోష్ఠులం దాటీ తేటీ, విద్యావివాదములందు విజయములంది, భువనభరితకీర్తియై. పూర్ణపురుషాయుషజీవియై దివిజకవివరుగుండియలు దిగ్గరనునట్లు స్వర్లోకప్రస్థానముసల్పిన మనకవిసార్వభౌమునివంటివాఁడు, ప్రఖ్యాత చరిత్రుఁ, డంధ్రకవీశ్వరులం దింకొకఁ డగపడఁడు. ఆయనచరిత్ర మును గనుఁగొనుటకు సాధనము లనేకములు సమకుఱియున్నవి యథాశక్తి, యఖోపలబ్ధి, యిఁకమీఁద నాసుకవీంద్రునిచరిత్రము వివరింతును.

❁

ప్రథమప్రకరణము

సీ. కమలనాభుఁడు సుధీఘనుఁడు సత్కవితా వి
ధాత కాల్పట్టణస్థాత తాత
మారయ్య సర్వవిద్యారసజ్ఞుఁడు తండ్రి
భీమాంబ సుగుణాభిరామ తల్లి
దుగ్గయ్య కృతికర్త తగ్గవాఁడు మఱంది
పాటికెక్కిన పాకనాటికులము
శాఖ కృష్ణయజుఃప్రశస్త మాపస్తంబ
సూత్ర భారద్వాజగోత్రయుతము

గీ జన్మకాల మాంగ్ల శాకాబ్దములు నహ
స్రమును మూఁడునూర్లు చనినమీఁద
నెన్నదేను కొంచె మించుమించుగ నగు
నెవని కట్టి సుకవినివని దలఁతు.

మన కిప్పుడు ప్రస్తుతాంశమగు శ్రీనాథచరిత్రము కొఱకయి యెఱుకకుఁదెచ్చుకొనవలసినకాలము పదునాల్గవ శతాబ్దియంతమును, బదునైదవ శతాబ్దియర్ధాధికభాగమును.

విద్వత్కవిసంపన్నతచే నీకాలమం ధ్రదేశ మెక్కువ వైభవమనుభవించినది. విద్యారణ్యులవారు తురుష్కులవలన నార్య ధర్మ నిర్మాణముల కుపప్లవము కల్గకుండ విద్యానగరరాజ్యమును వెలయఁజేసి వేదాదివిద్యలకు భాష్యములు రచియించి వైదిక సంప్రదాయమును సంరక్షించి యిప్పటి కెక్కువ కాలము కాలేదు.

బహుమహాకావ్యములకు వ్యాఖ్యానములురచించి సంస్కృత సారస్వత ముద్రను విప్పిచూపిన వ్యాఖ్యాతృశిరోమణి మల్లినాథ సూరియు భక్తి రసపారావారముననోలాడున ట్లాంధ్ర భాగవత ప్రబంధమును రచించి యాంధ్రలోకము ననుగ్రహించిన పూతచరిత్రుఁడు బమ్మెర పోతిరాజ కవియు నీకాలమునసే యవతరించిరి. సంస్కృతాంధ్రములం దింక నెందఱో యెన్నఁ దగిన కవీశ్వరు లున్నారు. వారివిషయము ప్రకరణాం తరమునఁ బ్రశంసించెదను. పరమధార్మికులును, విద్యావిలాసలాల సులును నగు రెడ్డిరాజులపాలన మీ కాలమునసే కొనసాగెను విద్యా నగరమునఁ గర్ణాటరాజులును, గటకమున గజపతులును, నద్దంకి కొండవీడు రాజమహేంద్రము మొదలగు స్థలముల రెడ్డిరాజులును రాచకొండ దేవరకొండ మొదలగు స్థలముల రేచర్ల వెలమరాజులును నెలకొని యీ కాలమున నాంధ్రదేశభాగములు పాలించుచుండిరి. సారవంతమయిన మధ్యాంధ్రదేశము రెడ్డిరాజుల పాలనమునుండుటచే వారిపయికిఁ దక్కినవారు దండువెడలు చుండిరి. తురుష్కుల తల్లును గలదుగాని వా రాంధ్రదేశమున సుప్రతిష్ఠితులు కాలేదు. నాఁటి రాజులలోఁ బ్రధానులు వీరు. మఱికొందఱు చిఱుతదొరతనములు నెఱపువారు నున్నారు; కాని వారు పయివారికి లోపడినవారే అప్పటి యాంధ్రదేశ రాజ్యస్థితి యిట్టిది.

కులగోత్రములు

శ్రీనాథుఁడు యజుశ్శాఖయు నాపస్తంబసూత్రమును భారద్వాజ గోత్రమునుగల పాకనాటి నియోగిబ్రాహ్మణవంశమువాఁడు. పాక నాఁడు పూర్వ మేకవింశతిసహస్ర (21000) గ్రామసంఖ్యాకము దేశము.

శృంగారశ్రీనాథము

మ. అరుదందఁ బెలనాటిచోడమనుజేంద్రాజ్ఞాపనం బూని దు
స్తరశక్తిఁ జని యేకవింశతిసహస్రగ్రామ సంఖ్యాకమై
ధరణింబేర్చినపాకనాడు నిజదోర్దర్పైకలగ్నంబుగాఁ
బరిపాలించె నమాత్యకొమ్మన జగత్ప్రఖ్యాతచారిత్రుఁడై.

కేయూరబాహుచరిత్రము.

శ్రీశైలము తూర్పుటంచునంటుకొని గుండ్లకమ్మ నదికి నుత్తర దక్షిణ పార్శ్వములందు సముద్రముదాఁక వ్యాపించినదేశము పూంగినాఁడని పోర్లయవేమునిశాసనమం దున్నది. పూగి, పూంగి, పోఁక, వాక, పదములకు శబ్దార్థసంగతి కలదు. పూంగినాఁడే పాకనాఁడు కావచ్చును. అప్లేయగునేని నేఁడది కర్నూలు, గుంటూరు, నెల్లూరు, కృష్ణామండలములలో సంకర్షించినదగును. బహుకాలమునకు ముందే యంధ్రబ్రాహ్మణులు వైదికులని, నియోగులని, యిఱుదెఱఁగులవారయిరి. వేదాదివిద్యాసంపన్నులును, వైదికకర్మాచరణపరాయణులును నయినవారు వైదికులు. వైదికధర్మముల నాదరించుచు, రాజ్యాంగోద్యోగులను, గార్యఖడ్గనిపుణులును, వితరణకుశలులును నయినవారు నియోగులు. వేదాదివిద్యాసంపన్నతను గాంచిన నియోగులును రాజ్యాంగోద్యోగాదిపదములను బడసినవైదికులునుగూడఁ గొందఱు లేకపోలేదు. పార్శ్వికముగా వైదికులు గీర్వాణభాషను, నియోగులు తెలుఁగు భాషను బోషించుచు వచ్చిరి. వైదికులలో వేఁగినాటివారు, వెలనాటివారు మొదలగు పేళ్లతోను, నియోగులలోనార్వేలవారు, పాకనాటివారు, మొదలగుపేళ్ళతోను నవాంతరభేదము లుప్పతిల్లినవి. వారు వారాయానాళ్లలోనున్నావారగుటనుబట్టి యాయాభేదము లేర్పడెనఁ. పాకనాఁటింటివాఁడనియున్నదేగాని శ్రీనాథుని యింటిపేరేమో స్పష్టముగా

నెక్కడను గానరాలేదు. పాకనాడనునది నియోగులయొకశాఖకే పేరు గానున్నదిగాని యొక కులుంబమునింటిపేరుగా వినబడదు.)

తాతతండ్రులు

సాహిత్యచక్రవర్తియై పద్మపురాణసంగ్రహమును పరిబంధమును రచియించి కవితాపితామహుడనబరగిన కమలనాభామాత్యుడు శ్రీనాథునితాత. పద్మపురాణ సంగ్రహకథాకావ్య పరిబంధాధిపుడనియు, కలితకావ్యకళాలాపుడనియు, నుండుటచే నాతడాగ్రంథమునకుగృతిపతి యయ్యె నేమోయని సందేహము కలుగవచ్చును. నీని కుపబలముగా గూచిమంచి తిమ్మకవికృత లక్షణసారసంగ్రహమున "మత్పితామహుగవిపితామహు"నని భీమఖండమందున్న పద్యము, 'మత్పితామహు ధీపితామహు' నను పాఠముతోగానవచ్చుచున్నది. భీమఖండమునకు వ్రాతపర్తులు మంచిపదొరకలేదు. కావున నాపాఠము నిర్ణయింపగ గుదురకున్నది. అయినను, సరససాహిత్యసామ్రాజ్యచక్రవర్తి, కవితావిద్యాధుడు, ననిపేర్కొనబడుటచే నాతడు కవియనియే యెఱుగదగును. ఆతనిపద్మపురాణసంగ్రహమిప్పుడు దొరకకున్నది. లక్షణగ్రంథాదులందది యుదాహృతముగా దెలియరాలేదు. భీమాంబామారయలు శ్రీనాథునితల్లిదండ్రులు. మారయ కమలనాభునివంటి విద్వాంసుడుగాకున్నను, భార్జ్జుడు విద్యావంతుడు ననియే తలపడగియున్నాడు. కాశీఖండమున నాతడు 'విద్యావాజీవభవు'డని పరిస్తుతింపబడెను.)

జన్మదేశము

శ్రీనాథుడు పిన్ననాటనుండియు గొండవీటి రెడ్డియాస్థానమున మెలగినవాడగుటచేతను, బాకనాటింటివాడగుటచేతను, నాతనిజన్మ

దేశము కొండవీటిసీమ యగునని స్థూలదృష్టికి గోచరించును. ఈ విషయమును గూర్చి పలువురు పలుదెఱఁగుల వ్రాసియున్నారు. ఒకొనొకరు :- శ్రీనాథుఁడు కర్ణాటకుఁడనియు నంధ్రదేశమునఁ జేరి తెలుఁగుఁగవీశ్వరుఁ డయ్యెననియుఁ, దనతాతనివాసస్థలముగా నాతఁడు చెప్పుకొన్న సముద్రతీరపుఁగాల్పట్టణమేదో పశ్చిమసముద్రతీరమున నుండుననియు వ్రాసియున్నారు. ఈ వ్రాత సర్వథా యసంగతముగా నున్నది. భీమఖండకృతిపతి "పాకనాటింటివాఁడవు బాంధవుఁడపు"నని శ్రీనాథుఁ బ్రశంసించుట, నాసికేతోపాఖ్యానకర్త దగ్గుబల్లి దుగ్గన "శ్రీనాథసుకవి కూరిమినేయుమఱఁది" నని చెప్పుకొనుట, మొదలగు సంశయములు పైవాదమును బ్రధ్వంసపఱుచుచున్నవి. అసంగతముగా నున్న పైవాదము నపాకరించి బ్రహ్మశ్రీ చిలుకూరి వీరభద్రరావు గారును, వీరేశలింగముపంతులుగారును, మఱికొండుదెఱఁగులఁ గ్రొత్త వాదములను నెలకొల్పిరి. "కాల్పట్టణమనఁగా గాలపట్టణము. [కాల = నల్లని] కాల పట్టణమే కృష్ణపట్టణము. ఇది నెల్లూరి చేరువ నున్నది." వీరభద్రరావుగారి యూహయిది. ఈయూహ వారికేలక్ష్మిని గొల్పదయ్యెను. కృష్ణపట్టణమని పద్యమునఁ జెప్పఁ గుదురక కాల పట్టణముగా మార్చుకొని యటులును గుదురక, కాల్పట్టణముగాఁ గుంచించుకొని శ్రీనాథకవి చెప్పవలసినవాఁడయ్యె ననుటయుచితముగా నుండదుగదా!

"కాల్ పట్టణము కాదు క్రాల్పట్టణ మనియుండవలెను. క్రాల్పట్టణ మనఁగాఁ బ్రకాశించుపట్టణము. క్రొత్తది ప్రకాశించునుగనుకఁ గ్రొత్తపట్టణమని యర్థమువచ్చును" అని వీరేశలింగముపంతులుగారి సంభావనము. ఇది మిక్కిలి యసంగతముగా నున్నది. కృష్ణపట్టణమని చెప్పఁ జూచుచోఁజొప్పడెడు దోషములు దీనికిని దప్పినవికావు. మఱి

విశేషమొక్కటి. క్రొత్తపట్టణ మేర్పడి యిప్పటి కిన్నూఱేండ్లుకాలేదు. ఇది వంగవోలునకుఁదూర్పునఁబదిమైళ్లలో సముద్రపుటొడ్డుననున్నది. ఆర్నూఱేండ్లకుముం దీపట్టణముఁగూర్చి ప్రశంసయసంగతముగదా!

(మచిలీపట్టణమునకుఁ దూర్పున సముద్రతీరమున నిప్పుడు కాలీపట్టణ మనుగ్రామ మున్నది. అది ప్రాచీనపట్టణము. ఇప్పుడు మిక్కిలి రూపుచెడియున్నను నాగ్రామము ప్రాచీన ప్రాభవమును సూచించుచున్నది. కాలిపట్టణము. కాలీపట్టణము, కాళీపట్టణము అను పదముల కంతగా భేదములేదుగదా! 'వారిధితటీకాల్పట్టణాధీశ్వరుఁ' అని భీమఖండ పద్యపాదమున శ్రీనాథుఁడు పేర్కొన్న కాల్పట్టణ మిప్పుడు కాలీపట్టణమని వ్యవహరింపబడుచున్న పయిగ్రామము కాఁదగును. శ్రీనాథునిబావమఱఁదియగు దుగ్గన యింటి పేరిగ్రామమగు దగ్గుఁబల్లి కాళీపట్టణమునకుఁ బదిమైళ్ల దూరమఁదున్నది. శ్రీనాథుని బంధువగు బెండపూఁడియన్నమంత్రి పరిభృతుల గ్రామములుగూడ దానికిఁ జేరువనున్నవి.

ఈనడుమ బ్రహ్మశ్రీ. కే.వి. లక్ష్మణరావుపంతులుగారొకశాస నము (క్రీ.శ.8-వ శతాబ్ది) నందుఁ "గలుపట్టణము" అనుపేరును జూచి శ్రీనాథుని కాల్పట్టణ మదియేయని నిర్ణయించిరి. శాసనమున నట్లుపేర్కొనఁబడిన కలుపట్టణము నేఁడు కలపట మనుపేర నున్నది. ఆది యిదివఱకు నేను బేర్కొన్నకాళీపట్టణమునకు దరిదాపుననేకలదు. కాళీపట్టణము సముద్రము నొడ్డుననే యున్నది. కలపటము పదిమైళ్ల దూరమున నున్నది. శ్రీనాథుఁడు పేర్కొన్న గ్రామమిదియుఁ గావచ్చును.

శృంగారశ్రీనాథము

జీ వి త కా ల ము

సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూఁకటి నాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాలనూత్న యౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండుజవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మంధ్రభాష
ప్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకునిమహిమ

గీ. ప్రాయ మింతకు మిగులఁగై వ్రాలకుండఁ
గాశికాఖండమను మహాగ్రంథ మేను
దెనుఁగు చేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి ! శ్రీనాథభట్టసుకవి !

సీ. కాశీకావిశ్వేశుఁ గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయఁ డిచ్చు ?
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు ?
స్వర్గస్థుఁ డయ్యె విస్వనమంత్రి మఱిహేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తిఁ గలదు ?
కైలాసగిరిఁ బంటమైలారవిభుఁ డుండె
దినమెన్న మేరాజు తీర్పఁగలడు ?

గీ భాస్కరుఁడు మున్నె దేపునిపాలి కరిగెఁ
గలియుగంబున నికఁ నుండ గష్ట మనుచు
దివిజకవిపరుగుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

మొదటిపద్యము శ్రీనాథుని కాశీఖండమందలిది. రెండవది యాతని చాటువు. ఈ రెండు పద్యములనుబట్టి శ్రీనాథుని జన్మకాలమును నవసానకాలమును గొంచె మించుమించుగా గుర్తింపఁదగును. మొదటి పద్యమునఁ బేర్కొనఁబడినగ్రంథములలో శృంగారనైషధము, భీమఖండము, కాశీఖండము నిప్పుడు ప్రఖ్యాతములయి యున్నవి. తక్కినవి కానరావు. శృంగారనైషధము నిండుజవ్వనమునను. భీమఖండము ప్రౌఢనిర్భరవయఃపరిపాకకాలమునను, కాశీఖండము వార్ధకారంభమునను రచింపఁబడినవని పయిపద్యము చెప్పుచున్నది. ఇర్వదికిమీఁద ముప్పదియైదుదాఁక నిండుజవ్వనమనియు, ముప్పదియైదునుండి నలుబదియైదుదాఁకఁ బ్రౌఢనిర్భరవయఃపరిపాకమనియు నటుమీఁదవార్ధకమనియు వయోవిభాగమును జేయఁదగును.

పయిగ్రంథములో దేనికేని రచనాకాలము స్పష్టముగా మనకుఁ బట్టుచిక్కినేని దానిఁబట్టి కొంచెమించుమించుగా జన్మకాలము తెలిసికొనఁగల్గుదుము. శృంగారనైషధము పెదకోమటివేమభూపాలమహాసామ్రాజ్యరక్షామణియై, యవనాధీశసభా నిరర్గళవచోవ్యాపారిణుఁడై, వివిధాగ్రహారములతో నాంధ్రోళికాచ్ఛత్రిచామరాదిరాజార్హపదములను బడసిన మామిడిసింగమంత్రి శంకితముచేయఁబడినది. పెదకోమటి వేమారెడ్డి క్రీ. 1400. తరువాతికాలమున రాజ్యమునకు వచ్చెను. క్రీ. 1420 వఱకు రాజ్యమేలెను. కాఁబట్టి సింగమంత్రి యట్టిప్రాభవములఁ బడసినపిదప నడచిన శృంగారనైషధరచనము క్రీ. 1410, 1415 ప్రాంతముల నయియుండవచ్చును. మామిడిసింగమంత్రియే క్రీ. 1418లో సోమసిద్ధాంతమునకు వ్యాఖ్యానము రచించినాఁడు. కృతినిగైకొన్నకాలము దానికిఁ జేరికగా నుండవచ్చును ఈ విషయమున నాక్షేపసమాధానములు కొన్నియున్నవి. అవి మూఁడవ

ప్రకరణమునఁ జూడఁదగును. శృంగారనైషధము నాతఁడిర్వదియైదు ముప్పదియేండ్ల నడిమివయసున రచించియుండునేని, యాతనిజన్మ కాలము కీ॥ 1385 వాఁడగును. ఈ పరిగణనమును నేను నిండు జవ్వనము నడిమికాలమును, పెదకోమటి వేమారెడ్డిపాలనము నడిమి కాలమును గొని యేర్పఱిచినాఁడను. ఇది స్థూలపరిగణనము, దీని కేదెనిమిదేండ్లు పూర్వోత్తరములుగాఁగూడ నాతనిజన్మకాల ముండవచ్చును. కాని యిది నిష్కృష్టనిర్ణయమునకుఁజాలదు. కాని మఱికొన్ని విధములఁ జూడఁగా నీకాలమే నిష్కృష్టముగా నిలుచుచున్నది, భీమఖండరచనాకాలము కీ॥ 1428 కిఁ బైపడియు 1435కి లోపడియు నుండును. ఆవిషయము నాల్గవ పరికరణమున జూడఁదగును. భీమఖండరచనమునాటికి శ్రీనాథుఁడు ప్రౌఢనిర్భరవయఃపరిపాకశాలియై బహుభోగముల ననుభవించుచున్నాఁడు. ఆవయస్సు ముప్పదియైదేండ్ల నుండి నలుబదియైదేండ్లదాఁక నగునసుకొంటిమి. శ్రీనాథుఁడు నలుబదియైదేండ్ల వయస్సునపుడే భీమఖండము రచించెనను కొన్నను నది కీ॥ 1430 అనియే యనుకొన్నను, నాతనిజన్మకాలము కీ॥ 1385గానే యేర్పడుచున్నది.

శ్రీనాథుని జన్మకాలము క్రీ॥ 1360 అగునని యొక యాక్షేప వాదమున్నది. దాని స్వరూపము సంపూర్ణముగాఁ దృతీయ పరికరణమునఁజూడఁదగును. ఆ యాక్షేపపక్షమును సమాధానపఱుచుటకయి యీ చర్చలో నే నా పక్షమునకే తిరిగి యటే యానుకూల్యమొసఁగి సిద్ధాంతము నిర్ధారింపఁబ్రయత్నింతును. ప్రౌఢనిర్భరవయఃపరిపాకకాలము ముప్పదియైదేండ్ల వయసు నుండి యెన్నఁదగినదైనను, భీమఖండరచనాకాలము కీ॥ 1435 వఱకు నెన్నఁదగినదైనను, నా యాక్షేపవాదపక్షమున కనుకూలముగా నేను ప్రౌఢనిర్భరవయఃపరిపాకమునకుఁ బరమా

వధియనఁదగిన నలుబదియైదేండ్లవయఃకాలమును, భీమఖండ రచనా కాలముకాఁదగిన యేడేండ్లలో మొదటిదేయగు సంవత్సరమును గయి కొనుచున్నాఁడను. ఇట్లు కై కొనఁగా క్రీ. 1429 సంవత్సరమునాఁటికి శ్రీనాథుఁడు నలుబదియైదేండ్ల వాఁడగును. ఇట్లుచూచినను, నాతని జన్మకాలము క్రీ. 1384 కంటెఁ బూర్వమునకుఁ బోఁజాలకున్నది. ఆక్షేపవాదమునఁ బౌఢినిర్భరవయఃపరిపాకకాలమనఁగా నలువది యేండ్ల వయస్సని యొక యుపక్రమముకలదు. అది యసంభావ్య ముగా నేను దలంచుచున్నాఁడను. 'కలౌషష్టి' యను పలుకు ప్రఖ్యా తము. అఱువదియేండ్లవయస్సు వార్ధకముగాని ప్రౌఢనిర్భరవయఃపరి పాకకాలముగాదు. అయినను నఖండమగు నారోగ్య భాగ్యము నసుభ వించిన శ్రీనాథున కసామాన్యముగా నేఁబదియేండ్ల ప్రాయముకూడఁ బౌఢినిర్భరవయఃపరిపాకకాలముగాఁ బరితోషమొసఁగి యుండవచ్చు ననని యింకనుగూడ నాయాక్షేప పక్షమునకే యాసుకూల్యమొసఁగి క్రీ. 1429 సంవత్సరమే భీమఖండరచనాకాలముగా నంగీకరించి చూచిన నింకొక యయిదేండ్లు శ్రీనాథుని జన్మకాలము పూర్వమునకుఁ బోఁగలదేకాని యంతకెచ్చుపోఁజాలదు. కాని యట్లాతని జన్మకాలము క్రీ. 1385 కింకను బూర్వమునకుఁ గొనిపోవు నడ్డగించు ప్రతికూల సాధనములింకను గొన్నిరలవు.

శ్రీనాథుని యవసానపద్యమున 'రంభఁగూడెదెసుంగు రాయ రాహుత్తుండు కస్తూరికేరాఁ బర్తిస్తితింతు' ననిరలదు. తెలుంగురాయ రాహుత్తునివిషయము చతుర్థపరికరణమునఁ జూడఁదగును. అతని కుమారుఁడు తిరుమలయదేవరాయని శాసనములు క్రీ. 1454 లోనున్నవి. శాసనములు చెక్కించునాఁటి కాతిరుమలయదేవరాయఁడు దెబ్బది మూఁడేండ్లవాఁడను కొన్నను, నాతనిజన్మకాలము క్రీ. 1470 అగు

చున్నది. కొడుకును గన్నపిదప దెలుంగురాయడు మృతిచెందుట కును నాతడు మృతిచెందినపిదప శ్రీనాథుడు మృతిచెందుటకును నాల్గయిదేండ్లకాలము పట్టియుండవచ్చుననుకొన్నచో శ్రీనాథుని మరణ కాల మించుమించుగా క్రీ. 1475 అగుచున్నది. శ్రీనాథుడు దవ సానకాలమునకు నెనుబదియైదు తొంబదియేండ్లవాడగునను కొన్నను నాతని జన్మకాల మించుమించుగా క్రీ 1385, 1390 గా నేర్పడు చున్నది. ఈసాధనము శ్రీనాథుని జన్మకాలమును క్రీ. 1385 కంటె దర్వాతికాలమునకు గొనివచ్చుట కానుకూల్యము గలిగియున్నదే గాని పూర్వమునకు గొనిపోవుట కేమాత్రమును నవకాశమిచ్చుట లేదు.

మఱియు శ్రీనాథున కమ్మలచింతలచెన్నమరాజని శిష్యు డొకడున్నాడని చాయచంద్రోదయమను గ్రంథము చెప్పుచున్నది. చాయచంద్రోదయకారుడుకూడ జెన్నమరాజే. ఈచాయచంద్రోదయ కారునికి శ్రీనాథునిశిష్యుడగు చెన్నమరాజు పితామహుడు. కవుల చరిత్రమున శ్రీ వీరేశలింగముపంతులుగా రీవిషయమును దప్పుగ వ్రాసిరి. అది యెల్ల నించు తొమ్మిదవ ప్రకరణమున జూడదగును. చంద్రోదయకర్త వేంకటపతిరాయలచే బహుబహుమానములు బడసిన వాడు. వేంకటపతిరాయడు క్రీ. 1580 నుండి 1615 దాక నున్న వాడు. క్రీ. 1600 నాటికి చాయచంద్రోదయకారు డఱువది యేండ్లవా డనుకొన్నను నాతనిజన్మకాలము క్రీ 1540 యగును. అప్పటికాతనితండ్రి కేబదియేండ్లుండుననుకొన్నను నాతని జన్మ కాలము క్రీ. 1490 అగును. ఆతని తండ్రియే శ్రీనాథుని శిష్యుడు. కుమారుని గాంచునప్పటి కాతడుగూడ నేబదియేండ్లవాడసియే యనుకొన్నను, నాతని జన్మకాలము. క్రీ. 1440 అగును. ఆషేపపక్ష

మునకనుకూలముగా నీలెక్క నే నసామాన్యవిధముననే వేసితిని. అతడు శ్రీనాథుని శిష్యత్వముచేయునప్పటికిఁ బదునైదేండ్లో యిరువదియేండ్లో పాఠ్యము.గలవాఁడయి యుండవలెనుగనఁ, అట్టులయిన నది క్రీ. 1455, 1460 అగును. శ్రీనాథునిజన్మకాలము క్రీ. 1385గా నెక్కింతుమేని యప్పటికాతఁడు డెబ్బదియైదేండ్లవయస్సువాఁడగును. క్రీ. 1600లో నున్న చెన్నమరాజుతాత నంతకంటెఁ బూర్వకాలమునకుఁ బంపుట సాధ్యమగునా? క్రీ. 1385, కంటె నింకను బూర్వకాలమందే శ్రీనాథుఁడు జన్మించియుండినచో, నాతనికా చెన్నమరాజతాత చెన్నమరాజు శిష్యతి నెఱప సాధ్యమగునా?

శ్రీనాథునికి బావమఱఁదియు శిష్యుఁడు నగుదగ్గుఁబల్లి దుగ్గన తనకృతిని నాసికేతోపాఖ్యానమును, జందలూరి గంగయ్య కంకితము చేసినాఁడు. ఈ గంగయ గజపతులపాలనమున వారిగడిదుర్గములకు రక్షకుఁడుగా నుండిన తమ్మయబసువరాజునకు నాప్తుఁడును, ఏఱిణాపూర్తిశివాఘోరశివాచార్యులకు శిష్యుఁడై, కృష్ణరాయలతండ్రి యగు వీరనరసింహరాయని కంకితముగా వరాహపురాణమును రచించిన నందిమల్ల ఘంటసింగకవులచేఁ బ్రబోధచంద్రోదయమును కృతినిగొన్న వాఁడునునై యున్నాఁడు. మల్లయసింగయలగురువగు నఘోరశివాచార్యుఁడే కృష్ణరాయలకంకితముగాఁ బారిజాతాపహరణము రచించిన ముక్కుతిమ్మనకవికిని, కృష్ణరాయలమంత్రియగు తిమ్మరసునల్లునికిఁ గృతియిచ్చిన మాడయమల్లకవికిని గూడ గురువు. ఇట్లు వీరందఱు నొకజడముకిలోఁ బడుచున్నామిగాన, దగ్గుఁబల్లిదుగ్గన వీరినుండి యెంతవేఱుపడి పూర్వమునకుఁబోయినను క్రీ. 1480 - 90 కంటె నెక్కువ పూర్వమునకుఁ బోవుట కష్టసాధ్యము. పిల్లలమఱ్ఱిపినవీరభద్రీకవియు శ్రీనాథుని శిష్యుఁడని జనశ్రుతి గలదు. ఆతఁడు

క్రీ. 1480 పాంతములందు విద్యానగరమేలిన సాళ్వగుండ నరసింగ రాయల కంకితముగా జైమినిభారతమును రచియించినవాడు. పిల్లల మట్టిపిశవీరభద్రునకు గురుపును, దగ్గుబల్లిదుగ్గనకుబావయు గురువునై వర్తిల్లియుండుటకు బూర్ణపురుషాయుషజీవియైన శ్రీనాథుడుగూడ గొంచెమించుమించుగా నంతకు బదిపదునై దేండ్లపూర్వకాలమువాడ నున్నవాడు కాగలడు.

ఎన్ని విధములఁ జూచినను, శ్రీనాథుని జన్మకాలమును క్రీ. 1385 కంటెఁ బూర్వమునకుఁ గొంపోఁగుదుపడకున్నది. ఈ క్రీదిసాధనము నాల్గుమూడేండ్లకంటె హెచ్చుగా నటుతర్వాతికాలమునకుఁ గొనిపచ్చుటకుఁగూడ నడ్డుదగులుచున్నది.

శ్రీనాథుఁడు పెదకోమటివేమభూపాలుని పాలనకాలమున విద్యాధికారియై శాసనకృతులను రచించినాఁడు. క్రీ. 1401లో పెదకోమటి వేమారెడ్డి చేసినధర్మకార్యముల శాసనములు మూఁడుపలభ్యమయినవి. ఱంటి శ్రావణమాసమునాఁటిది, రెండుపుష్యమాసమునాఁటివి. పుష్య మాసపుశాసనములు రెండింటను శ్రీనాథుఁడే శాసనాచార్యుఁడుగా నున్నాఁడు. ఆ సంవత్సరమే శ్రావణమాసము కడదినతర్వాత నాతఁ డాపదము నందియుండవచ్చును. చిన్నారిపొన్నారి చిఱుతకూఁటి నాఁటికే ప్రబంధరచయితయయిన ప్రతిభాశాలి గాపున నాతఁడు, శాలి వాహనసప్తశతీరచనాకాలమగు నూనూఁగుమీసాల నూత్నయౌవనము తటికిఁ బెదకోమటివేమ భూపాలుని యొద్ద విద్యాధికారిపదమును బడసి యుండవచ్చును. క్రీ. 1385 ప్రాంతమున జనించెనేని యప్పటి కాతఁడు పదునెనిమిది పందొమ్మిది యేండ్లప్రాయము వాఁడగును ఆతని జన్మకాలమింకను దర్వాతికిఁ దెత్తుమేని విద్యాధికారిపదముఁబడ యుటకు క్రీ. 1404 నాఁటికి వయసుచాలనివాఁడగును. కాఁబట్టి

శ్రీనాథుఁ డించుక యించుమించుగాఁ క్రీ. 1385లో జనించెనని. క్రీ. 1475లో స్వర్గస్థుఁడయ్యెనని నేను దలంచుచున్నాఁడను.

నేను మీఁదఁజూపినసాధనములు ప్రత్యేకముగాఁ జూచినఁగూడ బలిష్ఠములే యనఁదగియున్నవి. సమిష్టిమీఁద నవియన్నియుఁ గూడ నొకసిద్ధాంతమునే సాధించుచున్నవి. కాఁబట్టి యాసిద్ధాంతమును గట్టి బలముగల దగుచున్నది. అట్టిదానిని ద్రోసిపుచ్చుట దుష్కర మనవచ్చును. బలవంతములగు ప్రతిపక్షసాధనము లుండి పయిసిద్ధాంత మును బరిహరింపఁగల్గి శ్రీనాథునిజన్మకాలమును క్రీ. 1360గా నిలుపఁగలుగునేని దానినే పరిగ్రహింతముగాక.

పేరు

సామాన్యముగా నాకాలమున జనులనామధేయములు పైకృత ములుగా నుండెడివి. అప్పన్న, తిప్పన్న, జక్కన్న, మారన్న, పీకన్న, పోతన్న. మొదలగునవి యుదాహరణము, మన కవీశ్వరునకు "శ్రీనాథుఁ"డన్న శ్రుతిమధురమయిననామధేయ మాతని తండ్రితాతల విద్యాచాతుర్యమునకు ద్యోతకముగానున్నది. వీరివంశము విద్వద్వం శమేగదా! శ్రీహర్ష, శ్రీనాథ, పదములయందుబాటు ప్రశంసనీయము. ఆకవిగ్రంథము నీకవి తెల్లించెను. శృంగారనైషధ మాతఁడే యాతఁడుగా నవతరించెనో యనిపించుచున్నది. కొందటిట్లుగూడఁ బొరఁబడిరి. ఏనుఁగులక్ష్మణకవి రామేశ్వరమహాత్మ్యమున నిట్లుకొనియాడెను

గీ. మహితచింతామణీ దివ్యమంత్రసిద్ధు
నైషధాదిప్రబంధ సందర్భనిపుణు
నకలవిద్యావిశారదు సత్కవిత్వ
పట్టభద్రుని శ్రీనాథుఁబ్రస్తుతింతు.

శ్రీహర్షునకుఁజెల్లువిశేషణములు శ్రీనాథున కిక్కడ దక్కినవి. ఈకవి బ్రహ్మవీమహాత్మ్యమునఁగూడనిట్లే చెప్పినాఁడు.

బా ల్య ము

మనకవీశ్వరునిబాల్యవర్తన మెట్టిదో సరిగా గుర్తించుట కాధారము లేవియుఁగానరావు. తొల్లటికృతులనుబట్టి కొంతగుర్తింపనగునను కొనెదను. కాని యాకృతు లిప్పుడు దుర్లభము లయినవి. చిఱుత కూఁకటినాఁటికే ప్రబంధరచనము నిర్వహించినవాఁడగుటనుబట్టి యాతఁ డల్లరిగాఁదిరిగి కాలముఁ బొల్లపుచ్చక పసుఁబాయముసాఁడు విద్యా భ్యాసోత్సాహమునసే వర్తించెనని భావింపనగును. విద్యాభ్యాసముచేతన కాక రూపసౌందర్యము చేతనుగూడ నీతఁడు నాఁడు వాసికెక్కిన వాఁడుగా దోఁచుచున్నాఁడు. ''చిన్నారి పొన్నారి చిఱుశకూఁకటి, నూనూగుమీసాలు'' ననుట దానికి సోపరకము.

వి ద్యా భ్యా స ము గు రు వు

శ్రీనాథునివిద్యాభ్యాసాదికమెక్కడనెట్లుజరిగెనో గుర్తించుటకుఁ దగినబలవదాధారములు లేవు. కుశాగ్రబుద్ధియు నద్భుతప్రతిభాశాలియు నగునీతఁడు పలువురుగురులయొద్ద గురుకుల వాసక్లేశమునకు లోనయి చిరకాలముజాడ్యముతో విద్యాభ్యాసము చేసెనని తలంపరాదు. తనతాత కమల నాభామాత్యుఁడు గొప్ప విద్వాంసుఁడును గవీశ్వరుఁడునని శ్రీనాథుఁడు పలుమాఱు ప్రశంసించినాఁడు.

మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరు
ఘనునిఁ బద్మపురాణసంగ్రహకథాకావ్యప్రబంధాధిపున్.

వినమత్కాకతిసార్వభౌము గవితావిద్యాధరుం గొల్తు మా
యనుఁగుందాతఁ బ్రదాతశ్రీకమలనాభామాత్యుడామణిన్.

గీ. మత్పితామహుఁ గవిపితామహుని దలఁతు
గలితకావ్యకళాలాభు గమలనాభు
జంద్రచందనమందారసదృశకీర్తి
సరససాహిత్యసామ్రాజ్యచక్రవర్తి.

కవీశ్వరుఁడగు నీ కమలనాథామాత్యుని పౌత్రిత్వము మన శ్రీనాథునకు సహజశక్తిని సమకూర్చియుండును. కమలనాథునిసాక్షాదుపదేశముల నీతఁడు కాంచెననికాని లేదనికాని స్పష్టపఱుపు నాధారములు గానరావు. ఆతఁడు నేకరించియుంచిన గ్రంథభాండారము రచయించినరచనములు నీతనిసహజశక్తికి వడివడిగా నున్మేషము గలిగించి గ్రంథరచనమునకుఁ గడఁగించెనని తలఁపఁదగును; సహజశక్తి లోకశాస్త్రకావ్యాద్యవేక్షణమువలనినై పుణ్యము కావ్యజ్ఞశిక్షచేనభ్యాసమునను నివి కవిత్వోపలబ్ధికిఁ గారణములని యాచార్యదండి ప్రభృతులనిరి. ఉత్తమకవితకు సహజశక్తి, లోకానుభవాదులవలనినై పుణ్యముచాలదు. కావ్యజ్ఞశిక్ష యత్యావశ్యకము.సంస్కృత ప్రాకృతాదిభాషలలోఁబరిజ్ఞానపాటవము, తర్కవ్యాకరణాది శాస్త్రములందుఁ దలస్పర్శమగువైదుష్యము, పండితులతో శాస్త్రార్థములు సల్పఁజాలినపాండితీప్రౌఢి, పయిపయిపూత మెఱుంగు చాతుర్యముతో నలవడఁదగినదికాదు. సకలవిద్యా సనాథుఁడయి యాతఁ డీకముందు కోమటివేమారెడ్డి యాస్థానమున విద్యాధికార్యున్నతోద్యోగము వహింపనున్నాఁడు. మఱియు డిండిమభట్టారకాదులతో విద్యావివాదములు సలుపనున్నాఁడు. ఇట్టివాఁడు, గట్టిగా గురుశుశ్రూషతో శాస్త్రాభ్యాసము సల్పితీఱవలసి

యుండును. అట్టిగురువెవ్వరో స్పష్టముగానీతఁడు తనగ్రంథములందుఁ దఱుచుగాఁ బ్రస్తుతింపఁదగి యుండును. అలోకసామాన్య ప్రతిభాశాలి యగుటచే నాఁత డొకవేళ నాయఖండపాండిత్యమునుగూడ, నాచార్య సన్నిధి నభ్యసింపకయే యలవరచుకొన్నాఁడేమో యనుసంశయమున కీక్రిందిపద్య మవకాశము కలిగించుచున్నది.

శా. బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడ వురుపర్జ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చనకళాశీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాదిమహాపురాణచయ తాత్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమపు నీభాగ్యంబు సామాన్యమే!

శృంగారనైషధము.

కాని దీనినాధారముగాఁగొని శ్రీనాథునకు విద్యాగురుఁడు లేఁడని తలంపరాదు. కొందఱువిద్యాలాభము "ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాः" అన్నసూక్తిని స్ఫురింపఁజేయుచుండునుగాని యట్టివిద్యోపలబ్ధికిఁగూడ నుద్బోధకముగాఁ గొంత గురుశుశ్రూష యుండవలసినదే యగును. శాస్త్రాధ్యయనము గురునియొద్దఁ జేయవలసినదేయని శ్రీనాథుఁడే చెప్పినాఁడు.

గీ. శాస్త్ర మాచార్యునన్నిఁడఁ జదువఁడేని
యిద్ధబోధంబు మది సంగ్రహింపఁడేని
తెగువమీఱి పరిజ్ఞ సాధింపఁడేని
జ్ఞాతిజయమందఁడేని తజ్జనుఁడు జనుఁడె.

కాశీఖండము.

సంస్కృతకాశీఖండమున నీవిషయముగలగ్రంథభాగముకలదు గాని శ్రీనాథుఁ డీపట్టునఁ బ్రసక్తిగల్గించుకొని కొన్ని పద్యములలో

స్వవిషయమునే వెల్లడించుకొన్నాఁడని నేను నిశ్చయించుచున్నాఁడను. తన సాహిత్యసౌష్ఠవమునకుఁ గారణములు నుద్బోధకములునని తన కడపటిగ్రంథమగు కాశీఖండమున శ్రీనాథుఁ డీ క్రిందివానిని బేర్కొన్నాఁడు:-

సీ. ఆంధ్రక్షమామండలాఖండలుండైన
వేమభూపతికృపావీక్షణంబు
ఘోడెరాయాంక నద్గురురాయభీమేశ్వ
రస్వామిపదసమారాధనంబు
కమలాద్రినిలయమార్కండేయశివమౌళి
చంద్రాంశునవసుధాసారధార
వేదాద్రినరసింహవిపులపృష్ఠస్థలీ
కల్హారమాలికాగంధలహరి

గీ. కారణంబులు సుదోబధకములుఁగాఁగ
నంభవించినసాహిత్యసౌష్ఠవమున
వీరభద్రేశ్వరుఁ బ్రిబంధవిభునిఁ జేసి
కాశికాఖండముఁ దెనుంగుఁగానొనర్తు.

మొదటిది:- ఆంధ్రదేశాధీశ్వరుఁడయిన వేమభూపాలుని దయాదృష్టి. కొమరగిరిరెడ్డి భావమఱఁది యగు కాటయవేమారెడ్డియుఁ గొమరగిరియనంతరము కొండవీటిరాజ్యము పాలించిన పెదకోమటివేమారెడ్డియుఁ గాశీఖండకృతీశ్వరుఁడగు వీరభద్రారెడ్డియన్న యల్లయవేమారెడ్డియు, నని శ్రీనాథుని కాలమున విఖ్యాతులు మువ్వురు వేమారెడ్లు వర్తిల్లిరి. ఇందుఁ బేర్కొనఁబడినవేమారెడ్డి యీమువ్వురలో నొక్కఁడు కావలెను. మొదటివాఁడు కాటయవేమారెడ్డి; ఈతఁడు

కొమరగిరిని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి కొండవీటఁ దానేరాజ్య మేలి, పదపడి యాతనిచే రాజమహేంద్రవరప్రాంతదేశము పారితోషికముగాఁ బడసి కొలఁదికాలము పర్భుత్వము నెఱపినవాఁడు. పండితపర్భుడు; కాళిదాస నాటకత్రయవ్యాఖ్యాత; పండితుడు. శ్రీనాథుని చిన్ననాఁట జీవించి యున్నవాఁడు. ప్రస్తుతగర్భంథమగు కాశీఖండమును గృతిగాఁ గొనుపీరభద్రారెడ్డికి మామ. ఈతఁడు శ్రీనాథుని పర్భితభాచాతుర్యము పరికించి యాదరించి బాల్యమున నాతనివిద్యాభ్యాసమునకువలయువసతుల సమకూర్చి తనవిద్వద్గోష్ఠులందు గారవించుచుండవచ్చును. ఇఁక రెండవవాఁడు పెదకోమటి వేమారెడ్డి; ఇతఁడు సంగీతసాహిత్య విద్యలందుఁ జతురుఁడు, పెక్కు కావ్యములఁ జెప్పించుకొన్నవాఁడు. చెప్పినవాడు. సర్వజ్ఞచక్రవర్తి యని బిరుదు గొన్నవాఁడు. శ్రీనాథకవీశ్వరునకుఁ దనయాస్థానమున విద్యాధికార్యున్నతోద్యోగము నొసఁగి తాను జీవించియున్నంతదాఁక నాదరించినవాఁడు. పైప్రస్తావ మాతని గూర్చి వర్తించినది కాఁదగును. కాని యట్లనుటలో నొక్క చిక్కు చిన్నది యున్నది. కోమటివేమారెడ్డికిని. వీరభద్రారెడ్డిప్రభృతులకును విరోధము మెండు ఆతనిపొగడ్త తనపేరఁ జెప్పించుకొనుకృతికో నుండుట వీరభద్రారెడ్డికి సహ్యముగాఁ గూడదు. మూడవవాఁడు :- అల్లయవేమారెడ్డి, తనతమ్ముని వీరభద్రారెడ్డి నాతనిభార్యామూలముగా వచ్చినరాజమహేంద్రవర రాజ్యమున కభిషిక్తునిఁజేసి దేశమును నిష్కంటకముగా నేలుటకిఁ దెచ్చినవాఁడు. ఈతనిప్రాపు శ్రీనాథుని బాల్యమున నున్నట్లు తెలియరాదు. కాని కాశీఖండరచనసందర్భమునఁ దాత్కాలికోత్సాహమునకుఁ గారణమగుటను బట్టి యప్పుడట్టి పొగడ్త యతనిగూర్చి చేసియుండు ననుకొనుట యుక్తముకాకపోదు. సమష్టిమీఁదఁ బద్యార్థమును బర్యాలోచింపఁగాఁ

బయిప్రళంస కాశీఖండ రచనాకాలమునకుఁ దాత్కాలికోత్సాహ కారణముగా నున్న యళ్లవేమారెడ్డినిగూర్చి చేసినదిగానే తోఁచుచున్నది.

రెండవది:- ఘోడెరాయబిరుదాంకుఁడగు భీమేశ్వరస్వామి పాదసేవ. ఈభీమేశ్వరస్వామి యెవ్వరో గుర్తింపవలసి యున్నది.

"రాయగురుపరమేశ్వరసాధుజనవిధేయ, ఘోడెరాయ సకలకళా ధామాదిబిరుదభాస్వరుండై భీమయగురువరేణ్యపుణ్య కారుణ్యకటాక్ష వీక్షలబ్ధసుస్థిరైశ్వర్యధుర్యుండై విజయధాటీ సమాటీకనంబున దిశలల్లాడ నల్లడభూపల్లాభుండు రాజమహేంద్రంబు రాజధానిగా .....బాలించె.

భీమేశ్వరపురాణము.

మఱియుఁ గాశీఖండమందే:-

శా. ఈశ్వరుఁ డింటివేల్పు జగదేకగురుండగు ఘోడెరాయభీ
మేశ్వరుఁ డాత్మవంశగురుఁ డీగులు నిత్యవినోదకృత్యముల్
శాశ్వధర్మకీర్తులు తలంపఁగ నమ్మిననొమ్ము లాదిగ
శ్రైశ్వరుఁ డంట నై జ మెన యేనృపు లళ్లయవీరశౌరికిన్.

పర్యాలోచింపఁగా నీభీమేశ్వరస్వామి దైవమగుదాక్షారామభీమేశ్వరస్వామిగాక యొకమహాపురుషుఁడనితేలుచున్నది. ఆయనకు రాయగురుపరమేశ్వర సాధుజనవిధేయ ఘోడెరాయ సకలకళాధామాదులు బిరుదములు. రెడ్డిరాజులగురువులకు ఘోడియరాయ లనిబిరుదు పెక్కుచోట్లఁ గానవచ్చుచున్నది. వీరభద్రారెడ్డితండ్రి యళ్లాడభూపతికి రాజ్యలాభ మీమహనీయు ననుగ్రహమున సమకూడెనట! ఈతఁడు తప

స్వియు, వర్చస్వియు, నగుమహావిద్వాంసుఁ డయియుండును. వీర భద్రారెడ్డితమ్ముఁడు దొడ్డారెడ్డికిఁ గృతిగా నిశ్శంకకొమ్మనామాత్యుఁడు రచియించినశివలీలావిలాసమనుప్రబంధమునఁగూడ నీభీమయగురునిఁ గూర్చి యిట్లుకలదు:--

క. వీరభపంశగురుండు ను
దారగుణోత్తుఁడు నగుచుఁ దత్త్వమహత్వ
శ్రీరుచి ఘోడియరాయప
దారూఢుఁడు భీమదేశికాధిపుఁ డొప్పున్.

సీ. అవిరళైశ్వర్యమహత్వసంపన్నత
మౌళిన (?)బాసట మలయువాఁడు
సంశ్రితరక్షణాస్థాపరిపూర్ణత
నాభమహోజ్జ్వలు ననుపునాఁడు
వేదశాస్త్రాధికవిద్యానిరూఢత
వదనసరస్వతివడువువాఁడు
వివిధన్నవితరణాచరణనమీక్షణ
....సమతవాఁడు

గీ. తగుఁ బ్రశంసచేయ దండభున్మదవిభం
జనుఁడు వినయవినత (జనవరేణ్య)
మణికిరీట (గుణ, ఘృణి) సమంచితచరణుండు
ఘోడెరాయభీమగురువరుండు.

మ. నిపుణత్వంబునఁ బ్రస్తుతింపవలయున్ శ్రీవీరభద్రాచలా
గ్రిపదవ్యాతతభర్మహర్మ్యతల జాగ్రద్వీరభద్రాఖిలే

శపదాబ్జద్వయభక్తిసుస్థిరమానసంపూర్ణు భీమేశ్వరున్
త్రిపురారీంద్రగురూత్తమాత్మభవునిం దేవేంద్రకోలాహలున్.

పై పద్యమువలన నాభీమేశ్వరస్వామి త్రిపురారి (తిప్పయ) కుమారుఁడనియు, వీరభద్రాచల నిలయుఁడగు వీరభద్రేశ్వరునకు భక్తుఁడనియు, వేదశాస్త్రాదివిద్యానిరూఢుఁడనియుఁ దెలియుచున్నది. వీరభద్రాచలము కాశీఖండమం దెక్కువగా వర్ణింపఁబడినది. ఆవర్ణనము సంస్కృతకాశీఖండమునఁగానరాదు. అది శ్రీనాథునిస్వయం కల్పితము. భీమయగురువరేణ్యుని నివాసస్థల మగుటమీఁదియభిమానము చేతనే దాని నంత విరివిగా సవిశేషముగా వర్ణింప నుత్సహించినాఁడు. సమన్వయించి చూడఁగా నావీరభద్రాచలము పట్టిసపర్వతముగా నేర్పడు చున్నది. అది యఖండగోదావరీతీరస్థిత మగు పుణ్యక్షేత్రము. భీమ యగురుఁ డీక్షేత్రమున వెలసియున్న వీరభద్రేశ్వరస్వామి నారాధించుచు నుండినవాఁడు. శ్రీనాథున కద్వైతమందే తాత్పర్యమయినను, శైవమతమునం దభిమానవిశేషముగలదు. పెక్కుమార్లాతఁడు పంచ బ్రహ్మషడంగమంత్రములతోఁ బ్రాసాదపంచాశ్రినిస్మరించుచుండును. ఆయనగ్రంథము లెక్కువగా శివకథాప్రధానములే. ఆతని కాశ్రయ మొసఁగిన రెడ్డిరాజులందఱుఁగూడ శైవమతాభినివిష్టులే. వేదశాస్త్రాది విద్యోపదేశముచేఁగాక యాభీమయగురువరేణ్యుఁడు శైవమంత్రాద్యుపదేశముచే నతనికి గురుఁడయియుండవచ్చును. తనసాహిత్య సౌష్ఠవమునకుఁ గారణము లని చెప్పుకొన్న నాల్గింటిలో వేమభూపతి కృపావీక్షణము, భీమేశ్వరస్వామిపదసమారాధనమునను నీ రెండును మానుషములు.

మూఁడవది:- కమలాద్రినిలయుఁడగు మార్కండేయేశ్వరుని యనుగ్రహము. రాజమహేంద్రవరమందలి యొక స్థలవిశేషమునకుఁ

గమలాదిగ్రియనిపేరు. మార్కండేయేశ్వరస్వామి యక్కడ వెలసిన వేల్పు.

నాల్గవది:- వేదాద్రినరసింహస్వామి యనుగ్రహము. వేదాద్రి యనుపేరుగలశైలములు పెక్కులున్నవి. తెల్గుదేశమందున్నవానిలో బ్రిధానమయినవిమూడు. కృష్ణాతీరమున నిప్పుడు ముక్త్యాల సంస్థాన మునకు సంబంధించియున్న వేదాద్రియొక్కటి. నైజాంరాష్ట్రమున రాచ కొండకు జేరువనున్నవేదాద్రి యొక్కటి రాజమహేంద్రివరముదగ్గఱ నున్న యొకమిట్టకుగూడ వేదాద్రియనిపేరున్నట్టు శ్రీచిలుకూరి వీర భద్రాగ్రిరావుపంతులుగారు వ్రాసినారు. కాటయవేమారెడ్డి యహోబల శాసనమునగూడ గౌతమీతీరమున వేదాద్రియున్నట్టు చెప్పబడినది. "కాటమరెడ్డివేమారెడ్డింగారిఅర్ధాంగలక్ష్మిఅయి ఆ కొమరగిరయ్యంగారే ఈకొమరగిరయ్యంగారై అవతరించిన ఈ కొమరగిరయ్యంగారికి తల్లి గారైన తల్లసానమ్మగారు ఈకొమరగిరయ్యగారికిన్ని కాటమరెడ్డివేమా రెడ్డిగారికిన్ని సుకృతముగాను శ్రీగౌతమీతీరమందును వేదాద్రి శ్రీనర సింహదేవరకును ఆచంద్రార్కము ప్రతిసంవత్సరతిరునాళమహోత్స వానకుదారవోసి సమర్పణచేసిన వెలుచూరితల్లవరము...."

కాబట్టి శ్రీనాథుడు పయిపద్యమునఁ బేర్కొన్న వేదాద్రి శ్రీవీరభద్రిరావుపంతులుగారన్నట్టు కమలాద్రితోపాటు రాజమహేంద్రి వరము దగ్గఱ నున్నమిట్టయే యగును.

పయివిధమునఁ బరామర్శింపఁబడినయా కాశీఖండపద్యము శ్రీనాథునిబాల్యవిద్యాభ్యాసవిషయమును దెలుపునదిగా దోఁపకున్నది. కాశీఖండరచనాకాలమున నాతనికిఁ దాత్కాలికోత్సాహకారణముగా

నుండుటచే నళ్ళయవేమారెడ్డిని, భీమయగురుని, మార్కండేయేశ్వరుని, నరసింహస్వామిని బ్రస్తుతించినాడు. వీరందఱు రాజమహేంద్రివర సన్నిహితులే. ఉపలబ్ధమయిన శ్రీనాథునిగ్రంథములం దాతనిగురువెవ్వరో తెలియరాకున్నాడు. మన తత్తరాట్చరిత్ర పండితారాధ్య చరిత్రాదులం దుండునేమో: ఈవిధముననే శ్రీనాథునికిఁ దర్వాతికవియగు పట్టమెట్ట సోమనాథసోమయాజి సూతసంహితలో నొక్క పద్యమునుచెప్పినాడు. ఆపద్యమిది:-

సీ. అన్మద్గురుస్వామియైన లింగారాధ్య
సార్వభౌముప్రసాదసౌష్ఠవంబు
అత్యాప్తుడు సతీర్థ్యుడైనకామారెడ్డి
పట్టభద్రుని ధర్మపాటవంబు
తత్ప్రభానదులైన ధన్యవిద్వాంసుల
నంతతనల్లాపనమ్మతంబు
ఘనుఁడు విద్యారణ్యమునియేర్పరించిన
తాత్పర్యదీపిక దారికలిమి

కారణంబులుగా నిరాఘాటచాటు
శుద్ధపద్ధతిఁ దెలుఁగున సూతసంహి
తాచతుర్విధఖండసందర్భమెల్లఁ
గావ్య మొనరింతు లోకవిఖ్యాతముగను.

అభ్యసించిన విద్యలు

కొన్నియన్యపద్యములనుబట్టియు, శ్రీనాథకృతగ్రంథములను బట్టియుఁనాతఁ డభ్యసించినవిద్యలనుగూర్చి కొంత యెఱుఁగఁగల్గు

దుము. శ్రీనాథుడు కృష్ణయజుర్వేదము నధ్యయనముచేసినాడు. స్వవేద శాఖాధ్యయనము బ్రాహ్మణున కావశ్యకకార్య మని స్మృతికారులనిరి. దాని నీతడు పాటించెను. అధ్యయనము జదివి మఱుచుచందమున గాక చక్కగా నుపస్థితిలో నుండునట్లేచేసెను. ఈయర్థమును "అధ్వర్యువేదశాఖాధీతినిష్ణాతు" అన్నపద మెఱిగించుచున్నది. అధ్వర్యువేద శాఖ యనగా గృష్ణయజుర్వేదము. ఉభయభాషాకవియై 'శ్రీనాథకవి' యనియేకాక వేదాధ్యయనపరుడై 'శ్రీనాథావధాని' యనికూడ శ్రీనాథుడు పేర్కొనఁ దగినవాడయినాడు. మఱియు బదునెనిమిదియగు పురాణములను స్మృతులను, నింక సాంఖ్యయోగసిద్ధాంతములను, శైవాగమములను జదివినాడు. ఈయర్థము నీక్రిందిపదము లెఱిగించుచున్నవి. "శ్రుతిపురాణాగమస్మృతిసాంఖ్యసిద్ధాంత కబళనవ్యుత్పత్తి గౌరవంబు" "అఖిలపురాణవిద్యాప్రవీణు" "ఆగమజ్ఞాననిధివి" "బహుపురాణజ్ఞుడవు". "కబళనవ్యుత్పత్తిగౌరవంబు" అనుటచేనావిద్యలనుముద్దలుచేసి మ్రింగినట్లుగా నశ్రమమున గ్రహించి వ్యుత్పత్తి నార్జించినాడని యగుచున్నది. ఇంకను, మహారాష్ట్రి, శౌరసేని మొదలగు ప్రాకృతభాషలందుఁ బరిజ్ఞానపాటవము గడించినాడు. "సంస్కృత ప్రాకృతశౌరసేనీముఖ్యభాషాపరిజ్ఞానపాటవంబు." -మహారాష్ట్రిప్రాకృతము సామాన్యముగా బ్రాకృతపదముచే గొన్నిచోట్ల వ్యవహరింపఁబడియున్నది. "మహారాష్ట్రాశ్రయాం భాషాం ప్రకృష్టం ప్రాకృతం విదుః" కావ్యాదర్శము. మహారాష్ట్రిప్రాకృతమున నున్న సాతవాహనసప్తశతిని శ్రీనాథుడు తెలిగించినాడు. అట్లు తెలిగించుట కాప్రాకృతమున మంచి పరిజ్ఞాన ముండవలెను గదా! ప్రాకృతము నకు సంస్కృతమున ఛాయ వ్రాయునాచారము ప్రాచీనకాలముననున్నట్లు తెలియరాదు. మఱియు నాసప్తశతిలో నూఱుగాథల నేఱి శ్రీనాథుని

కాశయమైన పెదకోమటివేమారెడ్డి వ్యాఖ్య రచించెను. ఆవ్యాఖ్య యిప్పుడు క్రొత్తగా దొరకియున్నది. ఆవ్యాఖ్యారచనమున రెడ్డిగారికి శ్రీనాథునితోడ్పాడుటకూడ నుండఁబోలును

పతంజలిప్రణీతమగు వ్యాకరణమహాభాష్యమును బాగుగాఁ బఠించినాఁడు. ''పన్నగపతిసార్వభౌమభాషితమహాభాష్య విద్యాసమభ్యాసబలము'' ఈయర్థమునకు శ్రీనాథుగ్రంథములన్నియుఁ దార్కాణమగుచున్నవి. పరిగాఢమగువ్యాకరణపాండిత్యముున్నవాఁడే ప్రయోగింపఁదగినపదము లనేకము లీయనకృతులందుఁ గానవచ్చుచున్నవి. న్యాయవైశేషిక దర్శనములందుఁ గౌశల్యముఁ గాంచినాఁడు. ''అక్షపాదకణాద పక్షిలోదీరిత న్యాయకళాకౌశలాతిశయము.'' అక్షిపాదుఁడు న్యాయదర్శనకర్త గౌతమముని; కణాదుఁడు వైశేషికదర్శనకర్త; పక్షిలుఁడు గౌతమన్యాయభాష్యకర్త వాత్స్యాయనముని. శ్రీనాథుని నాఁటికి న్యాయవైశేషికదర్శనములకు సాంకర్యములేదు. అన్నంభట్టారకుని యనంతరమే యారెండు దర్శనములు గలసిపోయినవి. శ్రీనాథునకు న్యాయవైశేషికములయందుఁగల ప్రౌఢిమ కాశీఖండాది కృతులలోఁగానవచ్చుచున్నది; కోమటివేము నాస్థానమున విద్వత్పరీక్షణ వేళలందు బహుదేశభూధులతో భాషింపఁగల్గుటకుఁ దర్కపరిజ్ఞానము తప్పక యుండవలెను. డిండిమభట్టారకాదులతో వివాదము సల్పఁజాలుటకును దర్కచాతురి యావశ్యకమేయగును.

మఱియుఁ బ్రాచీన కృతులందుఁ గల్గు భావ విశేషములను బయల్పఱిచి హృద్యముగాఁ జెప్పు చాతుర్యము గలవాఁడు. 'పూర్వకవి ముఖ్యవిరచితాపూర్వకావ్య భావరససుధాచర్వణప్రౌఢత యును.'' ఈచాతుర్య మపారముగా శ్రీనాథున కుండు ననుటకు

సందేహమేమిఁ సహృదయులగోష్ఠులలోఁ మెలఁగుచుండినవాఁడేగదా; శ్రీనాథునిగ్రంథములలోఁ బెక్కుచోట్ల నాతఁడభిమానించినసంస్కృత కావ్యనాటకాదులలోని పద్యగద్యార్థములు పొందుపడినవి. అట్టివానిలో నేనుగుర్తింపఁగల్గినవానిఁబట్టి యేయేగ్రంథములమీఁద నాతని కభిమాన మున్నట్టు తెలియపచ్చెనో వాని నీక్రిందఁ నిచ్చుచున్నాఁడను. కాళిదాసుని కావ్యములు, నుమఁ గుమారసంభవమును, భారవి కిరాతార్జునీయమును, శ్రీహర్ష నైషధమును, భవభూతి యుత్తరరామచరితమును, మురారి యనర్ఘరాఘవమును, బాణునికాదంబరియును, మయూరునిసూర్యశత మును నీతనికృతులలోఁ బెక్కుచోట్లఁ జొచ్చినవి. ఇంకను యోగ సాంఖ్యశైవాగమబౌద్ధాగమాదులు గూడఁ బ్రసక్తములుగాఁ జేరినవి. శ్రీనాథునియాయాగ్రంథములను గూర్చి చర్చించునప్పు డవి కొంత వివరింపబడును.

కుటుంబస్థితి

ఈవిషయముగుర్తింపనాధారమేదియుఁగానరాదు. నిరంతరము దేశాటనముసేయుచు విషయలోల్యమున వర్తించుచు వచ్చినవాడగుఁ టచే నితనికి సంసారసుఖం దర్శమగునానందము లభింపకపోయెడి దేమో యని సంశయము కల్గుచున్నది. పుత్రసంతానము కలదో లేదో తెలియదు. ఉండినను బండితపుత్రత్వము శూన్యార్థము నేయునటై యుండును. పర్యాలోచకులయినపుత్రులే యుందురేని. యీతఁడు కడ కాలమునఁగూడఁ గృషికృత్యమునకుఁ జొచ్చుటయుఁ బన్నుచెల్లింప లేకపోఁగా దాఁపరిల్లినరాజదండనకుఁదానై పాల్పడుటయు సంభవిం పదుగదా; ఆలోకసామాన్యమగు ప్రతిభాసంపత్తితో భాసిల్లువారి సంతా నము పార్శ్వికముగాఁ గొఱుకురానిదగుచుండును. కావుననే పండిత పుత్రపదము మూర్ఖార్థ్యముగా నయ్యెను.

శ్రీవంగూరి సుబ్బారావుపంతులుగారు 'శ్రీరామాభిషేక'' మను గ్రంథమొక్కటి తమదగ్గఱ గలదని దానినుండి కొన్నిపద్యములను నా కొసఁగినారు. ఆ శ్రీరామాభిషేక గ్రంథకర్తయిప్పటికి నూఱేండ్ల క్రిందటివాఁ డగునేమో! ఆ పద్యములు మిక్కిలిదుష్టములుగా నున్నను శ్రీనాథకవీశ్వరుని కుటుంబవిషయము నెఱిఁగించుచున్నవి. ఆపద్యముల సారమిది:- కొండవీడు వాస్తవ్యుడగునాత్రేయగోత్రజున కొకనికి శ్రీనాథుడు కూఁతునొసఁగెను. వారికిఁ బుత్త్రసంతతి కలదు. శ్రీనాథుఁ డాదౌహిత్రుల నింటనుంచుకొని పెంచెను. ఆకారణమునఁ దత్సంతతికి శ్రీనాథునివారని యింటిపేరు వచ్చెను. వారివంశపరంపరలు మిక్కిలి పెంపొందెను. ఆపరంపరలలో మాధవమంత్రి యను వాఁడు ప్రఖ్యాతుడయ్యెను. ఆతని కయిదవతరమువాఁడు శ్రీరామాభిషేక గ్రంథకర్త."

కాంధవము

ఈయన కన్నవిమ్మలు. నక్కనెలియండ్రు నుండిరోలేరో యెఱుఁగరాదు. కీర్తిమూర్తితో వెలయుచున్నాఁడుగాన శ్రీనాథకవివర్యుఁ డెన్నటికిని గోచరించుచున్నాఁడు. కాని భౌతికశరీరమాత్రమున నాఁడే కడతేఱినతద్బంధుమండలి తెలియరాకుగదా! మనకవివర్యుఁ డెఱిఁగింపలేదు. దగ్గఱబల్లిదుగ్గన యనుకవీశ్వరుఁ డొక్కరుఁడు శ్రీనాథునికావ్యమఱిఁదినని చెప్పికొన్నాఁడు.

"సీ వంక్కృతప్రాకృత శౌరసేనీముఖ్య
భాషాపరిజ్ఞానపాటవంబు"

ఇత్యాదిపద్య మీవఱ కుదాహరింపఁబడినది; తర్వాత :

శృంగారశ్రీనాథము

"సీ॥ కవిసార్వభౌముఁడై కర్ణాటవిభుచేత
గనకరత్నాభిషేకములు గొనిన
శ్రీనాథకవి కూరిమిసేయుమఱఁదివి
దుగ్గయకవిరాజు దగ్గఁబల్లి
తిప్పనార్యునకు సతీమణి యెల్లమ
కును దనూజుఁడవు పోతనకు నెల్ల
నామాత్యవరునకు ననుగుఁదమ్ముండవు
కాండిల్యగోత్రుఁడౌ నరవమతివి

గీ॥ చెప్ప నేర్తువు కృతులు సుస్థిరముగాఁగ
గాన నీవిప్పురచియింపగఁదగి యున్న
నాసికేతచరిత్రంబు నాదుపేర
నంకితముసేయు కవిరాజు లాదరింప"

మఱఁదియనఁగా భార్యసోదర్యుఁడు. ఈతని శిష్యునిగాఁజేకొని శ్రీనాథుఁడు దేశములు త్రిప్పి విద్యాబుద్ధులు మప్పి సుకవితావిశారదునిఁ గావించెను. శ్రీనాథునికి బందుగుఁడనని చెప్పుకొనఁ దగిన య్యర్థ నీతఁడు గడించుకొన్నాఁడు. నాసికేతోపాఖ్యానమను సరసకావ్యమును రచించి యనంతామాత్యునిగంగయ్యకుఁ గృతియిచ్చినాఁడు. ఈతఁడు కాంచీమాహాత్మ్యముకూడ రచించెను. అది యిప్పుడు లభింపకున్నది. ప్రబంధరత్నావళిలో నందలి పద్యము లుదాహరింపఁబడినవి. ఈతఁడు శ్రీనాథశిష్యత్వమునుగూర్చ నిట్లు గద్యమునఁ బ్రశంసించుకొన్నాఁడు:-

"ఇది శ్రీమత్కమలనాభపౌత్త్ర మారయామాత్యపుత్త్ర కవిసార్వభౌమ సకలవిద్యానినాథ శ్రీనాథమహాకవీంద్రప్రసాదలబ్ధకవితావిశేష దగ్గఁబల్లితిప్ప

నార్యప్రియతనూజ దుగ్గననామధేయప్రణీతంబైన నాసికేతోపాఖ్యానంబను మహాప్రబంధంబునందు''-

దగ్గఁబల్లి కృష్ణామండలమునందు గుడివాడకుఁ జేరువనున్నది. ఈ దుగ్గన యా గ్రామమువాఁడు కావచ్చును. ఈ దుగ్గనతల్లిదండ్రులగు నెల్లమాతిప్పనార్యులు శ్రీనాథునకత్తమామలగుదురుగదా! దుగ్గన యన్నలగు పోతన యెల్లనలు మఱియిద్దరు శ్రీనాథుని బావమఱఁదులుండిరి.

బమ్మెరపోతన

ఆంధ్రభాగవతకర్తయై భక్తిరసపారావారమున నంధ్రలోకమునోలలాడించుచున్న బమ్మెరపోతనామాత్యుఁడుకూడ మన శ్రీనాథకవీశ్వరునకు బావమఱఁదియని యైతిహ్యముకలదు. ఇర్వురదేశకాలములకును గలయిక యేర్పడునేని యైతిహ్యము విశ్వాస్యముకాఁదగును. పరిశీలింతము. పోతనామాత్యునికృతులుభాగవతము వీరభద్రవిజయము భోగినీదండకము ననిమూఁడు కలవు, వీరభద్రవిజయకర్త యాతఁడు కాడేమోయనుసందేహ మంతయసంగతము కాదు. భోగినీదండకకర్త యాతఁడు కాఁడను వాద మెంతయు నసంగతమే; భాగవతము నితఁడు శిలానగరమున నుండి రచియించెను కాఁబట్టి యాతఁ డేకశిలానగరవాసి యనఁ జెల్లును. ఏకశిలానగర మనఁగా నోరుఁగల్లే యగుట నిశ్చయము. ఐనను గొందరు ''ఒంటిమిట్ట'' యని భ్రమించుచున్నారు వాదించుచున్నారు. ఓరుఁగల్లు కాకతీయులరాజధాని. ప్రసిద్ధపట్టణము. ఏకశిలానగరమని దానికే యేనాఁడును వ్యవహారముగలదు. శాసనములందేమి కావ్యములందేమి చరిత్రములందేమి, యెక్కడఁ జూచిననునోరుగల్లునకునేకశిలానగరమనినామాంతరముకన్పట్టుచున్నది.

చెన్నపురి "ఓరియంటల్ లైబ్రరీ" లోని యేకశిలానగర వృత్తాంతము మొదలగు చారిత్రికసంపుటములు పెక్కులు దీనికిఁ దార్కాణము. పర్వతాపరుదీర్ఘియాదులు తార్కాణము, కాకతీయపరిభృతులశాసనములు తార్కాణము.

భోగినీదండకము కుమారాన్నపోతానేనికుమారుఁ డగు రావుసింగభూపాలునిపేర రచింపఁబడినది. ఆరేచెర్లవెలమరాజులు రాచకొండ రాజధానిగా భువనగిరి, ఓరుఁగల్లు, సింగపురము మొదలగు తెలుఁగుదేశములు పాలించినారు. అన్నపోతానేఁడు, ఓరుఁగల్లు దగ్గర మైలారదేవరకు నగ్రహార మొసఁగినట్లు శాసనము లున్నవి. పోతనామాత్యుఁ డోరుగల్లునివాసిగాపుననే రావుసింగభూపాలున కాయల్పకృతి యొసఁగుట యిపపన్నమయ్యెను. ఒంటిమిట్టకు రాచకొండకుఁ, జేరికలేదు. పోతననాఁటికిఁ గాకతీయరాజ్యము చిదికిపోయినది. తురుష్కులతల్లి వచ్చినది. కాపున భాగవతమునకు శీఘ్రవ్యాప్తి కలుగ దయ్యెను. రాజునకుఁ గృతి యొసఁగినచోఁ దదాలంబమునఁ బెక్కులు పర్యంతరము లేర్పడి వ్యాప్తిచెందఁగల్గెడిది. ఒసఁగఁడయ్యెను. పోతనయనంతరము కొలదికాలమునకే యీ గ్రంథసంపుటము కొంతకొంత శిథిలమయ్యెను. నాఁ డాభాగమును వెలిగందలనారయాదులు పూరించిరి. వెలిగందల యోరుఁగంటికిఁ మిక్కిలి చేరువనున్నదట! మఱియు బమ్మెర గ్రామముగూడ నోరుఁగంటికిఁ జేరువనే కలదట. బమ్మెరవారు, నేఁటికిని నోరుఁగల్లుప్రాంతములం దున్నారట. మఱి యొంటిమిట్టకు నేకశిలానగరమన్నపే రెక్కడను నేనాఁడును గానరాదు. అయ్యలురాజురామభద్రుఁడు తనగద్యమున "ఒంటిమిట్ట రఘువీరశతకనిర్మాణకర్మఠ" యని యొంటిమిట్టనే పేర్కొనెను. ఆతనితాత తిప్పరాజుశతకమునఁగూడ "ఒంటిమిట్ట

రఘువీరా! జానకీనాయకా!" యనియెను. "ఒంటిమిట్టను గాఁపురం బున్నయట్టి సిద్ధసానికి సంకల్పసిద్ధిరస్తు" అని చాటువు.

"మానవతి విరహమ్మ చంద్రుఁడు మండువెన్నెల గాసెనే
సూనశరములవింట మదనుఁడు సూటిదప్పక యేసెనే
భానుతేజుఁడు తెలిసియంతటఁ బంతమున నసుడాసెనే
మేన గంధము పూసెనే! ఒంటిమిట శ్రీరఘురాముఁడు"

ఇత్యాదిపద్యములందును నొంటిమిట్ట యన్నపేరే పేర్కొఁబడినది. చెన్నపురి "ఓరియంటల్ లైబ్రరీ"లో నొంటిమిట్ట విషయము గలదు. కొన్ని శాసనము లుదాహరింపఁబడినవి. అన్నింటను నొంటిమిట్ట యన్నపేరే గలదు. "ఒంటఁడు, మిట్టఁడు" నను శబ్దముల మూలమున నక్కడ పురమేర్పడినట్టును వాండ్రపేళ్లతోడనే యాపేరుకలిగినట్టును నొంటిమిట్టవాసులు పలువురు స్థలజ్ఞులు చెప్పినట్లందు వ్రాయఁబడినది. ఎన్నెన్నో విషయములు వ్రాయఁబడినవిగాని యందుఁ బోతనామాత్యుని ప్రస్తావమే చేరలేదు. పూర్వ మీకింవదంతియున్నదనుట కాధారములేదు. భాగవతమును దొల్ల ముద్రాసున ముద్రించిన పురాణం హయగ్రీవశాస్త్రిగారి యూహ మే యీవాదమున కుపజ్ఞ. పోతన తననాఁటికి నేకశిలానగరమనుపే రొరుఁగల్లునకు జగత్ప్రఖ్యాతముగాఁ జెల్లుచుండఁగాఁ దానుగ్రొత్తగా నొంటిమిట్టకుఁ గూడ నదేపేరు పొసఁగించుట సంభవింపదు. ఈ సందర్భమున నిప్పుడు వాదప్రతివాదములు పేఱెత్తియున్నవి. ప్రాజ్ఞలోకము యథార్థము నెఱుఁగఁగలదు. ఇది యింతటఁ జాలును.

శ్రీనాథుఁ డోరుఁగంటితోఁ దనకుగలపరిచయ మెల్ల వల్లఁ

మాత్యునిపేర్వెట్టి తానురచియించిన క్రీడాభిరామమున వెల్లడించినాఁడు. శ్రీనాథునకును బోతనకును స్థలసంబంధము పొసఁగుచున్నది. పోతన భాగవతమున నాతనికాలము నిర్ణయించుటకుఁ దోడువచ్చునంత మేదియుఁ గానరాదు. భోగినీదండకమున :-

'సీమంతినీమానసారామవాటీవసంతుఁ, వసంతావనీనాథసంసేవితాంచత్ప
దాంభోజురాపుసింగక్షమానాథపౌత్రుఁ, సర్వజ్ఞసింగోర్వరాధ్యక్షు'

అని కలదు. రేచర్లవారివంశచరిత్రలం దీసర్వజ్ఞసింగ భూపాలుఁడు సరిగా గుర్తింపనగుచున్నాఁడు. ఈతఁడే శ్రీనాథునిచే దర్శింపఁబడినవాఁడు. షష్ఠప్రకరణమం దీవిషయము విపులముగాఁ జర్చింపఁబడును. కాలసంబంధమును బొసఁగినది. ఇర్వురును గవీశ్వరులు. సమానవృత్తివ్యాపృతులుగా నుండు వారికి మైత్రియో శత్రవమో ప్రాయికముగాఁ బుట్టిల్లుచుండును. శ్రీనాథుఁ డర్హవిద్వాంసులపై నాదరము కల్గువాఁడు. పోతనామాత్యుఁడు సాత్త్వికప్రకృతిగల యుత్తమపురుషుఁడు రాజాశ్రయాద్యపేక్షలు లేనివాఁడు. పరస్పరము ద్వేషమునకుఁ గారణము లేదు. ఈయిర్వురసంబంధమునుగూర్చి వాడుకలోఁ గొన్నికథలుగలవు సంగ్రహముగాఁ జేర్కొనెదను. శ్రీనాథుఁడు తన గ్రంథములెల్లఁ బ్రాభవాధికుల కొసఁగి హెచ్చు ధనమును గడించి భోగసమృద్ధితోఁబల్లకులెక్కి తిరుగుచుండెడివాఁడు. పోతనామాత్యుఁ డట్లుచేయమిచే బీదబాపఁడై కృషిచేసికొని జీవించుచుండెను. పోతనామాత్యునిచేఁగూడ, నరాంకితములుగాఁ గృతులు చెప్పింపఁ దలంపుగొని యొకప్పుడు శ్రీనాథుఁడాతని దర్శింపఁ బోయెనట' త్రోవలోఁ బొలము దున్నుకొనుచున్న పోతనామాత్యుని జూచి శ్రీనాథుఁ డీక్రింది పద్యమును జెప్పెనట!

క. కమ్మనిగ్రంథం బొక్కటి
యిమ్ముగ నేనృపతికైనఁ గృతి యిచ్చినఁ గో
కొమ్మని యీయరె యర్థం
బిమ్మహి దున్నంగ నేల యిట్టిమహాత్ముల్.

ఇర్వురు నింటి కరిగిరి. లేవడిఁ గుడుచుచున్నయాఫన్య చరితుఁ డా శ్రీనాథకవికిఁ దగిన ట్లాతిథ్యము నెఱపలేకపోయెనట! శ్రీనాథునిప్రాభవమును జూచి యానాఁడుపోతానామాత్యునిభార్య కవిత వలన మీకుఁ గానైన గడింపులేకపోయెఁగదా! యని విసువుదోఁపఁ బలికెనట! పోతనామాత్యుఁడు వ్యాకులపడెనట! శ్రీనాథుడును రాజాం కితముగాఁ గృతులు చెప్పి ధనవంతుఁడగు మనిపోత్సాహపఱిచెనట! నాఁటిరాత్రిస్వప్నమున సరస్వతి దీనాననయై కన్నీరుదోఁపఁ బొడ చూపఁగాఁ బోతనామాత్యుఁ డప్పు డీక్రిందిపద్యమును జెప్పెనట.

ఉ. కాటుకకంటినీరు చనుగట్టుపయింబడ నేలయేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాఁచిలికోడల! యోమదంబ! రో
హాటకగర్భురాణి! నిను నాఁకటికైకొనిపోయి యల్లక
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!

భాగవత మందలి "సిరికింజెప్పఁడు" మొదలగుకొన్ని పద్య ములఁగూర్చి శ్రీనాథునకుఁబ్రిసక్తములుగాఁ గొన్నికతలు గలవు. పోతన యైహికేచ్ఛావిముఖుఁ డగుట నిక్కువము. నరకృతి యాతని కసమ్మతము. శ్రీనాథాదులకుఁ జుఱుకుమని తగులునట్లు భాగవతమున నిట్లుచెప్పినాఁడు.

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురమ్ములు వాహనమ్ములుఁ
సొమ్ములుఁ గొన్నిపుచ్చుకొని చొక్కి శరీరముఁ బాసి కాలుచే

సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్

పోతనకు సహజపాండిత్యం డని బిరుదు. పాండిత్యవిషయమునం బోతరాజుగారికంటె శ్రీనాథభట్టారకుడు మిక్కిలి దండివాడు. వీరిర్వురను నిశ్చయముగా నిచ్చిపుచ్చుకొన్నసంబంధమున్న బావమఱదులయినను గాకున్నను, వరుసకయియుందురని నమ్మదగును.

భీమఖండకృతిపతి బెండపూడియన్నమంత్రి శ్రీనాథునకు బందుగుడు. ఆ బాంధవము తమనాటిదిగాక తరముల నుండి వర్తిల్లుచున్నదిగా భీమఖండమునన్నిట్లు సూచించినాడు.

సీ. గీ. పాకనాటింటివాడవు బాంధవుడవు
కమలనాభునిమనుమడ వమలమతివి
నాకుఁ గృపసేయు మొకప్రబంధంబు నీవు
కలితగుణగణ్య! శ్రీనాథకవివరేణ్య!

మఱియు శ్రీనాథునకు రామయమంత్రియని బావమఱదియో బావమఱదివరుసవాడో యొక్కడుండెడివాడనియు నాతడు భోజనశూరుడనియు, నొకసారి బంతినిగలసి భుజించుచు శ్రీనాథుఁ డాతని నీక్రిందిపద్యముఁ జెప్పి గేలిచేసెననియు వినికి. ఇది విశ్వాస్యముగా నాకుఁ దోఁపదు.

ఉ. గ్రామము చేతనుండి పరికల్పితధాన్యము నింటనుండి శ్రీ
రామకటాక్షవీక్షణపరంపరచేఁ గడతేఱెఁ గాక మా
రామయమంత్రిభోజనపరాక్రమ మేమనిచెప్పవచ్చు నా
స్వామి యెఱుంగు దక్కబళచాతురి తాళఫలప్రమాణమున్.

శృంగారశ్రీనాథము

ద్వితీయ ప్రకరణము

ము. మహనీయంబుగ నంధ్రభూవలయముం బాలించుచుం బ్రాజ్ఞులై
బహుకావ్యంబులు చెప్పుచుఁ, బలియుఁజెప్పంజేయుచామ్నిత
స్పృహతో ధర్మము లాచరించుచు, జగజ్జేగీయమానంబుగా
నహముల్ పుచ్చిన రెడ్డిరాజులసముద్యత్కీర్తిఁ గీర్తించెదఁ

కొండవీటి రెడ్లు

క్రీ 1330 ప్రాంతమునఁ దురుష్కులకల్లపలనఁ గాకతీయాంధ్రసామ్రాజ్యము చీకాకయి చెడెను. వారికిందఁ దండనాథులుగా నుండిన రెడ్లు చెలములు మొదలగువా రటుతర్వాతఁ గొందఱు స్వతంత్రరాజ్యముల నేర్పఱుచుకొన్నట్లు తెలియుచున్నది. ఈకొండవీటిరెడ్డిరాజ్యము కోమటిపోలయ యను రెడ్డికాలమున నెలకొన్నది. ఈతఁడు, క్రీ 1320 ప్రాంతమున రాజ్యమేలెను. శాసనములం దీతనితండ్రి వేమన పంశకర్తగాఁ బేర్కొనఁబడుచున్నాఁడు. ఆతనికిఁ బూర్వవిషయ మేశాసనమునను గానరాదు. ముట్లూరిశాసనమున నాతఁడు దండనాథుఁడనియు నాతనికుమారుఁడుపోలయక్షమాధీశ్వరుఁడనియుఁగలదు. ముట్లూరిశాసనము క్రీ 1333న కోమటి పోలయకుమారుఁ డగుపోలయ వేముఁడు తన మేనమామయగు నాగనేనానికిఁ బుణ్యముగా, ఁొన్నల గడ్డమృత్యుంజయార్యున కాగ్రహారము దానముచేసి నెలకొల్పినాఁడు.

క్రీ.శ. 1423న నెలకొల్పబడిన యనితల్లి కలువచేరు శాసనమున నీరెడ్డి రాజ్యారంభవిషయ మిట్లు తెలుపఁబడినది.

"ఆ పరితాపరుద్రుఁడు స్వేచ్ఛచేతనే (తురుష్కులకోడిపోయి యుద్ధాదులవలన మృతుఁడు కాలేదనుట) స్వర్గస్థుఁడుకాఁగా భూమి తురుష్కాక్రాంత మయ్యెను. సముద్రజలమగ్న మయినప్పు డాది వరాహమూర్తి యుద్ధరించినవిధమున, యవనులపాలయినప్పుడు పోలయనాయకుఁడు స్వర్గస్థుఁడు కాఁగా విశ్వేశ్వరానుజ్ఞచే గాపయ నాయకుఁడు డెబ్బదియేగురునాయకులు తన్ను సేవింప నేల్బడి నెఱపుచుఁ దురుష్కులాక్రమించు కొనినరాజ్యమెల్ల స్వవశముచేసికొని యనే కాగ్నిహోత్రములను బ్రాహ్మణులకు దానములొసఁగి పేర్వెలసెను. ఆతఁడును స్వర్గస్థుఁడయిన తరువాత నాడెబ్బది యేగురు నాయకులుఁ దమ తమ భాగములందు రాజ్యమేలఁ జొచ్చిరి. అందు వేమనరేశ్వరుఁ డొకఁడు"-

ముట్లూరిశాసనమున మొదటి వేమయ దండనాథుఁడయినట్లును, నాతనికొడుకు పోలయ రాజయినట్లును పోలయ కొడుకు వేమయ పరిసిద్ధముగా రాజ్యమేలినట్లును గలదుగదా, కలువచేరుశాసనమున వంశమునకు మూలపురుషుఁడుగాఁ బేర్కొనఁబడిన ప్రోలయ వేమయ చేతనే నెలకొల్పఁబడిన ముట్లూరిశాసనము ఆకలువచేరుశాసనముఁ కంటెఁ బ్రాచీన వృత్తాంత మెఱిఁగించుసందర్భము దభ్యర్థిత మగు ననుటకు సందియముండదు. డెబ్బదియేగురు దండనాథులలో నొక్కఁడు గానున్నవాఁడు పోలయతండ్రి వేమయయగునేమో! కలువ చేఱుశాసనమునఁ బోలయకొడుకు వేమయయే పేర్కొనబడినాఁడు. కాపయనాయనకునుతనికిఁ బూర్వము రాజ్యమేలిన ప్రోలయనాయ

కునకును వీరికి నేమేని సంబంధము గలదో తెలియదు. ఆకాపయ నాయకుని విషయ మీవఱ కంతగా గుర్తింపఁబడినదిగాదు. కలువ చేఱుశాసనము నార్యవటశాసనము నాతని మిక్కిలిప్రఖ్యాతునిగాఁ బేర్కొనుచున్నవి. మొదటివేమనకుమారుఁ డగుపోలయకే కోమటి పోలయ యని నామాంతరము. ఈతని భార్య యన్నమాంబ. వీరికి మాచయ వేమయ దొడ్డయ అన్నయ మల్లయ యని యైదుగురు పుత్రులు జనించిరి. కొన్ని శాసనములు మల్లయనువిడచి నలుగురినే పేర్కొనుచున్నవి. ప్రోలయతరువాత నాతనిరెండవపుత్రుఁడు వేమయ రాజ్యమునకు వచ్చెను.

ఈ కొండవీటిరెడ్డిరాజ్యారంభమునుగూర్చి కొండవీటి దండ కవిలెలోను, గొండవీటికై ఫీయతులోను, మరికొన్నిటను "పరుసవేది కథ" యొకటి గలదు. ఆకథ యాథార్థ్య మెట్టిదో యెఱుఁగఁజాలము రెడ్డిరాజులు 'వేమయ' 'కోమటి' నామములను దఱుచుగాఁ దాల్చుచు వచ్చిరి. దీనికిఁ గారణ మేదో యుండఁదగును. పరుసవేదికథకు సంబంధించిన విషయ మేదేని కారణమగుట చేతనేగాని, లేనిచో గోమటీళుఁ డనుజైనదేవునియు వేమయయను వీరశైవాచార్యునియు నామములనుబట్టిగాని యాపేళ్లు వారుతఱుచుగాఁ దాల్చుచుండవచ్చును. పరుసవేదికథయెడలఁ దొలుత నాకుఁ బ్రమాణబుద్ధి లేకుండెనుగాని ప్రోలయవేమయనాఁటనే వెలయింపఁబడిన మంచాళ్ల తామ్రశాసనమా కథయందుఁ గొంత సత్యము కలదేమో యని సందేహము కలిగించుచున్నది. అందిట్లు కలదు:-

"శ్లో. తద్వంశజాతామలపంటరెడ్డి కులామృతాంభోనిధిపూర్ణ చంద్రః। ప్రోలాభిధః ప్రాప పురాతనోష్ఠ పూజావశా ద్బ్రాహ్మణపాదుకార్చామ్॥

యదృచ్ఛయా స్వర్ణకరప్రసిద్ధిం లబ్ధ్వాన్నమాంబాపతి రాబభూవ।త తశ్చ పుత్త్రీ పంచ లేభే బృందారకాధీశ్వరతుల్యమూర్తిం।। తత్పుత్త్రే స్వధవేమభూపతి రరిప్రాణాపహారీ రణే ....—''।

ఇందు రెండవశ్లోకమున దైవికముగా స్వర్ణకరప్రసిద్ధి పొంది యన్నమాంబాభర్తయగు ప్రోలయ వెంపొందె ననియున్నది. ఇది పరునవేదివిషయమేమో యని సందేహమగుచున్నది.

ప్రోలయ వేమారెడ్డి.

ఈతఁడే రెడ్డిరాజ్యమును మహోన్నతికిఁ దెచ్చిన ప్రఖ్యాత పురుషుఁడు. ఈతనిప్రథానరాజధాని యద్దంకి. కొండవీడు, కొండపల్లి, ధాన్యవాటి, మొదలగు స్థలములం దీతఁడు చాసీతిదుర్గములను నిర్మించి తన స్వజ..మునక్కడక్కడ నెలకొల్పెను. బ్రాహ్మణులలో వేంగినాటి వారికి, వెలనాటివారికి, ద్రావిడులకు ముప్పదియాఱగ్రహారములు దానముచేసెను. మఱియు హేమాద్రిధర్మశాస్త్రమునఁ జెప్పఁబడిన మహాదానములన్నింటిని గావించెను. శ్రీశైలమునకు, నహోబలపర్వత మునకు సోపానములు కట్టించెను ఈ సోపాననిర్మాణము రెడ్డిరాజుల శాసనములందుఁ దఱచుగాఁ బ్రస్తావింపఁబడును. పల్లవ త్రినేత్రుడు లీతనిబిరుదులు. కవిత్రయమందొక్కఁడై ప్రబంధపరమేశ్వరుఁడునాఁ బరగిన యెఱ్ఱాప్రెగ్గడచే రామాయణమును హరివంశమును జెప్పించి కృతినాథుఁడై శాశ్వతకీర్తి గన్న ధన్యాత్ముఁ డీతఁడే।

---

1. ఈ తామ్రశాసన మిప్పుడు లభింపలేదు. మెకంజీదొరగారు దీని ప్రతి వ్రాయించియుంచినారు. లోకల్ రికార్డు వాల్యూములో జూడఁదగును.

క. విత తయువరాజవిభవో
న్నత సోతయసైన్యనాథ నయమార్గనమీ
హిత సంతత సేవావిల
సితపుత్ర శ్రీసమృద్ధ శివగుణ సిద్ధా. – హరివంశము.

హరివంశరచనమునాటి కీపోర్లయవేముని పెద్దకుమారుఁ డన పోతరెడ్డి యువరాజుపదమును బడసియున్నాఁడు.

ఎఱ్ఱాప్రెగ్గడను దొలుత సత్కరించినవాఁడు ప్రోలయవేముని తమ్ముఁడు మల్లచమూపతి. ఆతఁ డీకపీశ్వరుసిఁ దన యన్నగారి కర్పించెను. ఆ మల్లచమూపతి కురుమలూరు పురనాయకుఁడుగా నుండెనట. మధ్యాంధ్రదేశ క్షేమదకరవాలుఁడని హరివంశమునఁ బ్రోలయవేముఁడు పొగడ్తగాంచినాఁడు. ఆతనికిఁ జిట్టయయనువాఁడు మేనమామ కుమారుఁడు కుడిబుజమై యుద్ధాదులందు మిగుల సాహాయ్యము చేయుచుండెడువాఁడు. చదలువాడయెఱ్ఱాప్రెగ్గడ సూర్యసుకవికొడుకు. శంకరస్వామి సంయమిశిష్యుఁడు. ఆశంకరస్వామి శివపూజాధురంధరుఁడట! ఎఱ్ఱాప్రెగ్గడకు శంభుదాసుఁ డని నామాంతరము. భారతారణ్య పర్వశేషము, లక్ష్మీనృసింహపురాణము, రామాయణము, హరివంశము నాతని కృతులు.

సీ. రసపత్కవిత్వనిర్మాణంబునఁ బ్రబంధ
పరమేశ్వరుం డన్న బిరుదమందె
ప్రోలయవేమభూభుజు కోర్కి హరివంశ
మును రామకథయుఁ దెల్గనకుఁదార్చె
నన్నయసారస్వతోన్నతి దనుఁ జెంద
భారతారణ్యపర్వము ముగించె

శృంగారశ్రీనాథము

చెప్పెనొప్పులగ నృసింహపురాణ మె
త్తున నిల్చె నన్న తిక్కనలతోడ

గీ. పరమశైవుఁడై పేర్వాపి పడసె శంభు
దాసుఁ డన నిహపరహితధర్మముల తె
లుంగులెల్లఁ గడంక నెఱింగె నెట్టి
ప్రెగ్గడకవీంద్రుఁడతఁడు వర్ణింపఁ దగఁడె.

ప్రోలయవేముని యాస్థానమున లొల్లలక్ష్మీధరుని (లక్ష్మీధరుఁడు క్రీ. 1530వాఁడు) కేడవతరమువాఁడఁగు మహాదేవకవియుండెను.

శ్లో. యః కర్ణాటవసుంధరాధిపమహాస్థానే సువర్ణాయితో
యో నిత్య న్నికషాయితో నృపగృహే వేమాఖ్యపృథ్వీశితుః
శ్రీమల్లొల్లటభట్టశిష్యఇతి యో లొల్లాఖ్యయా శ్రూయతే
శ్శేషాన్వయశేఖర స్సహి మహాదేవో విపశ్చిన్మహాన్.

అనపోతారెడ్డి.

ప్రోలయవేమనకుఁ దర్వాత నాతనిపెద్దకుమారుఁ డనపోతా రెడ్డి రాజయ్యెను. ఈతని కాలమునుండి రేచర్ల వెలమరాజులకును నీ రెడ్డిరాజులకును బోరు ఘోరముగా నడవఁజొచ్చెను. పరస్పరముఁ దలలు నఱుకుకొని తమ్మపడిగల దాపించుకొనుచు వచ్చిరి. తుద కీరెడ్డిరాజ్యము ప్రభ్వీష్టమగుటకుఁగూడఁ గొంతవఱ కీవివాదము కారణ మయ్యెను. దన్నాలకోట (ధరణికోట) యొద్ద నీయనపోతారెడ్డిని రేచర్ల వెలమరాజగుసింగయమూదానేఁడు యుద్ధమొనరించి పాఱఁదఱిమినట్లు వెలిగోటివారివంశ చరిత్రలు పెక్కుపగా వాకొనుచున్నవి.

ఉ. దన్నడకోట ముంగల సుదగ్రబలోన్నతి గంగదాటి పం
పన్నబలుండు సింగజనపాలునిమాదఁడు రెడ్డిపోతనిఁ
బన్నిన సేనలం దునిమి పాఱఁగఁదోలె విరాటువీట న
త్యున్నతవిక్రమంబున సుయోధనుఁ దోలు కిరీటి చైవడిఁ.

వేమారెడ్డికాలమునఁ గొండవీ డొకదుర్గముగా నుండెడిది, కాని యద్దంకియే పర్యాయరాజధానిగాఁ నుండెను. ఈ యనపోతారెడ్డి యేకారణముననో యద్దంకి వీడనాడి కొండవీటినగరమును బెంపొందించి దానినే తనరాజధానిగాఁ జేసికొన్నాఁడు. రాచకొండ రాజధానిగా రాజ్యమేలుచున్న వెలిగోటివెలమరాజులతో స్పర్ధలు, యుద్ధములు పెరుగుచుండుటచే వారితాఁకుడు నడ్డుకొనుటకయి చేరువనుండఁగోరి కొండవీటికి మార్చుకొని యుండునని తలఁచెదను. నాఁటనుండియు రెడ్లరాజధాని కొండవీడుగా నుండెను.

(రాజమహేంద్రివరం యిలాకా యిప్పటిమన్యమాపురం శాసనం)*

---

* ఈశాసన మింతవఱ కముద్రితము. దీని వ్రాఁతప్రతి ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోనున్నది, అందుఁ దప్పులున్నవి. ఇప్పుడుదాహరింపఁబడిన శ్లోకములలోనే ''తతోన్నపోతనృపతిః'' అని యుండవలసినచోట ''తతోన్నవేమనృపతిః'' అని తప్పువ్రాయఁబడినది ఈ శ్లోకముల నింతతుదముందు శ్రీ వీరభద్రరావుగారు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని లోకల్‌రికార్డునం దున్నట్టే యుద్ధరించి యుదాహరించిరి. వీరేశలింగముపంతులుప్రభృతులు వీరభద్రరావు ఏంతులుగారిపుస్తకమునుండి యట్లేగైకొని యుదాహరించుకొనిరి. ప్రోలయవేమనతర్వాత రాజ్యమేలినవాఁడు అన్నపోతరెడ్డిగాని యనవేమరెడ్డి కాఁడు. ఆశ్లోకమునకుఁ దర్వాత నాశాసనమున ''సోన్నపోతనృప స్సేవననిర్మ

శృంగారశ్రీనాథము

"తతోఽన్నపోతనృపతిః పటుః పాలనకర్మణి
ఆపాలయ త్తన్య పుత్ర్యా స్తందంతేఽంధ్రవసుంధరామ్
కొండవీడుం రాజధానీం నవిచిత్రా మకల్పయత్
చృష్ట్వా త్వష్టాపి వైచిత్ర్య మథా ద్యస్యా స్సుస్మయః.
ఉచ్చైశ్శృంగవస్తుల్యబలై స్తురంగైః కల్పద్రుమాభైశ్చ వదాన్యవర్గైః
రంభోపమాభై రమణీజనైశ్చ సా భాతి భూమా వమరావతీవ.

సోఽన్నపోతనృప స్వేన నిర్మితాయాం పురిస్థితః
కుర్వ్ఞ హేమాద్రి దానాని చిరం భువ మపాలయత్."

ఈ యనపోతారెడ్డియాస్థానమున విద్యాధికారియై బాలసరస్వతి యనుపండితుఁ డుండెడివాఁడు. ఆతని ధర్మకార్యముల కాబాలసరస్వతియే భాసనకృతికర్త. భాసనావసానముల నాతఁడు తన పేరు చెప్పి కొన్నాఁడు

శ్లో. అన్నపోతనరేంద్రవ్య విద్వ్ఞ బాలసరస్వతిః
ఆకరో దాకరో వాచాం నిర్మలంధర్మభాపనమ్
ఈ బాలసరస్వతి యనవేమారెడ్డికాలమునఁ గూడఁగలఁడు.

మఱియు నీ యనపోతారెడ్డి యొకవెన్నెలకంటి సూర్యకవిచేఁ గృతుల నందుకొన్నాఁడు.

శ్రీనాథుని సమకాలముననున్న జక్కనకవి తనవిక్రమార్క-చరిత్రలోఁ గృతినాథునిఁగూర్చి చెప్పినపద్యము :-

---

తాయాం పురిస్థితః" ఇత్యాదిగాఁగలదు. ఆమీఁద ననవేమారెడ్డిరాజ్య పాలన విషయముకూడఁ జెప్పఁబడినది. భాసమి తర్వాతిభాగము పరిశీలించి చదివినప్పుడు దాతప్పు స్పష్టముగా గోచరించును. కొండవీడు రాజధానిగాఁ జేసినవాఁ డనపోతారెడ్డిగాని, యనవేమారెడ్డి కాఁడు.

ఉ. వెన్నెలకంటిసూర్యుఁడు వివేకగుణాఢ్యుఁడు వేదశాస్త్రసం
పన్నుఁడు రెడ్డివేమనరపాలకుచేత మహాగ్రహారముల్
గొన్న కవీంద్రకుంజరుఁ డకుంఠితతేజుఁడు పెద్దతండ్రిగా
సన్నుతిగన్నసిద్ధనకు సంతతదానకళావినోదికిన్.

ఇందు రెడ్డివేమనరపాలుఁ డగ్రహారము లిచ్చెనని యున్నది. పోలయవేమన కావచ్చును. వెన్నెలకంటి యింటిపేరివాఁ డొకకవి యనపోతరెడ్డికిఁగూడఁ గృతుల నిచ్చినట్లు తెలియఁదగియున్నది. ఆ వెన్నెలకంటి వంశమందే జన్మించి సరస కవితావిశారదుఁడై విష్ణుపురాణమును దెలిఁగించిన వేఱొక వెన్నెలకంటిసూరన యీవిషయమిట్లు పేర్కొన్నాఁడు:

ఉ. ఈనిఖిలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనది సాక్షిగా ననికి నిల్చినరావుతుకేవభూవిభుం
గానకుఁ దోలి వెన్నడచి కాచిన వేమయ యన్నపోతభూ
జానికి సత్పరిబంధము లొవంగిన వెన్నెలకంటివారిలోన్.

అన్నపోతారెడ్డి పంచారామములోఁ బ్రథమారామముగా నమరారామమనుపేరఁ బరగిన యమరావతి (ధాన్యవాటి)లో నమరేశ్వరదేవరను మంత్రియగుమల్లయవేమునిచేఁ బునఃపరిష్ఠితుఁని జేయించెను. అమరావతి శిలాశాసనమున నామల్లయవేమమంత్రి ప్రశాపాదికము మిక్కిలి కీర్తింపఁబడినది. అతఁడు ధరణికోటపయికిఁ దురుష్కసైన్యము దండెత్తిరాఁగా వెఱచిఱవక దీకొని యోడించి పంపినాఁడట.

అన్నపోతారెడ్డి 1366 వఱకు రాజ్యమేలెను. అతని శాసనములఁ గూర్చి యనుబంధముచూచునది. అతనికిఁ గొమరగిరిరెడ్డి కుమారుఁడు.

శృంగారశ్రీనాథము

కొమరగిరిరెడ్డి బాలుఁడగుటచేతనేమో యనపోతారెడ్డి తర్వాత నాతని తమ్ముఁడనవేమారెడ్డి రాజయ్యెను. శాసనములం దనపోతారెడ్డి స్వర్గస్థుఁడయినపిదప నాతని ప్రియసోదరుఁడనవేమారెడ్డి పిత్రమగు రాజ్యమును బడసెనని చెప్పఁబడియున్నది.

అనవేమారెడ్డి.

ఈతఁడు మహాధార్మికుఁడు. 'ధర్మవేమన' యని యీతనికిఁ బ్రఖ్యాతి కలదు. ఈక్రింద నుదాహరింపఁబడుచాటువు లీతనిఁగూర్చి రచింపఁబడినవి. అనవేమ వేమనాములు బ్రోలయవేమాన్నవేములకు సామాన్యములు.

శ్లో. అరుణోదయ తపనోదయ నంగవ మధ్యాహ్న సాయ మర్ధనిశాఃశివపూజానమయా ష ట్ప్రతిదిన మనవేమపార్థివేంద్రన్య.

శ్లో. భువినత్యనవేమపార్థివేంద్రే విదుషాం జీవన మేవ జీవనమ్దివినత్యనవేమభూపతీంద్రే విదుషాం జీవనమేవ జీవనమ్.

శ్లో. పాతాళం పరిపాలయ త్యహిపతౌ వాతాంనో భోగిన శ్శక్రే శాసతి నాకలోక మమరా స్పత్రాసినో జజ్ఞిరేభూమీశే చిర మన్నవేమనృపతౌ భూయో లభంతే జనామృద్వన్నం మృదులాంబరం మృగమదం చామీకరం చామరమ్.

శ్లో. సీవారోపహతే ర్గదాతరుఫలచ్ఛేదాద్ధనుఃకంటకస్యోద్ధారా ద్విశిఖస్సముద్ధత సమిచ్ఛేదాచ్చ కాక్షేయకఃచేమక్షివఃభవదృయేన విపినక్షోణీం సమాసేదుషాంసాఫల్యం దధతే రిపుక్షితిభృతాం శస్త్రాణి కాలా ద్పహోఃద్వితీయప్రకరణము

శ్లో. లక్ష్మీ స్త్వన్నయనాంబుజేచమణయ స్త్వత్కీర్తిగేహాంతరే
త్వద్బోష్టో స్సురభూరుహ స్తవగిరాం గుంభే సుధా వంభృతా
అంభోమాత్రధనస్య మే తవ చమూరేఖో ర్వయం మాస్వితి
శ్రీమన్! త్వాంప్రతి వేమభూపవరశీ సింధో రయం పత్రికాఃఃః

శ్లో. మహానటజటాచ్ఛటానటదమందమందాకినీ
కలక్వణితకంకణవ్రజవిజృంభివాగ్గుంభనః
కవిః కవికులోద్భవో భువనభవ్యదివ్యోదయ
శ్శివాగమవిశారదో జయతి శారదావల్లభః.

మఱియు ననవేమమహీపాలుని పాలనమున "పత్రికాశ భారతీ యోగి" యని యింకొక యంధ్రకవీశ్వరుఁ డుండెడువాఁడు. దాక్షారామపురమున నా యనవేమభూపాలుఁడు దేవాలయాదికమును వెలయించు సందర్భమునఁ బద్యరూపకములగు శాసనకృతుల నాతఁడు రచియించెను.

కొమరగిరిరెడ్డి.

ఈతఁడు భోగైకపరాయణుఁడు. ఆసువర్షమును వసంతోత్సవము లొనర్చుచుండెడువాఁడు. మన శ్రీనాథుని హరవిలాసము గృతినందిన యవచిదేవయతిప్పయ యిమ్మహారాజునకుఁ బ్రతిసంవత్సరోత్సవంబునకుం దగిన కస్తూరీఘనసారసంకుమదహిమాంబుకాలాగురుపరిభృతి సుగంధద్రవ్యంబు లొడఁగూర్చియుఁ జీనిసింహళతవాయి హరుమంజిజలనోగిపరిభృతి నానాద్వీపనగరాకరంబుల ధనకనకవస్తువాహన మాణిక్యగాక్యంబులు తెప్పించియు నాందోళికాచ్ఛత్రచామరతురంగాది రాజ్యచిహ్నముల నందెను. కుమారగిరిచే సంస్కృతమున వసంతరాజీయమను నొకనాట్యశాస్త్రగ్రంథము రచింపఁబడెనటఁ అది యిప్పుడు చేకూరకున్నది.

శ్లో. మునీనాం భరతాదీనాం భోజాదీనాం చ భూభుజామ్
శాస్త్రిణి సమ్య గాలోచ్య నాట్యవేదార్థవేదినామ్

ప్రోక్తం వసంతరాజేన కుమారగిరిభూభుజా
నామ్నా వసంతరాజీయం నాట్యశాస్త్రం యదుత్తమమ్.

– శాకుంతలవ్యాఖ్య.

నిత్యభోగపరాయణుఁడగు నీతఁడు వసంతోత్సవములతోడను వారాంగనాభినయములతోడను గాలముపుచ్చుచుఁ బేరునకు రాజై సింహాసనము నధిష్ఠించియుండఁగా నీతని బావమఱఁది (సోదరిభర్త) కాటయవేమన సర్వసమర్థుఁడై రాజ్యమును నిష్కంటకముగాఁ గాపాడుచుండెను.

శ్లో. భాగ్యం నామ సమగ్ర మీ దృశ మతిస్నేహైకపాత్రంయతో
వీరం కాటయవేమ ముద్ధతరిపుధ్వంసే నియుజ్య స్వయమ్
నిత్యం నందతి నర్తనై రభినవైః కాంతై ర్వసంతోత్సవైః
సంతానాభ్యుదయైః కుమారగిరిభూపాలో నృపాలోత్తమః

–మాళవికావ్యాఖ్య.

కోమరగిరి కోలుపున ''లమకు'' యనుప్రేయసి నాట్యమాడుచుండెడిదట.

శ్లో జయతి మహిమా లోకాతీతః కుమారగిరిప్రభో
స్సదపి లకుమాదేవీ యస్య ప్రియానదృశీప్రియా
నవ మభినయం నాట్యార్థానాం తనోతి సహస్రధా
వితరతి బహూనర్థానర్థివ్రజాయ సహస్రశః.

లకుమాదేవి వేశ్యకావచ్చును. వేలతెఱఁగుల నవనవాభినయములు చేయుచు వేలకొలఁదిగా నర్థివర్గిజమునకు నామె ధనమొసఁగుచు

సుండెడిదట. కొమరగిరిరెడ్డికి ననపోతరెడ్డియని కొడుకుండెను. నామ మాత్రము తప్ప నాతని గూర్చి యేమియు నెఱుఁగరాదు. ఒక దాక్షి రామశాసనమున "శ్రీ మత్కుమారగిరి భూమిపతేః కుమారో వీరాన్న పోతనృపతిః" అని కలదు. తర్వాతరాయి పగిలిపోయినది.

కాటయ వేమన

ఈ కాటయవేమనవంశవృత్తాంత మిదిఃగ

శ్లో. సప్తా కాటయశౌరేః పాత్రో మారన్య కాటనృపసూనుఃగ
వీరన్నపోతనృపతే ర్జామాతా జయతి వేమభూపాలఃగ

ఈతఁడు కాటయకున ప్ర, మారయకుఁ బౌత్త్రుఁడు, కాటయకుఁ బుత్త్రుఁడు, అనపోతనృపాలున కల్లుఁడు. తల్లాంబిక దొడ్డాంబిక మల్లాంబిక యని యీతనికి ముగ్గురుభార్యలు తెలియవచ్చుచున్నారు. తల్లాంబిక యఁదుఁ గుమారగిరియని కుమారుని, దొడ్డాంబికయం దనితల్లియని కుమార్తెను గాటయవేమన కాంచినాఁడు. మల్లాంబికకు సంతానము కలదో లేదో తెలియదు ఆమె కన్నిభదేవరాయని కుమార్తెయు ముక్కంటిరాజు తోఁబుట్టువైనటఃనాయూహ న్యాయ్యమగు నేని కాటయవేమునకు హరిహరరాయలకూఁతు రింకొకతె కూడ భార్య యగును. కాటయవేమన శూరుఁడు. విద్వద్గోష్ఠీప్రియుఁడు. స్వయము విద్వాంసుఁడు కాళిదాసకృతనాటకత్రయమునకుఁ గుమారగిరిరాజీయ మనుపేర నీతఁడు వ్యాఖ్యరచించెను.

శ్లో. తత్రోక్తైవ మార్గేణ దర్శితా శేషలక్షణమ్
కవీనా మాశ్రయో మంత్రీ కాటభూపతనూభవఃగ

శ్లో. సోఽయం వేమవిభుః కుమారగిరిణా రాజ్ఞా నియుక్తః కృతీ
నాట్యానాం త్రితయం కృతంకృతధియా శ్రీకాళిదాసేన యత్
త స్యోదీర్ణరసాశ్రయస్య రసిక శ్యాకుంతలాదే స్స్వయం
వ్యాఖ్యానం కురుతే కుమారగిరిరాజీయాఖ్య మస్మై హితం.

ఈతనిఁ గూర్చి చెప్పఁబడిన పద్య మిది యొకటిఁ-

క. వెలయాలు శిశువు నల్లఁడు
నిలయేలిక యాచకుండు నేగురు ధరలోఁ
గలిమియు లేమియుఁ దఁచవరు
కలియుగమునఁ గీర్తిగామ కాటయవేమా!

ఈయనయొద్దనే రాయనభాస్కరుఁడు మంత్రిగా నున్నట్టు చాటు పద్యము చాటుచున్నది. ఆ పద్యమిది:-

చ. కలయఁ బసిండిగంటమునఁ గాటయవేమసమక్షమందు స
త్ఫలముగ రాయనప్రభునిబాచఁడు వ్రాసినవ్రాలమోఁతలున్
గలుగలుగల్లుగల్లురనఁ గంటకమంత్రుల గుండె లన్నియున్
జలుజలుజల్లుజల్లురను సత్కవివర్యులు మేలుమేలనన్.

కొమరగిరికాలమునఁ గాటయవేమారెడ్డి శూరాగ్రేసరుఁడై తూర్పుదేశమును మెచ్చుగా జయించి యార్జించెను. ఆతఁడు జయించిన దుర్గములను శాకుంతలవ్యాఖ్యానమున నీ క్రింది శ్లోకము తెలుపుచున్నది.

శ్లో. ధాటీఘోటిఘరాగ్రతుటితగిరితటే యత్ర మాల్లేదిదుర్గం
దుర్గంకిమ్మీరసంజ్ఞం దళితరిపుబలే దుర్గమం బెండపూడ్డిమ్

దుర్భేదం వజ్రకూటం జితవరిరభసా రామగిర్యాఖ్యదుర్గం
విఖ్యాతం వీరఘోట్టం గణితమసుహృదాం దుర్గవన్నాహధార్ష్ణ్యమ్.

శ్లో. రాజవేశ్యాభుజంగ శ్రీకుమారగిరిభూపతిః
శక్తి కాటయవేమన్య ప్రగల్భా తత్రి దుతికా.

కాటయవేమునిశాసనము లనేకములు పిఠాపురము పెద్దాపురము ప్రాంతములం దున్నవి. ఈతఁడు రెడ్డిరాజ్యమును మిక్కిలి పెంపొందించినవాఁడు. జయింపఁబడిన యాక్రొత్తదేశమునకుఁ బరిపాలన సౌకర్యము కోరి యప్పుడు కాటయవేమకొమరగిరులు 'అనవేమ క్షితిపాలపౌత్రీప్రతి' యగునెల్లాడరెడ్డిని రాజమహేంద్రవరమునఁ దమ ప్రతినిధినిగా నిలిపిరి. ఆతఁడక్కడ పాలించుచుండెను. తర్వాతఁ గొంతకాలమునకుఁ గొండవీట నేదో కల్లోలము పెదకోమటివేమాదుల మూలమునఁ గలుగుటచేతనో కొమరగిరి వృద్ధుఁడగుటచేతనో కాటయవేమన కొండవీడు పీడనాది రాజమహేంద్రవరము వచ్చిచేరెను. తన్ను సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి రాజ్యమును జక్కఁగాఁ గాపాడిపెట్టినందులకుఁ గొమరగిరిరెడ్డి రాజమహేంద్రవరరాజ్యమును గాటయవేమనకుఁ బారితోషకముగా నిచ్చెనని శక. 1383 సం॥ తొత్తరమూఁడి తామ్రశాసనము చెప్పుచున్నది.

శ్లో ఆసీ దమాత్యరత్నం కాటయవేమప్రభు స్తస్య
అతిసురగురుభార్గవమతి రతి భార్గవవిజయ విజయవిఖ్యాతః

శ్లో. సింహాసనే నిధాయాసౌ కుమారగిరిభూవరమ్
అతేజయ న్మహాతేజా శ్శ్రీకృష్ణఇవ ధర్మజమ్
కుమారగిరిభూనాథో యస్మై విక్రమతోషితః
ప్రాదా త్పూర్వాచీం భువం రాజమహేంద్రనగరీముఖామ్.

కాటయవేముఁడు తన కుమార్తెయగు ననితల్లి నల్లాడరెడ్డి రెండవకుమారుఁడగు వీరభద్రారెడ్డి కిచ్చి వివాహముచేసెను. మఱియు నల్లయ వేమునకుఁగూడఁ దనపుత్త్రి (పుత్రి) యనుట తప్పుగాఁ దోఁచుచున్నది.) ని హరిహరాంబ నిచ్చి పెండ్లిచేసెను. కావున, గాటయవేమనయు నల్లారెడ్డియు నాతని పుత్రులును గలసి రాజ మహేంద్రవరమున రాచఱికము నెఱపుచుండిరి. కాటయవేమన కొంచె మించుమించుగా క్రీ. 1416లోఁ జనిపోయెను. ఆతర్వాత నితని కుమారుఁడు కొమరగిరి రాజయ్యేనుగాని కొలదిదినములకే యాతఁడును స్వర్గస్థుఁడయ్యెను. ఆ కొమరగిరి బాలుఁడుగాఁడు వివాహితుఁడే. అనంతర మనితల్లి మూలమున రాజ్యమును వీరభద్రారెడ్డికి సంక్రమింపఁ జేసి యల్లారెడ్డియుఁ దత్పుత్త్రులును బరిపాలనము నెఱపిరి. రాజ మహేంద్రివరమున రెడ్డిరాజ్యవేర్పడిన క్రమమిది. ఇంక గొండవీటిరాజ్యప్రశంస కొంత తెలుపవలసియున్నది. కొమరగిరి క్రీ. 1400, 1403 వఱకు రాజ్యమేలెను. ఆతఁ డటుతర్వాతఁగూడ నాల్గయిదేండ్లు జీవించియున్నట్టున్నాఁడు. ఆతనికి ననపోతరెడ్డి యను కొడుకు పుట్టినట్టున్నాఁడనికూడ నీవఱకే వ్రాసితిని.

పెదకోమటి వేమారెడ్డి.

కొమరగిరిరెడ్డి తర్వాతఁ గొండవీటిరాజ్యమునకుఁ గోమటి వేమారెడ్డి రాజయ్యెను. జ్యేష్ఠానుక్రమమునఁ గొమరగిరి జ్ఞాతులలో నీతఁడే ముఖ్యుఁడగును. ప్రోల్లయవేమన యన్నయగు మాచారెడ్డి కీతఁడు మనుమఁడు. ఈతఁడు మిక్కిలి విద్యారసికుఁడు. విద్వాంసుఁడు. ప్రఖ్యాతకవీశ్వరుల నాదరించి శాశ్వతకీర్తి నార్జించుకొన్నవాఁడు. సర్వజ్ఞచక్రవర్తియని వీకనారాయణుఁడని యీతని బిరుదులు.

శృంగారశ్రీనాథము

ఈతఁడు రాజ్యమునకు వచ్చిన తర్వాతఁ దనతమ్ముఁడగు మాచారెడ్డికిఁ గొండపల్లిరాజ్యముఁ గొంత పంచియిచ్చి యక్కడకుఁ బంపెను కోనుటివేమారెడ్డికి వెల్లోటివెలమ రాజులతోడను రాజమహేంద్రపుర మేలుచున్న యల్లయవేమాదులతోడను గజపతి (ఓడ్ర – ఒడ్డే) రాజులతోడను విరోధము మిక్కిలి చిక్కు గల్గించుచుండెను. కాటయవేమనయుఁ తప్పుత్త్రిఁడును స్వర్గస్థులయినపిదప నీతఁడు రాజమహేంద్రివర రాజ్యమితనకు రాఁదగినదని యల్లయవేమాదుల మీఁదికి యుద్ధమునకుఁ బోయెను. ఆ యుద్ధమున నల్లారెడ్డియు నాతని పుత్త్రిలును నీతని సైన్యము నోడఁగొట్టిరి. ఈ విషయము రెండుమూఁడు శాసనములందును. శివలీలావిలాసమునందును జెప్పఁబడినది.

వెల్లోటిరాజగు పినవేదగిరినేఁడు తనతమ్ముఁడగు మాచారెడ్డి నోడించి యాతనిరూపమును దమ్మపడిగలోఁదాఁపించుకొనఁగా నీతఁడు "ఘోరముగాఁ బోరుసలిపి యాపినవేదగిరినేనిం జంపి యాతనితల తనతమ్మపడిగలోఁ బొదిగించుకొనెను. అంత నా పినవేదగిరినేని తమ్ముఁడు లింగమనేఁడు ద్వాదశవర్షంబుల వాఁడై యుండియు బంధు హితపరిజనములం గూర్చుకొని యమరులకు వెక్కసంబగుయుద్ధంబు నల్పి కోమటివేమారెడ్డి నోడించి తనతమ్మపడిగం బొదిగించుకొనె" నట. మతియు నందికంతిపోతురాజను రెడ్లకథారినిగూడఁ గొని పోయెనట! ఈవిషయము ముందు విస్పష్టముగాఁ దెలియఁగలదు. ఈ లింగమనేఁడు కోమటివేమారెడ్డికే కాక, రాజమహేంద్రివరమున రాజ్యమేలిన యల్లయవేమవీరభద్రారెడ్లకుఁ గూడఁ బ్రబలవి రోధియైనవాఁడు. రాజమహేంద్రివరమున నీతఁడు కొల్లలాడినాఁడట. వెలిగోటివారి వంశచరిత్రలందలివి యీసందర్భమును సూచించు

పద్యములు గొన్ని యనుబంధమునఁ జూడఁదగును. కోమటివేమా రెడ్డియాసాపముననే శ్రీనాథకవీశ్వరుఁ డున్న వాఁడు గావున ముందాతని రాచరికముఁగూర్చి విస్తారముగాఁ దెలుపఁబడును. ఈతఁడు క్రీ. 1420 వఱకు రాజ్యమేలె నని యీవఱకే తెల్పియున్నాఁడను. ఈతనితర్వాత నీతని కుమారుఁడగు రాచవేమన నాల్గువత్సరములకంటె నెక్కువకాలము రాచరికపుభాగ్య మనుభవింపలేకపోయెను. ఆతఁడు మిక్కిలి దుష్టుఁడటఁ భృత్యు డొకఁ డచ్చారూపుఁడై నగరిలోనికి వచ్చినాఁ డన్న కారణమున నీతఁడు వానినిఁ జంపించెనటఁ. కొంత వఱకుఁ బ్రజలే యీతనిని హింసించిరి. రాజమహేంద్రివర మందున్న వేమవీరభద్రారెడ్లు తద్రాజ్యమును గొంత యాక్రమించుకొనిరి. విద్యానగరపభువులు గొంత యాక్రమించుకొనిరి. కొండవీటఁ గూలినపిదప మఱి ముప్పదియేండ్లకు రాజమహేంద్రివరమునఁ గూడ రెడ్డిరాజ్యము వేమవీరభద్రారెడ్లతోనే యంతరించినది.

రెడ్డిరాజులయోగ్యత.

ప్రఖ్యాతముగా రెడ్డిరాజు లంధ్రదేశమును బరిపాలించినది నూఱేండ్లుమాత్రమేయైనను వారు ప్రజలకుఁ బరమప్రేమ పాత్రులయి యఖండయశము నార్జించిరి. కృతికర్తలైరి. కృతిపతులైరి. ఆంధ్రభాష యున్నంతకాలము, నెఱ్ఱాప్రెగ్గడ శ్రీనాథకవులకావ్యములున్నంతకాలము రెడ్డిరాజులకీర్తి కీర్తిత మగుచునే యుండును. కోమటివేమారెడ్డికృతులు సాహిత్యచింతామణ్యాదులిఁక ముద్రితములు కావలసియున్నవి. ఫల భరితమయిన కృష్ణాగోదవరీపాంతదేశమీ రెడ్డిరాజులు పరిపాలించిరి. వీరి పాలనము తురుష్కులకు గజపతులకు విజయనగరకర్ణాటప్రభువులకును గన్నెఱ్ఱగలిగించునదిగానుండెను.

అఖండశివపూజాధురంధరులయి వీ రాముష్మికతత్పరులుగా నుండిరి. ఆనవేమారెడ్డి షట్కాలములందు శివపూజసల్పుచుండెడివాడట; కృష్ణా గోదావరీగుంటూరుమండలములందు నేఁడాగ్రహారికులుగా నుండువా రనేకులు నాఁడు రెడ్డిరాజులవలన నగ్రహారములు పడసిన వారిసంత తులవా రగుదురు. ఆసామాన్యములయిన ధర్మకార్యములను వారాచ రించిరి. శ్రీశై లాహోబలగిరి సోపాన నిర్మాణము. అమరేశ్వర పునఃప్రతిష్ఠ, అగ్రహార పరిదానములు, సంతానసాగరాదితటాక నిర్మాణములు పేర్కొనవచ్చును. రెడ్డిరాజుల పేళ్ళగల గ్రామము లనేకము లున్నవి. పారంపర్యముగా వారిపేళ్ళు పెట్టుకొనుచున్న కుటుంబములవారు నేఁడు న్నారు. సవిస్తరముగా వారిచరిత్ర సమగ్రముగా సమకూర్పఁ దగినది. అనుప్రసక్తమగుటచే నిక్కడ నధికముగా వ్రాయవెఱచుచున్నాను. ఈ రెడ్డిరాజులపరంపరలోనివా రిప్పు డెవరగుదురో యెఱుఁగరాదు. నెల్లూరు మండలమునఁ గాటమరెడ్డి యని ఇంటిపేరుగలవారున్నారు. వారు మనకాటయ వేమారెడ్డివంశమువా రగుదురేమో! ఇప్పటికి నేను రెడ్డి రాజులలో ప్రథానముగా రాజ్యమేలిన వారిచరిత్రమునే పేర్కొంటిని. అనుబంధమున వారి వంశవృక్షము చూడఁదగును. చాటుధారయొకటి రెడ్డిరాజులపరిపాలనాక్రమమును దెల్పునది కలదు. శాసనములఁబట్టి చూడఁగా దానిలోని కాలక్రమమును కొంత తప్పుచున్నది.

శృంగారశ్రీనాథము

తృతీయ ప్రకరణము

సీ. విద్యాధికార్యున్న । తోద్యోగము వహించెఁ
బోషిచెవిద్యావి । శేషములను,
బహుదేశబుధుల వి । ద్వత్త్వ పరీక్షించె
నంతరించెను ధర్మ । శాసనములు.
రచియించె నైషధ । ప్రముఖ ప్రబంధముల్
పైరిపాలైన క । టారిఁదెచ్చె,
అఖిలపురాణ వి । ద్యార్థంబు లెఱిఁగించె
వెదచల్లె దశదిశల్ । విశదయశము

గీ. విక్రమార్కుండు సర్వజ్ఞ । చక్రవర్తి
వీరనారాయణుఁడు వేమ । విభుని సభను
నిర్విభూతంబుగా నెవ్వఁ । డిర్వదేండ్లు,
అతని స్తుతియింతు "సకల వి।ద్యానాథు॥"

రాజాశ్రయము.

శ్రీనాథుఁడు పదునై దేండ్ల ప్రాయమునకే సంస్కృతాంధ్రము లందుఁ జక్కనిసాహిత్యశక్తిని నఖండమగు కవితా శక్తిని నార్జించు కొన్నవాఁడయినాఁడు. "నిరాశ్రయాన శోభంతే పండితా పనితా లతాः" అన్నట్టును,

చ. ఆపనిపుఁ డాదరించిన భటాళిభటత్వము వైద్యువైద్యముల్
గవికవితామహత్వమును గాయకుగానముఁ గోటిసేయు న
య్యవనిపుఁ డాదరింపని భటాళిభటత్వము వైద్యువైద్యముల్
గవికవితామహత్వమును గాయకుగానము గవ్వసేయునే?

అన్నట్టును, రాజాశ్రయము లేక యళోధనములు సమకూఅనేరవని యా కాలమునఁ బెనుపుగల్గి రాజ్యమేలుచున్న స్వదేశప్రభువులగు రెడ్ల ప్రాపునకై యప్పుడు రాజధానిగా నున్న కొండవీడు చేరెను. రెడ్లకు మంత్రులును గార్యనిర్వాహకులును నగు నియోగిప్రముఖుల యాదర గౌరవములు వడయఁజొచ్చెను. తర్వాత రెడ్ల యాస్థానమున విద్వత్కవియయ్యెను.

కాటయవేమన కొండవీట నున్నకాలముననే, కొమరగిరి జీవించియుండఁగనే శ్రీనాథకవిరత్నము కొండవీటికి వచ్చుచుఁబోవుచు నుండియుండునని నా తలఁపు, కాటయవేమన క్రీ.శ. 1398 ప్రాంతముల రాజమహేంద్రవరము చేరినాఁడు. విద్యారసికుఁడగు కాటయవేమన నాకాలమం దీతఁడు దర్శించి యుండవచ్చును. సకల విద్యాసనాథుఁడగుచున్న యీప్రతిభాశాలి నాతఁ డాదరించియు నుండవచ్చును. "కవీనా మాశ్రయఃʼʼ అని కాటయవేమన వర్ణింపఁబడెను. ఆతని నాశ్రయించినకవులలో శ్రీనాథుఁడుకూడ నొక్కఁడు కాఁదగును. శ్రీనాథుఁడవసానకాలమునఁ జెప్పుకొన్నపద్యమున "భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెʼʼ ననికలదు. కావున నాతనికి భాస్కరుఁ డనునాతఁ డొకఁ డాలంబమై యుండెననియు నాతఁ డందఅకుముందే స్వర్గసుఁడయ్యెననియుఁ దెలియుచున్నది. భాస్కరుఁ డనిపేరుగల మంత్రిశేఖరుఁడు కాటయవేమనాస్థానమున నుండెడువాఁడని యింతకుముందే

తెల్పితిని. 'కలయఁ బసిండిగంటమున'నని యారంభముగల యాచాటు పద్యము శ్రీనాథునిదిగాఁ దలఁచుచున్నాఁడను. "పసిఁడి గంటాన భూపాలు పార్శ్వసీమ" నని యట్టి దింకొకపద్యము భీమఖండమందున్నది. కాటయవేమారెడ్డి కాలమునసున్న యారాయన భాస్కరుఁ డీతని నెట్లాదరించినాఁడో యాతనిపేరనీకవీశ్వరుఁ డేమేని కృతులు రచించినాఁడో యెఱుఁగరాదు.

గ్రంథరచనము

కొండవీడు చేరునప్పటి కీతఁడు గ్రంథరచనము చేయఁజాలి యున్నాఁడు. కాశీఖండమందలి యీక్రింది పద్యమువలన నాతఁడు రచించినగ్రంథములయానుపూర్వి కొంత తెలియనగును:

సీ. చిన్నారి పొన్నారి చిఱుతహాఁకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
సూనూఁగుమీసాల సూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండుజవ్వనంబున యఁదు
హర్షనైషధకావ్య మాంధ్రభాష
పౌఢిసర్వరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమ

గీ. పాఱ్యమింతకు మిగులఁ గైవాఱికుండ
గాశికాఖండమను మహాగ్రంథ మేను
దెనుఁగుచేసెద కర్ణాట దేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి.

ఈ పద్యమున నాతఁడు కొన్నిప్రధానగ్రంథములను మాత్రమే

పేర్కొన్నాఁడు. ఇవిగాక మఱికొన్నికృతు లాతనివికలవు. హరవిలాస పండితారాధ్యచరిత్రాదు లట్టివి.

మరుత్తరాట్చరిత్రము.

"చిన్నారి పొన్నారి చిఱుతకూఁటినాఁడు రచియించితి మరుత్త రాట్చరిత్ర." ఈ ప్రాయ మించుమించు పదుమూఁడు పదునాఱు సంవత్సరముల నడిమి ప్రాయముగాఁ దలంపనెగును. మరుత్త రాట్చరిత్రము తొలుటి యభ్యాసకృతి యయినను గడపటికాశీఖండ మునఁ బేర్కొన బడుటచే నది యాతనిమనసునకు నచ్చినప్రబంధమే యగును. ఎవ్వరికిఁ గృతియిచ్చినాఁడో యెఱుఁగరాదు. ఇప్పుడది దుర్లభమయినది. తఱచుగా నీతనికృతులు సంస్కృత గ్రంథానువాద ములే, కాని యిది యట్టిదిగాఁ దోఁపదు.

శాలివాహన సప్తశతి.

'నూనూఁగు మీసాల నూత్నయౌవనమున శాలివాహనసప్తశతి నొడివితి." ఇది పదునేడు, ఇర్వది సంవత్సరముల నడిమి ప్రాయము కాఁదగును. శాలి (సాత) వాహనసప్తశతి ప్రాకృతభాషాత్మకమగురసో త్తరశృంగారప్రబంధము. సాతవాహనుఁడను నొకరాజుచేనిర్వహింపఁ బడినది. దీనికే "గాథాసప్తశతి" యని నామాంతరము. ఈ గ్రంథ మున నేఁబ్దూఱు గాథలు (ప్రాకృతార్యలు) గలవు. కథావస్తు సూత్రిత ములు గాక యాగాథలు నానావిధ నాయికా నాయకాదుల శృంగార వృత్తులను జమత్కరించుచు భిన్నభిన్నములుగా నున్నవి. శృంగార రసము వీనియందుఁ బొర్లిపోవుచుండును. కొన్నిలోకవృత్తము దెలుపు గాథలును గలవు. పద్యములు మిక్కిలిచిన్నవియైనను భావ పూరితములు. తన ప్రాయమునకుం బ్రవర్తనమునకు ననురూపముగా శ్రీనాథుఁడీకావ్యము నీవయస్సునఁ దెనుఁగునకుఁ దార్చెను. ఎవ్వరి

ప్రేరణమున రచియించెనో యేవి విశేషము లాకృతిముఖమున వెల్ల డించెనో యెఱుఁగరాదు. ఈ గ్రంథమును లభింపకున్నది. ఒకపద్యము మాత్రము లక్షణగ్రంథములందుఁ గానవచ్చుచున్నది.

ఉ. వారణసేయ దావగొనవా నవవారిజమందుఁ దేఁటి కొ
వ్వాఱుచుసుంట నీవెఱుఁగవా పిఱియ హా తెఱగంటి గంటి కె
వ్వారికిఁ గెంపురాదు తగవా మగవారల దూఱ నీవిభుం
డారసి నీనిజం బెఱుఁగునంతకు నంతకు నోర్వు నెచ్చెలీ!

కోమటి వేమభూపాలుఁడీ గ్రంథమును జెప్పించుకొని యుండు నని తలంచెదను. ఈసాతవాహనస ప్తశతికా కోమటివేమారెడ్డియే వ్యాఖ్యా తయగుట పై యూహకు సాధకము. అమరుశతకవ్యాఖ్యాతృత్వము కూడ సాధకమే యగును. శ్రీనాథుని నూనూఁగుమీసాల నూత్నయౌవ నమునాఁటికిఁ బెద్దకోమటివేమారెడ్డి ర్యాజమునకు వచ్చినాఁడు. ఈ కాలముననే శ్రీనాథుఁడు విద్యాధికారిపదము నందినాఁడు.

పండితారాధ్య చరితము.

నిండుజవ్వనము రాకపూర్వము, శృంగారనై షధము రచింపక పూర్వము శ్రీనాథుఁడుపండితారాధ్యచరిత్రము రచించినాఁడు. శృంగార నైషధకృతిపతియగు మామిడి సింగన్న కన్నయయిన పెద్దిగడయ్యకు దానిని గృతి యిచ్చినాఁడు. ఆతనికి మఱికొన్నికృతులనుగూడ నిచ్చి నాఁడట. అవి యేవో!

పండితారాధ్యచరితము తొలుతఁ బొక్కూరికి సోమనాథకవీశ్వ రునిచే ద్విపదకావ్యముగా రచింపఁబడినది. శివతత్త్వసారకర్తయగు మల్లికార్జున పండితారాధ్యుని చరిత్రమిందు వర్ణింపఁబడెను. సంస్కృత

భాషయందు వ్యాసుఁడు పురాణ కల్పకుఁడైనవిధమున నంధ్రభాష యందుఁ బాల్కురికి సోమనాథారాధ్యుఁడు వీరశైవపురాణకల్పకుఁడయ్యెను. సంస్కృతమున ననుష్టుప్పు పొసఁగిన ట్టీతఁడు తెలుఁగున ద్విపదపొసఁగునని గుర్తించి, తనపురాణములను ద్విపద రూపముననే రచియించెను. ఈతఁ డొకదొడ్డకవి. తొల్లింటి తెలుఁగు బల్కుబ్లీతనికబ్బములుదు మిక్కిలిగానెక్కొనియున్నవి. ఈతనిపండితారాధ్య చరితము ననుసరించి శ్రీనాథుఁడు పండితారాధ్యచరితను బద్యకావ్యముగా రచించెను. సోమనాథునిరచనములు శ్రీనాథునిరచనములందుఁ బొందుబడినవట! ఈ విషయమును బద్యబసవపురాణకర్త పిడుపర్తి సోమనాథుఁడు చెప్పినాఁడు. శ్రీనాథకవి యెంతశృంగారియైనను చిఱుతనాఁటనుండియు శైవమతాసక్తిగల్గియే యుండెననుట కీ పండితారాధ్యచరిత్రరచన మొకతార్కాణము.

పెదకోమటి వేమని పైదుష్యము.

రాజు రసికుఁడయినగాని కవులఘనత వెల్లడికాదు. శ్రీనాథుని ప్రతిభాప్రభ్యాతికిఁ బెద్దకోమటివేమునివిద్యారసికత ప్రధానకారణము. ఆతఁడు సంస్కృతప్రాకృతాంధ్రభాషలలో మంచి పాండిత్యముగల వాఁడుగాఁ దెలియుచున్నాఁడు. మఱియు సాహిత్యవిద్యయందేగాక సంగీతవిద్యయందుఁగూడ విశేషపరిజ్ఞానము గలవాఁడు. పెక్కు గ్రంథములను జెప్పినవాఁడు. చెప్పించుకొన్నవాఁడు. సర్వజ్ఞచక్రవర్తియని శ్రీనాథాదికవీశ్వరులచేఁ బొగడ్తగన్నవాఁడు.

శ్లో. చూడామణి ర్నృపాణాం
దుర్మదపరిపంథి శిఖరిదంభోళిః।

సర్వజ్ఞ, చక్రవర్తి
పెదకోమటి వేమభూపతి ర్జయతి.

ఈశ్లోకము శ్రీనాథుని శాసనకృతియందేగాక వామనభట్ట బాణుని వేమభూపాలచరిత మను నాఖ్యాయికయందుఁగూడఁ గలదు. రాచకొండ రాజధానిగా రాజ్యమేలిన వెలమరాజులకును గొండవీటి రెడ్డిరాజులకును బలవిరోధమని ముందే చెప్పితిని. వా రొండొరు లను మీటి కీర్తిప్రతాప యశస్సుల నార్జింప యత్నించుచుండిరి. రాచ కొండ వెలమసరరాజు ర్వజ్ఞబిరుద మందఁగాఁ గొండవీటి రెడ్డిరాజు సర్వజ్ఞచక్రవర్తి బిరుద మందెను. వారు రసార్ణవసుధాకరాది గ్రంథ కర్తలయిరి. వీరు వసంతరాజీయ, సాహిత్యచింతామణ్యాదిగ్రంథకర్త లయిరి. వారు సంగీతసాహిత్యచతురులు. వీరు సంగీతసాహిత్య చతు రులు. వారు కృతిపతులు. వీరు కృతిపతులు. వారు బహుపండితుల నాదరించిరి. వీరుబహుపండితుల నాదరించిరి. ఆస్థాన కవియైశ్రీనాథుఁడు రెడ్డిరాజుల కఖండగౌరవము వెలయించెను. అంతటివాఁడు పోత రాజు వెలమరాజుల యాస్థానమందున్నాఁడుగాని యానిస్పృహుఁడు నరస్తుతివిముఖుఁడై వారిగౌరనాదరములనుగోరఁడయ్యెను. వారిస్పర్థలు యుద్ధములు నాఁడే యంతరించినవిగాని పైదుష్యవిఖ్యాతిమాత్ర మక్షర రూపమై యలరారుచున్నది. సంస్కృతమునఁ బెదకోమటివేమన యనేక కృతులు రచించెను.

పెదకోమటివేమారెడ్డి కృతులు.

శృంగారదీపిక :- రసోత్తర శృంగార గ్రంథముగా గణుతిగన్న యమరుశతకమున కిది వ్యాఖ్య. ఆశతకమునకు మఱికొన్నివ్యాఖ్య లున్నవిగాని యీవ్యాఖ్యకే ప్రచారము మెండు. ఇది విపులమైన చక్కని

వ్యాఖ్యానము. దీని పీఠికలో నిట్లున్నది: ''సకల విద్యలం దతిప్రగ ల్భుఁడును జగనొబ్బగండాకుఁడునగు నావేమభూపాలుఁ డొకప్పు డాస్థానగతుఁడై కవీశ్వరులకావ్యామృతము నాస్వాదించుచుండెను. అమరుకకవి రచించిన శృంగారశతకమును విన్నవాఁడై యప్పుడు వ్యాఖ్యానరచనముచే దాని యభిప్రాయమును వెల్లడించుట కుత్సాహము చెందెను.'' ఈ వ్యాఖ్యపీఠికలో రెడ్ల ప్రాచీనశాసనకృతులలోని శ్లోక ములు కొన్ని కైకొనఁబడినవి. పొసఁగినంతవఱకుఁ దమపూర్వుల శాసన శ్లోకముల నర్వాచీనులు శాసనములందుఁ జేర్పించు కొనుట సంప్రదాయముగాఁ బ్రాచీనరాజశాసనములందుఁ గానవచ్చును. ఇదియు నట్టిదనవచ్చును. కాని సమకాలపు శ్రీనాథుని శాసనకృతుల లోని శ్లోకములుగూడ నీపీఠికలోఁ గలవు. ఈ గ్రంథరచనమున శ్రీనాథునితోడ్పా టుండెనేమో!

సప్తశతీసారటీక:– శ్రీనాథుఁడియం ద్రసప్తశతినిగూర్చి వ్రాయు నప్పు డించుక దీనిఁ బ్రస్తావించితిని. సాతవాహన (హాల) నృపతి సంధానించిన యేఁబ్బూఱుగాథలలో సారమనఁదగు నూఱుగాథలనేటి కోమటివేమారెడ్డి వ్యాఖచేసినాఁడు. వ్యాఖ్యారంభ మిట్లున్నది:

"శ్లో. హాలఃప్రాక్ సప్తశతీం గాథాకోశే ర్వ్యధత్త సంప్రతితు
సోయం వేమనృపాల స్తస్యాలపి శతక మాహర త్సారమ్॥

గద్యము. ఇతిశ్రీ పెదకోమటివేమభూపాలేన కృతా సప్తశతీ సారటీకా సమాప్తా.''

ఈవ్యాఖ్యానరచనమునఁగూడ శ్రీనాథునితోడ్పాటు నాతఁడు పొందియుండవచ్చును. శ్రీనాథునియాంధ్రీకరణ మట్టి ప్రసక్తికలదను టకు సాధకము.

సాహిత్యచింతామణిః- ఇది యలంకారశాస్త్రగ్రంథములలోఁ బేర్కొనఁదగిన **యత్కృష్ట** గ్రంథము. కావ్యప్రకాశము వంటిది. ప్రతాపరుద్రీయవ్యాఖ్యాత కుమారస్వామిసోమపీథి దీని నుదాహరించినాఁడు, మహిమభట్టు ననుమానము నిది ఖండించును. ధ్వన్యాలోకాదుల నిది పరామర్శించును. అమరుశతక శ్లోకములు పెక్కులిం దుదాహరింపఁబడినవి. మఱియు ననేక ప్రాచీనగ్రంథములలోని శ్లోకము లుదాహరింపఁబడినవి. ''యథా మమైన భాణే'' అనియుఁ, ''యథావ మమైవకావ్యే వీరనారాయణచరితే'' యనియుఁ బెక్కుశ్లోకము లుదాహరింపఁబడినవి. పెదకోమటివేమకృతులగు నాగ్రంథము లిప్పుడు తెలియరావు. వామనభట్టబాణునికృతి వీరనారాయణచరిత మను గద్యగ్రంథము గలదు. కాని యిం దుదాహరింపఁబడినది గద్యగ్రంథముకాదు. శ్లోకరూపమగు కావ్యము. ఎడనెడ వీరనారాయణ పెదకోమటి వేమభూపాలప్రశస్తిప్రస్తావశ్లోకములు పెక్కులుదాహరింపఁబడినవి. వీరనారాయణుఁడే గ్రంథకర్తయగునప్పుడు తనపొగడ్తకుఁ దానే పాల్పడినవాఁ డగును. సమ్మానార్థమై వేమభూపాలు నాస్థానమునకు వచ్చిన యనేక కవీశ్వరులు చెప్పినపరిశంసా శ్లోకములనిం దుదాహరించుకొన్నాఁడేమో! ఆయాయలంకారాదులకు లక్ష్యముగాఁ బ్రయత్నపూర్వకముగా రచింపఁబడినవిగా లే వాశ్లోకములు. పరితాపరుద్రీయరసగంగాధరాదులందలిశ్లోకము లట్టివి.

ఇంకను, ''యథా కాదంబరీనాటకే'' యని పెక్కుశ్లోకము లుదాహరింపఁబడినవి. ఆ కాదంబరీ నాటక మిప్పుడు క్రొత్తగా దొరకినది. దానికర్త నరసింహకవి. ఆతఁడువిశ్వనాథకవి తమ్ముఁడు. గంగాధరకవికొడుకు. ఈ నరసింహకవి పెదకోమటి వేమభూపాలునకుఁ గొంచెము పూర్వుఁడగునని నేను దలంచుచున్నాఁడను. నర

సింహకవియన్న విశ్వనాథకవి సౌగంధికాపహరణ నాటకకర్త కావచ్చును. ఆతఁడగస్త్యకవిమేనల్లుఁడును, గాకతీయప్రతాపరుద్రదేవుని కాలమువాఁడును నని యాతని నాటకమువలనఁ దెలియుచున్నది.

మధురావిజయకావ్యకర్త్రియగు గంగాంబ పయి యగస్త్యుని గంగాధరుని విశ్వనాథుని స్తుతించినది. ఆమె విశ్వనాథుని శిష్యురాలగు నటున్నది. మధురావిజయగ్రంథారంభము చూడఁదగును. నరసింహకవి కాదంబరీనాటకము సాహిత్యచింతామణిలోఁ దఱచుగా నుదాహృతమగుటకుఁ గారణ మేదేని యుండవచ్చును. మఱియు 'వేమఖీతీశో వృషమేకపాద" మిత్యాదిశ్లోకము శాసనకృతిగతము దీన నుదాహరింపఁబడినది.

ఈకిర్రింది శ్లోకము సాహిత్యచింతామణిలోనున్నది;

శ్లో॥ ఆటోపాయనటన్మహానటజటానంఘాట శృంగాటక
క్రోడఘాటకరోటికోటరకుటీవాచాటవీచీఘటా।
అస్తు స్వస్తి నినీవిశంకటతటీవాటీక వాటీభవ
ల్లాటీకోటిలలాటపాటలనటాపాటల్యపాటచ్చరీ॥

ఆటోపపదారంభముగలపద్యము లిట్టివి శ్రీనాథునివి పెక్కులుగలవు. భీమఖండమందలి యీక్రిందిపద్యమున నొక సమాసపదము మీఁది శ్లోకమందలిదే కలదు:

శా. ఆడెం దాండపమార్భటీపటహలీలాటోపవిస్ఫూర్జిత
క్రీడాండ బర మ్ముల్లసిల్ల గరళగ్రీవుండు జూటాటవీ
క్రోడఘాటకరోటికోటరకుటీకోటీలలత్పింధువీ
చీడోలాపటలీపరిస్ఫుటతరస్ఫీతధ్వనిప్రౌఢిమన్.

ఈ శ్లోకమును జదువుఁడు : "వాణీనఖముఖముఖరిత వీణా మాధుర్యధుర్యవాగ్వృత్తిః। ధ్వన్యధ్వన్యధ్వన్యః పెదకోమటి వేమ భూపతి ర్జయతి." హరవిలాసమందలి యీ పద్యమును గూడఁ జదువుఁడు : క।। వాణిజ్యచణుని కంతర్వాణీప్రస్తూయ మానవాగ్వి భవునకుఁ, వాణీనఖముఖముఖరిత వీణానిక్వాణ నిభకవిత్వఫణితికిఁ॥ సాహిత్య చింతామణిలో నుదాహరింపఁబడిన యొక శ్లోకమునకుఁ దెలిఁగింపుగా వల్లభరాయనిపేర్వెట్టి శ్రీనాథుఁడే రచించిన క్రీడాభిరామ మున నొక పద్యమున్నది. వానిని రెంటి నిక్కడఁ జూపఁజాలకున్నాఁడను. క్రీడాభిరామము రావిపాటిత్రిపురాంతకునిప్రేమాభిరామము నను సరించిచెప్పఁబడినదిగావున నాశ్లోకము ప్రేమాభిరామమందలి దగునేమో!

ఇట్టి సంగతులచే నీ సాహిత్యచింతామణి రచనమునఁగూడ శ్రీనాథునిసాహాయ్యము కలదేమోయని నే ననుకొనుచున్నాఁడను.

సంగీతచింతామణిఃఁ ఇది తిరుపనంతపుర ప్రాచ్యలిఖిత పుస్తక శాలలో నున్నది. తత్పుస్తకపట్టికలో పేరు మాత్రము చూచినాఁడను.

వీరనారాయణచరితము (భాణము): -- సాహిత్య చింతామణిలో నుదాహరింపఁబడిన (యథామమైవ వీరనారాయణచరితే) యీభాణ మును మఱొక (పేరేమో!) భాణమును దెలియరావు. పెదకోమటి వేమభూపాలునికృతు లింక నెన్ని యుండెనో?

ఆస్థానకవీశ్వరులు.

వామనభట్టబాణుఁడుఃఁ ఈతఁడు బహుగ్రంథకర్తయై ప్రసిద్ధి గన్నవాఁడు కొన్నియేండ్లక్రిందటిదాఁకఁ గాదంబరీ హర్షచరిత్రములు

రచించిన బాణుఁడేతక్క వేఱొక్క బాణుఁడు లేఁడనియు, నుపలబ్ధము లగు నేతత్కృతులుగూడఁ దదీయములే యనియుఁ గొందఱు పౌరఁ బడుచుండిరి. వామనభట్టబాణుని కృతులలో నిప్పుడు వేమభూపాల చరితమనునాఖ్యాయికయు రఘునాథాభ్యుదయము నలాభ్యుదయము ననుకావ్యములును శబ్దరత్నాకరము శబ్దచంద్రిక యను నిఘంటువులును, పార్వతీపరిణయ శృంగారభూషణము లను రూపకములును హంస సందేశమను ఖండకావ్యమును నేనుజూచినాఁడను. ఇంకను రెండుమూఁడుగ్రంథము లెఱుఁగవచ్చుచున్నవి. శబ్దచంద్రికా శబ్దరత్నాకరారంభములందుఁ....

శ్లో॥ విద్యారణ్యగురూ॰ సార్వభౌమాద్యఖిలనత్కవీ॰।
నమున్మృత్యాఖ్య బాణేన క్రియతే శబ్దచంద్రికా॥

శ్లో॥ వరదాగ్నిచితః పౌత్త్రిః పుత్త్రిః కోమటియజ్వనః।
జాగర్తి వామనోబాణో వత్సవంశశిభామణిః॥

అనికలదు. దీనిచే నీతఁడు విద్యారణ్యులకుశిష్యుఁడుగాఁ దెలియఁదగు చున్నాఁడు. సార్వభౌమకవియనఁగా శ్రీనాథుని ప్రత్యర్థియగు డిండిమ కవిసార్వభౌముఁ డగునేమో! శృంగారభూషణభాణము తుంగభద్రా తీరమున విరూపాక్షోత్సవమునందుఁ బ్రబర్శింపఁబడినట్టురచింపఁబడిన దగుటచే నీతని జన్మస్థలము విద్యానగరప్రాంతమోయని సంశయము కల్గుచున్నది. ప్రఖ్యాతుఁడగు భట్టబాణుని రచనములఁ బుడికి పుచ్చు కొని యీతఁడు గద్యరచనము నెఱవేర్చెను. ఆబాణుని తర్వాత నిపుణులగు గద్యకావ్యకర్తలు పొడచూపలేరను కొఱత నీతఁడు తీర్చెనట: గద్యకవిసార్వభౌముఁడని యీతని బిరుదు. ఈతనిప్రశస్తి యిట్టిది:-

శ్లో।। సౌభాగ్యస్య నిధి ర్భ్రుతస్య వసతి ర్విద్యావధూనాం వరో
లక్ష్మ్యాః కేళిగృహం ప్రసూతిభవనం శీలస్య కీర్తేః పదమ్
నిస్సామాన్యవికాసయా కవితయా జాగర్తి పత్సాన్వయ
శ్శ్రీమాన్ వామనభట్టబాణసుకవి స్సాహిత్యచూడామణిః।।

శ్లో. గాథా స్తాథగతావో దథతు వితథతాం తార్క్ష్య కాస్తర్క్షవిద్ధి
న్సత్రా స్సత్రానమాధ్వం ఫణిఫణితిజుషో వఃకృతం ప్రక్రియాభిః ।
భూమ్నాం సాహిత్యసీమ్నా మధిభువి భువనే వామనే భట్టబాణే
దివ్యత్యస్మిన్ కవీంద్రే జహిత భోఃకద్వదావిద్వదాస్థాం।।

వామనుఁడనునది పిన్ననాఁటిపేరని భట్టబాణుఁడనునది బిరుదు పేరని నేను దలంచుచున్నాఁడను. ఈబిరుదుపేరు వేమభూపాల చరితమను నాఖ్యాయికను రచించుటచేతవచ్చినదిగావలయు. వేమభూపాలచరితమునకే వీరనారాయణచరిత మనియు నామాంతరము. పెదకోమటివేమభూపాలునిసాహిత్యచింతామణిరచనమున నీతనితోడ్పాటు కూడ నుండఁదగును. ఈ వేమభూపాలచరితమునఁ బెదకోమటివేమారెడ్డి చరిత్రము కల్పనబహుళముగా వర్ణింపఁబడినది. వాస్తవ చరిత్రమును గుర్తించుటకుఁదోడ్పడు విశేషాంశములంతగానందుఁ గానరావు. దాక్షిణాత్యవేశ్యావర్ణన మెక్కువగా నందుఁ గలదు. గ్రంథాంతమందుఁ బెదకోమటి వేమారెడ్డి "సకసకవి కావ్య శ్రవణభూషణేన కర్ణప్రతిదిన మలంకుర్వన్" అని వర్ణింపఁబడినాఁడు. శ్రీనాథుఁ డాసకసకవులలో నగ్రగణ్యుఁడగుటగదా! మఱియు గ్రంథాంతమం దీశ్లోకమున్నది:-

శ్లో।। సుగుణాలంకృతిసుభగా సుకృతిరియం భట్టబాణ భవదీయా
ఆధరయతి విధుతనఖముఖ ముఖరితవీణానినాదమాధుర్యమ్।

ఇది వామనభట్టబాణనిరచనము కాఁగూడదు. మఱొక కవియా తనిఁ బ్రశంసించుచుఁ జెప్పినది యగును. ఆది శ్రీనాథునిపద్యమని

నేను దలంచుచున్నాఁడను. ఇంతకుముం దుదాహరింపఁబడిన హర విలాసపద్యమే యీతలంపునకు సాధకము.

మఱికొందఱు విద్వాంసులు.

కాదంబరీనాటకకర్త నరసింహకవి కొండపీడుప్రాంతముల వాఁడయి యుండవచ్చును. సాహిత్యచింతామణిలో నాతనినాటకము నుదాహరించుట యీయూహకు స్థిరకము. మఱియు నీవీరనారాయణు నిచే నగ్రహారములు వడసినవా రందఱు గొప్పవిద్వాంసులు. అందు భిషగ్వర్యులు దైవజ్ఞచూడామణులు గలరు. శాసనవిమర్శ సందర్భమున వారుతెలియవత్తురు. వారందఱుగూడ నీతనియాస్థానము నకు సంబంధించిన వారేయగుదురు. మఱియు నీతని మంత్రిశేఖ రుఁడగు మామిడి సింగనామాత్యుఁడుకూడ గొప్పవిద్వాంసుఁడే. జ్యోతిష సిద్ధాంతభాగమునం దతఁడు సంపూర్ణ పాండిత్యము కలవాఁడు. క్లిష్టార్థమగుసోమసిద్ధాంతమునకాతఁడు రచించినవ్యాఖ్యానము క్రొత్తగా నిప్పు డుపలబ్ధమయినది. తనవృత్తాంతము నాతఁ డిట్లుచెప్పుకొన్నాఁడు.

శ్లో. అస్తి శ్రీమన్భరద్వాజగోత్రే శ్రోత్రియభూషణమ్,
నప్తా శ్రీచిట్టయాఖ్యస్య పౌత్రో మామిడిమంత్రిణః
తనుజః పెద్దనార్యస్య శ్రీనృసింహో మహాయశాః
పెదకోమటివేమేంద్రమంత్రిణా తేన ధీమతా
జ్యోతిర్విద్యానిరాఘాటనరస్వత్పారదృశ్వనా
సింగయామాత్యరత్నేన భువి లోకహితైషిణా
క్రియతే సోమసిద్ధాంతవ్యాఖ్యా గూఢార్థదీపికా.

ఈ వ్యాఖ్యానము నీతఁడు క్రీ.శ. 1418 సంవత్సరమున రచించినట్టు చెప్పుకొన్నాఁడు.

శ్రీనాథుడు - విద్యాధికారి.

ఇట్టివా రనేకు లాస్థానమున విద్వాంసులుగా నుండిరి. స్వయము పెద్దకోమటివేమారెడ్డి గొప్పవిద్వాంసుడయి సర్వజ్ఞచక్రవర్తియన్న బిరుదము కల్గియుండెను. ఇట్టిచోట మన శ్రీనాథకవి విద్యాధికారిగా నుండెను. విద్యాధికారియనగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ అనుపేర నిప్పుడాంగ్లేయ ప్రభుతలో నున్నయుద్యోగివంటివాడు. విద్యావిషయమున సర్వ కార్యములు నాతనియేర్పాటుప్రకారము జరుగు చుండును. ఇప్పుడును మైసూరు మొదలగుసంస్థానములందు "ధర్మాధి కారి" మొదలగుపేళ్లతో నిట్టియుద్యోగు లున్నారు. ఆ పదమునకు సంబంధించినకార్యములన్నియు వారియేర్పాటుప్రకారమే జరుగుచుం డును. అయినను నిప్పటి పరిపాలనావిధానము పరకీయ మగుటచే నట్టిపదములకు నాడున్నగౌరవము నేడు లేకున్నది. శ్రీనాథుడా విద్యాధికార్యున్నతోద్యోగము వహించి యనేకవిధముల నార్యవిద్యల కానాడభ్యుచ్ఛయము చేకూర్చెను. ఆవేమారెడ్డి యాస్థానమునకు సమ్మానార్థమరుదెంచిన విద్వాంసుల ననేకులఁ బరీక్షించి యత్యుత్కృ ష్టమని యొదవింపఁ జేసెను. పెదకోమటివేమారెడ్డికాలమున నగ్ర హారములుపడసినవిద్వాంసు లనేకులు గలరు. వారి కాయగ్రహారలాభ ముము మన శ్రీనాథుని యభ్యనుజ్ఞపయి సమకూడినవే. ఆయాదానములఁ గూర్చి శాసనకృతులను శ్రీనాథుడే రచించుచుండెడివాడు. శాసన ములకడపట నతడు "విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః" అని చెప్పుకొనెడువాడు. శ్రీనాథునకుఁ బూర్వ మాయుద్యోగమున బాలసరస్వతియను విద్వాంసుఁ డన్నపోతాన్నవేమరెడ్డి కాలమున నుండె డివాడు. కుమారగిరికాలమున నాయుద్యోగమం దెవ్వరుండిరో తెలియఁ బడదు. విద్వాంసుడు కాటయవేముడే యుండెడివాడు గావలయు.

నానాదేశములనుండివచ్చుచుండెడి విద్వాంసులు ముందు విద్యాధికారి యగు శ్రీనాథుని దర్శించి తమవైదుష్యము నాతనికెఱుకపఱచుకొనెడి వారు. తర్వాత వారియర్హత నీ విద్యాధికారి రాజున కెఱిగించి సభా సన్నివేశాదికము కూర్పించి విద్యావినోదము నెఱపి సమ్మానాదికము జరిపించుచుండెడివాఁడు. ఈసందర్భమున నీతఁ డనేకవిద్వాంసు లతో భాషించెను. మఱియు ననేకవిద్వాంసులను బరీక్షించెను. ఇట్టిపని నిర్వర్తింపఁ దాటోటుపండితులకుఁ దరముగాదుగదా! వైదికులు, శ్రౌతులు, తార్కికులు, వైయాకరణులు, జ్యోతిషికులు, భిషజులు, మాంత్రికులు, తాంత్రికులు మొదలుగా నెందరో విద్వాంసు లెన్నివిద్య లనో నేర్చినవారు వత్తురు. వారినందఱఁ బరీక్షించుట కాయావిద్య లలోఁ బ్రధానమయిన వానియందేని పరిపూర్ణపాండిత్య ముండితీఱ వలెను. ఇట్టు వివిధవిద్యలందు వైదుష్యముగడించిన విద్వాంసులను జక్కఁగా గుర్తించి యాదరించినవాఁ డగుటచేతఁగూడఁ బెదకోమటి వేమారెడ్డికి సర్వజ్ఞచక్రవర్తియన్నబిరుదము సంగతమయినది. ఒకకవి యాతనినిట్లు ప్రశంసించెను:—

శ్లో. జ్ఞాతా యది నహి దాతా
దాతాచేత్కృపి భువి నచజ్ఞాతా
జ్ఞాతా దాతా చాభూ:
పెదకోమటి వేమభూపతే చిత్రమ్.

పెదకోమటివేమారెడ్డి పయివిధమునఁ బ్రస్తుతికిఁ బాత్రమై సర్వజ్ఞచక్రవర్తి కాఁగల్గుట కాతఁడు మనశ్రీనాథుని విద్యాధికారిగాఁ జేర్చుకొనుటయుఁ గారణము. ఈతఁ డాతని నట్టివానిగాఁ జేసెను. భీమ ఖండమందలి యీ కిర్రిందిపద్య మీయర్థమును నిరూపించుచున్నది:

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణ వేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరసులు దిశాంగణములందు

గీ. పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభునిమనుమఁడ వమఁమతివి
నాకుఁ గృపసేయు మొకప్రబంధంబు నీపు
కలితగుణగణ్య! శ్రీనాథకవివరేణ్య!

స్వయము వేమభూపాలుఁడు విద్యాప్రియుఁడుగాన శ్రీనాథుని యుపదేశము లాతనిదగ్గఱఁ జక్కఁగా నెగ్గినవి. తత్పరిపాలనముగల దేశకాలములందు షట్తర్కముల నెఱిఁగినవారు, నాయుర్వేదము నేర్చినవారు, జ్యోతిశ్శాస్త్రజ్ఞులు, వైయాకరణులు, శ్రోత్రులు, వేదవిదులు మూర్ఖలెక్క సుండెడివా రని శాసనములఁ బట్టి మన మెఱుఁగఁగలము. శ్రీనాథునకిది నెఱజివ్వనపుంబొంగరుఁ బ్రాయము. ఈప్రాయమున శ్రీనాథుఁడు మహాదశ ననుభవించినాఁడు. కొండవీటి రెడ్డిరాజ్య మీతనిచేత నుండెడి దనవచ్చునుగదా! వైదుష్యప్రతిభాధార కొగ్గివ్వాఁడియై పదనుమీటి మెఱయుచున్న ఈ కాలమున నీతఁడు స్వప్రజ్ఞా ప్రకటనార్థమై యేమేని దేశాటనము చేసెనేమోగాని ధనార్జనార్థమై చేసియుండఁడు. చేయవలసిన యావశ్యకతలేదు. ఇట్టి పండితప్రకాండునితో నెదబాటు నట్టివిద్యాప్రియుడు, సర్వజ్ఞచక్రవర్తి సహింపఁజాలఁడు. మఱియు సమ్మానార్థ మరుగుదెంచు పండితులనుపరిశీలిం

చుట రాజునకు వివిధవిద్యార్థముల నెఱిఁగించుట మొదలగు నుద్యోగ కృత్య మట్టిదెఱిపి నీయదు. పెదకోమటి వేమారెడ్డికాలమున శ్రీనాథుఁడు తనచేతిమీఁదుగా నెన్నోయగ్రిహారములు నెందఱకో విద్వాంసుల కిప్పించినాఁడుగానితానొక్కయగ్రిహారమేనిగైకొన్నవాఁడు కాఁడు. అత్యంత ప్రాభవముతో వీరనారాయణుఁడాదరించుచుండుటచే నీతనికట్టి యగ్రిహారముల యావశ్యకతయే యప్పుడు లేకుండెను. "సుకవితా యద్యస్తి రాజ్యేన కిం" మ్మనుసూక్తికిఁ దార్కాణమై యీతఁడు నెమ్మదితో నున్నాఁడు. భావికాలవైపరీత్యమును యోజించు నాతఁడు కాఁడు.

పెదకోమటి వేమారెడ్డి దాతృత్వమును గూర్చియుఁ బ్రతాప మును గూర్చియుఁ సంస్కృతాంధ్రములందుఁ జాటు పద్యములు పెక్కు లున్నవి. ప్రసంగరత్నావళిలోఁ గొన్ని శ్లోకము లుదాహరింపఁబడినవి. తెల్గుపద్యములు చాటుపద్యమణిమంజరి (ద్వితీయ భాగము)లో జేర్చి తిని. అందుఁ గొన్ని శ్రీనాథునివి కాఁదగును. ఉదాహరించు చున్నాఁడను.

శ్లో. దుర్గాండిస్పను గాండిరర్థవహగాణ్య ప్యర్థటంకోధవా
టంకోవాన్యనృపాలకైఃకవితతేర్దీయేత దీయేతచేత్
త్యాగఃకోమటివేమయక్షితిపతే రష్టా తతష్షోడశ
ద్వాత్రింశత్సచతుష్క షష్టిసహితఁద్వ్యష్టోత్తరం వాశతమ్.

శ్లో. కావేర్యాం త్రిపురాంతకే జయపురే కాశీపురే గోకుకే
పంచారామపురీషు పట్టనపురే మార్కండశంభోఃపురే
గంగాసాగరసంగమేషు నిరతం శ్రీకొండవీటీ పురే
చాతుర్వామయుతాన్నదాననిరతశ్శ్రీవేమభూపప్రభుఃశ.

శ్లో. జ్ఞాతా యది నహి దాతా
దాతచేత్కోపి భువి నచజ్ఞాతా
జ్ఞాతా దాతా చాభూ:
పెదకోమటి వేమభూపతే చిత్రమ్.

శ్లో. అర్థిజన చింతితార్థా
దధికం చేత స్తతోఽ పితే వాణీ;
అస్యా అపి దిశతి కర:
పెదకోమటివేమభూపతే చిత్రమ్.

శ్లో. క్షితపోషణ రిపుశోషణ
బుధతోషణ సత్యభాషణాది గుణాఢ్య
దత్తే దశరథరామ:
ప్రాగద్య కలౌ తు కోమటివిభువేమ:

సీ. కపటకంఠీరవాకారనారాయణ
శ్వేతానినాదంబు గేలిసేయు
కల్పాంతదుర్దాంతకాలభైరవభేరి
ధమరుకోన్మాదం బడంగఁజేయు
ప్రళయకాలాభీలపటుఘోర నిర్ఘాత
పటపటారావంబు జటులపఱచు
మహనామహాకాలకోలాహలోత్తాల
పాతాళనిస్వనం బంగపఱచు

గీ. గండు మెఱసిన రిపుకోటిగుండె లవియఁ
జండగతిమ్రోయు నీరణోద్దండభేరి
జయరమానంగ రాజవేశ్యాభుజంగ
అతులబలధామ! పెదకోమటన్న వేమ!

శృంగారశ్రీనాథము

కోమటివేమన్న మహాదాతయన్నవిషయ మీవర కేయెఱుకపడెను. ఆతనియాస్థానమునఁ దురగా రామయ యను దుష్టమంత్రి యొకఁ డుండెడివాఁడట.

క. కోమటివేమనదానము
భూమిఁబ్రసిద్ధంబు కల్ప (గంధ?) భూజముచెంతన్
భామున్నపగిదిఁ దురగా
రాముం డున్నాఁడు చేరరా దెవ్వరికిన్.

ఎవ్వరు చెప్పినదో యీ పద్యము! కోమటివేమారెడ్డివలన శ్రీనాథుఁడ గ్రహారము లందెనని గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారిట్లువ్రాసినారు:-

"కొండవీటి దండకవిలెలో నీశ్రీనాథునకుఁ గోమటి వేమన్న పలన రెండుపాలెము లీయఁబడెననియు ఆందొకదానికి పొలసపాలె మనియు, రెండవదానికిఁ బాలెమనియు నామముస్నట్లును జెప్పఁబడియె. ఆ రెండుగ్రామములును దొంతియల్లాడరెడ్డి కాలమ్మిలో నల్లాడరెడ్డికూఁతునకు నతనివలన సంక్రాంతిపండుగబహుమానముగా నీయఁబడిన వనియున్నది. అల్లాడరెడ్డి కూఁతురుపేరు వేమాంబ. ఆమెకు నామాంతరము మైలమ్మయని కలదు. మైలమ్మ కాగ్రామము లిచ్చి పొలమేరహద్దులు పెట్టించి యందొకదానికి మైలమ్మపేరిట మైల వరమనియు రెండవదానికి సంక్రాంతిపండుగకుగా నీయబడుటచేత సంక్రాంతిపాలెమనియు నామకరణముచేసిరి. నాఁడు మొద లవి ప్రత్యేకగ్రామము లాయెనని యున్నది." పయివ్రాఁతలో నేమేని సత్యము కలదాయని నేను సంశయించుచున్నాను. కోమటివేమన కు నల్లాడరెడ్డి సంబంధ ముండెననుట సందేహింపఁదగినది. విరోధము ప్రఖ్యాతముగాఁ గలదు.

శృంగారనైషధ రచనకాలము.

పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చినతర్వాత (క్రీ. 1403 తర్వాత)నే శ్రీనాథుడు క్రీ. 1410, 1415, ప్రాంతముల శృంగారనైషధమును రచించెనని నేను నిశ్చయించుచున్నాడను. శృంగారనైషధకృతిపతి మామిడి సింగనామాత్యుడీనాటి కీక్రింది విధమునఁ బ్రాభవము గాంచియున్నాడు.

మ॥ అరుదారఁ బివిచాగ్రహారములతో నాందోళికాచ్ఛత్రచా
మరకళా ణ కళాచికాది బహుసమ్మానార్హచిహ్నంబు లా
దరమొప్పారఁగ వేమభూవరునిచేత గాంచె సామ్రాజ్యనం
భరఁబ్రౌఢుఁ డమాత్యసింగఁడు నయప్రాగల్భ్యగర్వోన్నతిన్.

ఈక్రింది పద్యము కూడఁ జూడఁదగినది.

మ॥ నవరత్నోపల దివ్యలింగవరదానప్రీత దాక్షాయణీ
ధవ కర్పూరవసంతరాయ యనవద్య ద్వాదశీవాసరో
త్సవ రుక్మాంగద వేమభూపతి మహాసామ్రాజ్యరక్షామణీ
యవనాధీశనభానిరంకుశవచో వ్యాపారపారాయణా.

మఱియు నింక ననేకపద్యము లున్నవి. విస్తరభీతిచే విడచుచున్నాడను. నైషధమునఁ జూడఁదగును. శృంగారనైషధము పెద్దకోమటివేమారెడ్డి రాజ్యమునకు రాకముందే కొమరగిరిరెడ్డి పరిపాలనకాలమందే రచితమయ్యెననియు నా వేమారెడ్డినిగూర్చియుఁ దన్మంత్రియగు మామిడిసింగనా మాత్యునిఁగూర్చియుఁ జేయఁబడిన వర్ణన మతిశయోక్తియనియు, వేమారెడ్డి కంతకుఁబూర్వమును గొంత రాజ్య ముండెననియు నొకవాద మున్నది. దాని నేను విశ్వసింపఁ జాలకున్నాడను. మామిడిసింగనామాత్యునివర్ణనలలో నతిశయోక్తులని

తోర్గిసిపుచ్చఁదగినవికావు మీఁద నుదాహరింపఁబడిన విషయములు ; కొమరగిరియు, కాటయవేమనయు భావమఱఁదులు. మఱియుఁ గుమార గిరిరెడ్డికిఁ గాటయవేమారెడ్డి మంత్రి. ఈతనితోఁ బెదకోమటివేమా రెడ్డికి పైరమున్నట్టు తెలియుచున్నది.

పెదకోమటివేమారెడ్డికి రాజ్యలాభము కాటయవేమునకు సహింపరాని దయ్యెను. ఆట్లగుటచేతనే కొమరగిరి జీవితకాలముననే కీర్గి. 1398 ప్రాంతమున నాతఁడు రాజమహేంద్రిపురరాజ్యమును బడసి కొండవీడును విడనాడెను. "గతే దివం కాటయవేమభూపే నిర్మూల్య తద్ద్రోహికులం సమస్త" మిత్యాదిశాసనాంశము లిందుకు సాధకములు. కాటయవేమారెడ్డియే కొమరగిరిరెడ్డియనవచ్చును. కొమర గిరిరెడ్డికాలమునఁ గాటయవేముని ప్రాభవమే సాగినది. "సింహాసనే నిధాయాసౌ కుమారగిరి భూపతిమ్, అతేజయ న్మహాతేజాశ్శ్రీకృష్ణ ఇవ ధర్మజమ్" అట్టిస్థితిలో వారిపాలనమునఁ బెద్దకోమటివేమారెడ్డికి రాజ్య లాభము దర్లభము. కొమరగిరి యవసానమునకుఁ బూర్వము కోమటి వేమారెడ్డికి రాజ్య మున్నదనుట కాధారము నాకుఁగానరాలేదు. మామిడి సింగనయవనాధీశ్వరునిసభలోనిరంకుశవచోవ్యాపారము నెఱపుటయును, వివిధగ్రహారములతో నాందోళికాచ్ఛత్రచామరాది రాజార్హపదముల బడయుటయును నాతని నేలిన రాజగు కోమటివేమారెడ్డి కొండవీడు రాజ్య సింహాసనాధిష్ఠితుఁడయి యుండినప్పుడే యుక్తమగును. అప్పుడే యాతఁడు వేమభూపతిమహాసామ్రాజ్యరక్షామణి యనఁదగినవాఁడగును. రాజునకు రాజ్యములేనప్పుడు మంత్రియు నామంత్రి కగ్రిహారాందోళి కాచ్ఛత్రచామరాదిలాభమును సామ్రాజ్యసంభరణపౌర్గిమయు నసం గతములు. శృంగారనైషధము వేమారెడ్డికిరాజ్యలాభము కల్గినతర్వాతనే

రచింపఁబడినదనుట కిది యాధారమే యగుచున్నది. బలిష్ఠమగు సాధనమొకటి పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు రాకపూర్వమే శృంగార నైషధరచనము జరిగెనని స్పష్టముగా నిరూపించుచున్నప్పుడు పయిదానిని సందేహింప వచ్చును గాక! అది యంతకుఁ బూర్వమే రచిత మయ్యెనను పక్షితికూలవాదమునకు నిలువఁదగిన సాధనము నాకుఁ గానరాకున్నది. సాధనముగాఁ దత్పక్షమునఁ జూపఁబడునది హరవిలాసప్రబంధరచనావిషయము.

హరవిలాసవిషయము

పక్షితిపక్షవాదముసారాంశ మిది :—

"హరవిలాసము వ్రాయునప్పుడు కుమారగిరి బ్రిదికి యుండెననియుఁ గొండవీటిలో రాజ్యము చేయుచుండెననియు అతనియొద్ద పెద్దనెట్టిగా ఆవచితిప్పయ యుండెననియు జూపు వాక్యము లీ (హరవిలాసము) గ్రంథమునందుఁబెక్కులుగలవు. ఇట్టివాక్యము లున్నను కుమారగిరి చనిపోయినతర్వాత తప్పన అధికార మూడిపోయిన పిదప హరిహరరాయలు శాసనములలోఁ కీర్తిశేషులయిన యెన్నియో సంవత్సరములకుఁ దర్వాత నీకావ్యము రచింపఁబడియెనని చెప్పుటకంటె విపరీతమైన సిద్ధాంతము మఱియొకటి యుండదు."* హరవిలాసము శ్రీనాథుని యవసానకాలపు గ్రంథమనుటను నే నంగీకరింపను. మఱియు, నది కుమారగిరి జీవితకాలమందే, యవచితిప్పయ కొండవీటఁ బెద్దనెట్టిగా నుండుకాలమందే రచింపఁబడిన దనుటనుగూడ నంగీకరింపఁజాలను. హరవిలాసమునుండి పక్షితిపక్షవాదమునకు సాధకముగా నుదాహరింపఁ

*వాదస్వరూపము సమగ్రముగాఁ దెలియుటకయి పయిగ్రంథము నుండి పరానభాగము ననుబంధమునఁ జూపుదును.

బడిన గ్రంథభాగము. కుమారగిరి జీవితకాలమందే యీ గ్రంథము రచింపఁబడెననుట నేమాత్రమును సాధింపఁజాలదు. "సుగంధ ద్రవ్యంబు లొడఁగూర్చియు గానిక్యంబులు తెప్పించియు, కవిసై గమర వైతాళికాదులగు సర్వజనంబులకు సర్థంబులు గుప్పించియు విఖ్యాతిగాంచిన తిప్పప్రభుం డొక్కనాఁడు...." అని కలదు. కుమార గిరి జీవించియున్నకాలమే, యీయుత్సవములు నడుచుచున్నకాలమే, యీయనునేది, "సుగంధద్రవ్యంబు లొడఁగూర్చుచు....తెప్పించుచు .. గుప్పించుచు.... ఖ్యాతిగాంచుచున్న" యని యుండవలెను. ఆ కాలము దాఁటినపిదప రచింపఁబడినెదగుటచేతనే యట్లు భూతకాలక్రియావిశేష ణములను శ్రీనాథుఁడు ప్రయోగించెను. ఖనిమీఱఁగ- అను పద్యము సుల్తాన్‌ప్రభున కాతఁడు సుగంధి ద్రవ్యముల నొసఁగువాఁడని యర్థ మిచ్చుచున్నది. అందు విశేషములేదు. "సుతియించురా" యనునది తద్ధర్మరూపము. కుమారగిర్యధీశ్వరుని పసంత వైభవము "సర్వము నొక్కఁడ నిర్వహించుచుఁ...." అనిలేదు. "నిర్వహించు మా తిరు మలనాథనెట్టికిని" అని కలదు. ఇక్కఁడ నిర్వహించు అనునదియును దద్ధర్మవిశేషణమే. "నిర్వహించుచుఁ" అని శత్రర్థకముగా నుదాహ రించుట యుక్తమును. అచ్చుప్రతులలోఁగాని వ్రాఁతప్రతులలోఁ గాని యట్లుకాఁదాదు.

కొమరగిరివసంతన్యాగమేత్యాదివిధముగాఁ బ్రతిపక్షవాద మున నుదాహరింపఁబడినపద్య మిట్లుండవలెను.

క. కొమరగిరినృపసంతా
గమకేళీగంధసారకస్తూరీకుం
కుమ పర్వారహిమా భ
స్వమువంచిత బహుసుగ ధిరాలాధ్యక్షా'

ఇట్లే వ్రాతప్రతిలోఁగలదు. కొమరగిరిన్యపాలుని వసంతోత్సవములందుఁ "జందనము కస్తూరి మొదలగు సుగంధద్రవ్యముల కొట్టుపై నధికారముగలవాఁడా!" యని సంబోధనమిది; పయిప్రతిపక్ష వాదమున నవచితిప్పయ కొండవీటఁ గొమరగిరిరెడ్డికిఁ బెద్దనెట్టియై సుగంధద్రవ్యముల కొట్టుపెట్టుకొని పసించియున్నట్టు తలంపు గలదు. అవచితిప్పయ కొండవీట నిల్లుకట్టుకొని కూర్చున్నవాఁడు కాఁడు. కొమరగిరియొద్ద వసంతోత్సవసమయములంచే సుగంధిశాలాధ్యక్షుఁడుగా నున్నట్టు పయి పద్యమేకాక యీక్రింది పద్యముకూడఁ బలుకుచున్నది:

చ. కొమరగిరిక్షమారమణ కుంజరచారువసంతవైభవ
క్రమ వసుపార్జితాభినవగంధ హియాంబు కురంగనాభికుం
కుమఘనసారసంకుమదకుంభమనోహర గంధపాలికా
సముదయ సార్వభౌమ కవిసంఘమనోరథ కల్పకద్రుమా!

తిప్పయనెట్టి మహైశ్వర్యసంపన్నుఁడు. కొమరగిరిరెడ్డిచే రాజార్హపదములఁ బడసినవాఁడు. అతని నివాసస్థలము కాంచీపట్టణము. ఇది చదువుఁడు.

ఉ॥ మంకణమౌనివంశమణిమండన! కాంచిపురీనివాస! యే
ణాంకకిరీటివ్యచరణాంబుజ సేవక! వైరిభద్ర నా
గాంకుశ! హారహీరదరహాసవిపాండురకీర్తి చంద్రికా
లంకృత దిగ్విభాగ! శుభ షణ! వారిరుహాయతేక్షణా!

అవచితిప్పయ కొక్కకుమారరెడ్డితోడనే కాదు సంబంధము. పాండ్యరాజుతోఁ గలదు; తురుష్కప్రభులతోఁ గలదు. ఇంక ననేక ప్రభువులతోఁ గలదు. అతనితమ్ములు ద్వీపాంతరములనుండికూడ

ననేక మహార్ఘవస్తువులఁ దెచ్చుచుండెడివారు. వారు తెచ్చుపదార్థములు రాజార్హములు. కొమరగిరిప్రభుప్రభృతులసన్నిధికి వానిని గొని పోయి వారు విక్రయించుచుండెడివారు. కుమారగిరి ప్రతివర్షమును వసంతోత్సవములు చేయుచుండువాఁడు కాఁపననే యాతనికి వసంత రాయఁడని బిరుదు కలదు. ఆయుత్సవకాలమునకు సుగంధిద్రవ్యా దుల నీ యవచితిప్పయయు, నాతనిసోదరులు కొనివచ్చి విక్రయించి, తాత్కాలికముగా సుగంధిభాండాగారాధ్యక్షత వహించి యుత్సవము తీఱినతర్వాత రంచికరుగుచుండెడివారు. ఇట్లే యనేక రాజస్థానము లకు వా రరుగుచుండెడివారు. అవచితిప్పయ కొండవీడువా స్తవ్యుండనుట కాధారమేమియు లేదు. పైగాఁ గాంచీపురవా స్తవ్యుఁ డని స్పష్టము గాఁ గలదు. మఱియు నాతనికుటుంబము పెక్కుతరములనుండి కాంచీపురీవా స్తవ్యమనుటకు హరవిలాసము ప్రథమద్వితీయాశ్వాసములు ప్రమాణములు. శ్రీనాథుఁడు బాలుఁడుగా నుండఁగా నవచితిప్పయఁ కొమరగిరి వసంతోత్సవములకుఁ గొండవీటికి వచ్చుచుండఁగా వారికిఁ బరస్పరము సఖ్యమేర్పడినది. శ్రీనాథుఁడుబాల్యముననే కవిత్వమునను బాండిత్యముననుఁ బ్రఖ్యాతుఁడుగా నుండెనను విషయము నిక్కడ స్మరింపఁజేయ నక్కఱయుండదు. అవచితిప్పయ యాయుత్సవములకు వచ్చిన 'కవినై గమికవాదివాంశిక వైతాళికాదులగు నర్థిజనంబులకు నర్థంబులుగుప్పు' చుండువాఁడు. తిప్పయ యప్పుడు శ్రీనాథునిఁ గూడ సత్కరించియుండును. కొమరగిరితర్వాత గోమటి వేమన కాలమునఁ గొండవీటి కవచితిప్పయి వచ్చుచుండినట్లు తెలియరాదు. శ్రీనాథుఁడు కోమటివేమన కాలమున మహాప్రభపమున నున్నాఁడు. కుమారగిరికిఁ దర్వాత శ్రీనాథున కిట్టిదశ యించుమించుగాఁ బంచ వింశతి వత్సరములు నడచినది. తర్వాత కొండవీడురాజ్యము కూలినది. శ్రీనాథుఁడు యశోధనార్జనకై దేశాటనము చేయవలసిన వాఁడయ్యెను.

ఈస్థితిలో పెదకోమటివేమనకు విరోధులను రాజమహేంద్రవరపాల కులు నగు వేమవీరభద్రారెడ్డి యాశ్రయము కుదురుటకుముందుఁ గొన్నియేండ్లు కడపెను. ఆ సందర్భమునఁ దనబాల్యమునఁ గొండ వీటిబరిచితుఁడును, ఐశ్వర్యసంపన్నుఁడును నగు నవచితిప్పయను జూడ నీతఁడు కాంచీపురి కరిగెను. అతఁడాదరించి కృతి కోరెను. అలవోకగా హరవిలాసమును రచియించి శ్రీనాథుఁ డక్కడనే యుంకి తముచేసి యుండును. అప్పుడు కొంతకాలము శ్రీనాథుఁడు కాంచీపుర మున వసించెను. అప్పటికి నవచితిప్పయ మిక్కిలి వృద్ధుఁడుగా నున్నాఁడు. ఆతఁడు కొమరగిరివసంతోత్సవములు జరుపుకాలమునకు ముప్పదినలుబదియేండ్లవాఁడు కాదగును. తర్వాత నించుమించుగా నిర్వదియైదేం డ్లిప్పటికిఁ గడచెను. హరవిలాస కృతికాలమున కాతఁ డించుమించుగా నర్వదియైదేండ్లవాఁడు. ఈయర్థమునకు హరవిలాస మందలి యీ క్రిందిపద్యములు సాధకములు.

క. కంటిఁ బ్రవిశుద్ధసంతతి
వింటిఁ బురాణములపెక్కు విశ్వము పొగడఁ
మంటి బహుపత్సరంబులు
కొంటి యశోధనము సుకవికోటులుచేతన్.

గీ. ఆగమజ్ఞానఖనివి దత్త్వార్థనిధివి
బహుపురాణజ్ఞుఁడవు శుభభవ్యమతివి
బాలసఖుఁడవు శైవప్రబంధ మొకటి
యవధరింపుము నాపేర నంకితముగ.

ఇప్పుడు శ్రీనాథుఁ డించుమించుగా నలుబదియేండ్లవాఁడు. పంచవింశతి సంపత్సరములనుండి కలపరిచయమును గూర్చి చెప్పు నప్పుడు తిప్పయనెట్టి శ్రీనాథుని బాలసఖుఁడ వనిచెప్పుట తప్పుగాదు.

హరవిలాసమునఁ గొమరగిరి వసంతోత్సవాదికమును గొంచె మెక్కువగాఁ బ్రశంసించుటకు గారణ మది శ్రీనాథుని యెఱుకకెక్కిన దగుటయే యని నేను దలంచుచున్నాఁడను. ఆప్రశంస నాధారముగాఁ గొని యది హరిహరరాయ ఫేరోజిషహా కుమారగిరుల పాలనకాలము ననే రచితమయ్యెనుటకు నేనంగీకరింపఁజాలకున్నాఁడను. అది పెద కోమటి వేమారెడ్డి స్వర్గస్థుఁడైనపిదప రచింపఁబడిన దనుటయే సంగతముగానున్నది.

హరవిలాసము కొమరగిరిరెడ్డి పాలనకాలమునసే రచితమయ్యె నని యంగీకరింతుమేని యాకాలము క్రీ. 1385–1400కు నడిమికాల మగును. కొమరగిరిరెడ్డి పాలనకాలమునఁ గడపటి యైదేండ్లలోనే హరవిలాసరచనము జరిగిన దనుకొన్నను, నప్పటికి నవచి తిప్పయ బహువత్సరములుమనినవాఁడగుటయు నాతనికి శ్రీనాథుఁడు బాలసఖుఁ డగుటయు, సర్వథా యసంగతము లగును. హరవిలాసమున "ఆంధ్ర భాషానైషధబద్ధభవ్యని" అని కలదుకాన హరవిలాసరచనమునకుఁ బూర్వమే శృంగార నైషధరచనము జరిగినట్లేర్పడుచున్నది గదా!

శృంగారనైషధరచనమునాఁటికి శ్రీనాథుఁడు నిండుజవ్వనము వాఁడగుటచేత నాతని జన్మకాల మిప్పటి కిర్వదియేండ్లకుఁ దక్కువ కాకుండఁ బూర్వకాలమునకుఁ బోపలసివచ్చును. ఇదియు నసంభావ్యమే. ఈ విషయము జన్మకాలచర్చయందుఁ జూడఁదగును. ఇన్ని యసంగతుల కేల పాలుపడవలెను? శృంగారనైషధరచనము పెదకోమటివేమారెడ్డిపాలనకాలమున రచితమయ్యెనుట నేల యంగీకరింపకపోవలెను? కొమరగిరిపాలనకాలమునఁగూడఁ గోమటివేమారెడ్డికి రాజ్యముస్నదని యాకాశహర్మ్య మేలకల్పింపవలెను? శృంగార

నైషధము పెదకోమటివేమారెడ్డిపాలనకాలముననే రచితమయ్యెననుట కింకను సాధకములు గలవు.

శృంగారనైషధకృతిపతియగు మామిడిసింగన తాను స్వయము సోమసిద్ధాంతమునకు వ్యాఖ్యరచయించినాఁడు. గ్రంథకరణకాలము శక 1340 క్రీ. 1418 యని యందుఁ జెప్పుకొన్నాఁడు. (శృంగార నైషధ) కృతిగ్రహణకాలము కూడఁ (సోమసిద్ధాంతవ్యాఖ్యాన) కృతి కరణకాలమునకుఁ జేరువగా నుండఁదగును. కాఁబట్టి శృంగారనైషధ కృతిగ్రహణకాలము క్రీ. 1418 కిఁ గొంతముందుగా నుండఁదగును.

ఇంకను ధీమఖండమందలిదగు నీక్రింపిపద్యము గూడ నీయర్థ మునకు సాధకముకావచ్చును.

సీ వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణవిద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్యమాంధ్రభాష
భాషించినాఁడవు బహుబోధబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
వెరజల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు

గీ. ....

శృంగారనైషధ రచనావిషయముతో పాటు తక్కిన వెనుక ముందుచరణములలోఁ జెప్పఁబడిన విషయములు పెదకోమటి వేమా రెడ్డిపాలనకాలమున నడచిన వగుట సునిశ్చితము. వాని నడుమనున్న శృంగారనైషధరచనావిషయముగూడ నాకాలముననే నడచినదనుట

సంగతమగును. ఎన్నివిధములఁ బర్యాలోచించిచూచినను శృంగార నైషధము పెదకోమటివేమారెడ్డిపాలనకాలముననే రచితమయ్యెననుట నిర్బాధముగానే నాకుఁ దోఁచుచున్నది.

తెలుఁగుచేఁత.

బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిలుగారు విద్వదౌషధ మనఁబడు శ్రీహర్షనైషధమును శ్రీనాథుడు విద్వదమృతముగాఁ జేసినాఁడని శృంగారనైషధమునుగూర్చి సముచితమయిన ప్రశంస సల్పినాము. అది యట్టిది: ''కాశీఖండ మయఃపిండం నైషధం విద్వ దౌషధమ్'' అని ప్రతీతికలదు. శ్రీనాథుడిరెండుగ్రంథములను దెలిఁ గించినాఁడు. పయిప్రతీతి మన శ్రీనాథుని తెనుఁగు గ్రంథములను గూర్చి యేర్పడినదేయేమోగదా! స్కాందపురాణాంతర్గతమైన కాశీఖండ మునకును బ్రౌఢకావ్యమయిన నైషధమునకును బొత్తుగూర్చు నా ప్రతీతి సంస్కృత రచనములఁగూర్చి యేర్పడిన దనుటకంటె నేక కవికృతములయి పొత్తుగాంచిన తెలుఁగు గ్రంథములఁగూర్చి యేర్పడిన దనుట యుచితముగా నుండునుగాదా! ఆంధ్రకావ్యములందు శృంగార నైషధము మిక్కిలి ముఖ్యముగాఁ బరిగణింపఁబడుచున్నది. అపండి తులకు దురవబోధమగు నాగ్రంథమును శ్రీవేంకటరాయశాస్త్రిలుగారు సర్వంకష యను వ్యాఖ్యతో ససిపఱిచి ముద్రించి యిప్పుడు సుబోధము గావించినారు.

సంస్కృత వ్యాఖ్యలు.

శ్రీనాథుఁడు తెలిఁగించునాఁటికి శ్రీహర్ష నైషధమునకు నేయేవ్యాఖ్యలు మనదేశమున వ్యాప్తిలోనున్నవో స్పష్టముగా నెఱుఁగ రాదు. మల్లినాథుని వ్యాఖ్య యించుమించుగా శ్రీనాథుని కాలముననే

రచింపఁ బడెను. ఆవ్యాఖ్య నీతఁడు చూచెనో లేదో తెలియదు. మఱొక గొప్పవ్యాఖ్యాన మప్పటికిఁ గొంచెము పూర్వకాలమున మన తెనుఁగు దేశముననే రచింపఁబడినది కలదు. ఆవ్యాఖ్యాత ప్రఖ్యాతుఁడు, నరహరి. విద్యారణ్యుల శిష్యుఁడు.

శ్లో యం ప్రాసూత త్రిలింగక్షితిపతిసతతారాధితాంఘ్రి స్వయంభూ:
ప్రాతివత్యైకసీమా సుకవినరహరిం నాలమా యవ్యధాతా
యం విద్యారణ్యయోగీ కలయతి కృపయా తత్కృతౌ దీపికాయా
మాద్యా స్సర్గేఽ తిమాద్యత్కవికులవిజయీ చారునీరాజితోఽభూత్.

ఈ వ్యాఖ్యానమును శ్రీనాథుఁడు చూచియుండవచ్చునేమో! నైషధము గ్రంథగ్రంథులు కలిగి క్లిష్టమయినదగుటచే ననేకులు వ్యాకరించిరి. అందు శ్రీనాథుడు రచించిన దొక్కటి కలదు. ఆ శ్రీనాథుఁడు మన శ్రీనాథుఁడేయేమో యని సందియము పొడమినది. శ్రీవేంకటరాయ శాస్త్రులుగారు రిప్లువ్రాసినారు: "ఇతఁడు వ్యాఖ్యాతలలో శ్రీనాథుఁడు ఒక్కఁడని పేర్కొనఁబడి యున్నాఁడు. ఆ శ్రీనాథుఁడు శృంగారనైధకారుఁడేయేమో! ఈతఁడే యనుటకు ఈయాంధ్రీకరణాభిమానము కొంత సాధకము."

శ్రీనాథుని వ్యాఖ్యాన మెక్కడఁగలదో వెదకితిని. బరోడారాజు గారి పుస్తకశాలలో నున్నది. తత్పుస్తక పట్టికలో నీశ్లోకము లుద్ధరింపఁబడినవి.

శ్లో. శ్రీమన్నారాయణం నత్వా కావ్యే శ్రీహర్షనిర్మితే
ప్రకాశనం యథాప్రజ్ఞం శ్రీనాథేన విధీయతే.

....

శృంగారశ్రీనాథము

యే యదర్థమజానన్తో వృథావచనవిస్తరైః
దూషయంతి కవేః కావ్యం ధిక్తా పండితమానినః
యదిత్థం కరదోగత్వా సింధోరుపరి కాయతి
తత్కిం నవేత్తి గాంభీర్యం రత్నానిచ తదాశయే.

"గద్యమ్:- ఇతి శ్రీమహోపాధ్యాయ శ్రీనాథాచార్య విరచితే నైషధప్రకాశే" - ఇది మన శ్రీనాథునివిభముగా దోచదు. ఈతడేతడో శ్రీనాథాచార్యుడు మహోపాధ్యాయుడు. గ్రంథము సమగ్రముగా నుపలబ్ధమయినచో మన శృంగారనైషధమును దానిని సరిచూడదగును. అట్లు చూడక, మన శ్రీనాథునిది యగును కాదని స్పష్టముగా నిర్ణయింపఁ గుదురదు. మన శ్రీనాథుడే యగునేని సర్వజ్ఞ సింగభూపతి సంస్థానమునన్నున్న మల్లినాథుఁడు మహోపాధ్యాయుఁడు చేసిన వ్యాఖ్యానమునకుఁ బ్రతిగా సర్వజ్ఞ చక్రవర్తి కోమటి వేమభూపాలునాస్థానమునన్నున్న శ్రీనాథుఁడు మహోపాధ్యాయుఁడు సంస్కృత వ్యాఖ్యనేగాక యాంధ్రరచనమునుగూడఁ జేసె ననవలెను.

గద్యవిధము

శృంగారనైషధగద్యమున "సకలవిద్యాసనాథ శ్రీనాథప్రణీత" మని శ్రీనాథుఁడు చెప్పుకొన్నాఁడు. సకలవిద్యాసనాథ పదము, తర్వాతి గ్రంథములగు హరవిలాసాదులందుఁ గానరాదు. "సుకవిజనవిధేయ శ్రీనాథనామధేయే" త్యాదివిభములఁ దర్వాతిగ్రంథములందు మార్పు గలదు. నిండుజవ్వనమువాఁడై పెదకోమటివేమభూపాలునాస్థానమున విద్యాధికార్యున్నతోద్యోగము నిర్వర్తించుచున్న శ్రీనాథుఁ డిప్పు డిట్లు "సకల విద్యాసనాథ శ్రీనాథ" యని చేర్చుకొనుటయుఁ గాలముకడ చినపయి "సుకవిజనవిధేయ శ్రీనాథనామధేయ" యనిమార్చుకొను టయు సంగతముగానే యుండునుగదా!

అపపఠిత.

గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు పిల్లలమఱ్ఱి పినవీరభద్రునిచరిత్ర సందర్భమున నీ క్రిందివ్రాత వ్రాసినారు

"శ్రీనాథుడంతఁ దన యాంధ్రినైషధముంజూపి 'మీరు దీనిని బాగనిన జగద్వ్యాపకం బవున బ్లొనర్చెదఁ జూడుఁ' డనుడు నాతఁడు 'శ్రీహర్ష నైషధములోనిదగు 'గమి కర్మ్మకృత నైకనీవృతా' అను దానినెట్లు తెలిఁగించి' తని యడిగెను. అంత 'గమికర్మ్మకృత నైకనీవృతుఁడనై' అని తెనిఁగించితినని శ్రీనాథుఁడనియె. అపుడు వీరన శ్రీనాథుంజూచినవ్వి "యోయీ! నీవిందు 'నై' తెనిఁగించితివి కాఁబోలు" అనుడు వీరనపల్కులకేమియు నుత్తరమీఁజాలక శ్రీనాథుఁడు తా నాగర్భితముగు దెనింగించుతఱిం జేసిన పరిశ్రమ విశేషంబులు దెలుపందొడంగెను. అంత వీరన చిఱునవ్వునవ్వి 'యిని మాబోంట్లకుఁ గాకున్ననేమి సామాన్యులకుఁ బఠనార్హంబగుఁ గావున దీనిని జగద్వ్యాపకంబు నేయు' మనుడు, శ్రీనాథుండు గర్వంబేది నిజావాసంబునకుం జనియె. వీరన యెట్లన్నను శ్రీనాథకృత నైషధము తెనుఁగు గ్రంథంబులలో మిగుల శ్లాఘనీయంబు, సంస్కృతంబునకు సరియైన తెనుఁగని దీనిని బండితులందఱు నొప్పికొని యున్నారు."–

శ్రీ శ్రీరామమూర్తి పంతులుగారు వ్రాయఁగూడని వ్రాత వ్రాసినారు ఆ యపప్రథ యడఁగార్పఁదగినది. పినవీరన్న శ్రీనాథునిపై గౌరవప్రపత్తులు చూపుకొన్నవాఁడు. "శ్రీనాథభట్టు భాషాని గుంభంబులు, సౌరభంబులు వెదసల్ల నేర్చు" అని శృంగారశాకుంతల మున వీరభద్రుఁడు శ్రీనాథునిఁగొనియాడినాఁడు. శృంగారనైషధమును వీరభద్రుఁడు పలుమారులు పారాయణము చేసిచేసియే ప్రబంధకర్త

కాఁగల్గినాఁడు. శృంగారనైషధముమీఁది ప్రేమనే సూచించుచున్నది శృంగారశాకుంతలమని యాతని కబ్బముపేరు. శ్రీనాథుని చరణముల నాతఁడు, పెక్కుతడవులందుకొన్నాఁడు. శ్రీనాథుని వార్ధకకాలమునకుఁ బినవీరభద్రుఁడు బాలుఁడై యుండుట యుపపన్న మగును. శ్రీనాథు నాతఁడు దర్శించి యుండవచ్చును. ఆతనికి శిష్యత కూడ నెఱపి యుండవచ్చును. లోక ప్రతీతి యట్లేకలదు. శ్రీనాథుని కృతులను పినవీరభద్రుని శృంగారశాకుంతలమును జక్కఁగాఁ బరిశీలించువా రిది విశ్వసింతురు. పిన్నవీరభద్రుఁ డీతఁడు పెద్దవీరభద్రునొక్కని మనకెఱిఁగించుచున్నాఁడు. ఆతఁడును గవియఁటఁ! ఏమో యాతనికృతులు!

పెద్దిరాజు మన శ్రీనాథునిమెప్పు గొన్నవాఁడు. హరవిలాస కృతినాథుఁడగు నవచితిప్పయ, యాపెద్దిరాజునకు శిష్యుఁడైనట్లు హర విలాసమున శ్రీనాథుఁడు వర్ణించినాఁడు:—

ఉ. పిన్నటనాఁడు సత్కరుణఁ బిల్లలమఱ్ఱిమహాప్రధాని పె
ద్దన్న గురూత్తముండు తగ నక్షరశిక్షయు, దైవమార్గసం
పన్నతయున్ వివేకపరిపాటియునుం గృపసేసె నర్థి నే
యన్నకు నట్టి పెద్దిత్రిపురాంతకునిం దగుఁ బ్రస్తుతింపఁగన్.

పినవీరభద్రుఁడు, నీపెద్దిరాజును నెట్టి సంబంధము గలవారో యెఱుఁగరాదు. అన్నదమ్ములని ప్రతీతి. ఉపలభ్యమానములగు పిన వీరభద్రుని రెండుగ్రంథములందును నాతని వంశవర్ణనము గానరాదు. తత్పూర్వగ్రంథము "లవతారదర్పణము, నారదీయము, మాఘ మాహాత్మ్యము, మానసోల్లాససాంము," ననునవి చేకుఱుటలేదు. అన్నయో పిన్నతండ్రియో కావచ్చును.

గృహరాజసౌధము

కోమటి వెంకారెడ్డి యాస్థానమున నున్నకాలమున శ్రీనాథుఁడు విద్యానగరమునకరిగి ద్వితీయ హరిహరరాయల దర్శించినట్లొక కట్టు కథ కొండవీటి దండకవితెకోఁ గలదు. కోమటి వెంకారెడ్డియనువాఁ డాకాలమున నుండెననుట కాధారములేదు. శ్రీనాథుఁడు హరిహర రాయల దర్శనముచేసినప్పుడు మీనివాసదేశ మెయ్యదియని యాతఁ డడిగెనఁట! అంత శ్రీనాథుఁడుఁ-

సీ. పరరాజ్య పరదుర్గ పరవైభవశ్రీలఁ
గొనకొని విడనాడు కొండవీడు
పరిపంథిరాజన్య బలముల బంధించు
గుణుతైన యనుభూతి కొండవీడు
మగుడురాజులకును మోహంబు పుట్టించు
కొమరుమించినవీడు కొండవీడు
చటుల విక్రమకళాసాహసం బొనరించు
కుటిలారులకుజోడు కొండవీడు

గీ. జవనహోటకసామంత నరనవీర
భటనటా నేకహాటక ప్రకటగంధ
సింధురార్భటీమోహన శ్రీలఁదనరు
కూర్మ నరసమవలికిజోడు కొండవీడు.

అని కొండవీటిని వర్ణించిచెప్పెనఁట! సమ్మానమునకై వేచి శ్రీనాథుఁ డక్కడ నుండెనఁట! హరిహరరాయ లొకనా డొడ్డోలగ ముండి, యొంటిస్తంభముతో నున్నతోన్నతమగు మేడ నిర్మింపఁ దలంపుగలదనియు, నామేడ యనన్యరాజ కిల్బ్యముగా నుండవలయు

నియు, సభ్యుల కెఱిఁగించెనఁట! శ్రీనాథుఁ డదివిని తనయేలికయగు రెడ్డిరాజునకుఁ బెంపుపెలయింప "దేవా! మాభూపాలుని రాజధానియగు కొండవీటమింటికంటున బ్లొంటికంబపుమేడ నిర్మింపఁబడియె ననియె నఁటఁ! రాయ లదివిని యబ్బురపడి యరసివచ్చుటకు భృత్యుల నంపెనఁట! తనయాడిన యన్యాయము బయల్పడిన నవమానము వాటిల్లు నని శ్రీనాథుఁడు తనయిష్టదేవత నారాధించి యేడుతార్కిళ్ళ పొడుగును నేడుమోక్కులు చుట్టివచ్చు నలపును గల నవులూరులోని తుమ్మ చెట్టును స్తంభముగా నిలవరించి కొండవీట గృహరాజు మేడ నప్పటి కప్పుడే నిర్మింపఁజేసెనఁట! ఈవార్త తెలిసికొని రాయలు శ్రీనాథున కమితసమ్మాన మొదవించెనఁట! అభూతాత్యద్భుతకల్పనమయమగు నీకట్టుకథ యెంత వఱకు విశ్వాస్యమో ప్రాజ్ఞులు పర్యాలోచింతురు గాక!

ఇందుఁ బెద్దకోమటి వేమభూపాలుని యేలుబడికాలమునఁ గొండ వీట గృహరాజసౌధము నిర్మింపఁబడుట మాత్రము వాస్తవాంశము. ఇట్టిసౌధ మాకాలమున నంధ్రదేశమం దెక్కడను లేదఁట! "మించి కట్టిరి గృహరాజుమేడ కొండవీట" అని చాటుపద్యము. ఇంత ప్రసిద్ధ మైనహర్మ్య మాకాలమున నిర్మితమైనప్పుడు శ్రీనాథమహాకవి యెందేని పేర్కొనకపోవునా యను సందియముకల్గి పరిశీలింపఁగా నాతని శాసనకృతియం దీహర్మ్యపుంబ్రస్తావము కన్పట్టెను:-

శ్లో. ఆక్రాంతం గృహరాజసౌధనివసల్లక్ష్మీకరాభ్యంతర
క్రీడాంభోరుహతాళవృంత పవనప్రస్తార విస్తారితః।
వాయుః కేవరవాసనాసురభితో యస్యార్థిచింతామణే
ర్ధార్ఢ్యాచామతి దానకేళిజనితం స్వేదాంభసాం జాలకమ్.

—చెఱువు శాసనము

ఆగృహరాజసౌధము నిర్మింపఁబడినతర్వాత దాపుదాపుగా నిర్వది ముప్పది సంవత్సరములకే పరరాజులపాలై మాఱుపఱుపఁబడిన దయియు నప్పటి కేనూఱువత్సరములు కడచినని యీకాలమునఁగూడఁ గొండవీటఁ దన సన్నివేశము నెఱిఁగించుచుఁ జరిత్రాన్వేషులకు వ్యస నము గలిగించుచున్నది. ఇప్పటికిఁ దొంటిప్రాముఖ్యముఁ గోల్పోయి పురసామాన్యస్థితి నున్నను గొండవీడు ప్రాచీనౌన్నత్యమును దోఁపిం చుచుఁ బలు తెఱంగులఁ జూపఱచిత్త మాఁకగొల్పుచున్నది. కొండ వీటి కైఫియతునుండి గృహరాజుమేడకు సంబంధించిన భాగము నించుక యుదాహరించుచున్నాఁడను:

"ఈ గుండాలకు దక్షిణం పూర్వం రెడ్లవారు ఏర్పఱించిన బహు పరిబలమయినకోనేరు వున్నది. ఈపరిదేశమందు రెడ్లవారియొక్క రాజ గృహములు అని చెప్పినారు. ఈకోనేటికి పశ్చిమం హద్దు ఆనుకుని గృహరాజుమేడదిబ్బ అసివున్నది. రెడ్లవారు ప్రభుత్వంచేసే కాలమందు కోమటివేమారెడ్డిగారు శ్రీనాథునివారియొక్క పరిభావంచేతను నవు లూరి పోతురాజుదేవాలయం దగ్గిరవున్న యేఁకుతాళ్ళపాడుగున్నూ, యేడుమోకులుతిరిగే లావున్నూగల తుమ్మచెట్టు తెప్పించి స్తంభంగా చెక్కించి వంటిస్తంభం మేడకట్టించి తమకు యిష్టమైన ఆదిలక్ష్మీ కామేశ్వరిఅమ్మవారికి సింహాసనస్థానముగా నేర్పరిచి వైభవములు జరిగించి యీమేడశిఖరానకు బొల్లిమోరు వేంకటేశ్వరస్వామి దేవాల యానకు మకరతోరణం కట్టించినారట! ఇక్కడ వేంకటేశ్వరస్వామి వారు వున్న కొండ సహజా తూర్పుగా వుంటుంది. ఈమేడకు ఆను కునే జడ్డిగాలభావి అనే కోనేరు వున్నది."

ఈ కైఫియతునందు గృహరాజసౌధము ఆదిలక్ష్మీ కామేశ్వరికి నాస్థానముగా నుండినట్లు వ్రాయబడినది. ఇది యథార్థమగును. వెనుక

నుదాహరింపఁబడిన శ్రీనాథుని శాసనశ్లోకమునఁగూడ నాసౌధము "లక్ష్మీ" నివాసముగానే వర్ణింపఁ బడెను. పెదకోమటివేమారెడ్డిభార్య యగు సూరమాంబ తనపేర సూరమాంబాపుర మను నొకపేటను గొండవీటిలోఁ గట్టించెనఁట. కొండవీటినిగూర్చి మంచి పరిశోధనము జరుగ వలసియున్నది.

కొండవీటి గాడిద.

శ్రీనాథునికాలమునఁ గొండవీటిలోఁ గవు లనేకులు సమర్థులు నసమర్థులు నుండెడివారు. ఎక్కడఁజూచినను గవితా రచనములే యెసఁగుచుండెడివి. అసమర్థుల కవితాయాసమును శ్రీనాథుఁ డిట్లవ హేళనము చేసినాఁడు—

ఉ. బూదిదబుంగవై యొడలు పోఁదిమిదక్కి మొగంబువెల్లనై
వాదలవాదలందిరిగి వారును పీరును జొచ్చిచోయనఁ
గోడలగొందులం దొదిగి కూయుచుఁండెడు కొండవీటిలో
గాడిద నీవునుం గవివికావుగదా యనుమానమయ్యెడిఁ.

శాసనకృతులు

వీరనారాయణుని యాస్థానమున విద్యాధికారిగా నుండి శ్రీనాథుఁ డనేక శాసనకృతులు రచించెనని యీవఱకే వ్రాసితిని. పెద కోమటివేమారెడ్డి యెన్ని మహాదానములు చేసెనో, శ్రీనాథుఁ డెన్ని శాసనకృతులు రచించెనో, కాని యిప్పటికి నా కుపలబ్ధమయిన వీడ్రిం దివి. వీనిలోఁ గొన్ని ముద్రితములు, కొన్ని యముద్రితములు. కొన్నింటి కిప్పుడు పఠితులే గాని మూలములు దొరకలేదు. కొన్ని యీవఱ కెవ్వరును చదవి యెఱుఁగనివికూడను. కాలక్రమమునుబట్టి

వానిని వరుసగా నిక్కడ వివరించెదను. శా.1326, క్రీ. 1404, నుండి శా. 1341, క్రీ. 1419 వఱకు నాశాసనము లున్నవి. శాసనకర్తగా శ్రీనాథుఁడే యున్నాఁడు. కొన్ని సంస్కృత శ్లోకరూపమునను గొన్ని యంధ్రపద్యరూపమునను గొన్ని యుభయరూపమునను నున్నవి. ప్రాచీన రెడ్డిరాజశాసనములందలి శ్లోకములు గూడఁ గొన్ని వీని యందుఁ జేర్చుకోఁబడినవి. ఇట్టిసంప్రదాయ మితరశాసనకృతులందును గానవచ్చుచున్నది.

కుఱునూఁతుల శిలాశాసనము: శక. 1326 క్రీ. 1404

ఉపలబ్ధములయిన పెద్దకోమటి వేమారెడ్డి శాస నములలో నెల్ల నిదియే తొల్లటిది రెండేశ్లోకము లిందున్నవి. అందు 'చూడామణి ర్నృపాణా" మిత్యాదిశ్లోకము మొదటిది. రెండవదిది:-

శ్లో. మహారాజ స్యోయం గసకరహతాశేందుగణితే
శకాబ్దే శాకణ్యాం శశభృదుపరాగే ప్రకటితే
పరం ప్రీతః ప్రాదా దెఱ (విర) పురీనాశరథయే
వరం గ్రామం కుఱ్ఱూంతులురితి సమాఖ్యా ముపగతమ్.

సంవత్సరము పేరు చెప్పలేదుగానియద్భుతారణసంవత్సరమగును. ఆసంవత్సరము శ్రావణపూర్ణిమనాఁడు చంద్రోపరాగపుణ్యకాలమునఁ గుఱునూఁతులగ్రామమును ఎఱ (విర)పురీదాశరథికి (దేవుఁడు కావచ్చును) ఒసఁగెను కుఱునూఁతుల గుంటూరుతాలూకాలో నున్నది. గ్రామము నెల్లలు మొదలగునవి కానరావు. శాసనకృతికర్తపేరు లేదు. శ్రీనాథుఁ డిప్పటికి విద్యాధికార్యుద్యోగమును బడసియుండకపో వచ్చును.

శృంగారశ్రీనాథము

పొన్నుపల్లి తామ్రశాసనము. శక. 1326 క్రీ 1404.

శాసనకాలము:- శ. 1326 అగు తారణసంవత్సర పౌషామావాస్య, సూర్యోపరాగపుణ్యకాలము.

దాత.- పెదకోమటి వేమారెడ్డి.

పరిగృహీత:- కప్పమెముక గ్రుచ్చుకొనుటచే వ్యథపడుచున్న పామును బ్రదికించి "పరహిత" బిరుదమును బడసిన పండితులవంశమున జనించిన పరహితునికుమారుడు: యజుశ్శాఖాధ్యాయి; అపస్తంబసూత్రుడు: భారద్వాజగోత్రుడు; పుణ్యాత్ముడు; భూలోకధన్వంతరి; పండితశ్రేష్ఠుడు నగు భాస్కరార్యుడు

దత్తగ్రహారము:- కొండవీటిసీమను వెలనాటిదేశమున గృష్ణవేణ్ణానదీదక్షిణతీరమునగల పొన్నుపల్లిగ్రామము. వెలనాడనగాదుంగభద్రానదికి దూర్పుగా సముద్రముదాక నున్నదేశము. "తుంగభద్రాతరంగిణ్యాః ప్రాగ్దేశం వెలనాం డితి"- పులివర్త్తుశాసనము. ఈ తుంగభద్ర కర్నూలుమండలమందలిది కాదు. గుంటూరుమండలమందున్నది. ఇప్పుడది కొంత ముఱుగుకాలువగా మార్పబడినది పేరు మాసియున్నది.

ప్రదానము:- కృష్ణవేణ్ణానదియెడ్డున సోమేశ్వరస్వామిసన్నిధిని అగ్రిహారములనుండి యరుగుదెంచిన బ్రాహ్మణులయెదుర బుత్త్రిపౌత్త్రిపారంపర్యముగా ననుభవింప ననుజ్ఞయిడి చేయబడినది. కృష్ణోభయతటములయందును సోమేశ్వరాలయములు రెండుకలవు. ఉభయసోమేశ్వరములని వాని నామములు. పాపవినాశము, కోటిపల్లియని

యా గ్రామముల పేళ్లు. పొన్నుపల్లివై పున గృష్ణయొడ్డున నున్నసోమే శ్వరాలయము కోటిపల్లిది.

శాసనకృతి:— సంస్కృతభాషలో శ్లోకరూపముననున్నది. గ్రామసీమాచిహ్నములు తెలుఁగునవే కలవు.

కృతికర్త:— వీరశ్రీ వేమభూపతికి విద్యాధికారియు. విద్యల కాకరము నగు శ్రీనాథుఁడు.

ఈ దానశాసనమునకుఁ దర్వాత మఱి నాల్గేండ్లకుఁ బెదకోమటి వేమభూపాలునిదే వేఱొక పొన్నుపల్లిశాసనము కానవచ్చుచున్నది. దీనికి సీమాచిహ్నములు కొన్ని కలసియుఁ గొన్ని కలయకయు నున్నవి. ప్రతిగ్రహీతలు సంబంధులే యగునట్టున్నారు. ఇవ్వఁదు రెండు పొన్నుపల్లెలు తెలియరావు. రెండుశాసనములందును దత్తగ్రహా రమగు పొన్నుపల్లి యొక్కఁ జేయగునేని నాల్గేండ్లలో నిర్వ్యరకు భిన్న ముగా దానముచేయ నేల ప్రసక్తించెనో యెఱుఁగరాదు. ఈ రెంటును తామ్రశాసనములే. రాగిరేకు లిప్పుడు దొరకలేదు. ప్రాచ్యలిఖితపుస్తక శాలలో మెకంజీదొరగారినాళ్లలో వ్రాయింపఁబడిన ప్రతులున్నవి. నే నాపొన్నుపల్లి గ్రామమున కరిగి యాశాసనములనుగూర్చి విచారించితిని. అక్కడివారి దగ్గఱఁగూడఁ బ్రతులేకాని మూలములులేవు. పొన్నుపల్లె యిప్పుడు రేపల్లె తాలూకాలో నున్నది. పయిఁజెప్పఁబడిన రెండుపొన్ను పల్లెల శాసనములలో నిప్పు డుపవర్ణితమయిన శాసనకాలము శా॥ 1326. రెండవదానికాలము శా. 1330. శా. 1328 శాసనమును శా. 1410లో (అదియాతని 28వ రాజ్యసంవత్సరము) నొడ్డెరాజగు పురు షోత్తమగజపతి పరహితపండితులకు దత్తముగా నంగీకరించినాఁడు.

కావున గ్రామము మొదటి శాసనముపరికారమే చెల్లుబడికి వచ్చెనని తెలియవచ్చుచున్నది. శా. 1330 శాసనము సీమాచిహ్నములు భిన్నముగా నుండుటజేతను నందుఁ బొన్నుపల్లి వేమవరమని నామాంతరముంచిపట్లుండుటచేతను నాపొన్నుపల్లె మొదటి పొన్నుపల్లెకు జేరిన వేఱొక గ్రామవాటికయగునేమో యను సంశయమునకును నవకాశముగలదు. పయిశాసనమునఁ బ్రతిగ్రహీత పరహితవంశ్యుఁడుగదా! ఇంతకుఁ బూర్వము వెలసిన ముప్పభూపతి యక్కలపూఁడి శాసనమునఁగూడఁ బ్రతిగ్రహీత పరహితవంశ్యుఁడే. అనితల్లి కలువచేరుశాసనమునఁగూడ నీశాసనమందున్నట్లే పరహితవంశప్రశంస గలదు. అక్కడఁగూడఁ బరహితవంశ్యుఁడే ప్రతిగ్రహీత. పరహిత సంహితయని యొకయాయుర్వేదగ్రంథము గలదు. తత్కర్త యేత ద్వంశ్యుఁడు కావచ్చును. ఆ కాలమున నంధ్రదేశమున నాయుర్వేదము బహుప్రచారము కలదిగా నుండెననుట కిట్టివి యింకను గొన్నిశాసనములున్నవి. శా. 1330 పొన్నుపల్లిశాసనమునఁ బ్రతిగ్రహీతకూడ నాయుర్వేద విద్వాంసుఁడే. పయిశాసనమునఁ 'కృష్ణవేణ్ణామహానద్యా' యని కలదు. శ్రీనాథుని యితరశాసనములందును "కృష్ణావేణ్ణాజలక్రీడా వినోదుండు" మొదలగువిధముల గృష్ణవేణ్ణ యనుపదము ప్రయోగింపఁబడినది. కొందఱు కృష్ణవేణీనది యగునుగాని కృష్ణవేణ్ణానది కాదనియుఁ బయిశబ్దము తప్పనియు వాదింతురు. అదిసరికాదు. కృష్ణయు వేణ్ణయు నను రెండునదులు కలయుటచే నాపే రేర్పడినది. ఆ రెండు నదులును సహ్యాద్రికడ సంగమించినవట.

"శ్లో॥ సహ్యాద్రేరుత్తరం శృంగం తత్ర బ్రహ్మగిరిస్మృతః

* * * *

తృతీయప్రకరణము

తస్మాద్దక్షిణతో విప్రా రమ్యోవేదగిరి స్స్మృతః
తయో ర్మధ్యే మహా తీర్థం రమ్యా మామలకం స్మృతమ్
యాత్రామలకపృష్ఠస్థ పుణ్యైరేవ ప్రదృశ్యతే
తస్య మూలా త్సముద్భూతా వేణ్ణా నామమహానదీ
తస్మిన్ ప్రదేశే చాశ్వత్థమూలా త్కృష్ణా సముద్గతా."

—కృష్ణామాహాత్మ్యము

తుంగభద్రయను పదముకూడ నిట్టిదే. తుంగయు, భద్రయుఁ గలయుటచేఁ దుంగభద్ర యయ్యెను. తెనుఁగున జక్కన విక్రమార్క చరిత్రలో యతిలో "నాగమణిహార కృష్ణవేణ్ణావిహార!" యని ప్రయోగ మున్నది కృష్ణవేణీనది యనికూడ సర్వాచీనప్రయోగములు లేకపోలేదు.

కసుకుఱ్ఱు తామ్రశాసనము. శక. 1326.

ఈ శాసనముమూలము ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో మెకంజీ దొరగారికాలమున వ్రాయింపఁబడిన ప్రతి కలదు. కాని యందు దాతృ వంశవర్ణనాధికమయినతర్వాత గొంతభాగము చాళుక్యశాసనప్రసక్త విషయము వ్రాయఁబడియున్నది. అటుతర్వాత శాసనకాలము దత్త గ్రహారము సీమాచిహ్నాలు గల్గుభాగము సరిగానున్నది. ప్రతిగ్రహీతృ విషయముగల తేకొకటి మూలమునే లోపించి తత్స్థానమున నొక చాళుక్యరాజశాసనముతేకు చేర్చబడియుండుటచే మెకంజీదొరగారి వ్రాతప్రతిలోఁబై విధమున నుండుట తటస్థించెనేమో యనుకొనియెదను. ఈశాసన మిదివఱకుఁ జరిత్రకారులు చర్చించినదికాదు. ఇదివఱకు వివరింపఁబడిన పొన్నపల్లిశాసనమును గల్వచాములశాసనమును నీ శాసనమును నొకకాలమున నెలకొల్పఁబడినవే. శక. 1326 తారణసంవత్సర పౌషామావాస్యాప్రయుక్త సూర్యోపరాగపుణ్యకాలమునసే యీ కసువు

కుఱ్ఱుకూడ సగ్రహారముగా బెదకోమటి వేమభూపాలునిచే నీయఁబడినది. కసుపుకుఱ్ఱు బాపట్లతాలూకాలో పొన్నూరికిఁ జేరువనున్నది. ఈ శాసనముకూడ సంస్కృతశ్లోకరూపమున నున్నది. సీమాచిహ్నములు మాత్రము తెల్గు. శాసనకర్తికర్త విద్యాధికారి శ్రీనాథుఁడే. దీనిఁగూర్చి యింతకంటె నిక్కడ వ్రాయఁదగినది లేదు.

కల్వపాముల తామ్రశాసనము. శక. 1326.

ఈ శాసనము క్రొత్తగా శాసనపరిశోధకుల ప్రయత్నమున బయల్పడినది. ఇదివఱకు ముద్రితము. పొన్నుపల్లి కసుపుకుఱ్ఱు తామ్రశాసనములును నీకల్వపాముల తామ్రశాసనమును నొక్కకాలమున నెలకొల్పఁబడినవే. శక. 1326 అగు తారణ సంవత్సరపౌషామావాస్యా సూర్యోపరాగకాలమునఁ బెదకోమటి వేమభూపాలుఁడు ఖండవాటస్థలమునఁ గల కల్వపాముల గ్రామమును హారీతగోత్రుఁడును యజుర్వేదవేదియుసగు పెద్దియజ్వకు దానముచేసి యీశాసనము వెలయించినాఁడు. ప్రతిగ్రహీతయగు పెద్దియజ్వ శక. 1296 సంవత్సరమున ననవేమ నృపాలునిచే బచ్చనితాండపఱ్ఱుగ్రామము సగ్రహారముగా బడసినవాఁడు. ఈవంశమువారు గొప్పవిద్వాంసులు. కృష్ణాతీరమున ననేకయజ్ఞములు చేసిన మహావిద్వాంసుఁడు భీమేశ్వరయజ్వ యీతని ప్రపితామహుఁడు. షట్తర్కకర్కశాలాప ప్రక్రియాపరమేశ్వరుఁడు, మహావిద్వాంసుఁడు పోతయ యీతని పితామహుఁడు. పౌండరీకయాగముచేసి బ్రహ్మసంతతికి నలంకారమయినవాఁడు గుండయ యీతనితండ్రి. ఈతఁడు బ్రహ్మసూర్యాదిసిద్ధాంతములను దఱచిచూచిన త్రికాలవేత్త, దైవజ్ఞుఁడు, గోదావరీతటమున ననేక యజ్ఞములు చేసినవాఁడు. ఈతఁడే శక. 1333 ఖరసంవత్సరమున మరలఁ బెదకోమటి

వేమభూపాలునిచే నింకొక యగ్రహారమును నందమూరును బడసి నాఁడు. ఈ శాసనకృతి విద్యాధికారి శ్రీనాథుఁడు రచించినదే. దత్తాగ్ర హారమగు కల్వపాముల యిప్పుడు కల్వపాముల యనుపేరఁబరగు చున్నగ్రామమే కాఁబోలును. అది గుడివాడసీమ నున్నది. ఖండవాట యనునది కొండవీటికిఁ బ్రాచీసనామ మగునేమో పరిశోధింపవలసి యున్నది.

పినపాడు తామ్రశాసనము శక. 1327.

ఇదికూడ శాసనపరిశోధకుల ప్రయత్నమున బయల్పడినదే కాని యొక్కటేకు మాత్రమే దొరికినది. అం దీశ్లోక మున్నది:—

"శ్లో. దాతా కోమటివేమనామకృతిః పాత్రం గురు శ్శంకరః
స్థానంచే త్పినపాడు రత్ర తు కవి శ్రీనాథభట్టారకః :
కాలశ్చే చ్ఛివరాత్రిపుణ్యసమయ స్సాక్షీ మహా శ్రీగిరి
శ్శ్రేయః కిం నతు వర్ణ్యతే నుకవిభి ర్భుజ్యంతు తచ్ఛాసనమ్."

ఇందుఁ బ్రతిగ్రహీతయగు శంకరగురునివంశమువారిప్పుడు పిన పాడునఁ దున్నారు. వా రుద్భటారాధ్యసంతతి వారఁట! కొన్ని పురు షాంతరముల నుండి వారు లింగధారణము వర్జించినారు. దొరకిన యీశాసనపుటేకు పయిఁగల గ్రంథభాగమున శాసనకాలము లేదు కాని పినపాటిలోఁ బ్రతిగ్రహీతృపరంపరలోనివారగు మృత్యుంజయా రాధ్యులయింట నొక ప్రాచీన తాళపత్రగ్రంథమున నీదానప్రస్తా వము వ్రాయఁబడియున్నది. అందీశ్లోకము గలదు.

"శ్లో. శా కాబ్దే గిరినేత్రమూర్తివిధుకే సంవత్సరే పార్థివే
మాఘేఽస్మిఁ శివరాత్రి పుణ్యదినసే శ్రీవీరనారాయణః;

తస్మై శంకరదేశికాయ విదుషే భద్రానదీప్రాక్తటే
గ్రామం శ్రీపినపాడు మత్తమ ముదా దాచంద్రమాతారకమ్."

తప్పక యీశ్లోకము మీఁదిశాసనములోనిదే యగును. శా.శ. 1327 అగు పార్థివసంవత్సర మాఘమహాశివరాత్రి పుణ్యకాలమునఁ బెదకోమటివేమభూపాలుఁడు పినపాడు గ్రామమును శంకరదేశికునకు దానముచేసెనని మీఁదిశ్లోకమున కర్థము. ఈదానము శ్రీశైలమునఁ జేయఁబడినది. శివరాత్రికి వీరందఱు శ్రీశైలమున కరిగిరి. అక్కడ దానము జరిగినది. శృంగారనైషధకృతిపతి "శ్రీగురు శంకరమౌనిదయాగౌరవనిత్యవర్ధితాన్వయ" యని వర్ణింపఁబడినాఁడు. ఆశంకరమౌని యీ శంకరదేశికుఁ డగునేమో? ఎట్లాగైనఁగడగుఁ దొకశంకరస్వామి యున్నాఁడు.

పొన్నుపల్లి తామ్రశాసనము.

ఇది శా. శ. 1330 సర్వధారిసంవత్సరముననాశ్వయుజామావాస్యా సూర్యోపరాగపుణ్యకాలమునఁ బెదకోమటి వేమభూపాలుఁ డగ్రహారదానము చేయుసందర్భమున రచియింపఁబడినది.

ప్రతిగ్రహీత:- కల్యాణగుణశాలియగు వెర్యపిళ్ళకు నప్త; వేదవేదాంగనిధియగు భట్టభాస్కరార్యునిపౌత్త్రుఁడు; అష్టాదశవిద్యా పారంగతుఁడయిన విళ్ళయార్యునకుఁ బుత్రుఁడు; సాష్టాంగమయిన యాయుర్వేదవిద్య నధ్యయనము చేసినవాఁడు; పతంజలిమహాభాష్య ప్రక్రియయం దాటితేటిసవాఁడు; పూర్వోత్తరమీమాంసలు చక్కఁగా నేర్చినవాఁడు; కణాదగౌతమతర్కముల నభ్యసించినవాఁడు; యజుర్వేద వేది; ఆపస్తంబ సూత్రుఁడు; శివభక్తుఁడు నగుసింగనార్యుఁడు. వీరు

దార్విడులుగాఁ దోచుచున్నారు. ఇప్పుడు పొన్నుపల్లెలో దార్విడులున్నారు.

దత్తగ్రహారము:- త్రిలింగదేశమున వెల్నాటిదివిసీమను (?) కృష్ణవేణ్ణానదికిఁ జేరువనున్న పొన్నుపల్లి. దీనికే పొన్నుపల్లి వేమవరమని నామాంతరము గాఁబోలును. శాసనము శ్లోకరూపము. గ్రామసీమా చిహ్నాలు తెలుఁగుననే కలవు. అందు "శ్రీనాథభట్టరు శాసనాచార్యదక్షిణభాగం వకటి" అనుట పరిశీలింపఁదగియున్నది. ఈశాసనము మూలమిప్పుడు లభింపకున్నది. దీనిఁగూర్చి శక 1326 పొన్నుపల్లిశాసనమునఁ గొంతవ్రాసియున్నాఁడను. చరిత్రకారు లిదివఱకు దీని నెఱుఁగుదురు.

పొట్లపాటి తామ్రశాసనము.

క్రీ.శ. 1380 సర్వధారి సంవత్సరమందే యాశ్వయుజామావాస్యా సూర్యోపరాగపుణ్యకాలమందే పెద్దకోమటి వేమారెడ్డి పొట్లపాడనుగ్రామమును బిశిపాటి రామభద్ర సోమయాజులకు సగ్రహారికరించి దానముచేసినప్పుడు నెలకొల్పెనఁట. ఆశాసన మిప్పుడు దొరకలేదు. దానిసిగూర్చిప్రాచ్యలిఖితపు స్తకశాలలో నీ క్రిందిలేఖనమున్నది.

కోకల్లికార్డు వాల్యూం నెం 3 రు. పేజీ 559.

పొట్లపాటి అగ్రహారం సంతు నాదెండ్ల సర్కారు మృత్తుజాం సగరు తాలూకే సత్తినేపల్లి.

'శ్రీమద్యజనయాజన అధ్యయన అధ్యాపక దానప్రతిగ్రహ షట్కర్మనిరతులైన ఆపస్తంబసూత్రులున్నుయజుశ్శాఖాధ్యాయులున్ను

ఆయిన భారద్వాజగోత్రోద్భవులున్ను ఆయిన పిశిపాటి రామభద్ర సోమయాజులుగారు బహుతపస్సంపన్నులున్ను బ్రహ్మవిద్వాంసులున్ను అయివుండురు గనుక వీరిని పూజించి వీరికి ఆచంద్రార్క్కస్థాయిగాను యీపొట్లపాడు అష్టభోగసహితంగాను అగ్రహారంచేసి స్వస్తిశ్రీ శక వరుషంబులు ౧౩౩౦(A. D. 1408) అగు నేటిసర్వధారినామ సంవత్సర ఆశ్వీజ బ౩౦ లు సూర్యగ్రహణకాలమందు కృష్ణవేణ్యానదీతీర మందు శ్రీమతు కోమటివేమయరెడ్డింగారు పిశిపాటి రామభద్రసోమయాజులు గారికి సహిరణోద్యదకదానధారాపూర్వకంగాను ధారాగ్రహీతం చేసిరి గనుక రామభద్రసోమయాజులుంగారు యాస్థలమందు కుటుంబ యుక్తముగా అగ్నిహోత్రములతోగూడా యాగ్రామంలో ప్రవేశించి గృహనిర్మాణములుచేసికొని యాగాదినుష్ఠానాది సత్క్రియలు చేసు కుంటూ నిరతాన్నదానపరులయి వసించిన కోమటి వేమారెడ్డి గారున్ను, వీరితమ్ములయిన రాజనవేమనరెడ్డిగారున్ను శా.౧౩౪౨ (1420) శకంవరకు ప్రభుత్వం చేసినవరకు రామభద్రసోమయాజులు గారు అనుభవించినారు.''

పిరంగిపురపు శిలాశాసనము.

శా. 1331 విరోధి ఫాల్గుణ బహుళ ద్వితీయనాడు పెద్దకోమటి వేమభూపాలుని భార్యయును, ధాన్యవాటీపురాధిపతియగు గన్నభూపా లుని కుమార్తెయునగు సూరమాంబ త్రివ్వించిన సంతానసాగరమను తటాకము ప్రతిష్ఠోత్సవమున రచింపఁబడినది. శ్రీనాథకృతశాసనము లన్నింటికో నిది గొప్పది. ఇందు సంతానసముద్రవర్ణనముగా నున్న సంస్కృతశ్లోకములు మిక్కిలి ప్రౌఢములైయున్నవి. చివర దటాక నిర్మాణమును గీర్తించు సంస్కృత భారత శ్లోకములు మూఁడుదాహ

రింపఁబడినవి. పురాణేతిహాసము లాతనికి సమ్యక్పరిచితములని యెఱుఁగవలయును. కడపట ముచ్చటఁగూర్చు సీసపద్యములుమూఁడు చెప్పినాఁడు. శాసనములయందుఁగూడ సీసపద్యములనే రచించుట యాతని కావద్యములపైఁగల్గు నభిమానమును దెలుపుచున్నది. మఱియు ''నుభయభాషాకవిత్వ ప్రయోగకుశలు'' నని హరవిలాసమునఁ జెప్పి కొన్న సంస్కృత భాషాకవితాకౌశల్యము నిందలి సంస్కృతశ్లోకములు రాద్ధాంతీకరించుచున్నవి. ఈశాసనమును శ్రీజయంతి రామయ్యపంతులు గారు ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలో సవిమర్శముగా వెల్లడించినారు. విశేషము లక్కడ చూడఁదగును.

నందమూరు తామ్రశాసనము: శా. 1333.

ఈ శాసనమును గ్రొత్తగా శాసనపరిశోధకులప్రయత్నమున వెలువడినదే. బాపట్లతాలూకా కోడితాడిపల్లుగ్రామమున దొరకినది. ఇంతవఱ కిది ముద్రితము కాలేదు. ఇది శాక. 1333 అగు ఖరసంవత్సర మార్గశిరశుద్ధత్రయోదశీధనుస్సంక్రమణ పుణ్యకాలమునఁ బెద కోఁటి వేమభూపాలునియగ్రహారప్రదాన సందర్భమున వెలయింపఁబడినది.

ప్రతిగ్రహీత:- శక. 1326 అగుకల్వామూలశాసనమునఁ బ్రతిగ్రహీతగానున్న పెద్దియజ్వయే యిక్కడఁగూడఁ బ్రతిగ్రహీత.

దత్తగ్రహారము:- కండ్రవాడసీమనుగల నందమూరుగ్రామము. గ్రామసీమాచిహ్నములు తెల్పుచు నున్నవి. తక్కినది సంస్కృత శ్లోకరూపము. శాసనకృతికర్త విద్యాధికారి శ్రీనాథుఁడు.

శృంగారశ్రీనాథము

ఆలపాడు తామ్రశాసనము: శా.శ. 1334.

ఇది శా.శ. 1334 అగు నందన సంవత్సర మాఘబహుళమున శివరాత్రిదినమునఁ (సూర్యగ్రహణ సమయమున?) బెద్దకోమటి వేమ భూపాలుఁ డగ్రహారదానము చేయుసందర్భమున నెలకొల్పఁబడినది.

ప్రతిగ్రహీత:– విద్యావిహారభూమియగు మాధవార్యుని ప్రపౌత్రుఁడు; వేదాదివిద్యలకుజన్మమందిరమగు గుండయార్యునిపౌత్రుఁడు; శాపానుగ్రహదక్షుఁడు; లక్షీనరసింహామంత్రసిద్ధుఁడు; సకలకవిసార్వభౌముఁడు;నగు మాధవార్యుని పుత్రుఁడు; భారద్వాజ గోత్రుఁడు; విద్యావినయాన్వితుఁడు; విశ్వేశ్వర విద్వాంసుఁడు. దత్తగ్రహారము:– వెలనాటిలోఁ దుంగభద్రాతీరస్థమగు నాలపాడనుగ్రామము. శాసన కృతికర్త:– విద్యాధికారి శ్రీనాథుఁడే. విశ్వేశ్వరభట్టారకుఁ డీయగ్రహారమును బడసి యప్పుడే విశిష్టబ్రాహ్మణులకుఁ దనవంతుగాక మిగిలినగ్రామము నఱువదిపాళ్ళగాఁ బంచియిచ్చెను. వారిపేళ్ళు,భాగములసంఖ్య కలదు. ఈ శాసన మిదివఱకు ముద్రితముకాదు. దీని మూలము చెన్నపురి మ్యూజియములో నున్నది.

ఈ శాసనమునఁ బ్రతిగ్రహీతగానున్న విశ్వేశ్వరభట్టారకుఁడు చమత్కారచంద్రికాకారుఁ డగునా? ఆతఁడును భారద్వాజగోత్రుఁడే. షష్ఠపరికరణమున నాతనిఁగూర్చి చూడఁదగును.

పుల్లరిబోడు శిలాశాసనము: శా.శ. 1337.

ఈశాసన మమీనాబాదునకు నీశాన్యపుఁబక్కనున్న పుల్లరిబోడు కొండ పడమటివై పునఁగలదు. శా. 1331 విక్రతి వత్సరమునఁ

దనతల్లి సూరాంబచేఁ ద్రవ్వింపఁబడిన సంతానసాగర మను చెఱువు నకు నీటి వసతిఁ గల్పింపఁగాఁ బెదకోమటి వేమభూపాలుని కుమారుఁడగు రాచవేమారెడ్డి 'జగనొబ్బగండ కాలవ" యనుపేరఁ గాలువను ద్రవ్వించెను. ఆ సందర్భమున నీ శాసనము చెక్కఁబడినది. విషయ మంతగొప్పదికాకపోవుటచేతనో, రాచవేమనయెడ ననాదరముచేతనో, లేక యాఁతడప్పటికి రాజుకాకపోవుటచేతనో శ్రీనాథుఁ డీశాసనమును దక్కినశాసనములవలెఁగాక లఘువుగా నొకసీసపద్యముతో ముగించి నాఁడు. శాసనావసానమున 'శ్రీనాథకృతి' యనికలదు.

రుద్రవరము తామ్రశాసనము శా.శ 1341.

ఇది శా. 1341 అగు వికారి సంవత్సర మార్గశిరమున ధను స్సంక్రమణపుణ్యకాలమునఁ బెదకోమటి వేమభూపాలుఁడు రుద్రవర మనుగ్రామమును దానముచేయుసందర్భమున నెలకొల్పఁబడినది.

ప్రతిగ్రహీత:- ఇదివఱకుఁ గల్వవాముల సందమూరు శాస నములందుఁ బ్రతిగ్రహీతగానుండిన పెద్దియజ్వకుమారుఁడును గంగా ధరజ్యోతిషకుని యగ్రజుఁడునునగు రామచంద్ర జ్యోతిషికుఁడు. దత్తాగ్రహారమున ముప్పదిమూఁడుపా ళ్ళితఁడును, మిగిలినభాగ ములు మఱికొందఱును బుచ్చుకొనిరి. శాసనకృతికర్త విద్యాధికారి శ్రీనాథుఁడే. ఈశాసమునుగూడ సంస్కృతశ్లోకరూపమే.

మూలఁగూరమ్మకొండమీఁది శాసనము.

ఈ శాసన మసమగ్రముగా నున్నట్టున్నది. రచింపఁబడిన కాలము నాకుఁ దెలిసినదికాదు. ఫిరంగిపురపు శిలాశాసనమున కించుక

మిందువెనుకలుగా నుండు సనుకొనెదను. అనవేమభూపాలుఁడు మూలఁగూరమ్మకు శా. 1298 నలవత్సర మాఘపూర్ణిమనాఁడు ధార వోసియిచ్చిన పడిదరము, మూలఁగూరు, పలకలూరు అను గ్రామము లకు నటుతర్వాత మొప్పదియేండ్లకు రాజ్యమునకు వచ్చిన మన పెద కోమటి వేమభూపాలుఁడు సర్వకరపరిహారముగా సాష్టైశ్వర్యముగా సాష్టభోగముగా సర్వకాలమును సర్వమాన్యత (సర్వదుంబాలా యినాం) దయచేసి మూలఁగూరమ్మకు గుడియుఁ, గ్రాకారమును నిర్మించినసందర్భమున వెలయింపఁబడినది. రెండుసీసపద్యములు-పద్యముల తర్వాతఁ గొంతవచన మున్నట్టు తెలియుచున్నది. ఈశా సనప్రతిని శ్రీ జయంతి రామయ్యపంతులుగారికడనుండి నేను కయి కొంటిని. శాసనశిలను బరిశోధించి విశేషములు నిర్ణయింపవచ్చు సనుకొనెదను

పెదకోమటివేముని కాశీయాత్ర.

పెదకోమటి వేమారెడ్డి కాశీయాత్ర చేసినాఁడనుటకుఁ గొన్ని యాధారములు కలవు. వేమభూపాలచరితమున సంస్కృత గద్య ప్రబంధమున నాతఁడు దిగ్విజయార్థ మానేతుశీతాచలము యాత్రచేసి నట్లు సవిశేషముగా వర్ణనమున్నది. ఆగ్రంథమునందున్న ప్రధానవిష యమే యది. పెదకోమటి వేమారెడ్డి శాసనములందునుగూడఁ గొన్నింట నిట్టి ప్రశంస కలదు.

"శ్లో శ్రీశైలే స్థిరమూలతా మపగతా వ్యద్ధిం కుమారాచలే
పంచారామతలే ప్రతానసుషమా సింహాచలేఽద్రే తతః,
శ్రీకూర్మే పురుషోత్తమే ఋసుమితా యద్ధర్మకీర్తి ర్లతా
కాశ్యాం విశ్వపతేః పురః ఫలవతీ నిత్యోపహారోచితమ్."

"పెదకోమటివేమారెడ్డికి ర్హిలత శ్రీశైలమున స్థిరమూలమై కుమారాచలమున వృద్ధినొంది పంచారామములందును, సింహాచలమునను బందిరియల్లి, శ్రీకూర్మమునను పురుషోత్తమమునను ఋష్పించి, కాశిలో విశ్వనాథునెదుర నిత్యనైవేద్యమున కుచితముగా ఫలించెను," అని పయిశ్లోకమునకర్థము. అనఁగాఁ బెదకోమటివేమారెడ్డి పయిస్థలములందు దానధర్మములు చేసెనన్నమాట; ఈస్థలములు క్రమముగాఁ గాశీమార్గమున నున్నవి. ఈ స్థలములందు దానధర్మములు చేయుట కాతఁడక్కడకు వెళ్ళియుండవలెను. కాశిలో విశ్వనాథునకు నిత్యనైవేద్యము నిమిత్త మేదో దానము చేసినాఁడఁట. పయిశ్లోకము పెదకోమటివేమారెడ్డిభార్య సూరాంబ వెలయించిన ఫిరంగిపురపుశాసనమువను (శా.శ. 1331) నఁ గలదు. తర్వాతిదగు రుద్రవరశాసనమునను గలదు. కావున నాకాశీయాత్ర శా. 1330కిఁ బూర్వమున నాతఁడు చేసినట్లు తేలుచున్నది. ఆకాలమునఁ గాశీయాత్రయనఁగా నట్టిరాజులకు నించుమించు సంవత్సరకాలము పట్టునట్టిది యగును. శ్రీనాథకవీశ్వరుఁడు గూడ నప్పుడు వేమభూపాలునితోఁ గాశి కరిగియుండునని నేను దలంచుచున్నాను. కాశీఖండరచనాభిమానమును, నందలి కాశీసన్నివేశ వర్ణనావిశేషములును బయియూహకు స్ఫోరకములు. ఈ కిర్రిందిశ్లోకము గూడ నాతనికాశీరామేశ్వరయాత్రను దెలుపుచున్నది.

"శ్లో. కావేర్యాం తిపురాంతకే జయపురే కాశీపురే గోకులే
పంచారామపురీషు పట్టసపురే మార్కండశంభోఃపురే,
గంగాగాగరవంగమేషు సరతం శ్రీకొండవీటీపురే
చాళుక్యామయుతాన్నదాననిరత శ్శ్రీవేమభూపప్రభుః"

శృంగారశ్రీనాథము

పెదకోమటివేమారెడ్డి యిక్కట్టులు.

రాజమహేంద్రవరమున రాజ్యమేలుచున్న కాటయవేమనతోను నల్లాడ వేమవీరభద్రారెడ్లతోను మన కోమటివేమారెడ్డికిఁ బ్రబల విరోధమయ్యెను. వారితనితోఁ బోరాడి కొంత రాజ్యభాగమును గోదావరీతీరగతము నాక్రమించుకొనిరి. రాచకొండవెలమరాజులశత్రుత్వము తంతకంబెను బలిష్ఠమై మిక్కిలి యిక్కట్టులు గలిగించుచుండెను. మాదయలింగసునేనితో వివాదము దుర్భరముగా నుండెను. ఒకప్రక్క విద్యానగరప్రభువులతోఁగూడ విరోధ మున్నట్టున్నది. ఈ క్రింది పద్యమున కర్థసందర్భ మేమో స్పష్టముగాఁ దెలియదుగాని పెదకోమటివేమారెడ్డి యిక్కట్టు నెఱింగించుచున్నది.

ఉ. ఆచెపగద్దండ ( ) అనవేమపురమను
గ్రామంబు తోరణకట్టిరేని
ధరణి కోటనుగల్గు ధనధాన్యవస్తువు
లొకిట్టుకొని చూఱ లాడిరేని
మునుకొను యభిమానముద్ద భక్షింపంగ
సారెకుఁ జేతులు సాఁచిరేని
అభ్యంగసుఖసేయు నన్న గారికిఁ దెచ్చు
నూనెలోఁ జేతులు నూటిరేని

కణఁగి శత్రులుచేయు నఘాత్యమునకు
నోర్చియుంటివి నీసాటి యుర్వీఁ గలఁడె
సముదరిపురీరరాజవేశ్యాభుజంగ!
అతులబలీకుఁ పెదకోమటన్నవేమ!

ఈపద్యము పెదకోమటివేమారెడ్డి రాజ్యలాభకాలమునఁ గల్గిన చిక్కులను సూచించునదియుఁ గావచ్చును. వెలుగోటివారివంశ

చరిత్రలనుబట్టిచూడఁగాఁ బెదకోమటివేమారెడ్డి మాదయలింగమనేనితోఁ బోరాడి యోడిపోయినట్టు తెలియుచున్నది. మాదయ లింగమనేఁడు పెదకోమటి వేమారెడ్డి నోడించుటయుకాక రెడ్లవిజయాంకపుగు సంది కంత పోతురాజనుపేరి కటారినిగూడఁగొట్టుకొనిపోయెనఁట. రేచర్ల వెలమరాజులలో మాదయలింగమనేఁడు నిస్సామాన్యపరాక్రమఁడుగాఁ గీర్తింపఁబడినాఁడు. ఈకాలమునఁ గొండవీటి రెడ్డిరాజ్యము చిన్నభిన్నము కాఁజొచ్చెను. కొండవీటిరాజ్యము రాజులకందఱకుఁ గన్నెట్టి గలిగించుటగా నుండుటయే కారణము. "ముగురురాజులకును మోహంబు గలిగించు కొపురుమించినవీడు కొండవీడు." విద్యానగరప్రభువులు, గజపతులు, రాజమహేంద్రవరపు రెడ్డిరాజులు, వేలుగోటి వెలమరాజులు, నాల్గుపక్కలనుండి తాఁకుచున్నప్పుడు పెదకోమటివేమారెడ్డికి రాజ్యనిర్వాహము కష్టసాధ్యముగా నుండెను. ఆతని కొడుకు రాచవేమన రాజ్యకార్యములు చూచుచున్నను సంతసమొందుఁగాకుండెను. ఈరాజ్యోపప్లవకాలమున శ్రీనాథుఁడు కొండవీడు వీడినాఁడుగాఁడు. రెడ్డిరాజ్యము నిల్వరించుటయుం దీపని కభిమానము మెండుగా నుండెను. కటారిని గోల్పోవుట రెడ్డిరాజులకు రాజ్యమే కోల్పోవుటగా నుండెను. అదిలేకమున్న రాజ్యమును నిల్వరించుకొనఁ జాలమను సధైర్యమున వారుండిరి. కులక్రమాగతమగు నాకటారిని మ్లేచ్ఛులఁదమకడకుఁ జేర్చుకొనుటకు వారికిఁబరాక్రమము చాలకుండెను.

దేవరకొండ ప్రయాణము.

శ్రీనాథకవీశ్వరునిఁ గోరిరి. దేశాభిమానము, రాజ్యాభిమానము, ప్రభుభక్తి, కవిత్వదర్పము ప్రేరేపఁగా శ్రీనాథుఁ డాకటారిని గొని తెచ్చుటకయి దేవరకొండలో రాజ్యమేలుచున్న మాదయలింగమనేనిని

చర్చింప నరిగెను. శ్రీనాథునివంటి మహాకవి వచ్చినప్పుడు లింగమ నేఁడేమి! సింగమనేఁడేమి! యెవ్వ రయినను విసయవిధేయతలు చూపుట తమప్రఖ్యాతికివన్నెవెట్టుకొనుటయెగదా! అదిగాక తమప్రత్యర్థి రాజులదగ్గఱ నాస్థానకవీశ్వరుఁడుగానున్న యుద్దండపండితుఁడు తమ్ము చర్చింప నరుగుదెంచుట తమకెంతయుఁ బ్రతిష్ఠావహమను కుతూహల ముతో నా లింగమునేఁ డాతని నెంతో బహుమానించెను. శ్రీనాథుఁ డాతనిఁ బొగడెను:

సీ జగనొబ్బగఁడాంక! సంగ్రామనిశ్శంక
జగతీశరాయవేశ్యాభుజంగ!
అఖిలకోటంగొంఱ! యరిరాయమదభంగ!
మేలందు ధరణీశ మీనడాల!
మూరురాయరగండ! మురియురాజులమిండ!
యభివృద్ధి రాయచౌహ త్తమల్ల!
ఘనగాయగోవాళ! కామినీపాంచాల!
బ్రహ్మయు శశివంశపరశురామ!

గీ దంతిలిరుదులసురతాణి గుండెదిగుల!
బళిక! యల్లయవేముని పగరమిండ!
రమణమించిన మేడినీరావుబిరుద!
సంగరాటోప! మాదయలింగభూప!

శ్రీనాథుఁడు శత్రుషట్కమువదలితన్ను మెచ్చినందులకై లింగమనేఁ డత్యంతాసుదభక్తుఁడై వలసినవాంఛితము కోరుమని వేఁడుకొనెను రాజ్యమో ధనమో యాచించు ననుకొనెనఁట. స్వామిహితైక పరా యణతతో వచ్చిన మనకవిరాజు కటాక్షమే వేఁడెను. దాని నొక విజయ

ప్రశస్తిచిహ్నముగా భద్రపఱచుకొన్నవాడయ్యె నాతడు కపిలా మహిమకుఁ గట్టువడి శ్రీనాథుని స్వామిహితతత్పరత కచ్చెరువందుచు నిచ్చి వేసెను. ఈ విషయము వెల్లోటివారివంశచరిత్రలేగాక నాగ్నజిత్తీయ పరిణయమును ప్రబంధముకూడఁ బ్రశంసించుచున్నది:

మ. ధనరాజ్యంబులుమాని నెమ్మదిఁ బ్రమోదంబంది తద్గోరున
ట్టి న్నపాలాగ్రణికోర్కి తీర్పుట కకుంఠీభూతచేతస్కుఁడై
చని సాధించినసత్కవిప్రవరు రాజన్యాగ్రణీమాన్యు నేఁ
బ్రణుతింతుఁ బహుశైవసంగదిత శుంభద్భాషు శ్రీనాథునిఁ.

శ్రీనాథుఁడు కటాని గొండవీటికిఁ గొనివచ్చెను. పెదకోమటివేమారెడ్డిశాసనములు క్రీ. 1420 కిఁ దర్వాత లేవు. ఆతఁ డిర్వదియేండ్లు పరిపాలించినట్టు దండకపిలె, కైఫియతు, చాటుపద్యము చెప్పుచున్నవి. శాసనము లీయర్థమును స్థిరపఱుచుచున్నవి. కావున క్రీ. 1400, 1403 సమయు రాజ్యమునకు వచ్చిన యాతఁడు 1420లోఁ జనిపోయెనని నిర్ణయింపఁదగును.

రాచవేమన.

పెదకోమటివేమారెడ్డితర్వాత రాజ్యమున కాతని కుమారుఁడు రాచవేమన వచ్చెను. ఈతనిపాలనకాలము నాలుగువత్సరములు మాత్రమే యని కైఫియతు, చాటువు, చెప్పుచున్నవి. పోర్లయవేమన నాటనుండియు ధర్మోచర్యముగాఁ బెంపుగనుచున్న రెడ్డిరాజ్యము సకుఁ జెడ్డకాలమై రాజ్యమేలవచ్చిన యీరాచవేమన తనదౌష్ట్యము కారణముగాఁ దనతో రాజ్యమునుగూడ వినాశపఱచుకొనిపోయెనని దండకపిలె, కైఫియతు మొదలగు ప్రాచీనలేఖనములు చెప్పుచున్నవి. కొండవీటిరెడ్డిరాజ్య మీనాఁటితోఁ గూలిపోయినది.

❋

శృంగారశ్రీనాథము

చతుర్థ ప్రకరణము

సీ రెడ్డిరాజ్యం బంతరించె మిత్రులు దూర
దేశవస్థితుఁడు ప్రార్థింపఁదొడఁగి
రొండె "దేశాటనం పండితమిత్రతా"
యనిసూక్తి ప్రౌఢవిద్యావయోభి
యోగమ్ము నెసకొల్పనొండె, శిష్యులతో గ్ర
హముపీడి పెక్కు దేశములు తిరిగి
యా ప్తమిత్రులకోర్కి హరవిలాసము భీమ
ఖండమ్ము నని కృతుల్ రెండు నింకఁ

గీ. జాటువులు పెక్కు రచియించి, స్వర్ణపాత్ర
భోజనమ్ములు కస్తూరి బుగబుగలును
గుడుర సుధురాసదానందవదవిఁ గనిన
సుకవిజనవిధేయుని సముత్సుకతఁ దలఁచు.

కొండవీటి విప్లవము.

రాచవేమనను బ్రజలే కడతేర్చిరని దండకవిలె చెప్పుచున్నది. ఆతఁడు చనిపోయిన తర్వాతఁ గటకముసనుండిన లాంగూలగజపతి శ.1420 నుండి 1431దాఁకఁ గొండవీడు పరిపాలించెనియు నాతఁడుపెద మాంలెకోట,చినమాలెంకోట యని రెండుకోటలను గొండవీటఁగట్టించి

నాడనియుగొండపీటి కైఫియతులో గలదు.లాం గూలగజపతికిం దర్వాత విద్యానగరప్రభువు ప్రతాపదేవరాయం డిర్వదినాల్గు సంవత్సరములు పరిపాలించెననియు శ. 1377 నుండి మాలం గటకమునుండి వచ్చి కపిలేశ్వరగజపతి పరిపాలించెననియు నందుంగాదు. ఇది యిట్లేయని నిశ్చయముగాం జెప్పుట కాధారములు కానరావు. కాని "రెడ్డివొడ్డె కర్ణాటరాజ్యములు" అని ప్రతీతికలదు. ముందు రెడ్డిరాజ్యమును, దర్వాత నొడ్డెరాజ్యమును,బిదప గర్ణాటకరాజ్యమును, నంధ్రదేశమున వర్తిల్లెననుటకు మీంది నానుడి వినవచ్చుచున్నది. రాచవేమన చనిపోయినతర్వాత నల్పకాలము విద్యానగరప్రభువులు కొండపీటిరాజ్యమును లోంబఱుచుకొని పాలించుటవాస్తవమయియుండవచ్చును శ. 1344లో గుంటూరుతాలూకాలోని మాదిపాడులో ప్రౌఢరాయల శాసనమున్నది. శ.1370కిం దర్వాతం గపిలేశ్వరగజపతి యుదయగిరివఱకుంగల యంధ్రదేశమును బరిపాలించుట విస్పష్టవిషయము. రాచవేమన యనంతరము కొలదికాలము కొండవీడు పాలించినవాడుగాం గైఫీయతులోం జెప్పంబడిన లాంగూలగజపతినిగూర్చి విశేషములు నేనెఱుంగఁజాలకున్నాడను శక. 1 88లో కపిలేశ్వరగజపతియంధ్రదేశమును బాలించుచున్నట్టు బెజవాడశాసనమందు 'తత్ర స్వరాజ్యమధ్యేతు కొండపల్లీస్థలాన్తరే' ఇత్యాదిగా నున్నది. ఇట్లు కొండవీడు పలుపురు పాలకులపాలయి చెడుటను గూర్చి శ్రీనాథుడే కాఁటోలను చాటువును జెప్పినాడు:

చ. అలుగు లవెన్ని యేటికిని, నంచితమైన విశాలభూమిపైం
గలుగు లవెన్ని పామునకుం, గానలవెంబడి సంచరించు నా
పులుంగున కెన్ని వృక్షములు, పొల్పువహించిన భూధరాళిలో
నెలుంగున కెన్ని రోమములు, నేలికలందఱు కొండవీటికిన్.

శృంగారశ్రీనాథము

శ్రీనాథుని చిక్కులు.

మహాభోగములనుభవించినాఁడు. విద్యాధికారిగానున్నాఁడు. అనేకుల కగ్రహారాది సమ్మానములఁ జేయించినాఁడు. తాను 'సుకవితా యద్యస్తి రాజ్యేన కి' మ్మని యూరకున్నాఁడు. విప్లవముపాలయిన కొండవీటి నిప్పుడు కూర్చుండిన లాభము లేదయ్యెను. విద్యావయోవినోదములు దేశాటనసమనుభూతులు బయలుదేరఁదీసినవి. వెంట శిష్యసంఘముండెడిది. తనకుఁ బరిచితులయి, గొప్పపదవులందున్నవారిని గొందఱిని జూడను గొండవీటి వీడినాఁడు. దక్షిణదేశప్రయాణము, హరవిలాస రచనము, తర్వాత రాజమహేంద్రవరమున బెండపూఁడి యన్నమంత్రి యాశ్రయము, భీమఖండరచనము మొదలగునవి యీ కాలమున జరిగినవి. క్రీ. 1424 తర్వాత నించు మించుగాఁ బదిసంవత్సరము లిట్టి పర్యటనపర్యుత్సుకతతో శ్రీనాథుఁడున్నాఁడు.

కాంచీప్రయాణము.

శ్రీనాథుఁ డీకాలమునసనే కాంచీపురమున కరిగినాఁడని నేను చలంచుచున్నాఁడను. పంచవింశతివత్సరములనుండి తనకుఁబరిచితుఁడును, గోష్ఠీశ్వరుఁడును, శైవాచారసంపన్నుఁడును, దాతయినగు నవచి తిప్పయ కాంచీపురవాసియను విషయము నీవఱకే నిరూపించితిని. శ్రీనాథునివిగా మూఁడ్లు, నెల్లూరు సీమలనుగూర్చి, చాటుపద్యములును గింవదంతులును గొన్నిగలవు. అందు వాస్తవము కొంతయు, నారోపితము కొంతయు సయియుండును. కాంచీప్రయాణ సమయమున మూర్ఛమగుటచే నక్కడక్కడ నాగుచు నాతఁడు వెళ్ళియుండవచ్చును. ఆచాటుపద్యరచనాదు లాసమయమున సందర్భించినవి కాదగును. ఆ పద్యములను జాటుపద్యమణిమంజరిలోఁ జూడఁదగును.

హరవిలాసము.

ఇది యేడాశ్వాసముల ప్రబంధము. హరవిలాసమును సంస్కృత గ్రంథమొకటి కలదుగాని దానికి దీనికి సంబంధములేదు. సంస్కృత గ్రంథమున కిది పరివర్తనముగాదు. సిరియాలచరిత్రము, పార్వతీపరిణయము, దారుకావనవిహారము హాలాహలభక్షణము, కిరాతార్జునీయము సను శివకథలనుగైకొని శ్రీనాథుడు స్వతంత్రముగా నీ గ్రంథమును రచించినాడు. కాళిదాస భారవిప్రభృతుల కుమారసంభవ, కిరాతార్జునీయాదులందలి శ్లోకములు కొన్నిటి కిందు చెల్లుపద్యము లున్నవి. హరవిలాసమునఁ గృతిపతిప్రశంసయుఁ గృతికర్తృప్రశంసయు నిట్లున్నది.

"జంబూద్వీపమండలీ మకుట మండనాయమానంబగు కొండవీ (.... ..) లతాధిష్ఠితాష్టాదశద్వీపాంతరాళుండును సగుకొమరగిరిభూపాలుపలన నాందోళికాచ్ఛత్రచామరతురంగ భద్రపీఠాది రాజచిహ్నంబులు వడసి, యమ్మహారాజుసకు ప్రతివత్సరంబును సంవత్సరో (వసంతో?) త్సవంబులఁ గస్తూరీ కుంకుమసంకుమదకర్పూరహరిచందనకాలాగురుగంధసార ప్రముఖసంబులగు సుగంధద్రవ్యంబులొడఁ గూర్చియుఁ జీని సింహళ తవాయి హరుమంజి జోణంగి ప్రభృతి నానాద్వీపనగరాకరంబులు ధనకనకవస్తువాహసమూహక్రయాణిక్యంబులు దెప్పించియుఁ గనైగమిక వాదివాంశిక వైతాళికాదులగు నర్థిజనంబులకు సర్వంబుల గుప్పించియు ధీరుండన, నుదారుండన, సదాచారుండన భువనవిఖ్యాతిగైకొని యొప్పు నవచితిప్రభుండొక్కనాఁ డాస్థాన మండపంబున సుఖోపవిష్టుండై:-"

శృంగారశ్రీనాథము

సీ కమలనాభునిపౌత్రుఁ గవితామహారాజ్ఞ
భద్రాసనారూఢుఁ బరమపుణ్యుఁ
బాత్రు నాపస్తంబసూత్రు భారద్వాజ
గోత్రు సజ్జనమిత్రుఁ గులపవిత్రు
భీమాంబికామారనామాత్యనందను
నఖిలపురాణవిద్యా ప్రవీణు
నధ్వర్యు వేదశాఖాధీతిసిష్టాతు
నంధ్రభాషానైషధాబ్ధిభవుని

గీ నుభయభాషాకవిత్వ ప్రయోగకుశలు
బాలసఖు గారవించి తాత్పర్యమొప్ప
నవని దేవయత్రిపురారి యక్షరాజు
పాతమితోక్తులు వెలయఁగ నిట్టులనియె:

క. కంటిని విశుద్ధ సంతతి
వింటిఁ బురాణములు పెక్కు విశ్వముఁ గడఁ
మంటి బహుసత్పరంబులుఁ
గొంటి యశోధనము సుకవికోటి నుతింపఁ.

గీ. ఆగమజ్ఞాననిధివి తత్వార్థఖనివి
బహుపురాణజ్ఞుఁడవు శుభభవ్యమతివి
బాలసఖుఁడవు శైవప్రబంధ మొకటి
యవధరింపుము నాపేర నంకితముగ.

హరవిలాసరచనావిషయమునుగూర్చి శృంగారనైషధరచనాకాల ప్రశంసలోఁ గొంతభ్రమసితిని. హరవిలాసము రచించుచు

శ్రీనాథుఁ డవచితిప్పయ యాదరానురోధమునఁ గాంచీపట్టణమునఁ గొన్నిమాసములుండెనని నిశ్చయించుట కుపపత్తులు కలవు. కృత్యవతరణిక, సిరియాలకథ యాతని కాంచీపరిచయమును దెలుపుచున్నవి. మఱియుఁ గాశీఖండమందలిదగు నీ క్రిందిపద్యము, శ్రీనాథుఁడు కాంచీపురమున వసించినప్పుడు చెప్పినచాటుధారయనఁదగును.

సీ. ముదువంగనేర్తురు మూలదాఁపటికిరా జికురబంధము లీఁగ జీరువాఅ.....కించి యరవత లసమాస్త్రీఖడ్గలతలు.

ఈ పద్యమునకుఁ గాశీఖండముఁ బ్రబన్ధకిలేదు. సంస్కృత కాశీఖండమున నిట్టివర్ణనములేదు. 'కాంచి' యనుపురమునకుఁ దీర్థయాత్రాపరుఁడు శివశర్మ పోయిన ట్లందుఁ గలదు. ఆశివశర్మ కిట్టి శృంగారవిషయ మ్రప్రస్తుతము. అట్టిచో శ్రీనాథుఁ డీపద్యము ననుచితముగా ససంగతముగాఁ జేర్చుటకు, తాను మున్నుర చించిన మంచి పద్యము విడిగాసున్నచో జెడిపోవుసన్న లోభమే కారణమని తలంచుచున్నాఁడను. శ్రీనాథునిదిగా శ్రీరంగపురరాజవీధి విహారవర్ణనపద్యమొకటి చాటుధారగలదు. అది శ్రీనాథునిదే యగునేని యాతఁడక్కడికిఁగూడ వెళ్ళినవాఁడగును.

అవచితిప్పయ.

''సింహావిక్రమపట్టణశ్రేష్ఠుడయిన పావాణిసెట్టికి అవచిసెట్టి కుమారుఁడు. ఈతఁడు శ్రీపర్వతమునకు సోపానములు కట్టించిన రెడ్డివేమనృపాలునకుఁ బ్రాపయినవాఁడు. రామనాథయోగీశ్వరుని శిష్యుఁడు. అవచిసెట్టికి మాచాంబయను భార్యయందుఁ ద్రిపురారి,తిరుమలనాథుఁడు, చామసెట్టి యను మూవురుపుత్త్రులు జనియించిరి వీరిలోఁ బెద్దవాఁడగు త్రిపురాంతకుఁడే హరవిలాసకృతికి కర్త. ఈతఁడు, నీతనిపెద్ద

తమ్ముఁడు తిరుమలనాథసెట్టియు, హరిహరరాయఁడు, ఫిరోజిషాహ, గజపతిరాజు ,మెచ్చునట్లు 'కొండవీటిరెడ్డిరాజగు కుమారగిరిభూపాలుని వసంతోత్సవములను నిర్వహించుచుండెడివారు. రెండవతమ్ముఁడు చామినెట్టి పంజాబునుండి కర్పూరపుఁజెట్లు, జలనోగినుండి బంగారు మొలకలు, సింహళమునుండి మదపుటేన్గులు, హరుమంజినుండి గుఱ్ఱములు, గోవానుండి జవ్వాజి, ఆపనుండి యాణిము త్తెములు, బోటనుండి కస్తూరి, చీనినుండి యంబరములు తెచ్చుచుండెడివాఁడు. వీరికి ద్వీపాంతరములతో నోడలమీఁద వ్యాపారము జరుగుచుండెడిది. త్రిపురారికి అస్మమదేవి భార్య; మాచన, విశ్వనాథుఁడు, చినమల్లు అను వారు కుమారులు. ఈ త్రిపురారివంశమున పూర్వులలో నొకఁడు కంచి యేకామేశ్వరునకుఁ ప్రాసాదములు కట్టించెను. వేఱొకఁడు కంచి వరదరాజస్వామిబొడ్డున బాలార్కమను మణిని బొదిగించెను. ఇంకొ కఁడు తిరువళ్ళూర మూఁడామడల పొడవుగల తటాకము త్రవ్వించెను. మఱియు నొకఁడు కావేరిని గట్టించెను. ఈ వైశ్యులు చిఱు తొండనంబివంశ్యులు. శ్రీనాథకవిసార్వభౌముఁ డీత్రిపురారిసెట్టికి బాల సఖుఁడు.

గద్యవిధము

శ్రీనాథుఁ డీహరవిలాసమున గద్యవిధము మార్చినాఁడు. శృంగారనైషధగద్యమున 'సకలవిద్యాసనాథ' పదముకలదు. ఇందు సుకవిజనవిధేయ పదముకలదు. దీనితర్వాతి భీమఖండమునఁగూడ నీ 'సుకవిజనవిధేయ' పదమేయున్నది ఆతర్వాతఁ 'గవిసార్వభౌమ' పదము కాశీఖండాదులందుఁ జేర్చుకొన్నాఁడు.

శ్రీనాథుఁ డిట్లు దక్షిణదేశ ప్రయాణము జరిపివచ్చినపిదప రాజమహేంద్రవరప్రాంతముల కరిగెను.

భీమఖండరచనము.

రెడ్డిరాజ్యము కొండవీట నొడ్డగిలఁబడిపోవుటయు, రాజమహేంద్రవరమున నెగుపుచెందుటయు నెఱుకకందిన విషయమేగదా! క్రీ. 1405 ప్రాంతములకే రాజమహేంద్రవరరాజ్యము వేర్పడి కొండవీటిరాజ్యమును బరోధించినది. 1424 దాఁక గొండవీటిరాజ్యము కలదు. అంతవఱకును శ్రీనాథునకు రాజమహేంద్రవర రాజాశ్రయము చేకూఱలేదు. అతఁడు కోరలేదు. కొండవీటిరెడ్డిరాజ్యము రూపుమాపిదపఁ గొంచెముకాలము కాంచ్యాది ప్రదేశ ప్రయాణాదులతోఁ గడపెను రెడ్డిరాజ్యముపయిఁ బ్రేమకలదు. రాజమహేంద్రవర రాజాశ్రయము నపేక్షించెను. బంధువులును, రసికులునగు సక్కడి రాజమంత్రులఁజూచెను. శ్రీనాథుని దర్శనము వారికిన్నులకుఁ బచ్చగప్పురమయ్యెను వింతయేమి! అపుడు రాజమహేంద్రవరమేలుచున్న వేమవీరభద్రారెడ్లకు మంత్రియగు బెండపూఁడి యన్నామాత్యుఁడు శ్రీనాథునకు బంధుకోటిలోనివాఁడే. ఆంధ్రవము శ్రీనాథునితాలయగు కవులనాథునిన్నాళ్లసుండియుండినది. దీనికి ద్యోతకము:—

సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణ విద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశములతో
విద్యావరీక్షణ వేళలందు

వెలచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు

గీ. పానాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వమలమతిని
నాకుఁ గృపసేయు మొక ప్రబంధఁబు నీవు
కలితగుణగణ! శ్రీనాథకవివరేణ్య!

ఆయన్నామాత్యుఁడు పయివిధమున శ్రీనాథునిఁ గృతికటాక్షింపు మని వేఁడెను. అట్లతఁడు కృతి కోరునాటికి గాటయవేమనయు నల్లాడరెడ్డియు స్వర్గస్థులయిరి. కాటయవేమన క్రీ. 1416 నాటికేస్వర్గ స్థుఁడయ్యెనని యీవఱకే ప్రకాసియున్నాఁడను అల్లాడరెడ్డిఅటు తర్వాత మఱికొన్ని సంవత్సరములు జీవించినాఁడు. వేమారెడ్డి తన తమ్ముని వీరభద్రారెడ్డి ననితల్లీభ్రాతాకారణముచే రాజ్యాభిషిక్తునిఁ జేసి, తాను నిర్వ్యాక్రపరాక్రమముతో సప్తమాడెములు మొదలగు మన్యదేశముల జయించి సింహాద్రిపర్యంతసీమగా గల యంధ్ర మండలమును గైవసపఱచుకొని కాపాడుచుండెను. దొడ్డారెడ్డి, యన్నారెడ్డి యని మఱి యిరువురుతమ్ములుకూడఁ గూడిమాడి రాజ్యాభివృద్ధికారణములుగా నుండిరి. అందు దొడ్డారెడ్డి నిశ్శంక కొమ్మనామాత్యుఁడు శ్రీనాథుని హరవిలాసమును బోలునట్టు రచియించిన శివలీలావిలాసమను కృతికిఁ బతియయినవాఁడు. పట్టిసక్షేత్రమునఁ దపమాచరించుచుండిన ఘోరాయ భీమేశ్వరస్వామిని వీరాధించుచుండిరి. అహమ్మదు షాహా యను తురుష్కచక్రవర్తిపాలనకాలమది:—

ఉ. అన్నయమాత్రిశేఖరుఁ డహమ్మదుషా సురధాణభూమిభృ
త్సన్నిధికిన్ మదిన్ సముచితంబుగ వేమమహీసురేంద్ర రా

జ్యోన్నతి సంతతాభ్యుదయ మొందఁగఁ బారసిభాష వ్రాసినన్
గన్నలవండువై యలరుఁ గాకితమందలి వర్ణపద్ధతుల్.

భీమఖ డము.

అహమ్మదుషాహా, ఫిరోజిషాహకుఁ దమ్ముఁడు. ఈతఁడు క్రీ. 1422 నుండి 1436 వఱకు రాజ్యమేలెను. భీమఖండ రచనకాలము 1480 అని తలంపఁదగును. ఈకాలమునకు శ్రీనాథుఁడు ప్రౌఢనిర్భర వయఃపరిపాకమున నుండెను. "ప్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొనియాడితి భీమనాయకునిమహిమ" - (కాశీఖండము). ప్రౌఢనిర్భర వయఃపరిపాకముగలస్త్రీయ మించుమించుగా ముప్పదియైదునుండి నలుబదియైదేండ్ల వయఃకాలమగును. నిండారు నారోగ్యభాగ్యముగల వాఁడు గాన శ్రీనాథుఁ డేఁబదియేండ్లస్త్రీయమునుగూడఁ బ్రౌఢనిర్భర వయఃపరిపాకకాలమని చెప్పుకొని యుండవచ్చుననుటనుగూడ నొప్పుకొనవచ్చును. అంతకుమించిన వయస్సున్న టనుట విరుద్ధము. భీమఖండమునకే భీమేశ్వరపురాణమని నామాంతరము. స్కాందపురాణము పంచాశత్ఖండములలో నిదియొక్కటి. దాక్షారామముమీఁది యభిమానముచే శ్రీనాథుఁడే సంస్కృతగ్రంథమునుగూడఁ గల్పించెనని యొకకింవదంతికలదు. సత్యము కాకపోవచ్చును. దాక్షారామము, పలివెల, పీఠికాపురము మొదలగు స్థలముల వర్ణన మీగ్రంథమునఁ బౌరాణికముగాఁ గాక చారిత్రకముగా స్వాభావికముగా నున్నది. మొదటి మూఁడాశ్వాసములందు నీతీరు పరికింపఁదగును. మఱియు నాయాస్థలములం దనకు సమకూడిన యనుభవానందాదులు వెలికిఁదోచునట్లు పెక్కుపట్టులఁ గవనము రచించినాఁడు. శ్రీనాథుని కవితాచకోరికను బంచారామములందును, బల్వెల యందును, బ్రౌఢేందుబింబప్రతిబింబచంద్రికాచమత్కారములు చూఱలొసఁగి చొక్కించి దక్కఁ

గొన్నవి. యౌవనము నిండారి ప్రౌఢమై నిర్భరమై యీకాలము
దీతని నెన్నోయున్నతభోగముల ననుభవింపఁజేసినది. రాజమహేంద్ర
వరమున నీతనిఁ గొందఱువిద్వాంసు లవగణించిరి గాఁబోలును. ఎంత
వైదుష్యదర్పము గలవాఁడయినను శ్రీనాథుఁడు ప్రశాంత చిత్తుఁడై
కాలము కడచినకొలఁదిని వినయసంపత్తి నెక్కువగాఁ జూపుకొనుచునే
వచ్చెను. గద్యపుందలి 'సుకవిజనవిధేయ' పద మీయర్థమున నొక
సాధకము. శృంగారనైషధగద్యపుందలి సకలవిద్యాసనాథపదము
మాని హరవిలాసమందును, భీమఖండమందును, సుకవిజనవిధేయ
పదము చేర్చుకొన్నాఁడని మున్నే చెప్పితిని. ఆంధ్రకవివర్గము కృత్య
వతరణిక కొకయంగముగా గూరుచుచున్న కుకవినింద నీతఁడీ
భీమఖండమునను,శివరాత్రి మాహాత్మ్యమునను దక్క మఱియెక్కడను
జేసినవాఁడుగాఁడు. ఈ గర్హితములనేని యది చేర్చుట కప్పటి యర
సికపండితుల మాత్సర్యము కారణము కాఁదగును. అర్హులయెడ
శ్రీనాథుఁ డెంతయాదరము చూపువాఁడో పొన్నపల్లి శాసనాదులందుఁ
బ్రతిగ్రహీతలనుగూర్చి చేయఁబడిన ప్రశంసలు తెల్పుచున్నవి. లోక
జ్ఞత, నిర్మత్సరత, పరిశాంతత, వైదుష్యదర్పము శ్రీనాథునెంతగా
భూషించెనో యీక్రింది కుకవినింద ధ్వనించుచున్నది :

గీ. బోధ మల్ప బు గర్వ మత్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మచ్చరము మనము
కూపమండూకములుపోలెఁ గొంచెమెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు.

గీ. నికటమునను౦ది ప్రతిపుట నిష్ఠురముగ
నడరి కాతులు బిట్టుబెద్దరచినప్ప

డుడిగి రాయంచ యూరక యుంటలెప్ప
నైపరాకున్న నె దేనిఁ జనుటయొప్పు.

మఱికొందఱు కవులు నిందించినట్లు ముదుకగాక యీ యవ హేళన మెంతయు హృద్యమై కవికిఁగల నిడుదనమును దెలుపు చున్నది. గ్రంథము దిట్లు మృదువుగా మందలించినను జాటుపద్యము లందు రాజమహేంద్రవర విద్వాంసుల నీతఁడు పెల్లుగా నుల్లసమాడి నాఁడు. ప్రధ్వంసాభావ ప్రాగభావములపైఁ గల్పించిన కల్పన కిఁక నాటికి నేటికిఁ దార్కికులు తలలు వంపవలసినదేగదా; మఱికొన్ని చాటువు లున్నవి. ఇక్కడ నుదాహరింపఁదగినవికావు. అప్పటిచాటుధార నొకదానిని 'హాజలజే' త్యాదికమును లాక్షణికుఁ లక్షణగ్రంథము లందుఁగూడ నుదాహరించిరి.

తన పూర్వగ్రంథముల నీతఁడు భీమఖండమం దిట్లు పేర్కొ న్నాఁడు:

గీ. నవమదుత్తచరిత్రఁబు నైషధంబు
సప్తశతి పండితారాధ్యచరితమనఁగ
గావ్యములు పెక్కు చెప్పియుఁ గాంక్షచనక
వెండియును గావ్యమొకటి కావింపఁదలఁచి.

ఆపెక్కులు కావ్యము లేవై యుండునో; హరవిలాస మొకటి యగును. కావ్యకరణకౌతూహలమును, యళోలిప్సయు శ్రీనాథునెడ నెంత మెండుకొనియుండెనో యీపద్యము వెల్లడించినది. ఈ గ్రంథ మునఁ గృతినాథుఁడగు బెండపూఁడి యన్నామాత్యుఁవంశవర్ణనమునకు

ముందు వేమపీరభద్రారెడ్డివంశమును వర్ణించినాఁడు. వారిప్రాపును బడయుకోర్కి దీనికిఁ గారణము. ఆవంశవర్ణనప్రస్తావ మిట్లుగలదుఁ—

''చతుర్థకులమౌళిమండనంబై కీర్తివిహారఘంటాపథంబైన పఁటదేసటిమహాస్వయంబు వాకనాటిదేశంబున భద్రపీఠంబు నధివసించి సింహవిక్రమనగర దుర్వారు గండవరాది పట్టణంబులు నిజనివాసంబులుగా, భూలతాదష్టాష్టాదశద్వీపాంతరాళులగు భూపాలగ్రామణులం ద్రిలింగభూమండలాఖండయుకను, ప్రోలయవేమాన్నపోతాన్న వేమకుమారగిరీశ్వరాదులం బూజ్యసామ్రాజ్యపీఠస్థులఁగాంచె. తత్సంబంధబాంధవంబున విజయధాటీసమూటీకనంబుల దెసలల్లాడ సల్లాడ భూవల్లభుండు రాజమహేంద్రంబు రాజధానిగా సింహాద్రిపర్యంతంబుత్కళ కళింగ యవన కర్ణాట లాటాంతర్వీపంబైన ప్రతాపంబున.... విశ్వవిశ్వంభరాభవనమండలంబుఁ బరిపాలించె. తదనంతరంబ.''

ప్రోలయవేమన మొదలు కుమారగిరివఱకుంజెప్పి యాపై 'నాదు' లనుటకుంగారణము, రామటివేమకాచవేమనలకు విరోధులగుట చేత, చత్పక్షస్థావము వేమపీరభద్రారెడ్డకు సహ్యముగామియు, వారిని స్మరింపకుండుటకు మనసొల్లమియు నగును. రాజ్యప్రాప్తికిఁ బ్రధాన సాధనమును స్పష్టముగాఁ జెప్పినాఁడు కాఁడు. అనితల్లిమూలమున వచ్చిన దనుట యంతగాఁ బ్రతిష్ఠావహము కాదని ''అల్లాడ భూవల్లభుండు.... పాలించె. తదనంతరంబ,'' అనుటచే భీమఖండ మల్లాడ రెడ్డి చనిపోయినపిదపనే రచితమగుట స్పష్టము. కాకీఖండ ప్రస్తావమున నీరెడ్డనుగూర్చి మఱికొన్ని విశేషములు వివరింతును. ఇక్కడి వర్ణన మునే మెచ్చుగా నక్కడఁ గూర్చుకొన్నాఁడు.

అన్నమంత్రివంశమున పూర్వులు కాకతీయులయొద్ద నుద్యోగులుగా నుండిరి. పారంపర్యముగా వారినివాసము గోదావరీతీరమే. వీరితో చాతలనాటి చుట్టుటికముండుట శ్రీనాథుని కాశీపట్టణ వాసవ్యతకు సాధకము. అన్నయమంత్రి శక్తివ్యక్తులును, చాతృతయు నిట్లు వర్ణింపబడినవి:-

మ. అరభీకాష తురుష్కభాష గజకర్ణాంధ్ర గాంధార భూ
ర్జరభాషల్ మళయాళభాష శకభాషా సింధుసౌవీర బ
ర్బరభాషల్ కిరాటభాష మటియున్ భాషావిశేషంబు ల
చ్చెరువై వచ్చు నరేటియన్నునికి గోష్ఠీనంప్రయోగంబులన్.

సీ. రాజమహేంద్రదుర్గమునఁ గావించె శ్రీ
వీరభద్రునకుఁ బ్రాకారరేఖ
నిలిపె మార్కండేయ సీలశంఖునిమోల
రామేశుఁ దమతల్లి నామకముగ
సంగమేశ్వర దివ్య శంభులింగమునకుఁ
గల్పించెఁ గళ్యాణ గర్భగృహము
దక్షవాటికయందుఁ దరుణేందుమౌళికి
మొగలివాకిట ధామమును రచించె

గీ. ప్రౌద్ధిశాప్రపగోపుర ప్రాంగణమున
సప్తమునిసింధుసోపానసరణి కెలనఁ
దీర్చె భవనంబు భీమయదేవునగర
మంత్రిదేవయ యన్నయామాత్యవరుఁడు.

ఈ ధర్మకార్యములకు శాసనము లేవేని యుండఁదగును.

శృంగారశ్రీనాథము

పయి సీసపద్యము గీతిలోఁ బేర్కొనఁబడిన ధర్మకార్యమునకు దాక్షారామమున నీక్రింది శాసనమున్నది:

శ్లో. ఆస్తి పశ్చాత్కృతి రల్లయవేమభూపో
రాజ్ఞోన్నతో జగతి రాజమహేంద్రపుర్యామ్
మంత్రీ హితోఽస్య మతినిర్జితదేవమంత్రి
ర్దిన్నశ్రియా జయతి దేవయయన్నమంత్రీ

శ్లో. శాకేపుష్కరబాణవిశ్వగణితే సంవత్సరే కీలకే (1850)
కార్తిక్యాం శనివాసరే సుకృతధీ శ్రీయన్నమంత్రీశ్వరః
దాక్షారామజభీమలింగపురత శ్శ్రీసప్తగోదాతటే
ప్రాచీగోపురమండపం సమకరో ద్రమ్యం శిలానిర్మితమ్.

శ్లో. ద్వాదశసంఖ్యాస్తంభే
సదా బహిర్ద్వారమండపే విహరత్
రక్షతు భీమేశోఽయం
శ్రీదేవయయన్న సచివ మాకల్పమ్.

ఈ శాసనము క్రీ. 1428లో నెలకొల్పఁబడినది. ఇందలి పుణ్యకార్యము భీమఖండమునఁ బ్రశంసింపఁబడినది. కావున భీమఖండ రచనము క్రీ. 1428కిఁ దరువాతనే జరిగె ననుఁ విషయము నిశ్చలమయిన సిద్ధాంతముగా నిలుచుచున్నది. భీమఖండమునఁ బయి పుణ్యకార్యము మరియు నిట్లు ప్రశంసింపఁబడినది: ''వెండియు భీమేశ్వరుండు.... .... రాజవేశ్యాభుజంగవిరుదాభిరామాల్లయ వేమభూపాల రాజ్యధుర ధురంధరుండై బెండపూఁడి యన్నయామాత్యుండు గట్టించిన మొగలివాకిటి మహోత్సవమండపంబునందుఁ బేరోలగం బుండి కుండలీదండ లాసక్త ప్రేణీ పేంకట చిందుకంచుదమాళిచేల మత్తల్లీ

హల్లీసకాదినృత్యంబు లవలోకించుచు.... ....నాగమంబులు పరీక్షించుచు నిఖిలలోకరక్షణార్థంబుగా వివిధవిద్యాకలాపంబుల వినోదించుచుండు.''

భీమఖండరచనాకాలమునకే శ్రీనాథునకు దాక్షారామరామా పమాగమాది సౌభాగ్యములు సంఘటిల్లినవి. అన్నయమంత్రి ప్రభృతుల యాదరానురోధమున నాకాలమున నాతడు తఱచుగా గోదావరీ ప్రాంతముల కరుగుచుండెడివాడు. వేమవీరభద్రారెడ్డి గాఢపరిచయము కాశీఖండరచనాకాలము నుండియే యీతని కేర్పడినది. అంతకు పూర్వ మంతగా లేదనవచ్చును వేమవీరభద్రారెడ్డిపాలనము సింహాద్రి పర్యంతముఁ గలదని యీఱఱకే ప్రాసిలిని. సింహాద్రి మీఁద వెలసిన నరసింహస్వామికి వేమవీరభద్రారెడ్డు వత్సరోత్సవాదులు జరిపించుసప్పు డన్నయమంత్రి భృతులతో శ్రీనాథుఁడుగూడ నరుగుచుండెడివాఁడు. సింహాద్రిమీఁద దేవాలయాది సన్నివేశము కనువిందు గూర్చుచుండును. అసంట్లు, మావులు, మొదలుగా నెన్నో ఫలవృక్షములును, ఛాయావృక్షములు పూలచెట్లును దోఁపులు దీరియుండును. ఆసింహాచలోత్సవయాత్ర నాఁటికి నేఁటికిఁ గూడ దర్శనీయమే! ఉత్సాహజనకమే! అక్కడికి యాత్రార్థమువచ్చు నానాస్త్రీలనుగూర్చి శ్రీనాథుఁడు చెప్పిన చాటుధారలు పెక్కులు కలవు. వానితో నితరములను మఱికొన్నింటిని గలిపి యచ్చులో నిప్పటివారు శ్రీనాథుని వీథినాటకమనుపేర నెలకొల్పినారు. ఆపద్యము లెల్ల నొక యానుపూర్వ్యగల గ్రంథముగా లేవు. అవి విడివిడి చాటుధారలే. వీథినాటకమను గ్రంథము వేఱుగానున్నది. దానివిషయము ప్రకరణాంతరమున రాఁగలదు. శ్రీనాథుని యిప్పటి చాటుధారలను జాటుపద్యమణిమంజరిలోఁ జదువఁదగును.

తెల్లరాయని యాశ్రయము.

భీమఖండరచనము తర్వాత, దాక్షారామరామాసమాయోగము కల్గిన యాపయి క్రీ. 1435, 1440 ప్రాంతమున ఎన శ్రీనాథునకు మేదినీమీసరగండకటారి సాళువసంఘరాయనికొడుకగు తెలుంగురాయని యాశ్రయమేర్పడినది. ఈతని శాసనము శక 1350 నాఁటి దొకటి సింహాచలము మీఁదఁగలదు. ఈతని తండ్రియగు సంబురాయని శాసనము నెల్లూరుమండలము పొదిలెతాలూకాలోని కూచిపూఁడి గ్రామమున నాంధ్రరామలింగస్వామి దేవాలయమున నొకటి కలదు. ఆది శక 1348 సంవత్సరమునాఁటిది. నెల్లూరుమండలముననే యాత్మకూరుతాలూకాలోఁ దెలుంగురాయని పురమను గ్రామముగలదు. అది యీ తెలుఁగురాయనిపేర నేర్పడినదే కావచ్చు. కృష్ణాతీరమున శ్రీకాకుళముతోఁజేరి తెలుఁగురాయనిపాలె మనుపల్లె యొకటిగలదు. కాని యది శ్రీకాకుళాంధ్రినాయకస్వామిపేర నేర్పడినది కాని యీ తెలుంగురాయనికి సంబంధించినదికాదు. ఈతని కీనామముగూడ నా శ్రీకాకుళాంధ్రినాయకునిపేరునుబట్టి వచ్చినదే యగునని నేను తలంచుచున్నాఁడను. ఆకాలమున నీ తెలుంగురాయలను పేరు పలువురు పెట్టుకొనుచువచ్చిరి. శ్రీకాకుళాంధ్రినాయకస్వామియుత్సవాదు లప్పుడు ప్రఖ్యాతముగా జరుగుచుండెడివి. శ్రీకాకుళాంధ్రనాయకస్వామికిఁ దెలుఁగురాయఁడనిఁబేరుండుట తెలియక కొందరి సంబురాయనికొడుకు తెలుంగురాయఁడు శ్రీకాకుళము నేలినరాజని వ్రాసిరి. ఈ తెలుంగురాయఁడు శ్రీకాకుళమునేలినవాఁడనుటకు నాధారమేమియుఁ గానరాదు. అట్లుంట ప్రామాదికమే! ఈ తెలుంగురాయఁడు రాజ్యమెక్కడ యేలెనో ప్రఖ్యాతముగా లేదు. విద్యానగరాధీశ్వరునిక్రింద నేనాయకుఁడుగా నుండినట్టున్నాఁడు. బాఁట్లతాలూకా నూఁతులపాడుగ్రామ

మున నీ తెలుఁగురాయనిపుత్త్రుడు తిరుమలరాయని శాసనములు శా॥1466నాఁటివి కలవు. తెలుంగురాయని తండ్రి యగు సంబురాయఁడు శా॥1348నను. నాతని కొడుకగు తిరుమలదేవరాయని శాసనము శా.క. 1466 నను, నుండుటచేఁ దెలుఁగురాయఁడు శా. 1348 తర్వాత 1395 దాక నున్నట్టును, సింహాచలశాసనమునాఁటి కాతఁ డీర్ష్యి యేండ్లకులోపడినవయస్సువాడయినట్లు తలఁపఁదగును. ఆతఁడిప్పటికిఁ బ్రఖ్యాతుఁడుగాక తండ్రిచాటువాఁ డగుటచేతనే యాశాసనమందు "కన్నడ దేశమందలి సంబురాయనికొడుకు తెలుంగురాయండు" యని పేర్కొన వలసెను. ఆతనిశాసనము శా॥ 1364 నాఁటిది నూఁతులపాడుగాఁ మునుపం దున్నది.

విజయనగరాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయనికి లోపడిన యీ తెలుంగురాయఁ డాతనిదండయాత్రలో సింహాద్రి దాఁక వెళ్ళినట్లు శ్రీచిలుకూరి వీరభద్రావధానులుగారు తలంచుచున్నారు. అది సంగతముగానున్నది. శ్రీనాథుఁ డీతెలుంగురాయని నాసందర్భముననేని తర్వాతనేని సందర్శించియుండవచ్చును. ఆప్పటివి శ్రీనాథుని చాటుధారలివి వినవచ్చుచున్నవి:

శా. ధాటీఘోటఘరట్టఘట్టనమిళద్ధాఘిష్ఠకళ్యాణ ఘం
టాటంకార విలుంఠలుంఠిత మహోన్మత్తాహితక్షోణిభృ
త్కోటీరాంకితకుంభిసీధర సముత్కూటవీరూఢ! క
ర్ణాటాంధ్రాధిప! సొంప (సంబు) రాయని తెలుంగా! నీకు దీర్ఘాయువౌ !

ఈపద్య మాతఁ డశ్వారూఢుఁ డయి దండయాత్ర సాగించుచున్నప్పుడు చూచి చెప్పినపద్య మనుసింపుచున్నది.

శృంగారశ్రీనాథము

శా. అక్షయ్యంబగు సొంప (సంబు) రాయని తెలుంగాధీశ! కస్తూరికా
భిక్షాదానము సేయురా! సుకవిరాడ్బృందారక శ్రేణికిన్ (స్వామికిన్)
దాక్షారామచతుర్ముఖాభిమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయకుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

శ్రీనాథునికి పైషయికవాంఛలత్యున్నతములు. భోగపరాయణత మెండు. ప్రౌఢనిర్భరవయఃపరిపాక కాలమగుటచే నాతఁడప్పుడు శృంగారరససముద్రమునఁ దెప్పదేలుచున్నాఁడు. దాక్షారామాప్సరోరామలయొడళ్ళపయి బుగబుగ లొక్కల్పుటకని తెలుంగురాయనిఁ గస్తూరి కోరినాఁడు; ఏమికోరిక!! ఉచ్చైర్వర్ధళ నుండువారి కప్పు డిట్టియచ్చరల చెలికారము గౌరవము నించుచుండెడిది గావలయు! పయిచాటుపు శ్రీనాథునిది గాకపోవచ్చు ననుటకు వలనుపడదు. ఆక్షయ్యేత్యాది పద్యమువంటి దింకొకపద్యము 'క్ష' ప్రాసముగలది కాశీఖండమందుఁ గలదు. "రంభఁగూడె దెలుంగురాయరాహత్తుండు కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు" నని యాతని యవసానపద్యమందుఁగూడ నున్నది. పూర్వపద్యమువలె నిదిగూడ నాతెలుంగురాయఁడు "రౌతు" అని తెల్పుచున్నది. ఈ తెలుంగురాయనిఁగూర్చి గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారు సంబంధ మంతగాలేని ప్రాతలేమో ప్రాసినారు - అదియేల:

విస్సనమంత్రిప్రాపు

ఈతనిఁగూర్చి యేమియును దెలియరాకున్నది. శ్రీనాథుఁ డీతనిబంతిని బంగరుపళ్లెములో భుజించుచుండెడివాఁడఁట! ఈతఁడును రాజమహేంద్రవరమునకో, దాక్షారామమునకో, మఱి యాచుట్టుపట్టులనో యుండెడివాఁడగునేమో! తెలుంగురాయని పేరఁగాని యీవిస్సనమంత్రి

పేరఁగాని శ్రీనాథుఁ డేవేనికృతులు చెప్పెనేమో తెలియదు. శ్రీనాథుఁడు తన యవసానపద్యమందు "స్వర్గస్థుఁడయ్యె విస్సన మంత్రి మఱి హేమప్రాతార్నిన్న మెవ్వని పంక్తిఁగలదు" అని చింతించినాఁడు. ముప్పదియిద్దఱుమంత్రుల సీసమాలికలో విస్సన మంత్రి యొక్కఁడుగాఁ బరిగణింపఁబడినాఁడుగాని యం దాతని చరిత్రాంశమేమియుఁ దెలుపఁబడదయ్యె. ఈ విస్సనమంత్రి పేరూరు ద్రావిడులనఁబడెడు ప్రఖ్యాత బ్రాహ్మణులశాఖకుఁ జెందినవాఁడనియు, నాతని చరిత్రాదికమును బేరూరుద్రావిడులచరిత్రమును గ్రంథమున వెల్లడింప నున్నామనియు నొకశాస్త్రిగారు చెప్పుచున్నారఁట!

శేషధర్మములను రచించిన తాడిపత్రి పెమ్మయకవి తన పెద్దతండ్రి విస్సమంత్రిపేరివాఁడన్నదాత యున్నాఁడని చెప్పుకొన్నాఁడు. ఆపద్యమిది:

సీ. బహుపురాణగ్రంథపఠనార్థ కరణాత
శూరుండు మీయన్న సూరమంత్రి
మహితసభాభిరామముఖకావ్యంబులు
ధరనిల్పె మితండ్రి శరణమంత్రి
తగవరియై యన్నదానంబు సేయుచు
వెలసె మీపెదతండ్రి విస్సమంత్రి
వేదవర్తత మన వినుతులఁ గాంచెను
సరసుండు మీతాత చండ (ద?) మంత్రి

గీ ప్రౌఢరాయల మెచ్చించి రాయసమునఁ
బ్రెఁడి గంటంబు గొని వ్రాసి భద్రలీలఁ
బ్రెఁడి గంటంబువారని పద్దుతెచ్చి
యలరె మీతాత ముత్తాత యంబమంత్రి.

శృంగారశ్రీనాథము

శ్రీనాథునకు బంగరు పళ్లెరమున సహభోజనమొసఁగిన విస్న మంత్రి యాతఁడు గావచ్చునని కొందఱు తలఁచుచున్నారు. కాని యది సంగతముకాదు. శ్రీనాథుఁడు ప్రౌఢరాయలనాఁటివాఁడు. ప్రౌఢ రాయలను వ్రాయసమునమెప్పించి పైఁడిగంటముగొన్న యంబమంత్రి కృష్ణమంత్రి నాల్గుతరముల తర్వాతివాఁడు. కావున నాతఁడు శ్రీనాథుని నాఁటివాఁడు కాజాలఁడు.

❊

శృంగారశ్రీనాథము

పంచమప్రకరణము

కవికాభిషేకము

సీ. ఒడ్డోలగంబునం దడ్డ మాఁకయు లేక
వాక్ప్రవాహంబు వెల్వడిచినాఁడు
అష్టదిగ్గజయయోఽవష్టంభ డిండిమ
భట్టారకుని నోడఁ గొట్టినాఁడు
అఖిలవిద్వల్లోక మగ్గింపఁ గవిసార్వ
భౌమసద్బిరుదంబుఁ బడసినాఁడు
కలిత మౌక్తిక సభాగారాంతరమునందుఁ
గనకాభిషేకంబుఁ గాంచినాఁడు

గీ. రాజపరమేశ రాజాధిరాజవిభవ
దక్షిణాధీశ దేవరాయక్షితీంద్ర
రక్షితబుధాభిభటక "కర్ణాటకటక
పద్మవన హేళి శ్రీనాథభట్టసుకవి."

—*—

శ్లో వంశవీర్యశ్రుతాదీని వర్ణయిత్వా రిపోరపి
తజ్జయాన్నాయకోత్కర్ష వర్ణనం చ ధినోతి నఃం.

''ప్రత్యర్థికులబలపాండిత్యాదులను గూడ వర్ణించి యట్టివాని జయించుటఁజెప్పి నాయకుని యౌత్కృష్ట్యమునకుఁ బెంపు సంపాదించుటయు నింపుగూర్చును.''

– ఆచార్యదండి.

శ్రీరాముఁ డెంతగా రామాయణమునఁ గీర్తితుఁడయినను దత్ప్రతిత్యర్థి యగు రావణుని కులబలపరాక్రమాదులు గూడ నట్లు పర్యాప్తముగ వర్ణితములు కాకపోయినచో నా రామచంద్రుని గుణౌత్కృష్ట్యము లోకమున కింత యద్భుతావహముకాకపోయెడిది. ప్రఖ్యాతాంధ్రకావ్యకర్తయై యాంధ్రవాఙ్మయమునకు మహోపకృతి సల్పిన శ్రీనాథకవిపర్యని యాభిజాత్య పాండిత్యాదులు పుష్కలముగా వ్యక్తములగుటకై యాయనచే నోడఁగొట్టఁబడిన డిండిమభట్టారకుని యౌత్కృష్ట్యమునుగూడఁ గొండొక విపులముగనే వర్ణింపఁబూనుట యప్రసక్తవిషయచాలనముగాక యా కవీశ్వరుని ప్రశస్తికి మెఱుఁగులుగూర్చు నావశ్యకవిషయోన్మీలనమే యగునని సహృదయులు తలంతురుగదా!

డిండిమభట్టారకుఁడు.

ఈ బిరుదాంకనామధేయముగల కవీశ్వరుఁడు నలువురు గుర్తింపఁబడిరి. ఈ నలువురకును గర్భసంబంధము గలదు. ఏత ద్వంశ్యులు కొన్నితరములవఱకును బండితకవులై విద్యానగరప్రభువులచే నాస్థాన కవీశ్వరులుగా సమ్మానింపఁబడిరి. రెండవ డిండిమభట్టారకుఁడు రచియించిన యోగానందప్రహసన మనురూపకభేదమును బట్టియు. మూఁడవ డిండిమభట్టారకుఁడు రచియించిన సాహ్యాభ్యుదయ మను

పదునాల్గుసర్గముల మహాకావ్యమును బట్టియు వీరివంశవృత్తాంతము కొంత గుర్తింపనగును.

'అస్తి ఖలు గౌడేషు పరియేంద్రపురాగ్రహారనాయకమణేః సామవేద సాగర సాయాంతిర్కస్య, అష్టభాషాకవితా సామ్రాజ్యాభిషిక్తస్య,బల్లాళరాయకటకకవికులగర్వపర్వతవజ్రేః, నాగణకవిగజకేసరిణః,శ్రీకవిప్రభోః పౌత్రిః, పుత్రశ్శ్రీరాజనాథదేశికస్య, బ్రహ్మాండభాండపిచండమండలితవిజయడిండిమచండిమ్నః, శ్రీకంఠాగమశిఖండమండనమణేః, శ్రీడిండిమప్రభోర్దౌహిత్రః, శ్రీమదభిరామనాయిరాస్తనంధయః, సభాపతి భట్టారకాచార్యభాగినేయః, సరస్వతీ ప్రసాదలబ్ధకవితాసనాథః, శ్రీమానసుణగిరినాథః తేన కృతేన యోగానంద నామ్నా ప్రహసనేన సభానియోగమను తిష్ఠామి'' -

పైవాక్యములవలన నీయోగానందప్రహసనకర్త డిండిమకవి సార్వభౌముఁడని బిరుదాంకనామధేయముగల యరుణగిరినాథుఁడను గౌడబ్రాహ్మణుఁడని తెలియుచున్నది. మఱియు నాతని పితామహుఁడు కవిప్రభుఁడనియు, నాతఁడు బల్లాళ (దోరసముద్రము) రాయాస్థాన కవీశ్వరులగర్వ మడంచినవాఁడనియు, నాగణ యను కవీశ్వరు నోడించినవాఁడనియును,- దండ్రి రాజనాథ దేశికుఁడనియును -మాతామహుఁడు డిండిమ ప్రభుఁడనియు, నాతఁడు విజయడిండిమము గల వాఁడనియు, శైవవేదాంతపారంగతుఁడనియును- దల్లి యభిరామనాయిక యనియు - మేనమామ సభాపతి భట్టారకాచార్యుఁడనియు- నెఱుకపడుచున్నది. శ్రీకంఠాగమపారంగతుఁడై విజయడిండిమము నార్జించిన మాతామహుని యొద్దనుండియే యీయోగానందప్రహసన కర్తకు డిండిమకవిసార్వభౌమబిరుదమును, విజయడిండిమమును

లభించినవి. ఈతని పితామహుఁడే ప్రఖ్యాతకవీశ్వరుఁడుగాఁ గీర్తింపఁ బడెను. తండ్రి యట్టివాఁడుగా వర్ణింపఁబడలేదు. పై రూపకమునఁ గొన్నిచోట్ల నప్పటిరాజు దేవరాయలుగాఁ దెలుపఁబడియున్నది. భరతవాక్యమున ''దీర్ఘాయు ర్దేవరాయో దధతు వసుమతీచక్ర మాచంద్రతారమ్'' అని యున్నది. ఇనుక నీతఁడు దేవరాయ లను పేరు గల విద్యానగరప్రభు నాస్థానమున నుండినట్లు నిర్ధారింప నగును. దేవరాయ లనుపేరు విద్యానగరప్రభువులలోఁ బలువురకు బొసంగు నదియే యైనను ద్వితీయ హరిహరరాయల కుమారుఁడగు దేవరాయల యంచును, దర్వాత నాతని పౌత్రుఁడగు దేవరాయలయందును రూఢముగాఁ గన్పట్టుచున్నది. రెండవ దేవరాయల కిమ్మడిదేవ రాయలని ప్రౌఢదేవరాయలని ప్రతాపదేవరాయలని నామాంతరములు గలవు. యోగానందప్రహసనమునఁ బేర్కొనఁబడిన దేవరాయ లీయిర్వురుదేవరాయలలో నొక్కఁడయి యుండవలెను. రెండవ దేవరాయలే కాఁదగుననుట కొక యాధారము కలదు. సంస్కృతమున నిమ్మడిదేవరాయలు రచియించిన ట్లాతనిపేర మహానాటకసుధానిధి యను నొకయింపయిన కావ్యము కలదు. బాలకాండాంతమునఁ గల పద్య మిది:-

శ్లో. శ్రీమా నిమ్మడి దేవరాయనృపతి స్స్వర్లోకకల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తివిభవో విద్వజ్జనశ్లాఘితః।
ధీమా నాదిమకాండవస్తువిషయా న్వ్యస్తా న్మహానాటక
శ్లోకాన్వర్థపదక్రమోజ్జ్వలతరాన్ రమ్యా నకార్షీ ద్విభుః.

ఈ శ్లోకమున గల ''కల్లోలప్రతిమల్లసూక్తి విభవ'' యనుపద మేభేదమును లేక యట్లే డిండిమభట్టారకుని చాటుపద్యమునఁగూడఁ గలదు. ఉదాహరింతును:-

శ్లో. [1] అగ్రే డిండిమతాడనం తత ఇతో వందివజోద్ఘోషణం
ద్వితాశ్చిత్రపటాః కియంతి బిరుదప్రోతాని పద్యాని నః।
ఆస్తాం తావ దిదం మహేశమకుటీకోటీరకల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తి విభవైర్వేష్యాన్విజేష్యామహే

దీనివలన నిమ్మడిదేవరాయలకాలమున డిండిమభట్టారకుఁ డుండినట్లు తేలుచున్నది. మఱియు, మహానాటకసుధానిధి కూడ నాడిండిమభట్టారకునికూర్పే యగునో యని సందియము పొడముచున్నది. దేవరాయలే రచించినట్లుగల రతిరత్నప్రదీపికయను కామశాస్త్రముకూడ నిట్టిదే యగుఁగాఁబోలు! అయియుండును. అన్యకవీశ్వరరచితమురై ధనలోభమున రాజుల పేళ్ళఁ బ్రచురింపఁబడిన గ్రంథములు మన తెల్గుదేశముననే పరశ్శతము కలవు. ఆ కుళ్ళు పెల్లడింప వేఱు గ్రంథమే కూర్పవలసియున్నది. ఆవిషయ మట్లుంతము. ఈ ప్రౌఢదేవరాయల వారికాలమునఁనే యరుణగిరినాథుఁ డనుకవీశ్వరునిచే ద్రావిడభాష యందుఁ గొన్నిప్రౌఢములగు శైవస్తోత్రగ్రంథములు రచియింపఁ

---

1. మాకు – ఎట్టయెదుర విజయడిండిమపుమోగియింపు; ఇటునటు వంది జనులస్తోత్రములు; రెండు మూఁడు చిత్రపటములు (రూపప్రతిబింబములు?) మఱి కొన్ని బిరుదాంకితము లగు పద్యములు; గలవు. ఇవియట్లుండ–పరమేశ్వరుని జటాజూటమునందుఁ దొనఁకులాడు గంగానదితరంగములతోఁ బ్రతిపటింపఁ జాలు సూక్తివైభవములచేఁ బ్రత్యర్థిపండితులను జయింతుము.

ఉ. ముంగల జైత్రడిండిమపుమోగితలు; వందిజన స్తవార్భటుల్
చెంగట; రెండు మూఁడు తన చిత్తరువుల్; బిరుదాంకితంబు లిం
కం గల, వింతకంటె శితికంఠశిరస్సరిదూర్మిభంగి వా
గ్భంగు లెసంగు మాకుఁ బ్రతిపక్షబుధాళి నోడఁగొట్టఁగన్.

బడినవి. అయరుణగిరినాథుఁ డీయోగానందప్రసహనకర్త యరుణగిరినాథుఁడే యనునేమో విచారింపవలసియున్నది. కొంద ఱాతఁడు శూద్రుఁ డనుచున్నారు.

యోగానందప్రహసనము చాలవఱకు సభ్యమై మిక్కిలి హృద్యముగా నున్నది. ఇందలి యితివృత్తము తుంగభద్రాతీరమున విరూపాక్షేశ్వరుని తిరునాళ్ళలో జరిగినదిగాఁ గల్పింపఁబడినది.

ఈ వర్ణింపఁబడిన యరుణగిరినాథునకు రాజనాథదేశికుఁడను కుమారుఁడు గలఁడు. ఈతనికిని డిండిమకవిసార్వభౌముఁడని బిరుదనామము సంక్రమించినది. ఈతఁడే సాళ్వాభ్యుదయమను పదునాల్గు సర్గముల మహాకావ్యమును రచియించినవాఁడు. క్రీ. 1490 ప్రాంతముల విద్యానగరరాజ్యమును వశపఱుచుకొని పరిపాలించిన సాళ్వనరసింహరాయల ప్రాభవము లిందు వర్ణింపఁబడినవి. ఈకావ్యము నందఁ బ్రతిసర్గాంతమునను గద్యములు భేదించుచున్నవి. ఆమూలాగ్రము పరిశీలింపఁగా నిందుఁగొన్ని చరితోపయుక్తాంశములు కన్పట్టినవి. కవికి సంబంధించినవిమాత్రమే యిప్పుడు ప్రసక్తములు గావునఁ గొన్ని బిరుదములను పుటికొన్ని గద్యభాగములు నుదాహరింతును:-

" (1సర్గ) బిరుదకవి పరిపితామహ (5 సర్గ) దశరూపనారాయణ బిరుదమండన (6 సర్గ) రసికకవితాసామ్రాజ్యలక్ష్మీ పతి (8 సర్గ) నవనాటక భరతాచార్య (10 సర్గ) కవిమల్లగల్లతాడనపటు (11 సర్గ) పరితిభట కవికుంజరపంచాసన బిరుదమండన (12 సర్గ) చేర చోళపాండ్య ప్రథమారాధ్య హృదయశివాభిఖ్య డిండిమ కవి సార్వభౌమబిరుద శోణాధినాథాత్మజ (14 సర్గ) ద్వాదశ దేశ్యవృత్తి

పారదృశ్వనోఽష్టభాషాపరమేశ్వర స్యాభినవనాటకభవభూతే ర్మాఘస్య తివర్తి చిత్రప్రబంధపరమేశ్వరస్యాష్టదిగ్విజయపటహీకృతబిరుద డిండిమాడంబరస్య షడ్దర్శనషణ్ముఖస్య శైవశాస్త్రజీవాతో రఖిల వేద సాగర సాంయాత్రికస్య డిండిమకవిసార్వభౌమ ఇతి కృతాపరబిరుద నామ్నః శ్రీమదరుణగిరీశస్య తపఃపాకస్య డిండిమకవిరాజనాథస్య కృతౌ శ్రీసాళువాభ్యుదయే''–

ఈతఁడు గద్యములందుఁ బ్రస్తావించిన పూర్వతఁ దండ్రినిఁ బ్రఖ్యాతకవీశ్వరులని వర్ణించెను గాని పితామహునిఁబేరొక్కనినేలేదు. ఈతని తండ్రియగు నరుణగిరినాథుఁడును దన ప్రహసనమునఁ బితృ నామస్మరణము మాత్రమే కావించెను గాని యాతఁడు విద్వాంసుఁడని వర్ణింపలేదు. తన తండ్రియగు రెండవ డిండిమభట్టారకుని పాండిత్య ప్రభావము నీతఁడు గద్యములందు మిక్కిలిగాఁగీర్తించెను తత్తద్వి షయములను దెలుఁగున వివరించుట చర్వితచర్వణ మగునని వదలె దను. చేరచోళపాండ్యదేశములం దాతఁడు ప్రథమారాధ్యుఁడఁట! అష్టభాషాపరమేశ్వరుఁడఁట! అష్టదిగ్విజయపటహమగుబిరుదడిండిమా డంబరము గలవాఁడఁట! సాళ్వాభ్యుదయమును రచియించిన యా మూఁడవడిండిమభట్టారకునికుమారుఁ డరుణగిరినాథుఁడు. ఈతనికిఁ గుమారడిండిముఁడని బిరుదు. వీరభద్రవిజయమను పేరుగల డిమము నీతఁడు రచించినాఁడు. దానినుండి కవిచరిత్ర ప్రస క్తమగు గ్రంథభా గము నించుక యిందుఁబరించుచున్నాఁడను :

''సూత్ర – ఋణుతావత్ : సంతి ఖలు సంతతశివలింగారాధన వర్ధితో, గంగాతటాలంకార గౌడదేశచూడాపీడపరేందార్గిగహారనాయక సుతయః, శైవాగమజీవాతవః, చేరచోళ పాండ్యశిష్యకులసర్వ-వృత

శృంగారశ్రీనాథము

మహిమాన, స్సామవేదసీమానః, శ్రౌతాచారపూతాత్మానః, పవిత్రతర గౌతమ గోత్రజన్మానో. ద్విజన్మానః ... తదన్వవాయార్ణవ పూర్ణచంద్రస్య నాగణకవిగజ కేసరిణః సరసకవితాసామ్రాజ్యాను భోగ సార్వభౌమస్య కవిప్రభోః సృత్తరాజస్య పౌత్రిః, పరమమా హేశ్వరస్య పవిత్రతరచరిత్రస్య శివతత్త్వజ్ఞానశీలస్య శ్రీమతో రాజనాథస్య పురాతనపుణ్యపరిణామ స్సుధూ దభూతపూర్వ చతు ర్విధ కవితా స్వర్లోక సరిత్కల్లోలమాలా ..... రీప్రచండతర కాహల ఘంటాడిండిమవిరచిత బిరుదఘోషణో డిండిమ కవిసార్వ భామాపరనామా శ్రీమా సరుణగిరినాథోనామ: —

నటీ – (భా) యో బిరుదకవి ప్రపితామహ ఇతి ఫణితః–

సూత్ర–

శ్లో. తతోఽజని బుధోత్తమా త్తదుపమానవా గ్వైఖరీ
యశోభి రుపశోభితో యమకచిత్రవృత్త్యా కవిః
ప్రచండజయడిండిమః ప్రథితిన ప్రబంధ కియా
చమత్కృతసమగ్రథీ స్సఖలు రాజనాథః కృతీ!

నటీ – యం దశరూప నారాయణాపరనామానం భణంతి.

సూత్ర – తస్య ఖలు దుర్గాదేవీ సహచరస్య చతుర్విధ కవితా చాతుర్యస్య సూనునా కుమారడిండిమకవినా ఆరుణగిరినాథేన ప్రణీతో వీరభద్రవిజయాభిధానో డిమప్రబంధోఽస్మాకం హస్తే నివేశితోఽ భినీతపూర్వశ్చ.''

గ్రంథాంతగద్యము:-

''బిరుదకవి పితామహస్య బిరుదడిండిమవ్యాజ సంతాడితవిమత కవిగండమండలస్య డిండిమకవిసార్వభౌమస్య శ్రీమతో ఽరుణగిరినాథస్య పౌత్రేణ విచిత్రితర చిత్రయమకకావ్యధూర్వహస్య అప్రతిరూప బహురూపక సృష్టికౌశలపరమేష్ఠినః పరమమాహేశ్వరస్య చతుర్విధకవితాచాతుర్యధుర్యస్య రాజనాథాచార్యస్య పుత్రేణ పవిత్రితర గౌతమగోత్రేణ గంగాతటాలంకార గౌడదేశాలంకార రత్నపీఠపైరందగ్రహారమౌళిమణినా దుర్గాదేవీస్తనంధయేన షడ్భాషాసార్వభౌమేన కుమారడిండిమకవినా అరుణగిరినాథేన ప్రణీతే-''

ఈ యుదాహృతగ్రంథభాగ మింతకుముందు గుర్తింపఁబడిన విషయములను గొన్నింటిని స్థిరపఱుచుటేకాక మఱికొన్ని విశేషములఁగూడ నెఱిఁగించుచున్నది. యోగానందప్రహసనకర్తయగు నరుణగిరినాథుని మాతామహుఁడు 'కవిపర్వతు' వని యీవఱకు గుర్తించితిమి. ఆతని పేరు నృత్తరాజు (నటరాజు) అని యిది తెల్పుచున్నది. ఆయరుణగిరినాథుని తండ్రి యంతగాఁ బండితుఁడు కాఁడనుట నిదియు నెఱిఁగించుచునేయున్నది. ఈ రెండవ యరుణగిరినాథుఁడు (కుమారడిండిముఁడు) వీరనరసింహరాయల కాలమందును శ్రీకృష్ణదేవరాయల వారి కాలమందును నున్నవాఁడగును; ఈతని తండ్రి రాజనాథుఁడు. సాళ్వగుండ నరసింహరాయలకాలమందున్నవాఁడుగదా! వీరనరసింహరాయల కాలమందు డిండిమకవి కలఁడని కుమారధూర్జటికవి రచియించిన కృష్ణరాయవిజయమను ప్రబంధము తెల్పుచున్నది. విద్యానగర నిర్మాణాది చరిత్రము తెలుపుచుని వీరనరసింహరాయఁడుకోరఁగా

మ రమణీయా ద్భుతరంగిణీఘుమఘుమారావార్థగంభీరవా
క్ప్రమజఃపూనిలధూతదుష్కవిమహాగర్వాభ్రసంఘుండు ది
గ్రమణీమౌక్తికహారబంధురయశోరాజద్గుణాఢ్యుండు డిం
డిమపుంభావసరస్వతీంద్రుఁ డనియెన్ భీవిన్ ప్రకాశించుచున్.

మ. అని యాడిండిమసార్వభౌమకవి ప్రఖ్యాతంబుగాఁ దత్పురా
తనవృత్తాంతము నెల్లఁ దెల్పినఁ జమత్కారంబు వీక్షించి యా
జననాథాగ్రణియున్ సభాసదులు నుత్సాహంబునంబొంది కాం
చనభూషాదులొసంగి రెంతయు దయాసంరంభధౌరేయులై.

ఈ నాల్గవడిండిమభట్టారకుని కుమారుఁడు రాజనాథుఁడు. ఈతఁ డచ్యుతదేవరాయల యాస్థానమునఁ గవీశ్వరుఁడుగా నుండెను. అచ్యుతరాయాభ్యుదయ మను పేరఁ బండ్రెండు సర్గముల కావ్యము నీతఁ డాతనిప్రభ స్తిని వర్ణించుచు రచించెను. అచ్యుతదేవరాయలకాలము సను శ్రీరంగరాయలకాలమునను సభాపతిభట్టారకుఁడను కవీశ్వరుఁడు శాసనాచార్యుఁడుగా నున్నాఁడు. ఆతఁ డీడిండిమభట్టారకుల మాతృవంశ మునజనించినవాఁడయియుండును మొదటియిరుణగిరినాథునిమేనమామ సభాపతి భట్టారకుఁడుగాన యీసభాపతి భట్టారకుఁ డాతనిప్రపౌత్రుఁడో ప్రప్రపౌత్రుఁడో కావచ్చును. అరుణగిరినాథకృతులు పంచకావ్య వ్యాఖ్యలున్నవి. మఱియుసౌందర్యలహరీవ్యాఖ్యసత్యభామాపరిణయనాట కము మొదలగు గ్రంథము లనేకము డిండిమ బంధుసంతతివారు రచించినవి కలవు. వీరికి శైవమతమం దభినివేశము మెండు. కవిత్వ దర్పము హెచ్చు. వైదికాచారసంపత్తి శ్రౌతకర్మానుష్ఠాననిష్ఠయుఁ గల్గి రాజపూజ్యులై యాగ్రహారికులై వీరు దిగంతముల విజయ డిండిమము మ్రోగించుచు నఖండపృథివీ నార్జించిసవారయి యుండిరి.

పయినిజెప్పఁబడిన డిండిమభట్టారకుల పంశవృత్తాంతాదిక మును దెలుపు గ్రంథమొకటి విభాగరత్నమాలయని కలదు. అది డిండిమవంశ్యులు రచించినదే. దానిసారము నిక్కడఁ జెప్పుచున్నా డను :-

చోళరాజు గంగాయాత్రచేసి విశ్వేశ్వరుని దర్శించి కాంచీ మండలమున శివాలయములను నిర్మింపఁగోరి గంగాతీర వాసులయిన బ్రాహ్మణుల నెనిమిదికుటుంబములవారిని బిలుచుకొనివచ్చెను. వ్రాసా దవల్లభయజ్వ, భాస్కరకవి, రాజనాథకవి, సుబ్రహ్మణ్యకవి, జటా ధరేశయజ్వ, నీలకంఠకవి, సోమనాథదీక్షితుఁడు, మల్లిభార్జునభట్టు నని వారిపేళ్ళు. తుండీరమండలమునఁ దల్పగిరికిఁ బడుమట నాచోళరాజుచే నీయఁబడిన యగ్రహారమున వారు వసించిరి. ఆయగ్రహారమునకు రాజనాథపురమని పేరిడిరి. అందు రాజనాథుఁడను శివునిఁ బ్రతిష్ఠించిరి. నాల్గయిదుతరములు కడచినవి. ప్రాసాదవల్లభయజ్వకు సభాపతియను కొడుకు కల్గెను. పాండ్యచేరచోళ రాజు లాతనికి శిష్యులయిరి. ఆతఁడు ఢక్కావాద్యాదిసమ్మానములఁ బడసెను. ఆతని మునిమనుమఁడు భాస్కరార్యుఁడు. ఈతడు ప్రసన్నకావ్యకర్త. ఈతనివంశమున త్యాగ రాజు జనించెను. ఈతఁడు కామకోటిపీఠమున విద్యాజయస్తంభమును నెలకొల్పెను. త్యాగరాజునకు స్వయంభూయజ్వ, గురుస్వామిబుధుఁడు ననువారు జనించిరి. ఇట్లే తక్కినయేడ్డురి వంశంబులను బ్రఖ్యాత విద్వాంసులు జనించిరి. పంపకములలో వీ రేకవింశతికులములవా రయిరి. అందు స్వయంభువునకుసభాపతియని కుమారుఁడును, గురు స్వామిబుధునకు సభిరామాంబికయని కూఁతురును, సోమనాథుఁడను కుమారుఁడును జనియించిరి. ఆ యభిరామాంబికను గౌతముఁడగు రాజనాథుఁడు పెండ్లాడెను. ఆన్వర్థనామధేయయగు నాయభిరామాంబిక

పుష్పవతికాకముందేపదుమూఁడవయేట సరుణగిరినాథుఁడనిఁ కుమారునిఁ గనెను. అప్పటికిఁ గలి నాల్గువేలనాల్గువందలు కడచెను. రాజనాథుఁడు కుమారుస కుపనయనముకాకముందే శివలోకమునకరిగెను. అభిరామాంబికయుఁ గుమార్తునిఁ దస సోదరుఁడగు సోమనాథమఖి కప్పగించి భర్త సనుగమించెను. సోమనాథసుఖియు మేనల్లుఁడగు నణరుగిరినాథునిఁ దనపుత్త్రిల కంటె నెక్కువ గారాబముతోఁ బోషించుచుండెను. అరుణగిరినాథుఁడు పదమూఁడేండ్లకే వేదాధ్యయనము చేసెను. మేనమామభార్య కకారణ క్రోధము జనించెను. అది మేనమామ యెఱుఁగఁడు. బాధపడఁజాలక యరుణగిరినాథుఁ డిల్లువిడిచి నవగ్రామము (పుత్తూరు) చేరి యక్కడ నొక్కశివాలయమున శివు నారాధించుచుఁ బడియుండెను. సోమనాథయజ్వ మేనల్లునిఁ గానక యూళ్ళు నాళ్లు వెదకి వేసారెను. మూఁడవనాఁటియుదయమున నదీతటమున నాటాలుఁడు తమ్ముయుమ్మిచే నెఱ్ఱవాతిన పెదవితోఁ గానపచ్చెను. సోమనాథయజ్వ యాబాలునిఁ గౌఁగిలించుకొని "నాయనా! ఇదియే" మని యడిగెను. "నవగ్రామమున కూరకవచ్చి బడలికచే నీశ్వరాలయమున నిద్రించితిని. ఆర్ధేందు శేఖరుఁడు (పత్యక్షమై నన్ను మేల్కొల్పి నిదార్శి స్వభావముచేఁ దెఱపిగానున్న నానోరఁ దమ్మ నుమిచెను. కావున నా నోఁ రెఱ్ఱవాతెను. కడిగికొనుట కిక్కడికి వచ్చితిని," అని చెప్పెను. ఆతఁ డప్పుడు శివునిమీఁద ననేకస్తోత్రములు రచించెను. క్రొత్తగా నభిషిక్తుఁడయిన (ప్రౌఢదేవరాయల నాతఁడు కవిత్వశక్తి చేతను, వివాదచాతుర్యముచేతను మెచ్చించెను. (ప్రౌఢదేవరాయఁడు నీతఁడును మిత్రులయి తుల్యాంబరాభరణులయి యేకమనస్కులయి వర్తిల్లిరి. యజ్ఞాంబిక యను కన్యను వివాహమై యాతఁ డనేక యజ్ఞములఁ జేసెను. తల్(గామమునకు దక్షిణముగా నౌదుంబరపుర

ముసకు దూర్పుగా సవగ్రామమునకు వాయవ్యముగా బ్రౌఢదేవరాయ లొక యారామము నిర్మించెను. తూర్పుపడుమఱలకు క్రోసును, ఉత్తర దక్షిణముల కర్ధక్రోసును నది వ్యాపించి యనేక ఫలపుష్పములతో నాగవల్లీక్షుఖండాదులతో బెంపొందుచుండెను. రా జాతోటకు నీలగిరి యని పేరుగల కోమటి నధికారినిగా నియోగించెను. ఈ యుద్యాన మును జూచి రాణియగు రుక్మిణి ప్రమదోద్యానముగా గైకొనెను. ఉద్యానజీవియగు నానీలాద్రి దనికుడయి గర్వితుడయ్యెను. అరుణగిరి నాథునిపసు లాతోటలోని మేత కలవాటుపడియుండెను. నీలగిరి దానిని నిషేధించుచుండెను. ఒకనా డాతడు "రేపటినుండి తోటకు వచ్చె నేని పసులను గట్టిపెట్టెద" నియు, "వాని విడిపింప దక్షిణాధీశు డగు దేవరాయలయనుజ్ఞ పొందవలసినదే" యనియు గద్దించి పలికెను. మర్నాడును బశువు లరిగెను. నీలగిరి యాపసులఁ గట్టిపై చెను. పాలకు విడువఁడయ్యెను. అరుణగిరినాథుడు రాజున కది నివేదించి యిట్లు కోరెను: "నీ తోట పట్టును నాకగ్రహారముగా నొసఁగుము. అటు కాదేని నన్ను సన్యరాష్ట్రికుటుంబినిగా నెఱుంగుము." రా జిట్లనెను : "అది ప్రమదావనమగుటచే నీయఁబడదు. ఇతరత్ర యొసఁగుదును." కోపించి కవీశ్వరుడు ఢిల్లీపట్టణమున కరిగెను. ఢిల్లీసుర్రాణుని దర్శ నము దుర్లభమని యెఱిఁగి కోట వాకిట నొకశ్లోకార్థమును వ్రాసెను. "సుర్రాణా! నీ రాణిచెంత నిద్రింప నరుదెంచితిని," అని చాని యర్థము. అసూయాళువులగు తత్రత్యపండితులు సుర్రాణున కెఱిఁ గించిరి. అతఁ డాగ్రహభరితుఁ డయ్యెను. అతనికూఁతురు లవంగి వారించెను. "ఆర్థియు విద్వాంసుడు నగువా డెవఁ డిట్లు రచించును? అర్థ మేదో వేఱువిధముగా నుండును. ఆకవీశ్వరునిఁ బిలిపించి విచా రించుఁ"డనెను. సుర్రాణుఁడు పిలిపించి విచారించెను. అలంకారిక

సమ్మతముగా నుత్తరార్ధమును బూరించి చదివెను: "నీధాటివలని భయ
ముస నన్యదేశము లందు నిద్రలేకపోఁగా నీరాణిచెంత నిద్రింపవచ్చి
తిని." రాణియనఁగా నిక్కడఁ బరిపాలితదేశము. అనపాయుఁడను
కవిమల్లుఁడు పాదమున జయనూపురమును ధరించి డిండిమవాద్య
ముతో రాజసన్నిధిఁ బూజితుఁడుగా నుండెను. ఆతఁ డీతని గర్వించెను
ఇర్వురకు వివాదమేర్పడెను. ఇర్వదిమూఁడు దినములు వాదించిరి.
సర్వశాస్త్రములందు విచారము జరిగెను. గర్వితుఁడగు నాకవిమల్లుఁడు
నిగ్రహింపఁబడెను. ఆతని బిరుదుల నరుణగిరినాథుని కిప్పించి మణి
రంజితమయిన సువర్ణాసనమున సభిషిక్తునిజేసి "విద్యాడిండిమ శోణ
శైలకవి" యని యాసురత్రాణుఁ డరుణగిరినాథునిఁ బేర్కొనెను.
మఱికొన్ని విద్వత్త్వ కవిత్వపరీక్షలు జరిగెను. సురత్రాణుఁడు కరము
పరితోషించెను. "ప్రాచీభాగే సరాగే" యనుశ్లోక మప్పుడాతఁడు రచిం
చినది. ఆయరుణగిరినాథుఁడు డిండిమకవిసార్వభౌముఁడని పేరు
వహించి రామపదాంకితముగు కావ్యమును, డిమమను రూపకమును
రచించి యక్కడ ప్రఖ్యాతి గాంచెను. ఆసురత్రాణునికడనుండి
యాజ్ఞాపత్రమును గొనివచ్చి ప్రౌఢదేవునకుఁ జూపెను. తాను
తొలుత కోరిన ప్రమదావసథూమిని ప్రౌఢదేవుఁ డగ్రహారముగా
నొసఁగెను ఆయగ్రహారవిభాగాదిక మావలఁ జెప్పఁబడినది. ఈ వి
భాగరత్నమాల డిండిమ వంశ్యులగు సటీవలివారిచే రచింపఁబడినట్టున్నది.
దీనిలో సత్యమెంతో? అసత్యమెంతో? ఇంతకంటె మన కప్పటివారి
గ్రంథములే యెక్కువ ప్రమాణము. జగన్నాథపండితరాయలకు సంబ
ద్ధముగా 'లవంగి'కథ వాడుకగా నున్నది. ఈ విషయమింక విడిచెదను

మీఁద వర్ణింపఁబడిన డిండిమభట్టారకులలో మన శ్రీనాథకవీశ్వ
రునకుఁ బ్రత్యర్థియుగునాతఁ డేతఁడో కనుఁగొన వలసియున్నది.

కవితార్కికసింహ సర్వతంత్రస్వతంత్రాదివిరుదమండనుఁడై విశిష్టాద్వైతమతమును బెంపొందించిన వేదాంతదేశికులకును డిండిమభట్టారకునకును మహావివాదము జరిగినట్లు దక్షిణదేశమున నొకయైతిహ్యము పండితపరంపరాగతముగాఁ జెప్పుకొనఁబడుచున్నది.

వేదాంతదేశికులకును, డిండిమభట్టారకునకును శ్రీరంగపురమున వివాదము పొసంగెననియు నప్పుడు వారిర్వురును బరస్పరము సమస్యల నొసఁగికొని పూరింపఁజొచ్చిరనియు నందు దేశికులు "కళింద నందినీతటే ననంద నందనందనః" అని నిరోష్ఠ్యసమస్య నొసఁగఁగా నందలిమర్మమును గుర్తింపక భట్టారకుఁడు సోష్ఠ్యముగానే పూరించుటచేఁ బరాభూతుఁడయ్యెననియు దాక్షిణాత్యపండితులు చెప్పుచున్నారు.

ఆవివాదముననే డిండిమభట్టారకుఁడు:-

శ్లో. 1 "ప్రాజ్ఞానా మేవ రాజ్ఞాం సదసి న పహతే వాచ మల్పేతరేషాం
క్షుద్రే ష్వాక్షేపముద్రాం యది చ స సహతే డిండిమ సార్వభౌమః
ధాంకుర్వ న్దైకకుక్షింభరిషు భయభరభ్రాంత భోగీంద్రసూభూ
భ్రూణభ్రంశీ కి మంభః ఫణిషు పతగరాట్సంభ్రమి బంభ్రమీతి"

అనియును, – వేదాంతదేశికులు –

---

1 డిండిమసార్వభౌముఁడు ప్రాజ్ఞులే యగు భూపాలసభాంయం దల్పేతరుల వాక్కులను సహింపఁడు. కాని, క్షుద్రులుచేయు నాక్షేపముద్ర కూరకుంచును. లెక్కింపఁడు. నెఱ్ఱాదులకు భయాతిరేకముచే గర్భస్రావము గలుగఁజేయు గరుడఁడు, బెకబెకలాడు చిఱుగప్పలతోఁ బొట్టనించుకొనుచుండు బురుదపాములపై కాటోపముతోఁ బోరఁడు సుమా!

శృంగారశ్రీనాథము

శ్లో 1 బాహ్యో ర్వర్ణాడంబరై ర్మాభమంతు
సమ్యక్ఛిత్వాఽభ్యంతరం శోధయంతు।
నిర్జేతారో నీరసత్వేన కో వా
డిండీరాణాం డిండిమానాం చ భేదః.

అనియును బరస్పరము నిందించుకొనిరఁట! రసార్ణవ సుధాకరకర్త యసఁబరగు సర్వజ్ఞసింగభూపాలుఁడు వైష్ణవ మతాభిమాని యైష్టుఁడై తసయాస్థానమునుండి కొన్ని మతరహస్యములను దెలిసికొని వచ్చుటకు వైష్ణవులను గొందఱు దేశికుల యొద్ద కనిపెనినియు దేశికులును రహస్యసందేశ, తత్త్వసందేశ, సుభాషితనీవ్యాదిగ్రంథముల రచియించి సింగభూపాలుని కొఱ కనిపెసనియు నొకయైతిహ్యము కలదు. దేశికుల తత్త్వసందేశోపసంహారమున—

శ్లో. శ్రుతివిధచిదచిదీశలక్ష్యతంత్రే
యతిపతియామున భాషితే నియోక్తుః
ఇద మితి నిగమాంతదేశికేన
ప్రతినమదిశ్యత మాధవాత్మజన్మ.

అనియున్నది. ఈమాధవాత్మజుఁడే సర్వజ్ఞ సింగభూపాలుఁడని తర్వాతి వైష్ణవగ్రంథములు వాకొనుచున్నవి.

---

1. ఓప్రాజ్ఞులారా! పయిపయిఁ ర్ణా (అక్షరములు—రంగు డంబరములతో మోసపోవకుఁడు. తిన్నఁగా ఛేదించి (పదచ్ఛేదముచేసి —చీల్చి) అంతరమును శోధింపుఁడు. నీరసత్వముచే (నిర్ + రసత్వము, నీర+నత్వము) డిండీరములకును డిండిముఁకును భేదముగలదా!.

శ్లో. వ్యాఖ్యాకృచ్ఛతకోపముఖ్యవచసాం సర్వజ్ఞసింహాయ స
ద్రాజేత్తృహితాత్మకాని రచయన్ సూక్తాని యః ప్రాహిణోత్.
— ఆచార్యద్వాత్రింశత్.

శ్లో. తతశ్చ సర్వజ్ఞనృసింహభూపః
ప్రాగేవ రామానుజదర్శనస్థః
తీవ్రాం ముముక్షా మధిగత్య తస్మి
న్గురౌ భరన్యాస మపేక్షతే స్మ.
శ్రీవైష్ణవాగ్ర్యా అపి తత్ప్రయుక్తాః
ప్రణమ్య భూయః పదపద్మయుగ్మమ్,
ముముక్షు మేనం గురుసార్వభౌమే
సమర్పయామాసు రనన్యరక్షమ్
సోఽయం మహాకారుణికాగ్రగణ్యో
నిజాంతరంగై ర్వినివేదితార్థః
అంగీచకార స్వయమేవ రక్షా
భరం ముముక్షుప్రవరస్య తస్య!
— నిగమాంతదేశిక సచ్చరిత్రరత్నావళి.

ఇంక ననేకగ్రంథములందుఁ గలదు. రసార్ణవసుధాకర కర్త యనఁబరగు సింగభూపతి క్రీ. 1390 ప్రాంతకాలమున నున్నాఁడు. దేశికులు 1270 మొదలు 1370 వఱకుఁ గలరని గురుపరంపరా ప్రభావమందలి యీ శ్లోకముతెలుపుచున్నది:

శ్లో. శ్రీధీయోగ్యే శకే శుక్ల ఉదభూ ద్వేంకటేశ్వరః
లబ్ధప్రాయే శకే ప్రాయా ద్వాన్మేన పరమం పదమ్.

వీరిని సమకాలమువారినిగా సంఘటించుట క్లిష్టకల్పన మగుచున్నది. మన శ్రీనాథకవీశ్వరుఁడు సర్వజ్ఞసింగభూపాలుని దర్శించె ననునది యెల్లరకును వెల్లడిగాఁ దెలిసినవిషయము. సామాన్యదృష్టితోఁ బరిశీలింపఁగా నీయైతిహ్యములనుబట్టి డిండిమభట్టారకుఁడును దేశికు

లును సర్వజ్ఞసింగభూపాలుఁడును శ్రీనాథుఁడును సమకాలమువారని గోచరించును. వేదాంతదేశికులు మృతినొందినతర్వాతఁ బదునైదు సంవత్సరములకుఁ గాని మన శ్రీనాథకవీశ్వరుఁడు జనింపలేదు. నలు బదిసంవత్సరములకుఁ బైపడిన వయస్సుననే శ్రీనాథకవీశ్వరుఁడు డిండిమభట్టారకునితో వివదించినట్టు నిర్ధారణ మేర్పడుచున్నది. కావున దేశికులతో వివదించిన డిండిమభట్టారకుఁడే శ్రీనాథునిప్రత్యర్థి యగు నమట సంగతముగాదు. మఱియు డిండిమభట్టారకుని జయించిన తర్వాతనే శ్రీనాథునిచే దర్శింపఁబడిన సర్వజ్ఞసింగభూపాలుఁడు దేశికుల సమకాలమువాఁడగుననుట యత్యంతాసంభావ్య మగును.

శ్రీకంఠాగమశిఖండమండనమణియై విజయడిండిమముఁ దాలుత నార్జించిన డిండిమప్రభుఁడును (యోగానందప్రహసనకర్తమాతామహుఁడు) వేదాంతదేశికులును సమకాలమువారగుదురు. కావున దేశికునిప్రత్యర్థి ప్రథమడిండిమప్రభుఁ డని నిర్ధారింపఁదగును. శ్రీనాథుని ప్రత్యర్థి ప్రౌఢదేవరాయలకాలమునఁ గల యోగానందప్రహసనకర్త ద్వితీయ డిండిమభట్టారకుఁ డగును. శ్రీనాథుఁడు ప్రౌఢదేవరాయల యాస్థానముననే కనకాభిషేకదిసత్కారమును గాంచినట్టు స్పష్టముగాఁ దెలియుచున్నది.

ఇఁక - సర్వజ్ఞసింగభూపాలు నిర్వరని వెల్గోటివారి వంశ చరిత్రములు తెల్పుచున్నవి. రసార్ణవసుధాకరకర్త యనఁ బరగునాతఁడు తద్వంశమున నేడవతరమువాఁడఁట! ఆతఁడు దేశికునికాలమువాఁడు. శ్రీనాథునిచే దర్శింపఁబడిన సింగభూపతి పదవతరమువాఁడట! శ్రీనాథునిచే దర్శింపఁబడిన సింగభూపతి రసార్ణవసుధాకరకర్తనాఁబరగు సింగభూపతి కాఁడనుట నిస్సంశయాంశము. రసార్ణవసుధాకర

కారునకు సర్వజ్ఞబిరుదము లేదని నేను నిర్ణయించుచున్నాను. ఈవిషయమునఁగల ప్రబలకారణములు ప్రకరణాంతరమున వివరింపఁబడును. రసార్ణవసుధాకరమున సింగభూపాలుఁ డనపోతాత్మజుఁడని కలదు. దేశికుని తత్త్వసందేశోపసంహారశ్లోకమునమాధవాత్మజుఁ డనికలదు. ఇదియెట్లో! దేశికులగ్రంథమందు స్పష్టముగా మాధవాత్మజుఁ డనియుండఁగా దానికి విరుద్ధముగాఁ దర్వాతివారు సర్వజ్ఞసింగభూపతియని వ్రాయువాఁతలు విశ్వసింపఁ దగినవికావు. దేశికులు సర్వజ్ఞసింగభూపతిపేరు చెప్పలేదు. మనకుఁ దెలియవచ్చుచున్న సింగభూపతుఁ మాధవాత్మజులుగారు. ఆవంశమున మాధవుఁ (మాచానేఁ) డున్నాఁడు ఆతఁడు రసార్ణవసుధాకరకారుని పిన్నతండ్రి. తత్పుత్త్రునికి దేశికుల వారు గ్రంథముల నంపియుండురు. సింగభూపాలుర విషయమును ప్రకరణాంతరమున వివరించి తెల్పెదను.

అష్టదిగ్విజయ పటహీకృతబిరుదడిండిమాడంబరులును, గవి సార్వభౌములును నగు ద్వితీయ తృతీయ డిండిమభట్టారకులు కర్ణాటాధీశ్వరుల యాస్థానకవీశ్వరుని కనుఁగొంటిమి. ద్వితీయడిండిమభట్టారకుఁడు క్రీ. 1446 వఱకుఁ గల్గు ప్రౌఢదేవరాయలయొద్దను, తృతీయ డిండిమభట్టారకుఁడు క్రీ.1490 ప్రాంతములఁగల్గు సాళ్వ గుండనరసింహరాయలయొద్దను, గలరని తెలిసికొంటిమి. వేదాంతదేశికులప్రత్యర్థి ప్రథమడిండిమప్రభుఁడనియు, శ్రీనాథుని ప్రత్యర్థి ద్వితీయ డిండిమకవిసార్వభౌముఁ డనియుఁ దేల్చితిమి. ఇంక శ్రీనాథడిండిమభట్టారకుల వివాద మెక్కడ నేవిధముగాఁ బొసంగెనో కనుంగొన వలసియున్నది.

శృంగారశ్రీనాథము

శ్రీనాథుఁడు కర్ణాటప్రభునాస్థానమున కరిగినట్టు కొన్నియైతిహ్యములే కాక చాటుపద్యములును జాటుచున్నవి. కర్ణాటాధీశ్వరుఁడగు ప్రౌఢదేవరాయని దర్శింపఁగాఁ గొండపీటి నుండి శ్రీనాథుఁడు విద్యానగరమున కరిగెను. రాజదర్శనమునకుఁ బూర్వము తదాస్థాన విద్వాంసులను దర్శించి వారిమెప్పును దోడ్పాటును సంపాదించుకొన వలయునుగదా ! ప్రౌఢదేవరాయని యాస్థానమున విద్వాంసులుగానున్న ముమ్మకవి డిండిమభట్టు మొదలగువారిని దర్శించెను. అప్పుడే శ్రీనాథునకు డిండిమునకు బెడసినట్టున్నది. ముమ్మకవిని గూర్చి శ్రీనాథుఁ డార్జవముదోఁపఁగాఁ జెప్పినపద్య మిది :

సీ. పంపావిరూపాక్ష ఓహుజటాజూటికా
రగ్వధప్రసవసౌరభ్యములకు
తుంగభద్రాసము త్తుఁగవీచీఘటా
గంభీర ఘుమఘుమారంభములకు
కళసాపుర ప్రాంత కదళీవనాంతర
ద్రాక్షాలతాఫల స్తబకములకు
కర్ణాటకామినీ కర్ణహాటకరత్న
తాటంకయుగ ధాళధళ్యములకు

గీ నిర్నిబంధనిబంధమై నెనయు కవిత
తెలుఁగునను సంస్కృతంబునఁ బలుకనేర్చు
ప్రౌఢదేవేంద్రరాయ భూపాలవరుని
సమ్మఖంబున దయఁజూడు ముమ్మసుకవి!

కొండపీటి వర్ణన సీసపద్యము శ్రీనాథుఁ డీసమయమునఁ జెప్పినదిగా నుండఁదగును. ముమ్మకవి యడిగెను: "అయ్యా! మీరు

రెడ్డిరాజుల యాస్థానమున విద్యాధికారిగా నుంటిరి గదా ! మీ బిరుదు లేమి? తెలుపరై తిరే'' యని. శ్రీనాథుఁ డిట్లనెను:

"చ. తరువున గాండివం బిడఁడె ధర్మజునానఁ గిరీటి, యేను వా
క్పరసిజనేత్రయానతి విదారముచొప్పున గర్వహీనతన్
మరలి తెనుంగుభూమి కసమానగతిన్ గొనిపోవువాఁడనై
బిరుదులు నారివాగుకడఁ బెట్టితి సత్కవిసార్వభౌముఁడఁ."

ఈ పద్యమునర్థము మిక్కిలి లోఁతయినది. ''సత్కవిసార్వ భౌముఁడన్'' అనుట యష్టదిగ్విజయ పటహీకృత బిరుదడిండిమాడం బరుఁడును గవిసార్వభౌముఁడును నయి యక్కడ నున్న డిండిమ భట్టారకునకును దుస్సహమయ్యెను. స్పర్ధ యేర్పడెను. డిండిముని పుకుబడిచేతనో యేమో రాజదర్శనము వెంటనే శ్రీనాథునకుఁ గలుగ లేదు. దేశపర్యాటనబట్టి తలకుఁ గుళ్లాయును, మేని కంగరకాయును దాల్చుట మొదలగు నసభ్యస్తవిషయము లక్కడ శ్రీనాథునకుఁ దట స్థించెను. ఆదేశమువిధము తనకు సరిపడకుండెను. కర్ణాటరాజ్యలక్ష్మికి వేఁడికోలుగా నాతఁ డప్పు డీక్రిందిపద్యముఁ జెప్పెను :

"ఆ కుల్లాయుంచితిఁ గోఁకసుట్టితి, మహాకూర్పాసముఁ దొడ్గితిఁ
వెల్లులిఁ దిఁపిష్టముఁ మెనవితిన్ విశ్వస్త వడ్డింపఁగాఁ
జల్లా యఁటలిఁ ద్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిన్
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా? నేను శ్రీనాథుఁడఁ.

''అమ్మా! నాకుఁ బెందలకడ రాజదర్శనాదికము సమకూర్చి స్వదేశమున కరుగ నెలవిమ్మా'' యని యిట్లు వేఁడికొనెను.

దర్శనము లభింపకపోఁగాఁ బ్రౌఢదేవరాయనికడనేదో యసందర్భముగా శ్రీనాథునిఁగూర్చి ప్రసంగము జరిగెను. శ్రీనాథున కది తెలియపచ్చెను. ఈక్రిందిపద్యముచెప్పి ప్రౌఢదేవరాయల కనిపెను:

సీ. డంబు సూపి ధరాతలంబుపైఁ దిరుగాడు
కవిమీఁదఁ గాని నాకవచమేయ
గుప్తప్రయోగంబుల దొరకొని చెప్పెడు
కవిశిరస్సునఁ గాని కాలుచాఁప
సంగీత సాహిత్య నరనవిద్యల నేర్చు
కవుల తొమ్మిలు గాని కాల్చివిడువ
చదివి చెప్పఁగనేర్చి సభయందు విలసిల్లు
కవినోడు గాని ప్రక్కలుగఁ దన్న

దంట కవులకు బలువైన యింటిమగఁడఁ
గవులవాదఁబు ఎనవేత్తఁ గల్గెనేని
నన్నుఁ బిలిపింపు మాస్థాననన్నిధికిని
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర!

తరువాత రాయలు సభ కూర్పించెను. రాయలసన్నిధిని శ్రీనాథునకును డిండిమభట్టారకునకున్ను వైరమువర్ధిల్లెను. కవితావిషయమున వారిరువురు విజిగీషువులై వివదించిరి. డిండిమభట్టారకునకున్న కవిసార్వభౌమబిరుదమును శ్రీనాథుఁడుకూడఁ దాల్చుటచేతవివాద మేర్పడినదనుటకు ''బిరుదులునారివాగుకడఁబెట్టితి సత్కవిసార్వభౌముఁడఁ'' అని శ్రీనాథుఁడుచెప్పికొన్నపద్యమును శ్రీనాథుని బావమఱఁది దగ్గుఁబల్లి దుగ్గన్నచెప్పినఁ: ''కవిసార్వభౌముఁడై కర్నాటవిభుచేతఁ గనకరత్నాభిషేకములు గొనిన'' యనుపద్యచరణముకూడ సాధకమగు. వివాదవిషయ

విశేషములు తెలియరాపు గాని యది యుద్భటముగా జరిగినట్లు మాత్రము తెలియుచున్నది. ప్రౌఢరాయ లప్పుడు బాలను, యువతిని, ప్రౌఢను, లోలను గూర్చి నాలుగుపద్యములు చెప్పఁగోరఁగా శ్రీనాథుఁడు చెప్పెనఁట! అందొకటిమాత్రము చాటుపద్యమణిమంజరి రెండవభాగమునఁ జేర్చితిని : కర్ణాటకక్ష్మానాథేంద్రుసభక గవిత్వవిజయోత్సాహంబు నైకొన్న మా శ్రీనాథున్" అని రాధామాధవకవి చెప్పినాఁడు కాన యా వివాదము కవిత్వవిషయమున జరిగినదని యేర్పడుచున్నది. శ్రీనాథునిది యీ క్రిందిపద్యము :-

సీ. దీనార టంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశుమంత్రాలశాల
పగులఁగొట్టించి తుద్భటవివాద ప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూషక్రియాశక్తి రాయలయొద్ద
బాదుకొల్పితి సార్వభౌమబిరుదు
పలుకుఁదోడై తాఁద్రభాషామహాకావ్య
నైషధగ్రంథపందర్భమునకు

నెటుల మెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సరససద్గుణనికురుంబ! శారదాంబ!

గౌడడిండిమభట్టునకుఁ గంచుఢక్క కలదని యీవఱకే మన మెఱుఁగుదుము. ఆతఁడు వాదకుశలుఁడు, పాండిత్య దర్పము కల వాఁడు సని కూడా నెఱుఁగుదుము. శ్రీనాథుఁడు మాత్ర మేమి కొఱుకఁబడువాఁడా! నిన్నటిదాఁకఁ బెదకోమటివేమారెడ్డియాస్థానమున నిట్టి

పని పట్టియున్న వాఁడేకదా; శ్రీనాథునకు డిండిమునకు జరిగిన వివాదమునఁ జంద్రభూషక్రియాశక్తిరాయలనువారు మాధ్యస్థ్యము జరిపినవారు కాఁబోలును. ''చంద్రభూషక్రియాశక్తి రాయలయొద్ద బాదుకొల్పితి సార్వభౌమబిరుదు,'' అన్న చరణమున కర్థము పైవిధముగా నుండునని నే ననుకొనుచున్నాఁడను. ''చంద్రశేఖరక్రియాశక్తి'' ''చంద్రశేఖరుక్రియాశక్తి,'' యని కవిచరిత్రము మొదలగు వానిలోఁ గలదుగాని ప్రాచీనలేఖనము లన్నింటను ''చంద్రభూషక్రియాశక్తి'' యన్న పాఠమే కానవచ్చుచుండుటచే నేను దానినే కయికొన్నాఁడను. చంద్రభూషక్రియాశక్తిప్రసక్తిలోఁ గొండూరు శాసనము చదువవలసినది. అనుబంధమునఁ జూడఁదగును. క్రియాశక్తిస్వామి శిష్యుఁడయిన చంద్రభూషణాచారునికిఁ గర్ణాటా ధీశ్వరుఁడగు బుక్కరాయఁడు శిష్యుఁడని దానివలనఁ దెలియుచున్నది. ఆశాసనము క్రీ. 1349లో నెలకొల్పఁబడినది. శ్రీనాథునికాలమునకు సరిపడునదికాదు. ఆకాలమునఁ గర్ణాటాధీశ్వరులకు గురువులుగాఁగాశివలాస క్రియాశక్తి ప్రభృతులు క్రియాశక్తిపదలాంఛను లుండిరి. వారిపరంపరలోఁ ప్రౌఢరాయలకాలమునఁ గూడ నొక చంద్రభూషక్రియాశక్తి కలఁడేమో;

వివాదమున డిండిమభట్టారకుఁ డోడిపోయినట్టు మాధ్యస్థ్యము నెఱపిన పండితుఁడు నిర్ణయించెను. ఓడిపోయిన పండితునికిఁ గవి సార్వభౌమబిరుదము పోయి నిరాక్షేపముగా శ్రీనాథునికే యది నిలిచినది. మఱియుఁ నాపండితుని డిండిమాడంబరముగూడ నడఁగారినది. ''పగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢిగౌడడిండిమభట్టు కంచుడక్క'' నను చరణ మీ యర్థము నెఱిఁగించుచున్నది. దీనినిబట్టి సరిగా శ్రీనాథుఁ డాతని కంచుఢక్కను గొడ్డళ్లచేఁ బగులఁగొట్టించినాఁడని నిర్ణయింప నక్కఱలేదు. మరల నాతఁ డాఢక్కావాద్యాడంబరమును

గొన్నాళ్ళదాక సాగించుకొనకుండుసంతటి యవమానమువకు బాల్ప దినాడనుట చాలును. ప్రౌఢదేవరాయడు శ్రీనాథుని పాండిత్య శౌండీర్యమునకు బరితోషము చెందెను. ఆసందర్భమువనే మన శ్రీనాథ కవిసార్వభౌమున కాకర్ణాటాధీశ్వరు డత్యంతగౌరవాస్పదమగు తన ముత్యాలశాలలో బహుపండిత పరివార బహుూకార పూర్వకముగా నప్పటిబంగరు నాణెములగు దీనారములతోను టంకములతోను స్వర్ణ స్నానోత్సవము సమకూర్చెను. ఈ సత్కారము జరుగనున్నప్పుడు శ్రీనాథు డీపద్యము చెప్పినాడు:

చ. జననాథోత్తమ! దేవరాయనృపతీ! చక్రేశ! శ్రీవత్సలాం
ఛనసంకాశమహాప్రభావ! హరిరక్షాదక్ష! నాటోటికిన్
గునృపస్తోత్రీసముద్భవంబయిన వాగ్దోషంబు శాంతంబుగా
గనకస్నానము చేసికాక పొగడంగా శక్యమే దేవరన్.

రాజ్యలక్ష్మీపీఠికాతంత్రమునఁ గనకాభిషేకసత్కారక్రమము చెప్పఁబడినది: రాజు విద్వద్గోష్ఠిలో నసామాన్య వైదుష్యము చూపిన వారికిఁ గనకాభిషేక సత్కారము కావింపవలయు ననియుఁ గనకాభిషేకమనఁగా దీనారములు టంకములు మొదలగు బంగరునాణెములను సభామధ్యమున నున్నతపీఠమునఁ గూర్చున్న విద్వన్మౌళిమౌళిపై జలము క్రుమ్మరించినట్లు క్రుమ్మరించుటయనియు, నట్లుక్రుమ్మరించిన నాణెముల నాసమ్మానోత్సవము దర్శింపవచ్చిన విద్వాంసులకుఁ దదితరులకుఁ బంచిపెట్టవలయుననియు నందుఁగలదు. ఈకనకాభిషేక సత్కారమును బ్రాచీనకాలమున, బలువురు విద్వాంసులు పడసినారు. సర్వజ్ఞసింగభూపతిచేఁ గొలచెలము పెద్దిభట్టు కాంచెనఁట! కాకతిప్రతాపరుద్రునిచే నాతనితాత కాంచెనఁట! ఇట్లు మఱికొందఱున్నారు. "దీనా

రటంకాలఁ దీర్థమాడించితి దక్షిణాధీశుమత్యాలశాల''నసుచరణ మీ విషయమును దెలుపుచున్నది. ఇందు దక్షిణాధీశుఁడని కలదుగాన నాతఁడు కర్ణాటాధీశుఁడుగాక వేఱొకఁడు కావచ్చునని కొంద ఱందురు. కాశీఖండముకడపట:

శా. కర్ణాటక్షితినాథమౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణస్నానజగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్యచారిత్ర ! దు
గ్ధార్ణోరాశిగభీర ! ప్రాహ్ణముఖమధ్యాహ్నాపరాహ్ణార్చితా
పర్ణావల్లభ ! రాజశేఖరమణీ ! పంటాన్వయగ్రామణీ !

ఇందుఁ గర్ణాటక్షితినాథుఁడని కలదు. మఱియుఁ గవిసార్వభౌముఁడై కర్ణాటనృపుచేతఁ గనకరత్నాభిషేకమును గనిన ''శ్రీనాథకవి'' యని దగ్గుఁబల్లి పుగ్గనకవి చెప్పినాఁడు. విభాగరత్నమాలలోఁ బ్రౌఢదేవరాయఁడు ''దక్షిణాధిపతిః స్వయమ్'' అని యనఁబడినాఁడు. ఇదివఱ కుదాహరించిన శ్రీనాథునిచాటుధార ''జననాథోత్తమ దేవరాయ నృపతీ!.... కనకస్నానము చేసికాక పొగడంగా శక్యమే దేవరన్,'' అని దేవరాయనిఁ బేర్కొనుచున్నది. ఇంకసంశయమున కెడము కలదా? మఱియుఁ గనకాభిషేకసత్కారమును బడసినపిదప శ్రీనాథుఁడు దేవరాయని నిట్లు పొగడినాఁడు:

శా. జోటీ ! భారతి ! యార్భటిన్ మెఱయుమీ చోద్యంబుగా నేను గ
ర్ణాటాధీశ్వరు దేవరాయ నృపటిన్ నాసీరధారీవరమూ
కోటిమోటకధట్టికాఖురపుటీకుట్టాకనంఘట్టన
స్ఫోటీభూతధరారజఃపటకితాంభోటిన్ ప్రశంసించెదన్.

శ్రీనాథుఁడు కర్ణాటకరాజాస్థానమునఁ బొందిన యీ కవిత్వవిజయగౌరవ మంధ్రకవిలోకమునఁ జిరకాలము ప్రస్తుతమగుచుండెను.

శ్రీనాథుని మఱఁది దుగ్గన ప్రశసించుటేకాక యచ్యుతరాయాభ్యుదయ కర్తయు నచ్యుతరాయల యాస్థానకవీశ్వరుఁడు, శ్రీనాథునిచే నోడ గొట్టఁబడిన డిండిమునిమనుమఁడు నగు రాజనాథునితోఁబాటుగా నచ్యుత రాయల యాస్థానముననే కవిగానున్న రాధామాధవకవి యీ విషయము నిట్లు ప్రశంసించినాఁడు:

శా. సూనాస్త్రప్రమదామదస్ఫురిత వక్షోజాతకాఠిన్యమ
బూనంజాలు పదోవిలాసమున నిఃపుల్‌మీఱఁ గర్ణాటక
క్ష్మానాథేంద్రుసభన్ గవిత్వవిజయోత్సాహంబుకైకొన్న మా
శ్రీనాథుం గవిసార్వభౌముఁ గొలుతుఁ సేవాంజలుల్ గీల్కొనన్.

శ్రీనాథుఁడుకూడ నీ కవిత్వవిజయము సభిమానముతోఁ జేర్కొనుచువచ్చినాఁడు. సర్వజ్ఞసింగభూపాలుని దర్శింప సరిగిసప్పుడు చెప్పినపద్య ముదాహృతమేగదా: కాశీఖండము కడపటిపద్యము కూడ నుదాహృతమేగదా! మఱి కాశీఖండము కృత్యవతరణికలోను గద్యము నందును గూడ నీవిషయమును శ్రీనాథుఁడు పేర్కొన్నాఁడు: ''అధ్య క్షించుం గవిసార్వభౌము! భవదీయప్రౌఢసాహిత్యముల్'', ''తెలుఁగు చేనెదఁ గర్ణాటదేశకటక పద్మావనప్రోళి: శ్రీనాథభట్టసుకవి'', ''కవి సార్వభౌమ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన కాశీఖండముసందు'' — ఇందుఁ 'గర్ణాటదేశమందలి రాజధాని (లేక ప్రసిద్ధపట్టణములు) యను తమ్మితోఁపునకు సూర్యుఁడు' అని యర్థము. శ్రీనాథునిరాకచే నా రాజ ధాని (అంచున్న సరసులు పండితులు సనుట) యంతయు నానంద వికా సము గాంచెనని భావము. అట్లు వారందఱు నానంద మందుటకు శ్రీనా థుఁ డక్కడ నెంతవైదుష్య చమత్కారమునెఱపినాఁడో! కొందఱుకవులు పేరుపేర్కొనక కవిసార్వభౌమబిరుదముతోనే శ్రీనాథునిఁ బ్రస్తుతిం

చి॥ నిరతిశయ బహుమానముతో శ్రీనాథకవి కవితావిలాసములను భావనచేయుచుండు నేను ''కర్ణాటకటకపద్మవనహేళి'' యను నీ వ్రజపుబలుకుబోలు పలుకును దత్కవితాలుబ్ధుడనై యేతత్ప్రకరణ ప్రారంభమునఁ గూర్చిన సీసపద్యపుంగొన నలంకరించుకొన్నాఁడను.

నాఁటికాలమునఁ బండితు లెట్లు నిరంకుశచర్యలై డీకొనుచుం డెడివారో స్వతంత్రులగు నప్పటిరాజులు విద్యాప్రియులై వారియం దెంత గౌరవప్రపత్తులుకలిగి సత్కారము లొదవించుచుండెడివారో తలంచితిరా! ఆంతటి యఖండపండితుఁడగు డిండిమభట్టారకునితో ఢీ కొని వాదించి యోడించి యాతని లోహడిండిమమును బగులఁగొట్టించి మన శ్రీనాథ కవీశ్వరుఁడు తా నార్జించిన యశోడిండిమము నాంధ్ర మండలమం దెల్ల నెడతెగక సార్వకాలము ప్రోఁగించుచున్నాఁడు. మనకవీశ్వరుఁ డార్జించిన 'ఢంకా' యరుగుతరుగులులేక పగులఁ గొట్టరాక యేకాలమును ప్రోంగుచుండినది. ఆహా! శ్రీనాథ కవీశ్వ రుఁడు నశ్వరమగు భౌతికశరీరమును విడనాడియు శాశ్వతమగు కీర్తి మూర్తితో నాంధ్రలోకమున నెన్నఁటికిని గవిసార్వభౌమపదవి నలంకరించుచునే యుండునుగదా! ఆంధ్రకవీశ్వరులం దిట్టిమహాభాగ్య మెవ్వరే ననుభవించియుందురా?

శృంగారశ్రీనాథము

షష్ఠప్రకరణము.

మ. ప్రతిభాశాలురు పండితుల్ కవులు నంభావింపఁగా బాండితీ
చతురుండై సుగృహీతనాముఁడగు నాసర్వజ్ఞసింగక్షమా
పతియాస్థానికి నేఁగి దివ్యకవితా ప్రౌఢిమ్యముం జూపి న
త్కృతుఁడై వచ్చిన సత్కవీశ్వరునకుం గేలోడ్పు సంధించెడిఁ.

కర్ణాటదేశాటనము.

శ్రీనాథుఁడు క్రీ. 1435 ప్రాంతమునఁ గనకాభిషేక సత్కారమును గాంచినాఁడని తెలిసికొంటిమి. అప్పు డాతఁడు కర్ణాటదేశమున ననేకస్థలములను దర్శించినాఁడు. "కళసాపుర ప్రాంతకదళీవనాంతర ద్రాక్షెలతాఫలస్తబకములకు" ననుట దీనికి ద్యోతకము. కర్ణాటదేశమునఁ గళసాపుర మిప్పుడు గలదు. విద్యానగరమునకు ముప్పదిమైళ్ళ దూరమున నున్నది. అనఁటితోఁటలు, ద్రాక్షెలతలు, నక్కడ నిప్పుడు నెక్కువగా నుండునఁట! ఒక రాజాస్థానమున నెలకొని యుండి యీతని కిప్పుడు లేనుగాన యధేచ్ఛముగాననేక స్థలముల కరుగుచు వచ్చినాఁడు. రాజమహేంద్రవరమున వేమవీరభద్రారెడ్డ యాస్థానకవితా పదము దొరుకువఱకు నీతఁ డిట్లు తిరిగినాఁడు. ఈసంచారమందు రాచకొండలో రాజ్యమేలుచుండిన సర్వజ్ఞసింగభూపతిని గూడ నీతఁడు సందర్శించినాఁడు.

సర్వజ్ఞసింగభూపతివిషయము

ఇది యింతవఱకు బహువివాదగ్రస్తముగా నున్నది. వెలుగోటి వారివంశచరిత్ర మను నొకప్రశస్తచరిత్రగ్రంథమున నీవిషయము జాగ్రత్తతోఁ జర్చింపఁబడినది. అప్పటి రేచర్ల వెలమప్రభువు లేకశిలా నగరముచేరువనున్న రాచకొండ, దేవరకొండ మొదలగుస్థలముల నెలకొని రాజ్యమేలిరి. ఆదేశ మిప్పుడు నైజాముమండలమునఁ జేరియున్నది. ఆక్కడిశిలాతామ్రశాసనము లనేకము లింకను బయల్పడ లేదు. రేచర్లవంశ్యులచరిత్రమును జక్కఁగా గుర్తించుట కట్టిశాసనముల తోడ్పాటు కావలసియున్నది. వెలుగోటివారి వంశచరిత్రమును రచించిన వారు బహుప్రయాసమునఁ గొన్ని శిలాశాసనములను సేకరింపఁ గల్గిరి. ఆవి యావంశమువారి దేశకాలములు నిర్ణయించుట కనర్ఘమయిన సాధనములుగా నున్నవి. ప్రాచ్యలిఖితపుస్తకశాలలో వెలుగోటివారివంశావళి యని యొకప్రాతవ్రాతగ్రంథ మున్నది. ఆదియు ననేకవిషయములను దెలుపుచుఁ జరిత్రకారుల కత్యంతసాహాయ్యకముగా నున్నదిగాని దానిలో నల్పప్రమాదము లక్కడక్కడఁగలవు. అట్టివానిఁ గొన్నిటిని శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు చెనకినారు. వెలుగోటివారి వంశచరిత్రము రచించుట కిదియే ముఖ్యాధారము. ప్రాచ్యలిఖితపుస్తకశాలలోని ప్రాతవ్రాతగ్రంథమున శ్రీనాథునిచే దర్శింపఁబడిన సర్వజ్ఞసింగభూపతినిగూర్చి యిట్లున్నది :

"ఆ యనపోతమనేనికి సర్వజ్ఞసింగమనేఁడున్నా వసంతరా యఁడు పుట్టి రం దగ్రిజుండు,

సీ. సకలవిద్యాఖ్యాన సాహసగరిమ ము
సూటిమీఱఁగఁ బోడు సూపినాఁడు

కఠినశాత్రవయూథమనకంఠరక్తంబు
వేడ్క గాళికి భుక్తివెట్టినాడు
సాధుమార్గక్రియా సౌజన్యమున నీతి
చెలఁగ సద్వర్తనల్ చేసినాడు
సంతతార్థివాత సముదయంబులతోడ
వెలయు బాంధవము గావించినాడు

గీ. అతడు భూపాలమాత్రుఁడే చతురవిభవ
వితతజంభారి సర్వజ్ఞవిగ్రహంబు
వాసికెక్కిన రేచర్లవంశవార్ధి
శీతకరుఁడగు సర్వజ్ఞసింగవిభుఁడు.

* * *

శ్రీనాథుఁడు సర్వజ్ఞునిసమ్ముఖానకు పోతూ శారదాంబను ప్రార్థనజేసిన పద్యం:—

సి, దీనారటంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశుముత్యాలశాల
....
సరససద్గుణ నికురంబ! శారదాంబ!

సర్వజ్ఞసింగమనేఁడు శ్రీనాథునకు సమస్యయిచ్చిన పద్యము:


ఉ. తక్కక రావుసింగవసుధావరుఁ దర్థుల కర్థమిచ్చుచో
దిక్కులలేని కర్ణుని దధీచిని భేచరు వేల్పుప్రామునుఁ బెం
పెక్కినకామధేనువు శిబీంద్రుల నెన్నెదు భట్ట! దిట్టవై
కక్కసొ నక్కవో ఫణివొ క్రోతివొ పిల్లివొ బూతపిల్లివో!

శృంగారశ్రీనాథము

ఇత్యాది. తర్వాత సింగభూపతి తమ్ముఁడగు వసంత భూపాలునిఁగూర్చి పద్యము లున్నవి.

సర్వజ్ఞసింగభూపతిని శ్రీనాథుఁడు దర్శించినట్టు ప్రతీతి లోకమునఁ బ్రాచీనకాలమునుండి కలదు. మఱియు బమ్మెరపోతరాజు సర్వజ్ఞసింగభూపతిమీఁద భోగినీదండకము చెప్పినట్టు ప్రఖ్యాతియే కాక గ్రంథముకూడ నున్నది. భాగవతమునుగూడ నా సర్వజ్ఞసింగభూపతి కోరఁగాఁ బోతరాజుగారు తిరస్కరించి రనియు, నందు కాతఁడు కుపితుఁడై యా గ్రంథమును ధ్వంసపరుపయత్నించె ననియు వాడుక కలదు. కూచిమంచి తిమ్మకవిప్రభృతులీయైతిహ్యమును గ్రంథస్థము చేసిరి. శ్రీనాథుఁడును, బోతరాజును సమకాలమువారని, బావమఱఁదులవరుసవా రనికూడఁ బ్రతీతి కలదు. సాధకములయిన విషయము లున్నప్పు డింకఁ దప్పక విశ్వసింపఁదగునుగదా? బమ్మెర పోతరాజుకూడఁ బయిఁజెప్పఁబడిన సర్వజ్ఞసింగభూపతిపేరనే భోగినీదండకమును జెప్పినట్టు ప్రాచీనలేఖనములందుఁగూడ నున్నది. భోగినీదండకమున వర్ణితుఁడగు సింగభూపతి వసంతభూపాలుని యన్నయుఁ గుమారాస్థానోత్తానేనికిని బోచమాంబకును గుమారుఁడును సర్వజ్ఞ బిరుదాంకుఁడును నగుట విస్పష్టము. భోగినీదండకము చూడఁదగును. శ్రీనాథునిచే దర్శింపఁబడినవాఁడును, భోగినీదండక కృతినాయకుఁడును నొక్కఁడే యనుటకుఁ బ్రతీతి, ప్రాచీనలేఖనములు, శ్రీనాథుని చాటుపులు, సాధకములుగా నున్నవి. కాని యిక్కడ నొక్కచిక్కు దాపరించినది. ఇప్పుడు రచింపఁబడిన వెలుగోటివారివంశచరిత్రమున సర్వజ్ఞసింగభూపాలు రిరువురనియు, రసార్ణవసుధాకరకారుఁ డనఁబడు సింగభూపతి మొదటిసర్వజ్ఞసింగభూపతియనియు, శ్రీనాథపోతనలచే దర్శింపఁబడినవాఁడు రెండవ సర్వజ్ఞసింగభూపతి యనియు, వారిర్వును తాతా

మునిమనుమలనియు వ్రాయఁబడినది. ఇది యసందర్భమని నేఁ దలంచుచున్నాను. వసుధాకరకారునకు సర్వజ్ఞబిరుదము కానరాదు. శ్రీనాథపోతనలచే దర్శింపఁబడిన సింగభూపతికే సర్వజ్ఞబిరుదము కలదు. వారిర్వురును తాతామనుమలే యగుదురు. వివరించితెలిపెదను. రసార్ణవసుధాకరమున వారివంశవృక్షమిట్లు తెలియవచ్చుచున్నది:



ఇంతు నాల్గవవాఁడగు సింగమనాయఁడే రసార్ణవసుధాకరకారుఁడు. వసంతావనీనాథుని యన్నయుఁ, గుమారాన్నపోతనాయని కుమారుఁడును, శ్రీనాథపోతరాజకవులకుఁ బ్రపౌత్రుఁడును సర్వజ్ఞబిరుదాంకితుఁడును నగు సింగభూపాలుఁ డీరసార్ణవసుధాకరకారుని జ్యేష్ఠపుత్రుఁడగు నసపోతానాయిని కుమారుఁడగునని నాయుద్దేశము. వెలుగోటివారివంశచరిత్రమున రసార్ణవసుధాకరకారుని నాల్గవకుమారుఁడగు వేదగిరికి చినసింగభూపతియని నామాంతరము కల్పించి (కల్పితమే) యాతని కొడు కనపోతఁడనియు, నాతనికొడుకు శ్రీనాథాదులకుఁ బసక్తుఁడగు సర్వజ్ఞసింగభూపతియనియు, వ్రాయఁబడి

నది. అందట్లు వ్రాయఁబడుటకుఁ బ్రాఁతవ్రాఁతలోనున్న యసంగతపుఁ బద్య మీ క్రిందిది కారణమయి యుండును:--

సీ వీరాగ్రగణ్యుండు వెన్నభూపాలుండు
ఖ్యాతి నేరాజు ముత్తాతతాత
నెఱి పెండ్యగజసింహుఁ డెఱుదాచభూపతి
ధాత్రి నేరాజు ముత్తాతతండ్రి
సంగరాభంగుండు సింగభూనాథుండు
తనరంగ నేరాజు తాతతాత
ఆదిగరేశ్వరుల దనపోతభూపతి
తర్కింప నేరాజు తండ్రితండ్రి
చిరకీర్తి యగురావు సింగావసీఱుండు
ధట్టింప నేరాజు తండ్రితండ్రి
బిరుదభీకరుఁడైన పినసింగనరపతి
చెన్నొంద నేరాజు కన్నతండ్రి

గీ. భూరుఁ డారాచ ... ...
సారసస్వాంత సేవావిశాలుఁ డయిన
యన్నమాంబా తనూజాతుఁ డనఘమూర్తి
రాయరా వన్నపోతధరావిభుండు.

పాఠకులు పయిపద్యమును జాగ్రత్తగాఁ బరిశీలింతురుగాక ! పయిపద్యమున నసంగతి యిట్టిది: – ముత్తాతతాత, ముత్తాతతండ్రి, ముత్తాత (తాతతండ్రి), తండ్రితండ్రి, తండ్రి యనువిధమున, బితృ పరంపరఁ జెప్పఁదగియుండును. ఇందట్లు లేదు. పద్యముతప్పగానున్నది. ఇట్లుండవలెను: వెన్నభూపాలుఁడు ముత్తాతతాత, ఎఱుదాచభూపతి ముత్తాత తండ్రి, సింగభూపాలుఁడు ముత్తాత, ఆనపోతభూపతి

తండ్రితండ్రి, పినసింగనరపతి కన్నతండ్రి. 'చిరకీర్తియగు'-నిత్యాదిచరణ మసంగతము. తొలఁగింపవలసినది. మఱియు "సింగ భూనాథుండు తనరంగ నేదాజుతాతతండ్రి" యని యుండును పయిచర ణమందు ముత్తాతతండ్రి యుండఁగా మరల నిక్కడఁ దాత తాతయని యుండఁగూడదు. ఈ దిద్దుబాటు సరియనుటకు రసార్ణవసుధాకరాది ప్రాచీనగ్రంథములు సాధకము లగుచున్నవి. పయిపద్యమున "బిరుద భీకరుఁడైన పినసింగనరపతి" యనబోతభూపతికొడుకగు రసార్ణవసు ధాకరకర్త యగును. ("చిరకీర్తియగు" నిత్యాది చరణమును దొలఁ గింతుమిగాన). అట్లాచరణమును దొలఁగింపకున్నచో, నాదిగర్భేశ్వ రేత్యాదిచరణమునఁ జెప్పఁబడిన సింగభూపతి రసార్ణవసుధాకరకర్త యగును. అతని కుమారుఁడు "బిరుదభీకరుఁడైన పినసింగభూపతి" యగును. ఇది యసందర్భము. రసార్ణవసుధాకరకారునికిఁ బినసింగ భూపతియను కుమారుఁడు లేడు. ఆర్గురుకొడుకులని రసార్ణవసుధా కరము చెప్పుచున్నది. వారిపేళ్లు వేఱుగా నున్నవి. అది పోనఁగకే వెలుగోటివారి వంశచరిత్రమునం దా యార్గురిలో నొకఁడగు వేదగిరికిఁ బినసింగభూపతియని నామాంతరముగా నూహము కావింపఁబడినది. పయిప్రకారము దిద్దుబాట్లు చేసినచోఁ బద్యమున కుచితస్థితి కుదురుటే కాక, రసార్ణవసుధాకరగ్రంథస్థ విషయముతోఁ గుదిరికయు నేర్పడుచు న్నది. మఱియు రసార్ణవసుధాకరకారునికిఁ గుమారసింగభూపతి (పిన సింగభూపతి) యనియే వ్యవహారముకాని, పెదసింగభూపతియనికాదు. పెద్దవాఁడు మొదటిసింగభూపతి యుండుటచే రసార్ణవసుధాకరకారుఁ డగు సింగభూపతికిఁ గుమారసింగభూపతియని వ్యవహార మేర్పడినది. ఆ పెద్దసింగభూపతి జీవించియుండఁగా నీతఁడు జనించి యుండును. రసార్ణవసుధాకరకారుని గ్రంథములందే యాతనికిఁ గుమారసింగ

భూపతియని పేరుండుట నింకఁ గొంచెమాఁగి నిరూపింప నున్నాఁడను. సుధాకరకర్తయగు సింగభూపాలుని జ్యేష్ఠకుమారుఁడగు నన్నపోతానాయనికిఁగూడఁ గుమారాన్నపోతావనీనాథుఁడనివ్యవహారము ఈతనితాతయు నన్నపోతానాయఁడేగాన నీవ్యవహార మేర్పడినది. ఈకుమారాన్నపోతావనీనాథుఁడే శ్రీనాథపోతనలకుఁ బ్రబన్ధుఁడగు సర్వజ్ఞసింగభూపాలుని తండ్రి. కుమారాన్నపోతావనీనాథుఁడని యాతని పేరగుటనుగూడఁ దత్కాలపు గ్రంథములను బట్టియే కొంచెమాఁగి నిరూపించెదను. ఇది నాయూహమునకు దోహద మొసఁగుచున్నది. ఇఁక నాయారాజులకు సంబంధించిన యప్పటి గ్రంథములఁ బేర్కొనుచున్నాఁడను.

సింగభూపతి గ్రంథములు.

రసార్ణవసుధాకరము, చమత్కారచంద్రిక, అమరవ్యాఖ్య యను గ్రంథములు మూఁడు సింగభూపాలునకు సంబంధించినవి యున్నవి. మొదటిది ముద్రితము. కడమవి యముద్రితములు. మొదటిదానికిఁ గర్తగాను రెండవదానికిని మూఁడవదానికిని భర్తగాను సింగభూపతి యున్నాఁడు.

రసార్ణవ సుధాకరము.

ఇది నాయికానాయకరసభావావస్థాభేదాదివిషయములను రూపక భేదలక్షణాదికమును దెలుపు నలంకారశాస్త్రగ్రంథము. ఇందనేక ప్రాచీనగ్రంథములనుండి లక్ష్యములు కైకొనఁబడినవి. మఱియు "యథా మమైవ" యని గ్రంథనామము లేకుండ ననేకశ్లోకము లుదాహరింపఁబడినవి. పెక్కుశ్లోకము లవి యమరుశతకశ్లోకములను బోలి యున్నవి. శృంగారరసభరితములు. యథామమైవ కందర్పసంభవే- యని యొకశ్లోక ముదాహరింపఁబడినది. ఇంక ననేకరూపకములనుండి

శ్లోకములు గద్యములు నుదాహరింపఁబడినవి. అందుఁ గొన్నిరూపకము లిప్పుడు దొరుకుటలేదు. ఆట్టివాని నిక్కడఁ బేర్కొనుచున్నాఁడను. **అభిరామరాఘవము:** అనపోతనాయకీయమని దీనికి నామాంతరము. మాయాకురంగిక (ఈహామృగము), మాధవీవీధిక (వీధినాటకము), పద్మావతి, కామదత్తము (ప్రకరణము), కామానందము, కరుణాకందళము (అంకము), వీరభద్రవిజృంభణము (డిమము), మహేశ్వరానందము, ఆనందకోశము (ప్రహసనము), శృంగారమంజరి (భాణము), పయోధిమథనము (సమవాకారము), కందర్పసంభవము (భాణము), వీరానందము. ఇవియన్నియు రూపకభేదములే. ఇంచుఁ గొన్నిసింగభూపతికాలమున రచింపఁబడినవే. అనపోతనాయకీయమనఁగా నీతని తండ్రిపేరిదేగదా! వీరభద్రవిజృంభణము, కరుణాకందళము, ననునవి సింగభూపతియాస్థానకవియుఁ జమత్కారచంద్రికాకారుఁడును నగు విశ్వేశ్వరకవిచంద్రునిచే రచింపఁబడినవి. ఉదాహృతశ్లోకములలోఁ దత్కర్తృత్వమును దెలుపునవి కలవు. తక్కినవానిలోఁ గూడఁ గొన్నింటికేని యావిశ్వేశ్వరకవిచంద్రుఁడు కర్తగా నుండునేమో యని సందేహించుచున్నాఁడను. మొదటి కీ రసార్ణవసుధాకరగ్రంథమే విశ్వేశ్వరకవిచంద్రకృతి యగుననుట కాధార మున్నది. ఎట్లనఁగా, రసార్ణవసుధాకరమున "యథామమైవ కందర్పసంభవే" యని శ్లోక ముదాహరింపఁబడినదని తెల్పితినిగదా! విశ్వేశ్వరకవిచంద్రకృతియగు చమత్కారచంద్రికలోఁ గూడఁ 'గందర్పసంభవమే' తనకృతిగా విశ్వేశ్వరకవిచంద్రునిచే నుదాహరించుకొనఁబడినది. "తథాచ మమైవ, శ్లో॥ ఇతి కందర్పసంభవే," అని కలదు. ఇట్టి వింతలు పెక్కుగ్రంథములలోఁ గానవచ్చుచున్నవి. మచ్చునకు రెండింటిని బేర్కొనెదను. జైమినిభారతకృతిపతియగు సాళువగుండ సరసింహరాయఁడు

రచించినట్టుగా నాతనిపేరనే రామాభ్యుదయమని యొకగొప్పసంస్కృత కావ్యము కలదు. అన్నిసర్గములలోను, రాజుపేరున్నదిగాని, యైదవసర్గము కడపట నరుణగిరినాథుఁడను డిండిమభట్టు (శ్రీనాథుని ప్రత్యర్థియే) రచించినట్టు శ్లోకము గద్యము నున్నవి. మఱియు నా గ్రంథము మహానాటకమున కుగజాతమని యంచున్నది. ఆమహా నాటక మిమ్మిడిదేవరాయలు రచించినట్టుగా నందుఁగానవచ్చుచున్నది. కాని యదికూడ నాయరుణగిరినాథుని కృతియగునని ఈరామాభ్యుదయ విషయమ్ము తెలియక పూర్వమే నేను గుర్తించితిని. ఆ విషయ మీవఱకే కనకాభిషేక ప్రకరణమునఁ దెల్పితిని. మఱియు పసుచరిత్రకృతిపతి యగు తిరుమలదేవరాయఁడు రచించినట్లు పీఠికాగద్యములతో ఋగ్రితి రంజని యనుపేర గీత గోవిందవ్యాఖ్య కలదు. చెఱుకూరి లక్ష్మణసూరి రచించినట్లుగా నాగ్రంథమే లక్ష్మణసూరి పీఠికాగద్యములతోనుగలదు. రెండు దెఱఁగుల వ్రాఁతప్రతులు నిప్పుడు దొరకుచున్నవి. ఆతిరుమల రాయఁడు లక్ష్మణసూరి కగ్రహారముల నిచ్చి శాసనములు చెక్కించి నాఁడు. లక్ష్మణసూరి తన గ్రంథమునకుఁ దిరుమలరాయని పేరుపెట్టి రాజాస్థానమున వ్రాఁతపతి నుంచెను. తనయింటను శిష్యవర్గము కడను దన పేరితోనె వ్రాఁతప్రతుల నుంచుకొనెను. రెండింటికిని ఋత్తిరికలు పుట్టినవి. ఒక విశేషము : ఆవ్యాఖ్యలో ''యథా మదీయే ప్రసన్నరాఘవ వ్యాఖ్యానే'' యని కొంతగ్రంథభాగ ముదాహరింపఁబడినది. ఆయుదా హృతగ్రంథభాగముగల ప్రసన్నరాఘవవ్యాఖ్య లక్ష్మణసూరిరచనముగా దొరకియున్నది. రాజుగారు తమపేరగ్రంథము చెప్పమనిరి. కృతిలోఁ దమపేరఁ గావింపఁబడిన ప్రశంసలను విని పరితోషించిరి. కవిని సమ్మానించిరి, గాని లోనున్నలిమ్మల నేమి పరిశీలించిరి! ఇట్టివానిఁ

బెక్కింటిని లెక్కింపఁదగును. సుదూరము పోయితిని. ప్రస్తుతము నెత్తుకొనెదను. రసార్ణవసుధాకరమున సింగభూపతి ప్రశంసాత్మకములగు శ్లోకము లున్నవి. రసార్ణవసుధాకర కర్తృత్వము సింగభూపాలునిపై, నారోపితమేమో యని నేను సందేహించుచున్నాఁడను, తప్పులతోను గ్రంథపాతములతోను నిండియున్న తెలుఁగు ముద్రణమున సింగ భూపాలుఁడు కవీశ్వరుఁడనుటకు సాధకముగా నీక్రిందిశ్లోక మున్నది

శ్లో. శ్రీసింగభూపేన కవీశ్వరేణ
విశ్రాణితానేకవిభూషణేన
షట్త్రింశ దుక్తాని విభూషణాని
సంఖ్మ లక్ష్యాణి మునేర్మతేన.

"శ్రీసింగభూపేన కవీశ్వరాణాం" అని యుండవలెను. నాగర లిపిముద్రణమున నట్లేకలదు.

చమత్కార చంద్రిక.

ఇది యొక క్రొత్తత్రోవగల కావ్యాలంకారగ్రంథము. కావ్య గుణదోషాదు లిందుఁ జక్కఁగాఁ జర్చింపఁబడినవి. రసార్ణవసుధా కరమున లేని విషయముల నిది చెప్పుచున్నది. ప్రసక్తివచ్చినప్పు "డీ విషయము రసార్ణవసుధాకరమున వివరించి చెప్పఁబడినది, అక్కడఁ జూడఁదగును" అని తఱుచుగా నిందు రసార్ణవసుధాకరము పరామర్శింపఁబడును. కాన నది దానికిఁ దరువాతిగ్రంథమని యేర్పడు చున్నది. రసార్ణవసుధాకరమున నుదాహరింపఁబడిన కరుణాకందళ వీరభద్రవిజృంభణములకుఁ గర్త యీ విశ్వేశ్వర కవిచంద్రుఁడేగావు నను నందు, సింగభూపాలునిదిగాఁ జెప్పబడిన కందర్పసంభవ మిందు

విశ్వేశ్వరకవిచంద్రుఁడు తనకృతిగాఁ జెప్పుకొన్నాఁడు కావునను, రెండుగ్రంథములు నొక సింగభూపాలునకే ప్రపక్తించినవని స్పష్టముగాఁ జెప్పఁజెల్లును.

రసావర్ణసుధాకరకారుని తండ్రియగు నసపోతానాయని శాసనము శా. 1302 నాఁటిది వెలుగోటివారి వంశచరిత్రమున ముద్రింపఁబడినది. మఱియు, రసార్ణవసుధాకరకారుని యార్గురు కొడుకులలోఁ గడగొట్టువాఁడగు మాధవుని భార్య నెలకొల్పిన శాసనము శా. 1351 నాఁటిది కూడ నందే ముద్రింపఁబడినది. వీనిఁబట్టి చూడఁగా రసార్ణవసుధాకరకక్తర్త శా. 1320, 1325, వఱకు నున్నవాఁడగునని యేర్పడుచున్నది. శా. 1291లోఁ బళుపతికుమారుఁడగు నాగనాథకవికృతిగ సంస్కృతశ్లోకరూపము శిలాశాసనము వెలుగోటివారివంశచరిత్రముననే ముద్రింపఁబడినది. ఇది మిక్కిలి విలువగల శాసనము. రసార్ణవసుధాకరకక్తర్తండ్రియగు నసపోతానాయని ధర్మమునుగూర్చికలదు. పళుపతిపుత్త్రుఁడగు నీనాగనాథకవి చమత్కారచంద్రికాకారుఁడగు విశ్వేశ్వరకవిచంద్రుని శిష్యుఁడు. అసపోతనాయఁడు రాజ్యమేలుచుండఁగా నాతనిఁ బేర్కొనుచు మదనవిలాస మనుభాణము నీతఁడు రచియించినాఁడు. ఈతని రచనము శా. 1290, 1322 ల నడిమికాలమున నయియుండును. గురుశిష్యులు సమకాలమువా రగుదురుగదా! గురువు పదిదునై దేండ్లు పెద్దవాఁడు కావచ్చును. గురుశిష్యులిద్దఱును రసార్ణవసుధాకరకారునికాలమువా రగుట కభ్యంతరమేమియు నుండదు. పళుపతికొడుకగు నీనాగనాథకవి సంస్కృతమున మదనవిలాసమను భాణమునేగాక తెలుఁగున విష్ణుపురాణమును గూడ రచియించినాఁడు. నేను ముద్రించిన ప్రబంధరత్నావళిలో నావిష్ణుపురాణ ముదాహరింపఁ

బడినది. చూడఁదగును. దీనిఁబట్టి క్రీ. 1380 ప్రాంతమునఁ దెలుఁగున విష్ణుపురాణము రచింపఁబడినట్టు స్పష్టపడుచున్నది. ఆకాలమున సంస్కృతాంధ్రములందు గ్రంథములు రచించిన కవి యొకఁ డిప్పు డెఱుకపడుట సంతోషకరమేయైనను నాగ్రంథములు సమగ్రముగా లభింపమి విచారహేతువుగా నున్నది.

పరిశోధింపఁగా చమత్కారచంద్రికలో రసార్ణవసుధాకరమునఁ గలశ్లోకము లనేకములు గోచరించుచున్నవి. రసోపశమమున కుదాహరణముగాఁ జెప్పఁబడిన శ్లోకమందు సింగభూపాలుఁడు కళింగరాజును జయించినట్టును నాతఁడు తన కూఁతును సింగభూపాలున కుపాయనముగా నిచ్చినట్టును జెప్పఁబడినది. ఇందు సింగభూపతి గ్రంథకర్తయని విశ్వేశ్వర కవిచంద్రుఁడు చెప్పినాఁడు.

"యథాచాహుఃసామాన్యవనితా వేశ్యా సా ద్రవ్యపర మిచ్ఛతి. గుణహీనే న చ ద్వేషో నానురాగో గుణిన్యపి. శృంగారాభాస ఏతస్యాం నశృంగారఃకదాచన—ఇతి. తన్మతం నానుమనుతే ధీమాం శ్రీ సింగభూపతిః—'' ఇత్యాది.

శ్లో. అనుక్తానా మిహాన్యేషాం లక్ష్యలక్షణవిస్తరః
సింగభూపాలరచితే రసార్ణవసుధాకరే
ఆదిద్వితీయయో స్సాధుశీలసీ యా విలాసయోః
అన్యత్ర బద్ధదృష్టిత్వా దస్మా భిస్సం(ర్న?) ప్రపంచితః
నహి సర్వత్ర సర్వేషాం విశేషజ్ఞాం పశ్యదర్శనమ్.

శృంగారశ్రీనాథము

ఈగ్రంథమున నీ సింగభూపతి కుమారసింగభూపతియని కలదు. ''కుమారశీర్షిసింగే జలధి రశనాం శాసతి మహీమ్''—

అమరవ్యాఖ్య.

ఈసింగభూపతి యాస్థానముననే బొమ్మకంటి యప్పయాచార్యుఁడను విద్వాంసుఁ డొకఁడు కలఁడు. ఆతఁడే యమరకోశవ్యాఖ్యాత. ఉపలబ్ధమయిన తాళపత్రిపత్రితిలో గ్రంథారంభభాగము పోయినది. కడపట నిట్లున్నది :

శ్లో ఆద్యో వేదవిదాం కణాదకపిలవ్యాసాహిరాడంఘ్రిభృ
త్కాణిన్యాది సమష్టిమూర్తి రవధి స్స్మార్తక్రియావేదినామ్
వ్యాచష్టామరసింహనాథరచితం గ్రంథం నిపుంటూత్తమం
ఖ్యాతం శిష్యహితార్థ మవ్వయసుధీ శ్శ్రీమారపోతాభిధః.

శ్లో. రేచర్లవంశవంభూతే రాస్థాన్యాం సింగభూపతేః
బొమ్మకంట్యప్పయాచార్యమూర్త్యా జాగర్తి శారదా!

శ్లో కుమారసింగభూపేన లక్ష్యలక్షణవేదినా
శోధితశ్చే దయం గ్రంథః కిం శోధ్య శ్శోధకాంతరైః.

శ్లో. కుమారసింగభూపేన యః కదాపి న శోధితః
సగ్రంథ శ్శోధితో ప్యన్యైః కిం ముధైర్వ్యవహీర్యతే.

ఈబొమ్మకంటి యప్పయాచార్యుఁ డనర్ఘరాఘవవ్యాఖ్యాత యగు బొమ్మకంటి హరిహరునకు గురుఁడు. అనర్ఘరాఘవవ్యాఖ్య నారయఁ దగును. ఈయమరవ్యాఖ్యలోఁ గూడ నీతఁడు కుమారసింగ భూపతి యని పేర్కొనఁబడినాఁడు.

సర్వజ్ఞ బిరుదము.

ఈసింగభూపతికి సర్వజ్ఞబిరుదము కానరాదు. రసార్ణవసుధాకరమున లేదు. చమత్కారచంద్రికలో లేదు. అమరవ్యాఖ్యలో లేదు. ప్రాతప్రాతలలో నెక్కడను లేదు.కాని వెలుగోటివారివంశచరిత్రమున నీతడు మొదటిసర్వజ్ఞభూపతిగాను, శ్రీనాథునిచే దర్శింపబడినవాడు రెండవ సర్వజ్ఞసింగభూపతిగాను ప్రాయబడినది. ఆప్రాత యసంగతము. శ్రీనాథునిచే దర్శింపబడిన సింగభూపతికే సర్వజ్ఞబిరుదము కలదు. కొలచెలమ నారాయణపండితుడు చంపూరామాయణవ్యాఖ్యలో దమపూర్వులను ప్రకటించుచు గొలచెలము పెద్దిభట్టు (పంచకావ్యవ్యాఖ్యాత) "సర్వజ్ఞేనాభిపర్షితః" – సర్వజ్ఞునిచే గనకాభిషేకము గాంచినాడని చెప్పెను. మల్లినాథసూరి కూడ శ్రీనాథునిచే దర్శింపబడిన సింగభూపతికాలమువాడే కావచ్చును. మల్లినాథసూరిగ్రంథములందు రసార్ణవసుధాకర ముదాహరింపబడినది గాన నాతడు డంతకు బూర్వుడు కానేరడు. సమకాలమువాడుగాని తర్వాతివాడుగాని కాగలదగును. మల్లినాథునికుమారుడు కుమారస్వామి సోమపీథి పెదకోమటి వేమభూపాలుని సాహిత్యచింతామణి నుదాహరించినాడు. కావున మల్లినాథుని సత్కరించిన సర్వజ్ఞసింగభూపతి శ్రీనాథునిచే దర్శింపబడిన సింగభూపతియే కావలసియున్నాడు. కొలచెలమవంశ్యుల చరిత్రమును నేనిదివఱకు ప్రాసితిని; అందు :-

శ్లో. కిం దారుణా వంకరటింకరేణ
కిం వాససా చీకిరిబాకిరేణ
సర్వజ్ఞభూపాలవిలోకనార్థం
వైదుష్యమేకం విదుషాం సహాయః.

ఈశ్లోకము పండితలోకప్రతీతినిబట్టి పెద్దిభట్టు చెప్పినదిగాఁ దెలిసికొని యట్టు వ్రాసితిని. ఈశ్లోకము చమత్కార చంద్రికలో నుదాహరింపఁబడినది. అందు "శ్రీసింగభూపాలవిలోకనార్థమ్" అనికలదు. కాఁబట్టి యీ శ్లోకము మల్లినాథునిది కాకపోవుచున్నది. శ్రీనాథునిచే దర్శింపఁబడిన సింగభూపతికి సర్వజ్ఞబిరుదము కలదని శ్రీనాథుని చాటుధారలు చెప్పుచున్నవి. బమ్మెరపోతరాజుగారి భోగినీదండక కృతిపతి సర్వజ్ఞబిరుదము గలవాఁడని కుమారాన్నపోతాపసీనాథుని కొడుకని భోగినీదండకమే చెప్పుచున్నది:

కుమారాన్నపోతావసీనాథసూనున్, సర్వజ్ఞసింగక్షమానాథు, రాయచౌహత్తమల్లున్, మహారాజవేశ్యాభుజంగున్, సర్వజ్ఞ సింగక్ష మానాథపౌత్త్రిన్, సర్వజ్ఞసింగోర్వరాధ్యక్షు."

—భోగినీదండకము.

మీఁది పరిశోధనమువలనఁ జేలిన సారాంశ మిది : రసార్ణ వసుధాకరకర్త సింగభూపతియు శ్రీనాథులచే దర్శింపఁబడిన సింగ భూపతియు భిన్నులు. మొదటివానికి సర్వజ్ఞబిరుదము లేదు. వా రిర్వురు తాతామనుమలు. తత శక. 1320 ప్రాంతమునను మనుమఁడు శక. 1370 పర్యంతమునను నున్నవా రగుదురు. మల్లినాథుఁడు, శ్రీనాథుఁడు, పోతరాజు, సర్వజ్ఞ సింగభూపతిని దర్శించిరి.

సర్వజ్ఞ సింగభూపతిదర్శనము

శ్రీనాథుఁడు రాచకొండ కరిగి సర్వజ్ఞసింగభూపతిని దర్శిం చెను. ఆతఁడు గొప్పవిద్వాంసుఁడు. కావుననే శ్రీనాథుఁ డాతని

యాస్థాని కరిగినప్పు డక్కడ సభామందిరమునఁ బూజింపఁబడుచున్న శారదావిగ్రహమును గాంచి యీ పద్యమును జెప్పినాఁడు :

సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశుమున్యాలశాల
పగులఁగొట్టించి తుద్భటవివాదప్రౌఢి
గౌడడిండిమభట్టుకఁ బుధక్క
చంద్రభూషక్రియాశక్తి రాయలయెడ్డఁ
బాదుకొల్పితి సార్వభౌమబిరుదు
వలుకుఁదోడై తాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథసందర్భమునకు

గీ ఎటుల మెప్పించెదో నన్ను నింకమీఁద
రావుసింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సరవసద్గుణ నికురంబ! శారదాంబ!

రాజాస్థానమున నప్పుడు విద్వద్గోష్ఠిలో నేమేమిచర్చలు జరిగినవో యెఱుఁగరావు. శ్రీనాథుఁ డప్పుడు పూర్తిచేసిన సమస్య యిది మాత్రము తెలియుచున్నది :

ఉ. తక్కక రావుసింగవసుధావరుఁ డర్థుల కర్థమిచ్చుచో
దిక్కులలేని కర్ణుని దధీచిని భేవరు వేల్పుమానుఁ బెం
పెక్కిన కామధేనువు శిబిం(దుని నెన్నెదు భట్ట దిట్టవై
కుక్కవొ! నక్కవో! ఫణివొ! క్రోతివో! పిల్లివొ! బూతపిల్లివో!

క. సర్వజ్ఞనామధేయము
శర్వునకే రావుసింగజనపాలునకే

శృంగారశ్రీనాథము

యుర్వీం జెల్లుసు డక్కొఁడు
సర్వజ్ఞుం డనుట కుక్క సామజమనుటే!

పయిపద్యమునుగూర్చి గాథ యొకటి కలదు. శ్రీనాథుఁడు సర్వజ్ఞ సింగభూపతియాసానమునుండి మరలి రెడ్లయాస్థానమునకు రాఁగా రెడ్లాతని నిచ్చకాలమారి యని యాక్షేపించిరఁట. తమకు గర్వ శత్రువయిన సింగభూపతిని సర్వజ్ఞుఁడని పొగడినందులకు; శ్రీనాథుఁ డిట్లు బదులు చెప్పెనఁట: "ఆపద్యమున కర్థాంతర మున్నది. గూఢ ముగా సింగభూపతిని వెక్కిరించితిని. 'సర్వజ్ఞనామధేయము శర్వునకే, రావుసింగజనపాలున కేయుర్వీం జెల్లునుఁ (శివునిఁగాక) తక్కొఁడు, సర్వజ్ఞుం డనుట, కుక్క సామజమనుటే;' ఇది యా యర్థాంతరము." అని చెప్పి వారిని సమాధానపఱిచెనఁట! ఈయైతిహ్యమును గొందఱు విశ్వసింపకున్నారు. విశ్వాస్యము కావచ్చునని నా యుద్దేశము. శ్రీనాథుఁడు మరల నిఁకమీఁద (రాజమహేంద్రవరపు) రెడ్లయాస్థానమునఁ జేరఁబోవుచున్నాఁడు. రాజమహేంద్రవరపాలకులయిన వేమవీరభద్రా రెడ్లకును, వెలుగోటి వెలమరాజులకును విరోధముండుట వాస్తవము. కొండవీటి రెడ్లకును, వెలుగోటివారికిని వివాదముండుటను గూర్చి యీవఱకే తెల్పితిని. అట్టిచో నాబాల్యము వారియాస్థానమున మెలఁగిన కవీశ్వరుఁడు వారిప్రత్యర్థికడకుఁ బోయి మిగులఁగా నాప్రత్యర్థిని బొగడి వచ్చుట రెడ్లకెవరికిని సహ్యము కాకపోవచ్చును. అట్లు పొగడినందుకయి వారు శ్రీనాథు నాక్షేపించవచ్చును. శ్రీనాథుఁ డట్టియర్థాంతరమును దెలిపి సమాధానపఱుపను వచ్చును. ఇం దసంభావిత మేదియును లేదు. కాని శ్రీనాథునివంటి మహాకవి యట్లుచేయునా యని యాయన స్వభావమునుగూర్చి సంశయించుట తగును. రాజుల యవ్యవస్థిత చిత్తత్వమునుగూర్చి శ్రీనాథున కవహేళనబుద్ధి కలదు. వారి

యిచ్చకములను, మెఱమెచ్చులను జిక్కఁగా నెఱుఁగును. ఆయా సమయముల కనుకూలముగాఁ దప్పించుకొని పోవలసినదేగాని ప్రబల ప్రత్యయము వాఁయెడల ననుపఁదగదని యీ కవీశ్వరుఁడు తలఁ చెడువాఁడు. కొండవీటిరె డ్లంతరించినపిదప వారికిఁ ప్రబలప్రత్యర్థు లగు రాజమహేంద్రవరపు రెడ్లకడఁ జేరినాఁడు, కొండవీట నున్న ప్పుడు రాజమహేంద్రవరపురెడ్ల కీర్తఁడును ద్వేష్యుఁడే యగును. అప్పుడు కొండవీటిరెడ్లను ప్రస్తుతించినాఁడు. తర్వాత రాజమహేంద్ర వరపు రెడ్లకడఁ జేరినాఁడు, వారిని వర్ణించినాఁడు. ఆట్లు వెలుగోటి వెలమరాజులదగ్గఱ కేఁగినాఁడు. వారిని వర్ణించినాఁడు. గుణవద్వస్తువర్ణ నము కవికి స్వాభావికము. దానివలనఁ జిక్కువచ్చినప్పుడు తప్పించి నచ్చఁజెప్పఁగల్గు చాతుర్యమును గవికి స్వాభావికమే.

రావుసర్వజ్ఞసింగభూపాలునిచే శ్రీనాథుఁ డెట్లు సమ్మానింపఁబడెనో యెఱుఁగరాదు. బమ్మెర పోతరాజకవీశ్వరునితో శ్రీనాథున కిప్పుడు సమాగమము కల్గియుండును, పోతరా జేకశిలానగరనివాసి గావున; పొలము దున్నుకొనుచున్న పోతరాజుగారిని జూచి శ్రీనాథుఁడు చెప్పి నదిగా వినఁబడ్డ నీ క్రిందిపద్య మిప్పటిది కావచ్చును :

క. కమ్మని గ్రంథం బొక్కటి
యిమ్ముగ నేఁ బతికైనఁ గృతియించినఁ గో
కొమ్మని యీయరె యర్థం
బిమ్మహి దున్నంగ నేల యిట్టిమహాత్ముల్?

మెతుకుసీమ ప్రభువులఁ గూర్చి శ్రీనాథుఁడు చెప్పినదిగాఁ దెలియుచున్న యీక్రిందిపద్యము కూడ నాసమయమందలిది కావ చ్చును :

చ. తుతుకలు కోయ దొంగలకు ఘోరవికారతురుష్కజాతికిన్
మతకపు లంజెతొత్తులకు మాదిగవాండ్రకు మప్లదార్లకుఁ
గొతకక యిత్తు;రంతె; కవికోటుల కిత్తురె? చత్తు; రంతెపో
మెతుకుదొరల్ ..... భయదాయి దోర్బలుల్.



శృంగారశ్రీనాథము

సప్తమప్రకరణము

సీ. రాజమహేంద్రవరమున గోదావరీ
లహరిశీతలగంధవహము లొలయు
త్రైలోక్యవిజయసౌధము చంద్రశాలపై
వ్రేఁదతో నల్లాడవిభుని వేమ
వీరభద్రారెడ్డు వేరోలగంబుండి
కోరి యెవ్వాని సత్కారపూర్వ
కమ్మగా రావించి "కవివరేణ్య! బళి! నీ
బాసు! మీవలెఁ గవితాసమర్థు

గీ. లీక్షితిని నేఁటికాలమం దేరి యనుచు
మెచ్చి కాశీకాఖండము నిచ్చగించి
కృతిపతిత్వంబుచే నిత్యకీర్తి గనిరి
యతనిఁ గవిసార్వభౌము సమ్మతి నుతింతు.

కాశీఖండరచనము : వేమవీరభద్రారెడ్డప్రాపు.

భీమఖండరచనకాలమునకే సనసన్నగా వేమవీరభద్రారెడ్డకు శ్రీనాథకవీశ్వరునియెడ గౌరవాదరములు మొలకెత్తినవి. అందుకొఱకే శ్రీనాథుఁడు భీమఖండమునఁ బ్రసక్తాను ప్రసక్తముగా సందర్భింపఁ

జేసికొని వారిని వర్ణించినాఁడు. అప్పటికిఁ గొండవీటి కోమటి వేమా రెడ్డియుఁ దత్పుత్త్రుఁడు సంతరించి హెచ్చుకాలము కాకపోపుటచేతను వారియెడలఁ గల స్పర్ధ కొంత తగ్గాశితుఁడగు కవీశ్వరుని యెడఁ గూడ నుండఁదగిన దగుటచేతను సప్పుడు వారు శ్రీనాథు నాస్థాన కవినిగాఁ జేసికొన రయిరి. పదపడి శ్రీనాథుఁడు ప్రౌఢరాయ సర్వజ్ఞసింగాదుల యాస్థానముల కరిగి కనకాభిషేకాది సత్కా రములఁ బడసి వచ్చెను. ఈవార్తలను భీమఖండకృతిపతియగు బెండ పూఁడి యన్నామాత్యుఁడు మొదలగువారు వేమవీరభద్రారెడ్డకుఁ దెలుపుచు నాతనియెడ వారికి విశేషగౌరవ ముదయించునట్లు చేయుచు వచ్చిరి. శ్రీనాథకవీశ్వరు నాస్థానకవీశ్వరునిగాఁ జేర్చు కొనఁ బ్రోత్సాహపఱుచుచు వచ్చిరి. శ్రీనాథకవీశ్వరుఁడు విద్యానగ రము,రాచకొండ మొదలగుదేశముల కరిగి తిరిగి కొండవీటికే చేరెను. ఆకాలమున నాతఁడు కాశీఖండమును దెనుఁగింప నారంభించెను. ఎడనెడ బెండపూఁడి యన్నామాత్యాదుల చెలికారముచేఁ రాజమహేంద్రి వరప్రాంతముల కరుగుచుండెను వేమ వీరభద్రారెడు బెండపూఁడి యన్నామాత్యుల ప్రోత్సహముచేఁ గాశీఖండమును గృతిగొన నుత్స హించిరి. కాశీఖండమును గృతిగొనుటకుఁబూర్వము శ్రీనాథునకును వేమవీరభద్రారెడ్డకును సప్పుడప్పుడు సంఘటిల్లెడు సందర్శనమేగాని హెచ్చుసంబంధమున్నట్లు కానరాదు. మఱియు నాతఁ డప్పుడు రాజ మహేంద్రవరము వాసమేర్పఱచుకొన్నట్లును గానరాదు. కాశీఖండ మున: ''ఇమ్మహా (కాశీఖండ) ప్రారంభంబు కర్ణాకర్ణికావళంబున నాకర్ణించి కర్ణాంతవిశాలనేత్రుఁడును....ఆగు సల్లయవీరభద్రభూపాలుం డొకనాఁడు'' అనియున్నది. శ్రీనాథుఁడు రాజమహేంద్రవరమునఁనే వసించుచు వేమవీరభద్రారెడ్డయాస్థానకవితాపదమును బడసియే

యుండునేని యాతనికాశీఖండరచనమును వీరభద్రారెడ్డి కర్ణకర్ణికావశమునిసఁబనియుండదు. అస్వహము నాస్థానకవి యగపడుచునే యుండును. అతఁడే యెఱిఁగించును. మఱియు "నైషధాది మహాప్రబంధములు పెక్కుచెప్పినాఁడవు. మాకు నాశితుఁడ వనఘ" అని నేమవీరభద్రారెడ్డి య్యునట్టున్న పద్యభాగము శ్రీనాథునకు వానితో ప్రత్యేషపరిచయము లేనట్టు తోఁపించుచున్నది శ్రీనాథునకుఁ గాశీఖండరచనాభిమానము కోమటివేమారెడ్డితోఁ దాను కాశీయాత్రజరుపుటచేత నేర్పడినదయి యుండవచ్చును. కాని దానిని గృతిపతికోరి చెప్పించుకొనలేదు. వేమవీరభద్రారెడ్డికూడ కాశీయాత్ర చేసినదేమో? ఈయనుమానమున కిక్రిందిపద్యము హేతువు:

క. ఈంచి శ్రీగిరి కాశీ
పఁచారామాది దేవభవనంబుల వా
యించెఁ వేమమహీధవుఁ
దంచితభూదానశాసనాక్షరపంక్తుల్.

వేమవీరభద్రారెడ్డికాశీఖండరచనమునాఁటికి రాజమహేంద్రవరమున కుత్తరముగాఁ జోటి, కళింగపట్టణము, చిల్కసముద్రము పర్యంతముగాఁగల దేశమును జయించి యేలుచుండిరి. వారు జయించిన స్థలము లివి కాశీఖండమునఁ జెప్పఁబడినవి. చీడికాడ, మాకవరము, సప్తమాతెములు, మూడెజంతర్నాడు (ఇప్పుడు మావితోపులకుఁ బ్రఖ్యాత మయిన 'ఆలమండ'ను జంతుర్నాటి యాలమండయనుట విశాఖపట్టణమండలమునఁ గలదు), బారుహా (బారువ), కలువపల్లి, ఓడ్డాది, కసిమికోట కప్పకొండ, మొదలగునవి. చాటుపద్య మిది శ్రీనాథునిది కాఁదగును :

శృంగారశ్రీనాథము

సీ. దండయాత్రాఘోషతమ్మటధ్వనులచే
గంతులు వేయించెఁ గప్పకొండ
కితవ కాలాభీల కీలాలములచేత
నేలఁ బొంగడఁగించెఁ బాలకొండ
ఆరట్టశాధట్టహయధట్టములచేత
మట్టితూర్పెత్తించెఁ బొట్టూరు
భూరిప్రతాపాగ్నిఁ బుటములు పెట్టించె
పద్వేషులను గల (?) వెండిపురము

గీ. అనఁగ నుతికెక్కితౌర! కేతాదిరాయ!
ఆరులపండుమండువాయవనహరణ!
బళియదూళియమాధవ బిందికార!
విజయరఘురామ! అల్లాడవిభునివేమ!

ఈ క్రింది చాటుపద్యములు వేమవీరభద్రారెడ్లతోఁ బరిచయము పరిచయము సమయమున శ్రీనాథకవీశ్వరుఁడు చెప్పినవి కాఁదగును:

సీ. వివిధవిద్యోద్దండవిద్వత్కుమద కాంద
హరిణాంక! రూపనారాయణాంక!
సీతోగ్రకరవాల నిర్జితారినృపాల
సప్తాంగ! రాజవేళ్యాభుజంగ!
సకలమహీరాజ్యసంరక్షణోద్యోజ్య
కులశీలగుజ్జరిదళవిపాళ!
భామాజనస్వాంతపరితోషణలతాంత
కోదండ! రాయచేకోలుగండ!

గీ. జయవిజయజన్యకాంభోజహయనమాజ
ఘురవిపాటనసంధూత కుతలరేణు

పటలనిబిడఘనధ్వాంత భరితభువన
విజయరఘురామ! అల్లాడవిభునివేమ!

సీ. ఖండేందుమౌళిపై గలహంసపాళిపై
గర్వారధూళిపై గాలుద్రవ్వు
మిన్నేటితెఱలపై మించుతామరలపై
మహిమంచు సురలపై మల్లరించు
జంభారిగజముపై జండికారజముపై
జందనధ్వజముపై జొకరించు
ముత్యాలసరులపై మొల్లక్రొవ్వీరులపై
ముదికల్పతరులపై మోహరించు

గీ. వెడిమలయెక్కి శేషాహివెన్నుదన్ని
తొడరిదుగ్ధాబ్ధితరగలతోడ నలరి
నెఱతనంబాడి నీకీర్తి నిండె నహహా!
విజయరఘురామ! అల్లాడవిభునివేమ!

సీ. జయ! రాజవేశ్యాభుజంగాంక నిశ్శంక
యభ్యుదయంబు రాజాధిరాజ!
మంగళం బానతమండలీకరగండ
సంకల్పనంసిద్ధి సమరవిజయ!
బ్రహ్మాయు వరిరాయబసువ శంకరముద్ర
వర్ధిల్లు గాయగోవాళవిరుద!
మహిమించు రపుచెంచు మంచూఱికారాంక
స్వస్తి కర్పూరవసంతరాయ

గీ. ఆంధ్ర.....సింధుయవనవేది
వీరలక్ష్మిస్వయంవరపీఠణాధ్య!

శృంగారశ్రీనాథము

ధరణీపాలింపు మాచంద్రతారకముగ
విక్రమొన్నిద! ఆళ్వయవీరభద్ర!

వీరభద్రారెడ్డితమ్ముఁడు దొడ్డారెడ్డి నిళ్ళంకుని కొమ్మనామాత్యునిచే శివలీలావిలాసమును ప్రబంధముఁ జెప్పించి కృతిపతి యయ్యెనని యీవఱకే ప్రాసితిని. అతఁడు రాజమహేంద్రపురపార్శ్వమున నిరువది యాఱుమూళ్లమేఱ "రాజకుంజరసింహ" మను సత్రమునెక్కి దుమికించెనఁట! ఈ విషయము శ్రీనాథుఁడును కొమ్మనామాత్యుడునుగూడఁ బ్రస్తావించినారుఁ-

మ. హరి దాఁటించెఁ బురోపకంఠమున వాహ్యాళిప్రదేశంబునం
దరుదై యళ్వయరెడ్డినందనుఁడు దొడ్డయ్యక్షమాధీశ్వరుం
డిరువై నాలుగుమూళ్ళమేర యని గో సెక్కింపఁగానేల య
ద్ధరణీనాథునికీర్తి దాఁటెఁ గడు నుద్దండించి బ్రహ్మాండమున్.

- కాశీఖండము.

మ. అరుదై యళ్వయదొడ్డభూవిభుఁడు వాహారోహరేఖంతుఁడిం
పరుదార న్వడి మూలఁగూరికడ వాహ్యాళిస్థలిన్ రాజకుం
జరసింహంబను వారువంబును యదృచ్ఛాలీలఁ దాఁటింపఁడే
తిరమై యిర్వదినాల్గుమూళ్ళనిడు పుత్సేకంబుచే యెత్తుగాన్

-శివలీలావిలాసము.

ఈతఁడు శృంగారంకోట లోతుగడ్డలను జయించెనఁట! రాజమహేంద్రవరమున వీరభద్రారెడ్డి త్రైలోక్యవిజయసౌధము చందశాలపైనుండిన. గోదావరీతరంగతాండవ మొగపడుచుండెదిదఁట!

క. త్రైలోక్యవిజయసౌధవి
శాలమహోత్తుంగ చంద్రశాలాసతత
వ్యాలోకిత గౌతమక
న్యాలహరివిహారతాండవాటోపునకఁ.

ఇప్పుడు చిత్రాంగిమేడ యని చెప్పఁబడెడు దిబ్బ యీ త్రైలోక్య విజయసౌధపుఁ బాటిదిబ్బ యగునాయేమిఁ


వీరభద్రారెడ్డి పాలనకాలమున బ్రాహ్మణుల వైభవ మీవిధముగా వర్ణింపబడినది :

సీ. ధరియింపనేర్చిరి దర్పపెట్టెడు వ్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియమీఁదఁ
గస్తూరికాపుండ్రకములు నొసల
నవరింపనేర్చిరి జన్నిదంబులమోలఁ
దారహారములు ముక్తాలవరులు
చెరువంగ నేర్చిరి పిగల సెన్నుదుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వ విసులు

గీ. ధామముల వెండిపైఁడియుఁ దడబడంగ
బ్రాహ్మణోత్తము లగహారములలోన
వేమభూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రియేలింప గౌతమీతటములందు.

ఇది స్వభావోక్తి. అప్పుడు విప్రాంసులగు బ్రాహ్మణులస్థితి యిట్లే కలదనుట స్పష్టపడుటకును మఱికొన్ని విషయము లెఱుక పడుటకును వీరభద్రారెడ్డికాలమున నెలకొల్పఁబడిన చెఱకుమిల్లి

ధర్మశాసనము చూడఁదగినది. వీరివంశవృక్షమిక్రిందఁ జూపు చున్నాఁడను:



కాశీఖండము.

''కాశీఖండ మయఃపిండమ్'' అని ప్రతీతిఁగాంచిన సంస్కృత గ్రంథమున కిది తెలుఁగు. అయఃపిండ మన్నప్రతీతి తెల్గుగ్రంథము నకే యయి యుండవచ్చునని నాతలంపును ముందే తెల్పితిని. శ్రీనాథుని గ్రంథములలోనెల్ల నిది ప్రౌఢతమరచనము గలది. సంస్కృత గ్రంథమున కిది సరియయిన తెనుఁగు గాదు. మిక్కిలి సంక్షిప్తముగా నున్నది. సంస్కృతమునఁగల గ్రంథభాగ మెంతో యిందు విడనాడఁబడసది. తన పూర్వకావ్యరచనము నీగ్రంథమున శ్రీనాథుఁడు ''చిన్నారి పొన్నారి—'' పద్యమందుఁ బేర్కొన్నాఁడు. ఇంచుమించుగా నీకావ్యము రచించునాఁటికి శ్రీనాథుఁ డర్వదియేండ్ల ప్రాయము వాఁడగునని ''ప్రాయమింతకు మిగులఁ గైవాలకుండ'' ననువాక్యము వాక్రుచ్చు చున్నది. వీరభద్రారెడ్డి యొద్దోలగముండి శ్రీనాథునిఁ గృతి గోరు విషయ మిట్లు వర్ణింపఁబడినది:—

సీ. త్రైలోక్యవిజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలాప్రదేశంబునందు
సచివసైన్యాధీశసామంతన్యపవార
సీమంతినీజనశ్రేణి గొలువ
శాస్త్రమీమాంసయు సాహిత్యగోష్ఠియు
విద్వత్కవీంద్రులు విస్తరింప
కర్పూరకస్తూరికా సంతమదగంధ
సారసౌరభము దిక్పూరితముగ

గీ. నిజభుజావిక్రమంబున నిఖిలదళలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరునియంక మాశ్రయించి
నిండుగొలువుండెఁ గన్నులపండువగుచు.

వ. అప్పుడు నన్నుం బిలువం బంచి సముచితాసనంబునఁ గూర్చుండ నియమించి యున్నయవసరంబున:-

సీ. వచియింతు వేములవాడభీమనభంగి
నుద్దండలీల నొక్కొక్క మాటు
భాషింతు నన్నయభట్టుమార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వ పకారమురసా
భ్యుచితబంధమున నొక్కొక్కమాటు
పరిధవింతు ప్రబంధపరమేశ్వరునితేవ
నూక్తివైచిత్రి నొక్కొక్కమాటు

గీ. నైషధాదిమహాప్రబంధములు వెక్కు
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ!

శృంగారశ్రీనాథము

యిపుడు చెప్పఁదొడంగిన యీ ప్రబంధ
మంకితముసేయు వీరభద్రయ్యపేర!

శా. ఈషోడశ సిసఁటోలు సత్కవులు వేరీ నేటికాలమ్మునఁ
దాక్షారామచతుర్థభీమకరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయగంధసార ఘనవృణద్వీరాజ్యభారంబున
ధ్వనింపన్ గవిసార్వభౌమ! భవదీయప్రౌఢసాహిత్యముల్.

"కర్ణాటకటకపద్మవనహేళి" "కవిసార్వభౌమ" పదములఁ గూర్చి యీవఱకే కనకాభిషేకప్రకరణమునఁ బ్రస్తావించితిని. మఱియు శ్రీనాథుఁడు తన సాహిత్య సౌష్ఠవమునకుఁ గారణములని, యుద్భోధకములని వేమభూపతి దయాపీఠికాదులను బేర్కొని చెప్పిన పద్యము నింతకుముందే వివరించితిని. మీఁద నుదాహరింపఁబడిన "వచియింతు వేములవాఁడ" యని సీసపద్యము వీరభద్రారెడ్డి యన్నయగు వేమారెడ్డి తన్నుఁగూర్చి ప్రశంసించినదిగా శ్రీనాథుఁడు చెప్పుకొన్నాఁడు. ఈ పద్యమునుగూర్చి నే నిట్లు తలఁచుచున్నాఁడను. వచియింతు, భాషింతు, వాకొనిత్తు, పరిభవింతు – అనుపదములు మధ్యమపురుషక్రియలుగాఁ బ్రయోగింపఁబడినవి, అవి ఘటితిస్ఫూర్తిలో నుత్తమపురుషక్రియలుగా గోచరించును. ఎత్తుగీతి నెత్తుకొనిన పిదపఁగాని యవి మధ్యమపురుషక్రియలుగాఁ దెలియరావు. ఈపద్యమును శ్రీనాథుఁడు కర్ణాటరాజాస్థానమునఁగాని మఱియేదేనియెడఁగాని తన కవితాప్రాభవము నెఱిఁగించుకొనుచు నుత్తమపురుషక్రియాఘటితముగానే రచించి పదపడి కాశీఖండరచనకాలమునఁ గ్రొత్త యెత్తుగీతిని జేర్చి వేమారెడ్డి పలికినట్లు మధ్యమపురుషక్రియాన్వయమేర్పరచి కూర్చుకొని యుండును. ఇట్లుచేయుటచే నాత్మస్తుతి

దోషము లేకపోవును. మధ్యమపురుషక్రియాఘటితముగానే యాతఁడు రచించి యుంగునేని నాల్గుక్రియలలో దేనికయినను ''వు'' చేర్చి యుండును.

విద్యానగరమున కరిగి డిండిమభట్టునోడించి రాయనిచేఁ గనకాభిషేకాదిసత్కారములఁ బడసివచ్చినతర్వాత నల్పకాలముసకే రచింపఁ బడినదగుటచే నీకాశీఖండమున శ్రీనాథుఁడు ప్రవక్తి కల్పించుకొని యా విషయమునుగొంత చెప్పుకొన్నాఁడు. గ్రంథమున సందర్భమిది:— మేరు వింధ్యపర్వతములకు నారదమహర్షి స్పర్ధపెంచెను. అపమాన మొర్వఁజాలక వింధ్యపర్వత మాత్మగతముగా నీక్రింది విధమునను కొనుచున్నది' పరిభూతుఁడయిన పండితుఁ డనుకొన్నవిధమున నున్నదిగాని యిది యవమానితమయిన యాదియనుకొన్న విధమున లేదు. చదువఁదగును:

గీ. విబుధమునిమాట చెవికిఁ గ్రొవ్వేఁడిగాఁగ
వింధ్యగర్వోదయుండైన వింధ్యశిఖరి
చాల నుద్వేగమందె విచారపరత
నాత్మగతమునఁ దాను నిట్లనుచు నుండె.

గీ. శాస్త్ర మాచార్యసన్నిధిఁ జదువఁడేని
యిద్ధబోధఁబు మది సంగ్రహింపఁడేని
తెగువమీఱి ప్రతిజ్ఞ సాధింపఁడేని
జ్ఞాతి జయమందఁడేని త జ్జనుఁడు జనుఁడె?

ఉ. కంటికి నిద్రవచ్చునె, సుఖంబగునే రతికేళి, జిహ్వకుఁ
వంటకమిందునే, యితరవైభవముల్ పదివేలు మానసం

శృంగారశ్రీనాథము

బంటునె మానుషంబుగలయట్టి మనుష్యున కెట్టివానికిఁ
గంటకుఁడైన శాత్రవుఁడొకండు తనంతటి వాఁడు కల్గఁగఁ.

క. ఎవ్వనితో నెచ్చోటం
జివ్వకుఁ జేఁ జాఁపవలదు చేఁ జాచినచో
నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వకయుండంగఁ బగసనఁ దీర్చుదగుఁ.

సంస్కృతమున నింత లేదు. శ్రీనాథుఁడు డిండిమభట్టారకుని తోడి వివాదసందర్భమున నాత్మగతముగా ననుకొనిన విషయమే యిందిట్లు ప్రసక్తపఱచి చొప్పించినాఁడని తలంపఁ దగును. లక్ష్మీనిట్లు స్తుతించినాఁడు:-

ఉ. పండితుఁ డాతఁ డాతఁడు ప్రభావసమగ్రుఁ డతండు శూరుఁ డా
తండు వివేకి యాతఁడు వదాన్యుఁ డతండు మహాకులీనుఁ డా
తండు కళావిదుం డతఁడు ధన్యుఁ డతండు మనోజ్ఞమూ ర్తి యె
వ్వండు భవత్కృపాకలన వైభవలక్ష్మికిఁ బాత్ర మిందిరా!

గీ. కమలనయన నీవు కలచోటు కలచోటు
నీవు లేనిచోటు నీరసంబు
కంజకంఠి నీవు కలవాఁడు కలవాఁడు
లేనివాఁడు నీవు లేనివాఁడు.

మఱికొన్ని విశేషములు శ్రీనాథుని స్వభావమును గూర్చి వ్యాయపట్టునఁ దెలుపుదును.

డిండిమభట్టారకుని జయించుట యీతనికి మహోత్సాహకరముగా నున్నది. కాశీఖండమునఁ గవిసార్వభౌము బిరుదమును గ్రంథావ

తరణికలోను, గద్యమునందును జెప్పుకొన్నాడు. గ్రంథాంతమునఁ గూడఁ జెప్పుకొన్నాడు:

శా. కర్ణాటక్షితినాథమౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణస్నాన జగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్య చారిత్ర! దు
గ్ధార్ణోరాశి ధీర! ప్రాహ్ణముఖమధ్యాహ్నపరాహ్ణార్చితా
పర్ణవల్లభ! రాజశేఖరమణీ! పట్టాన్వయగ్రామణీ!

కాశీఖండము రచించి కృతియొసఁగినప్పుడు వీరభద్రారెడ్డి మన దొడ్డకవీశ్వరున కేమేని సత్కారములఁ గావించెనో యెఱుఁగరాదు. "కాశికాపేశ్వేళఁ గలసె వీరారెడ్డి, రత్నాంబరంబు లేరాయఁ డిచ్చు" నని యవసానపద్యమునఁ జెప్పుకొన్నాడు. కాశీఖండరచన కాలమునుండి శ్రీనాథుఁడు "వీరభద్రారెడ్డి విద్వాంసుఁ" డయినాఁడు.

వేమవీరభద్రారెడ్ల యవసానము.

వీరి యవసానమునుగూర్చి యింతవఱకు స్పష్టముగా నేమియును దెలియరాకున్నది. శాక 1356 వఱకు వేమవీరభద్ర దొడ్డయాన్నయలు నల్వురును జీవించియున్నట్టు దాక్షారామశాసనములవలనఁ దెలియుచున్నది. శాక 1366 లో దాక్షారామమునఁ బ్రౌఢదేవరాయలశాసనమున్నది. శాక 1376లో గజపతులశాసనములు కొండవీడుప్రాంతములఁగూడనున్నవి. 'రెడ్డిదొడ్డకర్ణాటరాజ్యము'లని తెలుఁగుదేశమునఁ బ్రతీతికలదు. రెడ్డిరాజ్య మంతరించినతరువాత నొడ్డెరాజ్యము వచ్చినట్టు ప్రఖ్యాతి. కృష్ణదేవరాయనికాలమున నాయొడ్డెరాజ్యము చెఱుపఁబడినది. రాజమహేంద్రవరమున రెడ్డిరాజ్యము పేరులేకుండ సమసిపోవుటకు గారణమేమో స్పష్టముగాఁ దెలియరాకుండుట వింతగానున్నది. కర్ణాటరాజులో గజపతులో రూపుమాపియుందురేమో!

శృంగారశ్రీనాథము

కాశీఖండరచనకాలమునాఁటికి వేమవీరభద్రారెడ్లు కర్ణాటులతో గజపతులతో నత్యంతమున్నైత్రి కల్గియుండిరి. కాశీఖండమం దిట్లు వీరభద్రారెడ్డి వర్ణింపఁబడినాఁడు:

"కర్ణాటోత్కళ పారసీకనృపసఖ్య ప్రాభవశ్రీనిధీ!"
"ఉత్కళ కర్ణాట తురుష్కరాట్పరిషిత్రా।"

"కర్ణాటభూపతి కానుకడుంపిన బాగాహయంబులు వాగేవచ్చు; యవనాధిపతి యుపాయసముగా నంపిన ముక్తాతపత్రింబు ప్రోలమెఱయు। ఒడ్డెధాత్రీనాథుఁ డుపద పుత్తెంచిన బిందారుణోష్ణి సంబెళవహించు." ఈముష్వరలో నొకరు రాజమహేంద్రవరరాజ్యమును నిర్మూలపఱచియుండు రనుటకు సరియయిన ప్రమాణము దొరకకున్నది. వేమవీరభద్రారెడ్లకు వెలుగోటివెలమరాజులు ప్రబల విరోధులుగానుండిరి. అనుబంధము చూడఁదగును. మాదయలింగమనేనిఁగూర్చి కలసీసమూలికలో "గంగసాక్షిగ మీఱి కదిసి రాజమహేంద్రవరము చూఱలుకొని వచ్చినాఁడు" అనియు, "వీరభద్రుని దొడ్డవిభువేమనృపతులఱట్టడై కాలందెబెట్టినాఁడు" అనియుఁ గలదు. మఱికొన్ని పద్యములు గలవు. కాని రాజమహేంద్రవరమును వెలుగోటివెలమరాజులు పరిపాలించిన ట్లెక్కడను గానరాదు. బలవత్ప్రమాణములు లేక యిది యిట్లేయని నిర్ధారింపరాదు. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు వేమవీరభద్రారెడ్ల యవసానమునుగూర్చి యిట్లువ్రాసినారు:

"....మంత్రియగు కపిలేంద్రగజపతి రాజ్యారూఢుఁడయ్యెను. ఇతఁడు మిక్కిలిసమర్థుఁడు విక్రమాఢ్యుఁడు సగటుచేత దనరాజ్యమును విస్తరింపఁజేయ సంకల్పించెను. రెడ్డి రాజ్యము నాపోసనము బట్టినఁగాని తనసంకల్పము నెరవేఱఁజాలదు. అందులకై పదిసంవ

త్సరములు కృషిచేసెను. 1444 వ సంవత్సరమునఁ గపిలేంద్రగజపతి రాజమహేంద్రపురముపై దండయాత్ర వెడలివచ్చెను. ప్రౌఢదేవరాయలు రెడ్లకు సాహాయ్యముఁజేయవచ్చెను. ఉభయపక్షములవారికి యుద్ధములు జరిగినవి. కపిలేంద్రగజపతి యుద్ధమున గెలువఁజాలక యాతడవకు మరలిపోయెను గాని తనపట్టువిడచినవాఁడుగాఁడు. ప్రౌఢదేవరాయ లాసంవత్సరమున దాక్షారామభీమేశ్వరుని సందర్శించియొక దానశాసనమును వ్రాయించి వెడలిపోయెను. తరువాత రెండు సంవత్సరములైన తరువాత విద్యానగరమునందు ప్రతాపదేవరాయలు మృతుండయ్యెను. ఇట్టి మహాసమర్థుడైన శత్రువు మరణమునొంది నందునఁ గపిలేంద్ర గజపతికి బలమెక్కువయయ్యెను. అతఁడు కర్ణాటసామ్రాజ్యమును స్వాధీనపఱచుకొని పిమ్మట తురుష్కులను జయించి దక్షిణహిందూదేశమున నేకసామ్రాజ్యమును స్థాపింప వలయునని సంకల్పించి కృషిచేయుచుండెను.''

అన్నదేవచోడుని వీరకృత్యములు.

ఇట్లుండగా మధ్యాంధ్రదేశమున నొక మహావీరుఁడావిర్భవించెను. అతఁడు చోడవంశమున జనించినక్షత్రియుఁడు. ఇతని శాసనమొకటి రాజమహేంద్రవరము మ్యూజియములో నుండెను. ఈ తామ్రశాసనములోని కొన్నిపలకలు పోయినవి. అయినను గొంత వఱకు నీతనిచరిత్రము చెలిసికొనవచ్చును.... ..... కామభూపాలనిపుత్త్రుఁడే అన్నదేవచోడుఁడు. సూర్యవంశమున జనించిన పిన్నుండిరాజుయొక్క సోదరియగు ఇరుగాంబికను వివాహము జేసికొనియెను. 1383వ సంవత్సర ప్రాంతమున నుండ్రాజు భూరవరపట్టణము రాజధానిగాఁ బరిపాలనముజేయుచుండెనని పూర్వప్రకర

ణమున దెలిపియున్నాఁడను. ఈపిన్నుండి యనునాతఁ డాయుఁడాజు వంశమున జనించినవాడుగఁ గన్పట్టుచున్నాఁడు వీరికి సంతానములేని హేతువుచేత వీరభద్రుఁ డనువానిని దత్తుచేసికొన్నట్లు గన్పట్టుచున్నది. అన్నదేవచోడుఁడు బహమనీసుల్తానగు అల్లాఉదీన్ షాహతోనొడఁబడిక చేసికొని తురుష్కసైన్య సహాయ్యముతో రాజమహేంద్రపుర రాజ్యములో గొంత భాగమాక్రమించుకొనియెను. రాజమహేంద్ర పురమునకుఁదూర్పుభాగమున గజపతికిని వీరభూపాలునకును ఘోర యుద్దములు జరుగుచుండెను దక్షిణము నుండి లింగమనాయఁడు, సింగమనాయడు మొదలగు పద్మనాయకులు కర్ణాటనృపతులకు సామంతులు గావునఁ గర్ణాటసైన్యములతో దండెత్తివచ్చిరి. రాజ మహేంద్రపురరాజ్య మిట్లు యవనకర్ణాటబల సైన్యములతో నొక్క మారు పోరాడవలసివచ్చెను. ఈ ఘోరయుద్ధములలో వేమవీరభద్ర పృథ్వీశుల సైన్యము హతమయ్యెను. వీరశిఖామణులైన సోదరులు మువ్వురును వీరస్వర్గమును జూఱగొనఁబోయిరి.... .....

శ్రీ వీరభద్రరావుగారు వ్రాసిన విషయము సంగతముగాఁ దగును. రాజమహేంద్రపాంతములం దన్నదేవుఁడను క్షత్త్రియుఁడు రాజుగానుండెనని, ప్రసంగరత్నావళికూడఁ బలుకుచున్నది. అందుఁ గొన్ని శ్లోకము లన్నచోడదేవునిగూర్చి కలవు. శ్రీవీరభద్రరావుగారు పేర్కొనిన శాసనము మిక్కిలి పాతపడగలది. ఆ శాసనమందలివిగా వారు వివరించినవిషయము లింతకుముందుఁ దెలియరాలేదు. ఆశాస నము సవిమర్శముగా ముద్రితము కావలసియున్నది. వీరభద్రరావుగా రాశాసనరచనాకాలమును బేర్కొనలేదు. అందుఁ గొన్నిరేకులు పోయినవఁట!

భీమఖండమునందుఁ జూడఁగా సూర్యవంశ్యులయిన వీరభద్రాన్న దేవభూపాలుర గర్వసంరంభము నడఁగించి యరియేటి లింగనమంత్రి యల్లాడభూపతిని దెలుఁగుభూమి నేలించెనని కలదు :

సీ యూదేశవనస ప్రమూడెబారుహదొంతి
వంతునాదిక్షితీశ్వరులఁ గెలిచి
యెడ్డాది మత్స్యవంశోదయార్జునుచేతఁ
బల్లవాదిత్యుచేఁ బలచమంది
దండకారణ్యసధ్య పులిందరాజ రం
భాహివంశజులకు భయమొసఁగి
భానమత్కలవీరభద్రాన్న దేవేంద్ర
గర్వసంరంభంబుఁ గట్టి పెట్టి

గీ. యవ కర్ణాటకాంధ్ర భూధవులతోడఁ
జెలిమి వాటించి యేలించెఁ దెలుఁగుభూమిఁ
దన నిజస్వామి యల్లాడధరణినాథు
భళిరె యరియేటిలింగన ప్రభుపరుండు.

అల్లాడభూపతి కాటయవేమారెడ్డి చనిపోయినపిదపఁ గొంత కాలమువరకు జీవించియుండెను. భీమఖండరచనకాలమున కాతఁడు చనిపోయెను. ''అల్లాడభూపుండు రాజమహేంద్రంబు రాజధానిగా సింహాద్రిపర్యంతం బుత్కళకళింగయవనకర్ణాటలాటాంతర్దీపంబైన ప్రతాపంబున..... ప్రభావుండై విశ్వంభరాభువనమండలంబుఁ బాలించెఁ దదనంతరంబ''- భీమఖండము.

శ్రీ వీరభద్రావుగారు పేర్కొన్న యన్నలదేవుఁడే పయి భీమఖండపద్యమునఁ బేర్కొనంబడినవాఁడు. భీమఖండరచనకాలమువఱ

కాతఁడు పరాభూతుఁ డగుచువచ్చి తర్వాతఁ గాశీఖండరచనానంత రమున విజయము గాంచెనేమో! ఆశాసనము సమగ్రముగా ముద్రిత మయినఁగాని నిశ్చయపరిజ్ఞానమేర్పడదు :

శ్రీనాథునకు మరలఁ జిక్కులు.

ఎట్లోగాని, వేమవీరభద్రారెడ్డి ప్రభృతులు క్రీ. 1460 ప్రాంత ముల సంతరించి రనుమాట వాస్తవము. తర్వాత రాజమహేంద్రవర రాజ్యము రెడ్లపాలనమున లేకుండుట వాస్తవము. శ్రీనాథుని యాలం బము మరలఁ జిక్కినది. కష్టము, అధికగౌరవముతోఁ దన్నాదరించు చుండిన కోమటి వేమనను గోల్పోయినాఁడు. కొండవీటిరాజ్యము రూలెను. ఉదయించెను మరల రెడ్డిరాజ్యము రాజమహేంద్రవరమున; అక్కడ భోగభాగ్యములతోఁ దొప్పదోఁగినాఁడు అంతలో నదియు నస్తమించెను. ఇస్సిరో! ఎట్టివిప్లవములు! నేఁటివఱకును శ్రీనాథుని వర్ణనము విశృంఖలమే! ఆదరించురాజులయొద్ద నానందముతోఁ గడప వలసినకాలమింక; ప్రాయపుఁబ్రొద్దు పడుమటికిఁ దిరిగినది. అయిన నేమి! దేశాటనము తప్పదయ్యెను. వేమవీరభద్రారెడ్లు చనిపోయిన తర్వాత శ్రీనాథుఁ డించుమించుగా నిర్వ్యాదియేండ్లు జీవించినాఁడు. ఆ కాలమున కుటుంబభరము హెచ్చుగానుండెను గావలయు. దొహి త్రాది పోష్యవర్గమును ఒప్పనిదిగా నుండియుండును.

పంటమైలారుని యాశ్రయము.

శ్రీనాథుఁ డిల్లగదలవలసి యున్నాఁడు. కాని కొండవీటనున్న సంసారమునకు జీవనోపపత్తి కల్పింపవలసియున్నది. అదికుదిరినఁ గాని తాను హెచ్చుకాలము దేశాటనము జేయ సనిపడదు. ఇందుకయి

పంటరెడ్డియు, విద్యానగర ప్రభువులకు ఛోపడిన సామంత్తుడును నగు మైలారరెడ్డిని దర్శించినాడు. ఈరెడ్డి శఠమర్షణగోత్రజులగు శ్రీవైష్ణవులకు శిష్యుడు. శక. 1360 కీలకసంవత్సరమున మైలారరెడ్డి కోర్కిపై ప్రౌఢదేవరాయడు తక్కెళ్లపాడు, పోలవరము, నను రెండుగ్రామములను బ్రాహ్మణులకు దానముచేసెను. మైలారరెడ్డి తనకు యుద్ధవిజయములను గల్గించినందులకు బరితుష్టుడై, ప్రౌఢదేవరాయ లాతని యభీప్సితము నెఱవేర్చినాడు. పెదకోమటివేము ననంతరము కొండవీడు నాక్రమించుకొనుటలో బ్రౌఢరాయలకీతడు తోడ్పడి యుండవచ్చును. కొండవీడుప్రాంతదేశ మీతని యేల్బడిని గొంతకాల మున్నది. మైలారరెడ్డి కంకితముగా శ్రీనాథుడే మేమని కృతులు రచియించెనేమో యెఱుగరాదు. శ్రీనాథుని కృతులుగా బేళ్లు మాత్రము తెలియునవి నందసందనచరిత్ర, వల్లభాభ్యుదయము మొదలగునవి కొన్నికలవు. అందొకటి యాతని కంకితమయి యుండవచ్చునేమో ! శ్రీనాథుని నిర్యాణకాలపద్యమున "కైలాసగిరి బంటమైలారవిభుడుండె దినమెచ్చ మేరాజు తీర్పుగలడు?" అని కలదు.

పల్నాడు పర్యాణములు.

ఈకాలమున శ్రీనాథుడు కొండవీటికి జేరువనున్న పలినాడు మొగలగుప్రదేశముల కరిగి కొంతధనమార్జించుకొని వచ్చుచుండెడివాడు. పల్నాటిసీమనుగూర్చి శ్రీనాథుడు రచించినవిగా జెప్పబడెడు చాటుపద్యము లీకాలమందలివి కాదగును. చాటుపద్యమణిమంజరి, పర్శిథమ, ద్వితీయభాగములలో నాపద్యములు గొన్నిటి జేర్చితిని. కొన్నింటినిమాత్ర మిక్కడ జూపుచున్నాడను:—

శృంగారశ్రీనాథము

క. రసికుఁడు పోవఁడు వల్నా
డెసఁగంగా రంభయైన నేకులె వరకుఁ
వసుధేశుఁడైన దున్నును
గుసుమాస్త్రుండైన జొన్నకూడేకుడుచుఁ.

పలనాటిసీమలో నెంతోలోతు త్రవ్వినఁగాని నీళ్లూరవు. అక్కడఁ జేఁదాళ్ళు కొండపీటిచేఁదాళ్లకు ద్విగుణితమై యుండవలయును. అంతలోఁతు తవ్వినను గొన్నిచోట్ల నీరూరక రాతిచట్టు వచ్చును. కాన నీళ్లకై యెంతోసొమ్ము వ్రయిపెట్టియు నొక్కపుడు భంగపడ వలసివచ్చుచుండును. ఇది తెల్పుచుఁ జెప్పినపద్యము:-

ఉ. అంగడి యూరలేదు, వరియన్నములేదు, కుచిత్వమేమిలే
దంగన లింపులేరు, ప్రియమైన వనంబులులేవు, నీటికై
భంగపడంగఁ బాఁడు కృపాపరు లెవ్వరులేరు, దాత లె
న్నంగను సున్న గాని పలనాటికి మాటికఁ బోవ నేటికిన్?

పల్నాటిదేశమున గ్రామమున కెవ్వరో పెద్దలు వచ్చినప్పుడు గ్రామపురోహితునింట విడిదలనేయింతురు. వారిండ్లలోఁ దమతమ యాశ్రితులయిండ్లకుఁ గుట్టియిచ్చుటకై విస్తరాకులు నిల్వయుంచు కొందురు. అక్కడఁ బురోహితులే కరణముగార్లకు విస్తళ్లుకుట్టి ఇవ్వ వలెనఁట: -శ్రీనాథుఁ డొకపురోహితునింట విడిసి యారోత నిట్లు వర్ణించెను:

ఉ. దోసెఁడు కొంపలోఁ బసులత్రొక్కిడి, మంచము, దూడరేణమున్
బాసినవంటకంబు, పసిబాలురశౌచము, విస్తరాకులున్
మాసినగుడ్డలున్, దొలకుమాసినముండలు, వంటకుండలున్
రాసెడుకట్టెలున్ దలఁవరాదు పురోహితులించికృత్యముల్.

క. జొన్నకలి జొన్నయంబలి
జొన్నవ్వము జొన్నవిసరు జొన్నలె తప్పన్
వన్నన్నము సున్నసుమీ
పన్నుగఁ బల్నాటిమన్న ప్రజఁ దఱుకున్.

గీ. చిన్నచిన్నరాళ్ళు చిల్లరదేవుళ్ళు
నాగులేటిసీళ్ళు నాఁపరాళ్ళు
సజ్జజొన్నకూళ్ళ సర్పంబులును దేళ్ళ
పల్లెనాటిసీమ పల్లెటూళ్ళ.

మొరసరాజ్యము.

మఱియు మొరసరాజ్యమునుగూర్చి శ్రీనాథునివిగాఁ గొన్ని చాటుపద్యములు గలవు. మొరసరాజ్యమనఁగాఁ గర్నూలుమండల మనియుఁ, మొరసరాళ్ల విస్తారముగా నుండుటచే నాదేశమున కాపేరు వచ్చెననియుఁ దెలియుచున్నది. శ్రీనాథుఁ డీ కాలమున నక్కడికిఁ గూడ నరిగెడివాఁడు. చాటుపద్యము లున్నవి. ఉదాహరింతును:—

ఉ. గొంగడి మేలుపచ్చడము కుంపటి నల్లలు కుక్కమంచమున్
జెంగటవాయుతైలము జీర్ణపుమందులు నుల్లిపాయలున్
ముంగిట వంటకట్టియలమోపులు దోమలు చీఱిపోతులున్
రంగ! వివేకి కీ మొరవరాజ్యము కాఁపుర మెంతరోఁతరా!

ఉ. వంకలపాగలున్ నడుమువంగిన కత్తులు మైలకోఁకలున్
సంకటిముద్దలున్ జనుపళాఁ ములున్ బలుపచ్చడంబులున్
దెంకగునోరచూపులును దీఱుపదప్పిన యేసబాసలున్
అంకులబ్రహ్మ యీమొరసరాజ్యము నెట్లుసృజించె నక్కటా!

శృంగారశ్రీనాథము

అష్టమప్రకరణము

సి. వీరభద్రారెడ్డి చేరెను దివికిరా
జమహేంద్రివరపుటాశ్రయము తొలఁగె
విప్లవంబులఁ గొండవీడు చేర్పడియెఁ
సేకరంబగు సొమ్ము లేకపోయె
పడుమటఁదిరిగెను బ్రాయంపుఁబొద్దు లేఁ
బరముపైకొనె విల్లు జరుగదయ్యె
ఱచ్చుచుండెను దినవెచ్చము మైలారుఁ
డార్జించెఁ బల్నాటి కరిగి కాంత

గీ వీరకథ, వీథియును, సుకుమారచరిత
మొదలుగాఁ గబ్బములు చెప్పె బ్రదికి బ్రదికి
నిస్స్వతకుఁబాలుపడి దానిదుస్స్థితవ
మెఱిఁగెఁ గవిసార్వభౌముఁ డీ ద్వితీయువాఁడె?

పల్నాటి వీరచరిత్రము.

రాజావలంబము విఱిగిపోయిన తర్వాతఁ గొండవీటనెలకొని పల్నాడుప్రాంతములఁ బర్యటించునప్పు డక్కడి ప్రజల ప్రార్థనము చేతఁగాని, దేశచరిత్రాభిమానముచేతఁగాని, శ్రీనాథుఁడీగ్రంథమును రచియించియుండును. పల్నాటివీరచరిత్రము భారతమువంటిది. అంద

నేకభాగము లున్నవి పర్వములవంటివి. ఆమూలాగ్రముగా శ్రీనాథుఁ డాగ్రంథమును రచించినట్టు తోఁపదు. ఇప్పుడుపలభ్యమానము లగుచున్న పల్నాటి వీరచరిత్రభాగములలో శ్రీనాథుని కృతు లేవో స్పష్టముగా నిరూపింపఁ గుదురదు. కొన్నింట శ్రీనాథరచనానుసారముగా రచనము చేయఁబడినట్టుండును. కొన్నింట శ్రీనాథరచనమే యన్నట్టుండును. ఆదిని శ్రీనాథునిపేరు, అంతమున నన్యునిపేరు, దీనికి విపరీతముగాఁ గొన్నింటనుగూడ; కొన్నింటఁ గవిసార్వభౌమబిరుదముకానఁ బడును. కొన్నింట శ్రీనాథకవిరాజరాజనిమాత్రమే యుండును. కొన్ని మంజరీరచనముగానున్నవి. కొన్ని ద్విపదరచనముగానున్నవి. కొన్నింటి కొకరచనము మాత్రమేయున్నది. కొన్నింటికి రెండుదెఱఁగుల రచనములును మఱి కొన్నింటికి మూఁడుదెఱఁగుల రచనములును గలవు. పల్నాటి వీరచరిత్రభాగములు కొన్ని యీక్రిందివిధమున వేర్వఱుపఁబడియున్నవి. రాజులపుట్టుక, కోళ్ళపోరు, గోపుయుద్ధము, కన్నమనేనియుద్ధము, మందపోటు, రాయబారము, గురిజాల యుద్ధము, కళ్ళప్రతిష్ఠ, బాలునికథ, కొమ్మరాజుకథ, బ్రహ్మనాయనివిరుగు, – అని. వీనినిఁగూర్చి యిఁకముందుఁ గొంతవిస్పష్టపరిజ్ఞాన మేర్పడఁగలదు. శ్రీనాథుఁడురచించిన పల్నాటి వీరచరిత్రము ద్విపదరూపమయి యుండవచ్చునని నాతలంపు. క్రీడాభిరామములో నీక్రింది పద్యమున్నది:

మ. ద్రుతతాళంబున వీర్రగుంఫితకధుంధుంధుంకిటాత్కార సం
గతివాయించుచు నాంతరాళికయతి గ్రామాభిరామంబుగా
యతిగూడన్ ద్విపదప్రబంధమున వీనీకముంబాడె నొ
క్కొ క ప్రత్యేకముగాఁ గుమారకులు ఫీట్కారంబునం దూలఁగన్.

ఇందు ద్విపదగ్రంథమే పేర్కొనఁబడినది. మఱియు నీక్రీడాభిరామమునఁ బల్నాటి వీరచరిత్ర విషయము హెచ్చుగాఁ గలదు. ఆ

గ్రంథము శ్రీనాథకృతియే యగునని నేను నిశ్చయించుచున్నాను. ఆ విషయము ప్రకరణాంతరమున రాగలదు. పల్నాటివీరచరిత్రగ్రంథ కర్తల విషయము చిక్కుగా నున్నది: ప్రాచ్యలిఖితపుస్తకశాలలో బల్నాటి వీరచరిత్రపు ప్రతులు పెక్కులుగలవు. కాని యవి యన్నియు భిన్నదేశప్రతులు కావు. కొన్నిపుస్తికలు. శ్రీనాథుడు, కొండయ్య, మల్లయ్య యనువారు వీరచరిత్రగ్రంథకర్తలుగా దెలియవచ్చు చున్నారు. ఒకానొకరు బలరామిసెట్టి యనువాడుకూడ గ్రంథకర్త కలడనిరి. సరికాదు. బలరామిసెట్టి కొండయ్యతండ్రికాని, వేఱుగా గ్రంథము రచించినవాడుగాడు. పయిమువ్వురలో శ్రీనాథుని కాలము మనమిప్పు డెఱుగుదుముగదా! కొండయ్య శ్రీనాథుని తర్వాతి వాడే. ఆతనిగ్రంథము నాద్యంతములం దిట్లున్నది :

ద్వి శరధితల్పునిపేర సర్వేశుపేర
గిరిధీరుడగు చంద్రగిరిరంగపుని
వేంకటవిభునకు విభవంబులొసగు
పంకజాక్షునిపేర బరమాత్మునేర.

చంద్రగిరిలో రాజ్యమేలిన శ్రీరంగరాయలకొడుకగు వేంక టాద్రి పయినబేరొక్కనఁబడినవాడు కావచ్చును. అట్లైని యీకొండయ్య గ్రంథము శ్రీనాథునకుఁ దర్వాతనే చేయఁబడినట్లు స్పష్టమగుచున్నది. మల్లయరచనకాలము గుర్తింపనాధారము నాకు దొరకలేదు. ఈ ముమ్మువ్వురకవులును వేర్వేఱుగా సమగ్రముగా గ్రంథములను రచించి నట్లు కన్పట్టదని చెప్పితిని. ఎవ్వ రేయేభాగములను రచించిరో యది కూడ విస్పష్టముగా నెఱుఁగరాకున్నది. కొన్నిపట్టుల గ్రథనములు సంకర మయినవి. కృత్యవతరణికావసానములు తారుమారయినవి. చిరకాలము

నుండియు సీచరిత్రము సీచజాతుల కంతస్థమగుచుండి ప్రాయిక ముగా దన్మూలమున వ్రాతకెక్కుచు నుండుటచేత నట్టివికృతిని గాంచినదని నేను దలంచుచున్నాను.

ఆంధ్రభాషోద్ధారకులలో గలకాలము స్మరింపదగిన రసిక శిఖామణి, సి పి. బ్రౌనుదొరగారు వీని నన్నింటిని బరిశీలించి యీ క్రింది విధమున నభిప్రాయమిచ్చిరి. ''శ్రీనాథుని కృతినిజూచి తక్కిన యిర్వురును గ్రంథరచనముచేసిరి గావున వారు శ్రీనాథునిం దమ గ్రంథములందుం బశంసించిరి.'' ఇది యు క్తముగా నున్నదని నేనును దలంచుచున్నాను. ద్విపద రూపమున మిక్కిలి సంగ్రహముగా నొక రచనము ప్రాచ్యలిఖిత పు స్తకశాలలోనే కలదు. అది మంచి రచనముకలదై చక్కగానున్నది. శ్రీనాథునిది కావచ్చునని నేను దలంచుచున్నాను. కాని యది సంపూర్ణముగా లేదు. తక్కిన యిర్వుర రచనములుగూడ మొదటినుండి తుదదాక లేవు. వీరచరిత్ర మందలి యేకదేశమగు ''బాలునికథ''ను శ్రీయక్కి రాజు సుమాకాంతముగారు బృహత్కీకితో నీనడుమ ప్రకటించిరి. వారు ప్రకటించినపిదపనే యాకథ ననేకు లెఱుగగ గల్గిరి. మంజరీ రూపముననున్న గ్రంథమును వారుప్రకటించిరి. కాని వారి ముద్రిణ మున నాకృతియాకృతి చెడినది. గ్రంథావతరణికలో రెండు దెఱగుల రచనములు కలసిపోయినవి. అదియెల్ల నిక్కడ నిరూపింపగ బూనినచో గ్రంథవిస్తరమగునని వెఱచి విడుచుచున్నాడను. ప్రాచీన గ్రంథములను ముద్రించు నప్పుడు గ్రంథకర్తల రచనములను మార్ప కుండుట న్యాయ్యము. కవిప్రయుక్తపాఠమును గ్రహింపగ గుదురనప్పుడు గ్రంథకర్తృ మతానురోధమున నుచిత సంస్కారము చేయదగును. గ్రంథపాఠము లున్నప్పుడు కథాసమన్వయమునకై పూరణములు

సయితము చేయఁదగును. ఆ పూరణములేవో తెలియఁ దగినట్లు చిహ్నతములుగా నుండవలెను. ఈ గ్రంథసంపాదకులు యథేచ్ఛముగా గ్రంథమును మార్చిరి. కొంతచేర్చిరి. ఆమార్పులు చేర్పులు నన్నియుఁ దిన్నఁగాఁ దెలుపరయిరి. దానిఁ జూచి శ్రీనాథుఁడు పల్నాటివీరచరిత్రమును రచించెననుటయే కల్లయని కొందఱు మూలచ్ఛేదమే చేయుచున్నారు. శ్రీనాథుఁడు పల్నాటి వీరచరిత్రము రచించెను. కొన్ని భాగములు నిర్దుష్ట రచనములుగలవి కలవు. అట్టివి శ్రీనాథునివిగా నిలువఁగలవు. వాచకలేఖకాదులమూలమున దొరలినతప్పులనుబండితులు నిపుణముగాఁ బరిశీలించినచో దొలంగింపఁగల్గుదురు. ఉపలభ్యమానములగు వీరచరిత్రప్రతులనుగూర్చి తెలుపఁదగిన విషయ మెంతోగలదు. సంక్షేపించితిని. ఆంధ్రదేశము, ఆంధ్రభాష, ఆంధ్రులయాచారవ్యవహారములు, ఇంతయేల, --'ఆంధ్రత' యనునది యీ గ్రంథమునఁ బరిస్ఫురించుచున్నది. ఉన్నంతవఱకు దాని నెన్నటికేని తిన్నఁగా వెల్లడింప నుత్సాహపడుచున్నాఁడను, పల్నాటి వీరచరిత్రమునకుఁ గథాసంగ్రహ మిదిః

పల్నాటిరాజయిన యనుఁగురాజునకు వీరవిద్యాదేవి, భూరమాదేవి, మైలమాదేవి యని ముప్పురుభార్యలు. మైలమాదేవియందు నలగామరాజును, దక్కు నిర్వురందు మలిదేవ రాజాదు లేడ్వురను, బుత్త్రులు జనించిరి. అనుఁగురాజునకు దొడ్డనాయఁడు మంత్రి. ఈతని పుత్రులలో బాదయ్య యనువానిని దొలుత ననుఁగురాజు పెంచుకొనియెను. బ్రహ్మయ్య యనునతఁడు మహానుభావుఁడు. దొడ్డనాయనితర్వాత నితఁడే మంత్రి. అనుఁగురాజు రాచపుండుచే మృతి నొందెను. మరణ సమయమునఁ దనపుత్త్రులను బ్రహ్మనాయని కప్పగించి యరసి కాపాడుచుండుమని చెప్పెను. తదనంతరము నలగామ

రాజును బట్టాభిషిక్తునఁజేసి బ్రహ్మయ్య తాను దోడై రాజ్యమేలించు చుండెను. ఒకప్పు డాతఁడు కప్పములఁ గొనితెచ్చుటకై యన్యదేశ ముల కరుగఁగా, నారువెల్లి నాయకురా లను నొకవీరవనిత స్వశక్తిచే నలగామునొద్దఁ గార్యనిర్వాహకురాలై యాతని హృదయసీమయం దప్పటికి బాలురుగానున్న మలిదేవరాజాదుల యెడ విద్వేషాంకురముల నాఁటెను. నలగాముఁడు నత్యాశకు లోనై యాదుర్మంత్రిములకుఁ జిక్కి తమ్ములఁ జెఱసాలలోఁ బెట్టించెను. బ్రహ్మనాయఁ డదియెఱిఁగి రాజ్యమును విభజించి మలిదేవరాజాదులకు మాచెర్ల రాజధానిగా నేర్ప టిచి వారి నక్కడి కనిపి తానును దోడై వారిచే నక్కడ రాజ్యమేలించు చుండెను. నలగాముని రాజధాని గురిజాల. అతనికి మలిదేవాదుల రాజ్యము నపహరింపవల నను దురాశ మెండయ్యెను. నాయకురాలు తన మంత్రశక్తిచే మలిదేవరాజాదులకును నలగాముసకును గోడి పోరాటము సమకూర్చెను. ఎవ్వఁ కోడి యోడునో వారేదేండ్లు రాజ్యము పీడి యన్యదేశములకుఁ బోవలసినటు పందెము. బ్రహ్మనాయఁడు కోడిని గొనిపోయెను నాయకురాలు మంత్రప్రయోగముచే బ్రహ్మ నాయునికోడి యోడిపోవునట్లు చేసెను. తర్వాత బ్రహ్మనాయఁడు చచ్చుటకు విషాన్నము పెట్టించెను. కాని దానివలన నాతనికి వికృతి కలుగకపోయెను. బ్రహ్మనాయఁడు విష్ణ్వంశ సంభూతుఁడుగాఁ దలఁప బడుచున్నాఁడు. నాయకురాలిని మనుము కర్ణనంశమున జనించిన దానిఁ గాఁ దలంతము. ఒక గ్రంథకర్త యీ యిర్వురజన్మ చిత్రప్రకారము ముగాఁగల్పించెను. పందెముప్రకారము మలిదేవరాజాదులు మండాది యనుగ్రామమునకు రాజ్యముపీడి యరిగిరి. నాయకురాలిపన్నుగడ చేతనే నలగాముఁ డక్కడ మలిదేవరాజాదుల గోగణమును బొడిపించెను. ఆగ్రహోదగ్రుఁడై బ్రహ్మనాయఁడు గురిజాలకువచ్చి యలగా

మునకు మిక్కిలి చిక్కుగల్గునట్లు యుద్ధమునల్పెను. మలిదేవరాజాదులు మండాదివీడి శ్రీగిరిప్రాంతములకరిగి భిఱువృత్తిమఠమువారివలన గొన్నిభూములు గుత్తకుఁ దీసికొని ఆకాలమెట్లోగడిపిరి. పదపడి తమరాజ్యముఁ దమకిమ్మని యల్లమలురాజు (నలగామాదులకల్లుండు)ను రాయబారిగా నంపిరి. నలగాముఁడు రాజ్య మీ నంగీకరింపకపోయెను. అల్లమల్లుఁడు తిరిగివచ్చునెడఁ ద్రోవలో నాయకురాలు విషగర్భిత పుగు పూఁబంతి మూలమున నాతనిఁ జంపించెను. పదపడి యిరువాగుల వారికిని గార్యమపూఁడియొద్ద యుద్ధము జరిగినది. అర్వదియేడ్గురు వీరులు వీరశయనమున శయించిరి. నాయకురాలియొక్కయు బ్రహ్మనాయనియొక్కయు శక్తిసామర్థ్యము లత్యద్భుతములు. బ్రహ్మనాయనితో సయితము నాయకురా లెదిరినిల్చెను. తుదకు శరణాగతుఁడయిన యలగామరాజును బ్రహ్మనాయఁడు రాజ్యమున నిల్పెను. ఈయుద్ధమున వీరశయనమున నొఱగిన వీరులెల్లరును బ్రిమథులుగా భావింపఁబడుచున్నారు. కార్యమపూఁడిలో వీరికాలయములు కట్టఁబడినవి. సంవత్సరోత్సవములు జరుగుచున్నవి. కానిక లర్పింపఁబడుచున్నవి. యుద్ధమారంభింపఁ బోవునపుడు బ్రహ్మనాయఁడు కార్యమపూఁడి గంగధారమడుగుకడఁ గల్లుపోతురాజును బ్రతిష్ఠించెను. ఈ క్రింది చాటుధార శ్రీనాథునిదని వాడుకకిలదు :

ఉ. వీరులు దివ్యలింగములు విష్ణువు చెన్నుఁడు కల్లుపోతురా
ణారయఁగాలభైరవుఁడు నంకమశక్తియు నన్నపూర్ణ యా
కేరెడు గంగధారమడుగే మణికర్ణికగాఁ జెలంగు నీ
కారెమపూఁడిపట్టణము కాశిగదా పలినాటి వారికిన్!

పల్నాటి వీరుల సంగరము జరిగిన తర్వాతఁ జిరకాలమునకా కథ గ్రంథరూపమున నెలకొన్నది. పల్నాటిసీమయందుఁ బ్రజ లాయా

యెడల నాయాచరిత్రాంశములు జరిగినట్టు ఐతిహ్యములఁ జెప్పుకొనుచుండెడివారు. ఇప్పటికిని జెప్పుకొనుచున్నారు. ఈ విషయము క్రీడాభిరామమున నిట్లు తెలుపఁబడెను.

సీ. ఇచ్చోట భుజియించి రేకకార్యస్థులై
సామంతనృపతులు చాపకూడు
ఇచ్చోటఁ జింతించె నిచ్చ నుపాయంబు
నళినాక్షి యార్వెల్లి నాయురాలు
నిజమనుబుద్ధికై నిప్పులయేటితో
నోలాడె నిచ్చోట బీలసాని
యిచ్చోటఁబోరిరి యిలపణంబుగఁ గొల్ల
సవతితల్లులబిడ్డ లవనిపతులు

ధీరులగు వారలేవురు వీఁ పురుషు
లైమదోద్ధతి నిచ్చోట నాజిఁబడిరి
యనుచుఁజెప్పుదు రైతిహ్య మదటనచట
జనుపదెద్దలు వల్లెదేశములయందు.

నాఁటికి నాఁటికి నందుఁ గల్పితాంశములు హెచ్చినవి. యుద్ధ వీరులయెడ మాహాత్మ్యము సుస్థిరపడినది. గ్రంథరూపముగునాఁటి కీచరిత్రము భారతభాగవతాదులవలెఁ బరమపవిత్రమగు పుణ్యకథగా సభ్యర్హితమయ్యెను. వీరభాగవత మనియు, వీరరామాయణ మనియు నీకథాంశము ప్రస్తుతింపఁబడుచున్నది. కాని యిది యనేకసందర్భములందు భారతకథతోఁ బోలుచున్నది. బ్రహ్మనాయఁడు, నాయకురాలు మొదలగువారి జన్మాదిసందర్భములందు మూలముట్టుగాఁ గథలు కల్పింపఁబడినవి. బ్రహ్మనాయనిమాహాత్మ్య మెక్కువగా జెప్పఁబడినది. అనుఁగురా జుత్తరహిందూదేశమునుండి పాపపరిహారార్థమై దేశాటనము

నేయుచుఁ గృష్ణాతీరమునేరి పానిద్మక్తుఁడై పదపడి యక్కడ నెల కొనెనన్న సందర్భమునఁగూడ భూతార్థము కలదో లేదోయని సందే హము కల్గుచున్నది భారతయుద్ధముతో నీయుద్ధమును బోల్చుట తై యనేక కథాభాగములు సమకూర్పఁబడినవి. భారతకథయందు మాయా ద్యూతములులేదు. ఇందును గలదు. అందుఁ బాండవులకు శ్రీకృష్ణుఁడు తోడు. ఇందు మలిదేవరాజాదులకు బ్రహ్మనాయఁడు తోడు. అందు దుర్యోధనాదులకు శకుని కర్ణాదులతో దురాలోచనము. ఇందు నలగామునకు నాయకురాలితో దురాలోచనము. ద్యూతమున నోడినవారు ప్రవాసము నేయవలసినట్లు పందె మందును గలదు. ఇందును గలదు. విషాన్నము పెట్టించుట యందును గలదు. ఇందును గలదు. గోగ్రహణ మందునుగలదు.ఇందును గలదు. రాయబార మందును గలదు.ఇందును గలదు. ఉత్తరకుమారప్రజ్ఞ లందుఁ గలవు. అట్టివే తంబళకొమ్మ్యాప్రజ్ఞ లించుఁగలవు.

ఇట్లెన్నియేని పోల్చిచూపనగును. అనుఁగురాజు మొదలగువారు కార్తవీర్యార్జునుని వంశమున జనించిన క్షత్రియులఁట. ఈ యుద్ధము పండ్రెండవశతాబ్దిలో జరిగినది. పల్నాటి సీమలో మాచర్ల, గురజాల మొదలగు స్థలములందు ఇష్టకామేశ్వరస్వామిదేవాలయము లున్నవి. అనుఁగుగామరాజు (అలగామరాజు. అనుఁగురాజు అనుగుగామరాజు ఒకనిపేళ్లే) చనిపోయినపిదప నాతనిపేర శివలింగములు ప్రతిష్ఠిం పఁబడినవి కాఁబోలును. భీమేశ్వర, గణపేశ్వరాది శివలింగములిట్టు ప్రతిష్ఠింపఁబడినవే ఇట్టియాచార మీనాఁడును గలదు.

పాటలు–పదాలు.

శ్రీనాథుఁడు పల్నాటి వీరచరిత్రము మాత్రమేకాక యట్టిరచన ములను మరికొన్నింటినిగూడఁ జేసినట్టు తెలియుచున్నది. ఈవిషయ

మున శ్రీగురుజాడ శ్రీరామమూర్తిపంతులుగా రిట్లు వ్రాసిరి: ''ఈకవి (శ్రీనాథుడు) పండితాదరణీయములగుకావ్యములను జెప్పుటయేకాక స్త్రీ శూద్రాదుల కుపయుక్తములై సులభశైలితో నొప్పు పాటలు పద్యములు రచియించెను. మనదేశములో, బెండ్లిపాటలు మొదలగునవియు, గొల్లలుమొదలగు పాటకపుజాతి పాడుకొను గొల్లసుద్దులు మొదలగునవియు, పగటివేషగాండ్రు చెప్పెడు కథాలాపములును శ్రీనాథునిచే విరచితములేయని ప్రసిద్ధిగలదు.'' అని. పెండ్లిపాటలు మొదలగునవి యేమిరచించెనో యెఱుగరాదుగాని గొల్లసుద్దులు రచించినది సత్యమే. ఆంధ్రిదేశమున నెఱగొల్లలు, పిచ్చుగుంటులు మొదలగుజాతులవాండ్రు తెగలుతెగలుగా నూళ్ళవెంట దిరుగులాడుచు శూద్రుల గోత్రప్రవరాదులఁ దెలుపుచు గాసువీసములు గడించి జీవించుచుందురు. వాండ్రు పంటసమయములందు గాపుటిండ్ల కడ కరుగుదెంచి పాడుచుండు పదములకే గొల్లసుద్దులనిపేరు. గొల్లసుద్దులలోఁ బ్రథానమయినది కాటమరాజుకథ. ఇక్కడఁ గొంతవిస్తరించి వ్రాయవలసిన విషయమున్నది. తెలుఁగుభాషలో వెలసిన రచనములను బ్రథానముగా రెండుదెఱఁగుల విభాగింపవచ్చును. సంస్కృతచ్ఛందోనుసారముగా నక్షరగణములతోఁ జంపకోత్పలాదివృత్తరూపమున సంస్కృత పదజటిలమైన రచనమొకటి. భారతవర్షమునకెల్లను సామాన్యముతై భారతరామాయణాది గ్రంథాళ్వము లిట్టిరచనములతో వెలసినవి మాత్రాగణఘటితమై తాళలయాన్వితపుగు ఛందోబంధముకలిగి దేసిపలుకులతో నంధ్రదేశమునకు సహజమైవెలసిన రచనమొకటి. ఈరచనములం దంధ్రులప్రత్యేక ధర్మము స్పష్టముగా స్ఫురించుచుండును. పాటలు పదాలు, రగడలు, ద్విపదలు, సీసములు, అక్కరలు, తరువోజలు మొదలగువృత్తము లీజాతిలోఁ జేరును. సీసమునకు,

ద్విపదమునకు, రగడలకు, అక్కరలకు. చేరికగానుండు వృత్తభేదము లనేకములున్నవి. వీనిఁగూర్చి సంపూర్ణచర్చ విమర్శభాగమునఁ జేయుదును. తెనుఁగునకుఁ దోడిభాషలగు దర్విడ కర్ణాటభాషలలో వీని వంటి వృత్తభేదములున్నవి. సీసగీత్యాదు లయిదాఱుమాత్రమే వీని నుండి యాసంస్కృతచ్ఛందోఘటితమయిన రచనలలోనికిఁ జేరినవి. ఈ రచనములందు ముఖ్యముగా నంధ్రదేశవిషయములే యితివృత్తములు. కురవంజులు, ఏలలు, జోలలు, పదాలు, మొదలగునవి యెన్నియో ప్రాచీనాంధ్రస్వాంజకములు రచనము లున్నవి. ఇట్టిరచనములలోఁగూడ జగత్ప్రసిద్ధములయిన భారతరామాయణాది కథాంశములు చేరినవి. కుచ్చెలకథ, లంకాయాగము మొదలగునవి యిట్టివే. అధికారిభేదమునుబట్టి వానిరచనములను భేదించుచుండును. ఈ విషయమునఁ దెలుపవలసిన దెంతో కలదు. ఉపేక్షించుచున్నాఁడను. యాదవరాజులకథలని, శ్రీకృష్ణకథలని, పల్నాటికథలని, ముత్తెఱగుల కథలను జెప్పువాండ్రు, మూఁడు సంప్రదాయములవాండ్రు, తెలుఁగు దేశమునఁ గలరు. పల్నాటి కథలఁగూర్చి పూర్వప్రకరణమున ప్రాసితిని. వానిని జెప్పువాండ్రు పల్నాడు ప్రాంతములం దున్నారు. ఆ తెగ కాచార్యపురుషు కారెమపూఁడితో నున్నారు. వారుబ్రాహ్మణులు. శక్తికథలఁ జెప్పునాండ్రకుఁగూడఁ బల్నాటిలోనే యాచార్యపురుషులున్నారు. వీరును బ్రాహ్మణులే. పంబవాండ్రు బవినీండ్రు మొదలగువాండ్రీశక్తికథలఁ జెప్పుదురు. మొక్కుబళ్ళు, శక్తిజాతరలు మొదలగునవి జరుగునప్పుడు వాండ్రసుద్ద లత్యావశ్యకములుగా నుండును. మాతపురాణము, పరశురామరామాయణము, గౌతమపురాణము,మట్టిచెట్లకథ, రేణుకయుదము, కాకతమ్మకథ, అంకమ్మ కథ, గంగానమ్మకథ, మాతంగికథ దలగునవి వాండ్రగ్రంథములు.

అవియుఁ బల్నాటివీరచరిత్రమువలెనే ద్విపదమంజరీనిబద్ధములుగానే యుండును. క్రీడాభిరామమున నీగ్రంథార్థములు మిక్కిలి ప్రశంసింపఁ బడినవి. వానిఁగూర్చి క్రీడాభిరామప్రశంసలో ముందు వ్రాయుదును. మూఁడవతెఱఁగుకథలు యాదవరాజులకథలు;ఎఱ్ఱగొల్లలు మొదలగువాం డ్రీకథలను జెప్పుదురు. ఈ తెగ కాచార్యపురుషులు కలరో లేరో తెలిసినదికాదు కాటమరాజుకథ, కడియాపులరాజుకథ, పోలురాజుకథ, వల్లరాజుకథ మొదలగునవి వీండ్రగ్రంథములు. ఇవియు ద్విపద మంజర్యాది దేశిచ్ఛందోనిబద్ధములే. యాదవరాజుల కథ లనేకములు కలవఁట. ''యాదవశాస్త్రం యెద్దుమోతపరిమాణ'' మని చెప్పుదురు. పయివానిలోఁ గొన్నింటఁ జరిత్రోపయోగములగు విషయము లున్నవి. ఓంగోలు, వినుకొండ, పల్నాడు, సర్వారావుపేటతాలూకాలలో నీ గ్రంథాధ్యేతలు పెక్కురున్నారు. ఆగ్రంథములన్నియుఁ బరిశీలింపఁ దగినవి. బహుయత్నమున నేను వానిలోఁ గొన్నింటిని జూడఁగల్గినాఁ డను. ఇప్పు డిక్కడ మనకుఁ బ్రస్తుతము కాటమరాజుకథ.

కాటమరాజుకథ.

ఇది పదుమూఁడవ శతాబ్దిని నెల్లూరునుఁ బరిపాలించినమనుమసిద్ధి రాజునకును,నెఱుగడపాటిసీమేలికయగు కాటమరాజునకును జరిగిన యుద్ధ చరిత్రము. పుల్లరియిచ్చు నొడంబడికపైఁ గాటమరాజు తనపశువులను మనుమసిద్ధిరాజుమేఁతబీళ్లలో మేపుకొని యక్కడ దనకోడెలలో నేదో నష్టమువచ్చినదన్న కారణమున నీయవలసిన పుల్లరి నెగఁగొట్టెను. దానిపై మనుసిద్ధి పశువులఁ బోనీఁడయ్యెను. పరస్పరయుద్ధమున కిది కారణము. ఈయుద్ధముననే తిక్కనసోమయాజుల పెద్దతండ్రి కొడుకు రణతిక్కన నిహతుఁడయినాఁడు. స్వల్పమగు నీచరిత్ర విషయమును

శ్రీనాథుడు తనకవితాధార పాఱించి కబ్బము కట్టినాడు. దీనిలోఁ గూడఁ బల్నాటివీరచరిత్రము తీరునఁ బ్రకరణభేదము లున్నవి. శ్రీనాథుని గ్రంథము సాంకర్యమును బొరసినట్టున్నది. శ్రీనాథ గ్రంథానుసారముగాఁ దర్వాత మఱికొంద టీకథను బెంచి రచించిరి. పిన యల్లయ యనుకవి యిట్లు వ్రాసికొన్నాఁడు:

ద్విపద. గురుతైన కొమనాలగోత్రాబ్ధిచంద్రుఁ
దరయంగ గంగుఁలయల్లయ కూర్మి
తనయుండు సర్వన తగుసహోదరుఁడు
పినయల్ల యనువాఁడు ప్రియముతో జనుల
ఎలనొప్ప శ్రీనాథు వచనపద్ధతిని
సలిపెను యదుశాస్త్ర చరితమంతయును
వినుపింతు యాదవవీరులచరిత.

ఇప్పటికి నముద్రితములుగానున్న పల్నాటివీరచరిత్రము, కాటమరాజుకథ, యను రెండు గ్రంథములందును దేసితెలుఁగు పలుకుబళ్లు పెక్కులున్నవి. భాషాపరిశోధకుల కీగ్రంథము లమూల్య నిధులు. కాటమరాజుకథయను పద్యప్రబంధముగూడ నున్నది. అది ముద్రితము. ఆ పద్యప్రబంధకర్తకూడ నాకథను శ్రీనాథుఁడు తొలుత రచించెనని చెప్పినాఁడు.

సీ. ఒకశుభదినమున నొగి శుభ్రమతి శౌరి
పూజావిధానంబు పొందుపఱచి
హరికథ వినివిని యారాత్రి నిద్రింప
శ్రీనివాసుండిట్లు చెప్పెఁ గలను
శ్రీనాథుఁడను కవిశ్రేష్ఠుండు ద్విపదగా
రచియించెఁ గాటమరాజుచరిత

మది నీవు నాపేర నంకితంబుగఁ బద్య
గద్యాత్మకంబుగా ఘనత నుడువు

గీ. మనివచించి తిరోహితుఁడయ్యె నంత
నేను మేల్కాంచి యాస్వామి నెంచి మదిని
గాల్యకృత్యంబులనుదీర్చి కడుఁదలిర్చి
పండితావళిఁగనుఁగొని భక్తిమెయిని.

మఱికొన్ని గ్రంథముల నిట్టివానిని శ్రీనాథుఁడు రచించెనందురు గాని యవియేవో యెఱుఁగరావు. శ్రీనాథునిరచన మిదియని నిరూపింపఁదగిన కాటమరాజుకథ నాకు గోచరింపలేదు. ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ గొన్నిప్రతులున్నవి.

వీథీనాటకము.

శ్రీనాథకృతములును దదితరకృతములును నగు చాటుపద్యములను గ్రంథస్థపద్యములను గొన్నింటినిజేర్చి యచ్చువచ్చిన తర్వాతఁ గొందఱు శ్రీనాథుని వీథీనాటకమను పేర నొకగ్రంథమును ముద్రించుచున్నారు: ఆ పేరుతో నాపద్యసముదాయము ప్రాతప్రాతప్రతులలోఁ గానరాదు. ఆట్టి పద్యములఁ గొన్నింటిని జాటుపద్య మణిమంజరిలో నేను సంధానించినాఁడను. శ్రీనాథుని వీథీనాటకమందలి పద్యములు కొన్ని పయిపద్యసముదాయమునఁ జేరిన వనపచ్చును. కాని ఆపద్యసముదాయమే శ్రీనాథుని వీథీనాటకమనుట సరిగాదని నేను దలంచుచున్నాఁడను. శ్రీనాథుని వీథీనాటకములోనివని యిప్పకవి మొదలగువా రుదాహరించిన పద్యములు "కందుకేళిసల్పెడు ప్రకారమునన్" "కుసుమంబెట్టిన చీరకొంగు వొలయన్" ఇత్యాదికములు పయిపద్యసముదాయమంచుఁ జేరినవి.

శృంగారశ్రీనాథము

అట్లైని శ్రీనాథుని వీథినాటకమేదిఁ యని విచారము పర్యవసన్నమగును. అప్పకవ్యాదులు శ్రీనాథుని వీథినాటకము లోనివని యుదాహరించిన పద్యము లేగ్రంథమున నానుపూర్వితో నుండునో యా గ్రంథమే శ్రీనాథుని వీథినాటకమగునుగదా! అగ్రంథము దొరకినది. దానిపేరు క్రీడాభిరామము. అది వీథినాటకమే. ప్రదర్శనానుకూలముగా లేక, కొంచెము మార్పుతో నేకాశ్వాసప్రబంధముగా నున్నది. కాని దాని గద్యమున నది వీథినాటకమనియే పేర్కొనఁబడినది. ఇంతతోనే యది శ్రీనాథుని వీథినాటకమని సిద్ధాంతమేర్పఱుపను గుదురదు. ఆ గ్రంథమున వినుకొండ వల్లభరాయఁడు తత్కర్తగాఁ జెప్పఁబడినాఁడు. అప్పకవ్యాదులు చెప్పినది తప్పుకావలెను. లేక శ్రీనాథుఁడే యాగ్రంథమును రచించి వల్లభరాయని పేరుపెట్టఁగా గ్రంథమున వేఱుపేరున్నను రంగనాథరామాయణాదులవలె నీ గ్రంథముగూడఁ గర్తపేరనే లోకమునఁ బ్రచారము గాంచియుండుటచే నప్పకవ్యాదులట్లు చెప్పియుండవచెను అప్పకవ్యాది లుదాహరించిన పద్యములు పయిగ్రంథమున నానుపూర్వితోనున్నవి. పరీక్షింపములనఁ గుదురదు. మీఁది రెండు పక్షములలో రెండవపక్షమే పరిబలమని నెనుతలంచుచున్నాను. ఇఁకమీఁద దానిని దెలిపెదను

రావిపాటి త్రిపురాంతకుఁడు

సంస్కృతమున ప్రేమాభిరామ మనుపేర రావిపాటి త్రిపురాంతకకవి రచించిన వీథీరూపకమునసుసరించి యీ క్రీడాభిరామము తెలుఁగున రచింపఁబడెనని గ్రంథమునఁగలదు. దానికిది తెలిఁగింపు

---

* తంజావూరు సరస్వతీభాండాగారమున నున్నది. బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు దానిని ముద్రించినారు.

గాదు. తెలిఁగింపయినచోఁ బేరు మాఱఁగూడదు. సంస్కృతమునఁ బ్రేమాభిరామమును రచించిన త్రిపురాంతకుఁడు ప్రఖ్యాతాంధ్రకవి. ఆతనికవిత యతిప్రశస్తమయినది. ప్రాచీన కవీశ్వరు లాతని హెచ్చుగా మెచ్చుకొనిరి. క్రీడాభిరామకారుఁ డిట్లు ప్రశంసించుచున్నాఁడు:

ఉ. నన్నయభట్ట తిక్కకవినాయకులన్న హరిక్కభాస్కరుం
డన్నను జిమ్మపూఁడి యమరాధిపుఁడన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు నింతురు జేయని రావిపాటి తి
ప్పన్నయ వంతవాఁడ! తగునాయిటు దోసపుమాటలాడఁగన్?

త్రిపురాంతకుని కృతులు అంబికాశతకము, వంద్రస్తుతి, త్రిపురాంతకోదాహరణము* ననువానినుండి పెదపాటి జగన్నాథకవి పద్యములను బ్రబంధరత్నాకరమునఁ గూర్చినాఁడు. మదనవిజయ మను గ్రంథమొకటికూడఁ గలదని శ్రీరామకృష్ణకవిగా రనుచున్నారు. ప్రేమాభిరామము దొరకలేదు.

వల్లభరాయఁడు.

వల్లభరాయఁడు విద్యానగరాధీశ్వరుఁడగు హరిహరరాయల యొద్ద రత్నభాండాగారాధ్యక్షుఁడయి ములికినాటిలోని మోపూరును బాలించిన తిప్పనకుఁ గుమారుఁడు. హరిహరరాయండు ముగ్గురున్నారు. రెండవ మూఁడవవారు క్రీ. 1402, 1412, వఱకునుండిరి. తిప్పన వారిలో నెవనియొద్దనుండినను దత్పుత్త్రుఁడు వల్లభరాయఁడు శ్రీనాథుని కాలమువాఁడే యగును. శ్రీనాథుఁడు క్రీడాభిరామకర్తయనుట

---

* త్రిపురాంతకోదాహరణము తంజావూరు లైబ్రరిలో నున్నది. శ్రీ రామకృష్ణకవిగారు దాని ముద్రించిరి.

కితరసాధనము లెన్నియున్నను వల్లభరాయనికాలము వేఱగునేని అవి యెల్లను బొల్లపోవును. కాలము సరిపచ్చినది అచిక్కులేదు. క్రీడాభి రామమున వల్లభరాయని వంశవర్ణన మత్యధికముగా నున్నది. అంతే కాదు, వల్లభరాయని వాగ్వైభవాది వర్ణనము మితిమీఱియున్నది.

ఆహారవధిసమయనృత్య
త్తుహినాంశుధరప్రచారధూతా భ్రఘనీ
లహరీభ్రమఘుమఘుమములు
వహిం దిప్పయవల్లభన్న వాగ్వైభవముల్.

ఇత్యాదిగాఁ బద్యాష్టకమున్నది.

క. ఉవమించెదధారాధర
తపనజరై రాజరాజధానగరా
ధిపధారాధరవాపులఁ
ద్రిపురాంతకవల్లభుని వితీర్ణప్రౌఢిఁ

త్రిపురాంతకవల్లభుని వితీర్ణప్రౌఢిని ధారాధరాదులతో నుప మించెద ననియా వల్లభుఁడే యనుకొనునా! ఎంతయసంగతము! ఆ కందపద్యాష్టకము భీమఖండాదులలోని కృత్యవతరణికాపద్యముల పోలికకలది. గ్రంథాంతపద్య మిక్రిందిది :

చ. ఉదమున మల్లినాటిపురమోహనశైలసువర్ణకందరా
సదనుఁడు కాలభైరవుఁడు శంభునిపట్టి సమగ్రవైభవా
భ్యుదయపరంపరావిభవముల్ కృపసేయుఁ గవీంద్రకాంక్షిత
త్రిదశమహీరుహంబనకుఁ దిప్పయవల్లభరాయమంత్రికిఁ.

భరతవాక్యరూపముననేని గ్రంథకర్త పై విధమునఁదన్నుఁ దా నాశీర్వదించుకొనుట తుమ్మికొని తానే శతాయువనుకొన్నట్టుండును.

అష్టమప్రకరణము

గ్రంథకర్త వల్లభరాయఁడు కాఁడని పయిపద్యములు పలుకుచున్న వనుట యసంగతముకాదు. వల్లభరాయఁడు ''కవీంద్రకాంక్షితత్రిదశ మహీరుహము'' కావున విశేషధనమొసఁగి కవి యశోలోభమున నేతత్కావ్య కర్తృత్వమును దనపై వేయించుకొన్నాఁ డనఁదగును. గ్రంథకర్త శ్రీనాథుఁడే యనుట కింకను బలిష్ఠమగు హేతూపత్తి చూపెదను.

పోలికలు.

శ్రీనాథుఁడు తన గ్రంథములలోఁ గొన్నిపద్యములను, పద్యభాగములను, భావములను, మార్పుచేయక యొకతీరుననేకూర్చుకొనుచు వచ్చినాఁడు. స్వరచనమే యగుటచే నటపడిన పట్టులందుఁ ముందు రచించిన గ్రంథములలోని కూర్పులను జేర్చుకొనుట దోషముకాదు కదా! తిక్కనాదులుకూడ నిట్లుచేసిరి ఎన్నటికిఁగూడఁ గ్రీడాభిరామము శ్రీనాథకృతి కాదనువాదము పుట్టకుండుటకో యనుసట్లు శ్రీనాథకవి యనేకస్థలములు నిందుఁ దనతిక్కనగ్రంథముల రచనములను జేర్చెను. పోలిక లీగ్రంథము శ్రీనాథకృతమేయని చెప్పకచెప్పుచున్నవి. ఇతరకృతులందలి సరససంవిధానములను గాఁజేయు దొంగకవులు కొందఱున్నారు. వల్లభరాయఁ డట్టివాఁడై శ్రీనాథరచనములను గొన్నింటిని జేర్చుకొని యుండరాదా యనరాదు. గ్రంథమాదూలాగ్రము శ్రీనాథరచనముగానే కన్పట్టుచున్నది. తస్కరకపుల తక్కిన స్వరచన మస్వరసమై, పొందిపొసఁగక తెలియవచ్చుచుండును. క్రీడాభిరామమునఁ బదసంవిధానము, అన్వయక్రమము, కారకప్రయోగవైచిత్రి, పద్యోపక్రమనిర్వాహములు, ప్రతిపదము శ్రీనాథుని పేరుగ్గడించుచున్నవి. శ్రీనాథుని రచనా చమత్కారముల నెఱిఁగిన వారిది చక్కఁగా గుర్తిం

పఁగల్గుదురు. శ్రీనాథుని యితర గ్రంథములకు సీగ్రంథమునకుఁ గలరచనాసామ్యమునుగొంతచూపుచున్నాఁడను:

శా. సారాదారమునఁ బ్రవేకసరణిఁ సౌభాగ్యభాగ్యంబులఁ
ధౌరంధర్యమునన్ ప్రతాపగరిమఁ దానంబునఁ సజ్జనా
ధారుఁ డిప్పనమంత్రివల్లభు నమాత్యగ్రామణిం బోల్పఁగా
వేరిమంత్రులు? సింధువేష్టితమహోర్వీచక్రవాళంబునఁ.

—పీఠి.

శా. వేరీ? నిన్నెదిరింపఁగా జగమునఁ బీరుల్ ప్రతాపోద్ధతిఁ
ధౌరంధర్యమునఁ బ్రభావమహిమఁ ధైర్యంబునఁ జాపలీ
లారంభంబున సాహసిక్యమున బాహాశక్తివ్యాయుధో
దారప్రౌఢిమ దేవదైత్యనరగంధర్వాదిసంమంబులన్.

—హరవిలాసము.

గీ గార్గ్యసిద్ధాంతమత ముషఃకాలకలన
శకునమూనుట యది బృహస్పతిమతంబు
వ్యాసమతము మనఃప్రసాదాతిశయము
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము.

—పీఠి.

గీ. గార్గ్యసిద్ధాంతమత ముషఃకాలకలన
శకునమూనుట యది బృహస్పతిమతంబు
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము
సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతమగు. —భీమఖండము.

శా. వ్రాలెన్దిక్కుల భానుభావ్యతికరప్రక్రీడదర్కోపల
జ్వాలాజాల జటాలజాంగలతటి వాచాలకోయష్టి లై

అష్టమ పకరణము

రోలంబంబులు మూతిముట్టవెఱచెన్ గ్రొవ్వేఁడి బీరెండలన్
జాలం గ్రాఁగి కరంబు వేఁడియగు కాసారాబ్జమైరేయనుల్.

—వీథి.

శా. మౌళింగోహళి సంఘటించిన క్రియన్ మధ్యాహ్నవేళన్ మహా
కాళంబైన నభోవిభాగమున వీఁకంగాసె బీరెండ యా
ప్రాలేయాహిత సంపదీప్తకిరణప్రక్రీడదర్కోపల
జ్వాలాజాల జటాలజాంగలతటీ వాచాలకోయష్టియై.

—హరవిలాసము.

పైపద్యముల సమానసమాససంవిధానము భట్టమురారిపరిణీత మగు అనర్ఘరాఘవ నాటకమునందుఁ గలదు. శ్రీనాథునకు భవభూతి, భట్టమురారి నాటకములమీఁద నభిమానముమెండు. వారి నాటకముల లోని రచనములను బెక్కుచోట్లఁ బుడికి పుచ్చుకొన్నాఁడు.

శ్లో. ఉద్దామచ్ఛ్యామణిద్యుతిచ్ఛటికరప్రక్రీడదర్కోపల
జ్వాలాజాల జటాలజాంగలతటీ నిష్కాజకోయష్టయః
భీమోష్ణప్లవమానసూరకిరణక్రూరప్రకారాదృశో
రాయుష్కర్మ సమాపయంతి ధిగమూర్మధ్యాహ్నశూన్యా దిశః

—అనర్ఘరాఘవము.

ఈ క్రిందిపద్యము కూడ భట్టమురారిశ్లోకచ్ఛాయగలది:

శా ఆమిత్రావరుజాంశసంభవుని విద్యాటోపవిధ్వంసి లో
పాముద్రాసహితుం గనుంగొనిరి యుత్పన్నప్రమోదంబునన్
శ్యామగ్రాహ్యపయోధరల్ కుటిలనీలాగ్రాలకల్ తథ్యమి
థ్యామధ్యస్థితమధ్యలాటవికసేనాధీశసీమంతినుల్.

—కాశీఖండము.

శృంగారశ్రీనాథము

శ్లో. వ్యామగ్రాహ్యాస్తసీధి శ్మరయువతిభిః కౌతుకోదంచదక్షం
క్ష్వ్రేదస్వేద్యమానః క్షణమచల మనో చిత్రకూటం ప్రవిశ్య.
—అనర్ఘ రాఘవము.

వ్యామగ్రాహ్యపదప్రయోగమున శ్రీనాథునకు మురుపుమెండు. బహువారము లాపదమును ప్రయోగించును. అది యాతని సర్వ్రగంథములందును గలదు. ''వ్యామగ్రాహ్యనితంబబింబ'' —పీథి ''వ్యామగ్రాహ్యస్తనులగు భామినులు'' — నైషధము.

వ. టిట్టిభ! యదె చూడు వరుణరాజవారాంగనావిలాసదర్పణానుకారియై యహర్పతి ప్రకుంకటోయె— పీథి.

క. చ. మాచలశిఖరంబున
దిరమై యొక్కింతదడవు దినకరుడొప్పెన్
వరుణుని శుద్ధాంతంబున
నరవింశాక్షులకు మించు నద్దంబగుచున్.
—భీమఖండము.

వ.....నెఱనంజయు మనమసకనీచీరకటియుగలసి దిక్కాంతకూట వాటీనికరంబుల ప్రేలవిడిచిన గురివెందపూసలపేరునుంబోలెఁ బొలుపుమిగిలె ....—పీథి.

క. పసుఁబాప యొడకొనలును
మనమసకనియిరులు గలసి మనమలరించెన్
దెవల నలుగడల గుంజా
విసరంబుల సరులు ప్రేలవిడిచినభంగిన్. —నైషధము.

వ.... నంజకెంజాయయున్ గలయబెరసి గురివెందపేరులయందంబు వహించుటయును....— నైషధము. సీ. గన్నేరుబూచాయ కరమొప్పసిర్కావి, మదుగుదోవతిపింజె విడిచికట్టి — పీథి. సీ. గన్నేరుబూచాయఁ గనుపట్టు జిలుగైన ఁ వలికాషాయ వస్త్రంబుగట్టి — నైషధము. సీ. గొజ్జంగిపూనీరు

తులికిమేదించిన, గంగమట్టి లలాటకమునఁదీర్చి —పీథి. సి గొజ్జంగి పూసిరు తులికిమేదించిన కమ్మకస్తురి మేనఁ గలయనలదు - కాశీఖండము. సి. నిద్దంపు వెలిపట్టు నెఱికదూలినయప్డు తొడలమించులు వెలిఁ దొంగలింప—పీథి. సి. అచ్చవెన్నెలచాయ నవమల్లింపఁగఁజాలు నిద్దంపువెలిపట్టు నెఱికగట్టి — నైషధము. సి.తోకచుక్కలఁబోలు తోరంపుఁ దెలికన్నులాచైశమున సిగ్గనతకరింప. తే. తోకచుక్కలఁబోలు దృక్తోయజముల — నైషధము. సి. అదెముద్దరాల్మసానమ్మ నివాసమ్ము —పీథి. గీ. మోసపోక ముసానమ్మ ముద్దరాలు - కాశీ. వ చరణాగుశీకుటిలనఖశీఖాకోటి కుట్టనంబున —పీథి సి. కుటిలచంచూపుట కోటికుట్టనమున—నైషధము. సి. కుటిలపాటల జటాంకురకుట్టనంబున—కాశీ. వ....కంతగైర్వియఘంటికాటంకారంబులును—పీథి. వ....ఆఖండలదిశావేదండ కంఠగైర్వియఘ టికాటంకారంబురంబోలె — భీమఖండము. వ....కరిఘటాగైర్వి యఘంటికాటంకారంబులం బ్రోదిసేయుచు — నైషధము. వ....చాంపేయ కునుమచ్ఛదచ్ఛాయాదాయాదంబులైన.....పీథి. వ....కరోరపాతీరచ్ఛాయాదా యాదంబులైన-భీమ.వ....సుం మారశుకచ్ఛదచ్ఛటాఛాయాదాయాదంబులై-కాశీ. వ....ముఖరవీణాక్వాణ పాణిరమంబైన మధురస్వరంబున —పీథి వ...కల మధురవీణాక్వాణ పాణింధమంబైవ యెలుంగెత్తి —భీమఖం. వ....కాలకూట చ్ఛాయాపాణిధమంబైన....కాశీఖం. వ...సంధ్యారాగంబు నిండియింగిలికంబు నంబెట్టి —పీథి. గీ ....సింగి యింగిలికాన నభ్యంగమూర్చి — కాశీ. ఉ. ఘ్రాణ పుటీ కుటీరములఁ గాపురముండఁ దొడంగె-పీథి వ...నాసికాపుటకుటీకుటుంబి యగు పక్వాన్నగంధంబు.

కా. పంచారించిన సీపయోధరము లాస్ఫాలింతునో లేతబా
మ్మంచుం గెంజిగురాకుమోవిణిసిధాత్వర్థం బనుష్ఠింతుమో
పంచాస్త్రీపనిష దహస్యపరమబ్రహ్మస్వరూపంబు నీ
కాంచీదామపదంబుముట్టదునో యోకర్ణాటకాటంకినీ!

మర్మజ్ఞు లీపద్యమును వినఁగనే శ్రీనాథుని రచనమని గుర్తిం పఁగల్గుదురు. ణిసిధాత్వర్థప్రయోగమున శ్రీనాథునకు మిక్కిలి యభి

రుచి: ''ణిసిధాత్వర్థ మనుఁ బ్రహింపఁగదవే! సిరేజపత్రేక్షణా!'' — నైషధము.

సీ చంద్రఖండములతో సరివచ్చుననవచ్చు
విమలదంష్ట్రాప్రరోహములవాని
పవడంపుఁగొనలతోఁ బ్రతివచ్చు ననవచ్చు
కుటిలకోమలజటాఘటలవాని
ఇంద్రనీలములతో నెనవచ్చు ననవచ్చు
కమనీయతర దేహకాంతివాని
ఉడురాజరుచులతో నెఱవచ్చు ననవచ్చు
చంచన్మదాట్టహాసములవాని

గీ. సిగ్గుమాలినమోలవానిఁ జిఱుతవాని
నెల్లకాలంబు మూలికీనాడేలవాని
నధిపు మోపూర నవతారమైనవాని
భైరవునిఁ గొల్వవచ్చిరి భక్తవరులు.

ఈ పద్యము క్రీడాభిరామపరిస్తావనలోనిది యగును. తంజాపూరుప్రతిలోఁ బ్రస్తావన సంపూర్ణముగాలేదు. పరిబంధరత్నాకరమున నీపద్యమున్నది:

సీ. సరివచ్చు ననవచ్చు శతమన్యుపీఠికి, ప్రతివచ్చు ననవచ్చుఁ బాలమున్నిటికి, ఎనవచ్చునెనపచ్చు నిందు బింబమునకు, దొరవచ్చు నవచ్చుఁదోయజాతునిమూర్తికి.

—భీమఖండము.

చదువువారికిఁ బాలుననిపించునేమోయని నిలుపుచున్నాఁడను. ఇంకనెన్నియేని చూపవచ్చును. ''ప్రేమసంధుక్షణాగర్భంబైన—గోధూళిలగ్నంబునం బురంబు ప్రవేశింపవలయు—బాలార్కకిరణ

సంపర్కంబు -వీథీవిటంకంబు-కుసుమంబెట్టినచీర - పదియార్వన్నె పసిండి - చెక్కుటద్దములు - కోకిలము పంచమశ్రుతి కొసరినట్లు- విజ్జోడు - నిద్దంపుఁజెక్కుల నీడసూడ - కలకంఠీకలకంఠకోమల కుహూకారంబు- ఘంటాఘణాత్కారముల్ - కప్పురబోగివంటకము- పెసర్పప్పు - అదెదారువనభూమి - (ఇత్యాదిసీసము) ద్యావాపృథ్వ్యవకాశముల్ - పంచారించు - ఓలగందము - మిసిమింతుఁడు - కట్టెట్టి - ఉట్టూఁతలు - ఇట్టింకులు మొదలగు పదములకు, సంధానములకు, శ్రీనాథుని సర్వగ్రంథములందును సంవాదములుగలవు. రచనాచమత్కారము చక్కఁగా నెఱుఁగనేర్చినవారికి శ్రీనాథరచన మనుట కీగ్రంథమెల్ల నుదాహరణమే.

దోషములు.

కొంద ఱీగ్రంథము దోషభూయిష్ఠమనియు శ్రీనాథుఁడు దుష్ట ప్రయోగములఁ గావించువాఁడు కాఁడు గావున నీగ్రంథమాతనిది కాఁజాలదనియు వాదించుచున్నారు. ఇప్పుడు ముద్రితగ్రంథము తప్పులతోనున్నదన్నమాట యొప్పుకోవలసినదే. కాని యవి ముద్రాప్రమాదములు. అట్టివానిని విడచెదను. కవిపాఠములే కొన్ని తప్పులని చూపఁబడునవికలవు. వానినిక్కడ తెలిపెదను. వసివాఁడువాడుచు -ఇది తప్పు కాదు. శ్రీనాథున కిట్టిప్రయోగమునెడ మక్కువయెక్కువ. గ్రుక్కిళ్ళింగుచు - అని కాశీఖండము. ఇది దుష్టమనుట కేమి ప్రమాణము? విశేషచర్చ యిక్కడ తగదని విడుచుచున్నాఁడను. పుప్వులు వేడుకైనఁ గడివోయిన వాఁ ముడువంగవచ్చునే - నాచనసోమనాథుఁడు. చాలదా? ''భూదేవా ప్రశాంతం మహాపాపం'' - తప్పుకాదు. ''నమో విశ్వసృజే వినుమింతకు''- నాచనసోమన. అనుకరణముండి తీఱవలెనేమి? ఎన్ని ఇట్టివే తప్పుల నఁబడునవి? ఎందుకు! తొలుత నా కొక్క

ప్రయోగము నెడసంశయము కల్గినది: ''సుక్షత్రియకులంబు నిక్షత్రియము గఁజేయు కొడుకుఁగాంచిన యట్టి కోపక త్తె.'' ఇక్కడఁ గోపక త్తె యనుట శ్రీనాథున కిష్టమగునా యని. ఈపదమే కాశీఖండమునఁగూడఁ గన్పట్టినది: ''అన్న మీయన్న కోపగాఁడొనొ కాఁడొ.'' ఇంకనేమిఁ పరిశోధింపఁగా నిది ప్రాచీనతరకవిసమ్మతమేయని తేలినది. ఇంతట నీవిషయము ముగింతును. ఈ గ్రంథము శ్రీనాథరచన మనుటకుఁ బలువురు విశ్వసింపక పోయిరి. అటియవిశ్వాసము సమసిపోవుటకై యింతప్రాయవలసెను. నా కీగ్రంథమునెడ నభిమానముండెను. చరిత్ర కారుల కీగ్రంథము నిధి. ఇందు వర్ణింపఁబడిన విషయములు కొన్ని పేర్కొనెదను. ''దేశభాషలందుఁ దెలుఁగులెస్స,'' ఇది కృష్ణ రాయఁడు మెచ్చిన మెప్పుగాఁ దలంపఁబడుచున్నది. ''జనని సంస్కృ తంబు సకలభాషలకును దేశభాషలందుఁ దెలుఁగులెస్స'' యని శ్రీనాథుఁ డీగ్రంథమునఁ దనమెప్పు చెప్పెను కృష్ణరాయఁడు దాని ననువదిం చెను. ఈనాటఁకు మోపూరి భైరవుని తిమ్మనార్యులోఁ బ్రదర్శింపఁబడి నట్టున్నది. అది మొకికినాటిలోనిది. ఇంచలి యితిహ్యత్త మేఁకిలా సగరవీధిని దిరుగుచుఁ గాసల్నాటి మంచనశర్మయు నాతనికట్టనుఁగుఁ జెలికాఁడు టిట్టిభనెట్టియుఁ బ్రభాతకాలముమొదలు చంద్రోదయ సమయముదాఁక సంచరించుచు జరిపికొనిన పరిసంగముగా నున్నది. మేదరమెలఁత, మాలపనిత, కాపుఁగన్నెఁ, కర్ణాటకాంత మొదలుగాఁ గొంతయంగనాజన మిం దభివర్ణింపఁబడినది. ఏకశిలానగరవర్ణన మిందుఁ జక్కఁగాఁ గావింపఁబడినది. రాజప్రాసాదముమీఁద గడి యారమున మధ్యాహ్నకాలమునకు పదునాఱుగంటలు మోనెనటఁ అక్కడ భైరవుఁడు, చముదేశ్వరి, వీరభద్రుడు, బుద్ధదేవుఁడు, ముసా సమ్మ, కుమారస్వామి, పాండవులు, కర్తారుడు (మసీదు) ననుదేవ తల గుళ్లున్నట్టు చెప్పఁబడినది. కేశవస్వయంభూదేవుల దేవాలయ

ములు ప్రధానములుగాఁ జెప్పఁబడినవి. ప్రతాపరుద్రీయాదులందుఁ గూడ నాదేవాలయముల ప్రస్తావము కాననగును. రాజమార్గము వారణ ఘోటకశకటికాభటకోటి సంకులమట! మఱియు నక్కడఁ బల్నాటి వీరులకును నేకవీర, కాకతమ్మ, మాహూరమ్మలను శక్తులకును జరుగు జాతరలు వర్ణింపఁబడినవి. పంబవాఁడు బవినీఁడు నేకవీరాపరశు రాములకథలను బాడుట మొదలగు జాతరవిషయము నేఁడును జరుగు చున్నవిధముననే వర్ణింపఁబడినది. జక్కులాఁడసోదెయు మైలార భటుల (శివశక్తులు) సాహసకృత్యములు వర్ణింపఁబడినవి. పూటకూళ్ళ యిళ్లు వర్ణింపఁబడినవి. పూటకు రూకయిచ్చిన సమృద్ధమయినభోజనము దొరకునట్లు చెప్పఁబడినది మఱియు నిందు "ప్రతాపరుద్ర ధరణీశో పాత్త గోష్ఠీ ప్రతిష్ఠాపారీణ" యగు మాచల్దేవియను వారాంగన ప్రస్తావము గలదు. ఆమాచల్దేవి శ్రీనాథుని కాలమున కుండనేరదు గావున నేతద్గ్రంథము శ్రీనాథరచితముకాఁగూడదని యొకవికటవాద మున్నది. కవివర్ణించిన విషయము లప్పుడు వర్తిల్లితీరవలయునా? సంస్కృత ప్రేమాభిరామమున నున్నదానిఁ దెల్గునకుఁ దార్చియుండరాదా? మొత్తమున కీగ్రంథము సంస్కృతగ్రంథమునకు సరియగు తెనుఁగుకాదు. కొన్ని మార్పులుండును. సంస్కృతగ్రంథమునకుబేరువేఱు;దీనికి వేఱుగదా!శ్రీనాథుఁడు రాకున్నచో వల్లభరాయఁడే గ్రంథకర్తకావలయును. అతనికాలమునకు మాచల్దేవియుండుట సంభావ్యమగునేమి? శ్రీనాథుఁడు నాతఁడును సమకాలము వారేగదా! మాచల్దేవి ధనసంపన్నురాలు. నాఁటి కాలమున గొప్పప్రఖ్యాతిగాంచినది. బెజవాడలో మాచల్దేవి కావించిన ధర్మకార్యములకు శాసనము గలదు. కానియాశాసనమునఁ గాలనిర్దేశములేదు. ఆశాసన మీమాచల్దేవిదేయని స్పష్టముగా ననుట కాధారము లేదు. ఉన్నంతవఱకాశాసనము నుదాహరించుచున్నాను:-

శృంగారశ్రీనాథము

''బెజవాడగ్రామమధ్యమందు వేంచేసిన శ్రీ భ్రమరాంబామల్లే శ్వరస్వామివారిదేవాలయం గర్భాలయంముందర పడివున్న నల్లసీసపు రాయిమీద శాసనం:-

''బెజవాడ పాపవినాశనదేవర రుద్రపాదాలస్థానాల ధర్మాలకు, పినకూన తలాభక్తుని కూతురు మాచలేవి తనకు జెల్లిన వృత్తిక్షేత్రాలు:- పాశ్చాతూరున పుట్టెండుక్షేత్రమున్ను, తాడేపల్లిని పుట్టెండుక్షేత్రమున్ను, పెనుంబాకను పుట్టెండుక్షేత్రమున్ను, గొల్లపూండిని పుట్టెండు క్షేత్రమున్ను, సరసూరుగ్రామానను పుట్టెండు క్షేత్రమున్ను, నున్నగ్రామాన పుట్టెండుక్షేత్రమున్ను, గుడుదలగ్రామాన పుట్టెండుక్షేత్రమున్ను, వెన్నవల్లిగ్రామాన పుట్టెండుక్షేత్రమున్ను, యీ పదిగ్రామాల కేసరి పాటి పదిపుట్లక్షేత్రమున్ను పృథివింగలగోత్రమువారికి పుణ్యంగాను ధారపోసియిచ్చిన ధర్మశాసనం. సుంగళ మహాశ్రీంజేయును.''

మఱియు శ్రీకాకుళమునిరునాళ్లవేడుక లిందు వర్ణింపఁబడినవి. నెల్లూరితూముకాలువ, మందపాక, పెనుబాక, మాగ్గరము, నాగ వరము, పానుగంటి కలుకోడి, ణొన్నగడ్డ తమిలేఱు, దాక్షారామము, అరవపిళ్ళ. యిందు బ్రస్తావింపఁబడిరి. గ్రంథాంతమం దీపద్యమున్నది.

ఉ. నటులది దోరసమ్రక్కుఁ
విటులది యోర్వ్లు కవిది వినుకొండ మహా
పుటభేదమున మీత్రిత్రయము
నిటగూర్చెను బ్రహ్మ రసికులెల్లను మెచ్చఁగ.

ఈగ్రంథము శ్రీనాథునికృతియయి వెల్లడి కాఁగల్గి నందుల కెంతయు సంతోషించుచున్నాఁడను. ఇందు పల్నాటి వీరచరిత్రపాటలు,

పంబవాండ్రపాటలు మొదలగునవి వర్ణించుపట్టునఁ జూపట్టు కవిత్వా
హామునుబట్టి చూడఁగా శ్రీనాథుని కట్టిరచన మిక్కిలి రుచితమయి
నట్లు తోఁచుచున్నది. ఆతఁడిట్టి రచనలేనో రచించిన చ్లైతిహ్యా
ములు గలవని వ్రాసితిని గదా!

*శివరాత్రి మాహాత్మ్యము.

ఈగ్రంథ ముపలబ్ధములయిన శ్రీనాథుని గ్రంథములలోఁ గడపటిదని నేను దలంచుచున్నాఁడను. కాశీఖండరచన లిందుఁ బొందుపడినవి. విస్తరభయముచే వాని నిక్కడ వివరింపకున్నాఁడను. అవి యీగ్రంథమునుండియే కాశీఖండమునకుఁ జేరియుండరాదా యనరాదు. ''కాశిలోఁ జంద్రపుష్కరిణీదుష్కరభుష్కగహనావళీదావదహనజిహ్వా' ఇత్యాదులు కాశీఖండరచనానుస్మృతిని జెప్పుచున్నవి. దాక్షారామవైశ్యుల ప్రశంస యిందున్నది. ''కర్ణాటదేశతాటంకినీదశన వజ్రాంకురముల కాంతి'' యిందు స్మరింపఁబడినది. కవిసార్వభౌమబిరుద మిందుఁ గానవచ్చుచున్నది. రాజమహేంద్రవరము ప్రాపుపోయినపిదపఁ గొండవీటనుండి పల్నాడుప్రాంతముల సంచరించుచుండినకాలమున శ్రీనాథుఁడు దీని రచించెను.

భిక్షావృత్తిమఠము.

శ్రీశైలమున భిక్షావృత్తిమఠ మను జంగమమఠ మొకటికలదు. అది నేఁటికిని గలదు, తన్మఠాధీశ్వరులు శ్రీశైలపర్వతతత్ప్రాంతదేశ ములకుఁ బాలకులుగా నుందురు. ఆకాలమువారు మహైశ్వర్యసంప

---

* ఇది యాంధ్రసాహిత్య పరిషత్తువారిచే సంపాదితమై వారిపత్రికలోఁ బ్రకటింపఁబడినది. గ్రంథపాతములున్నవి.

న్నాలు. ఆమఠ మంతకుఁ గొంతప్రాచీనకాలమునుండి కలదని తెలియుచున్నది. పల్నాటి వీరచరిత్రకాలమున కామఠము కలదు.

శాంతభిక్షావృత్తి.

తన్మఠాధీశ్వరులకు భిక్షావృత్తు లనిపేరు. వారిలో శాంతభిక్షావృత్తి మహోన్నతుఁడుగాఁ దెలియవచ్చుచున్నాఁడు. మన శ్రీనాథుని శివరాత్రిమహాత్మ్యమునకుఁ గృతిపతియయిన శాంతస్వామి యా శాంతభిక్షావృత్తికి మూలభృత్యుఁడు. ఒకప్పుడు శివరాత్రిమహోత్సవ సమయమున మల్లికార్జున దేవదర్శనార్థము శ్రీనాథుఁడు శ్రీశైలమున కరిగెను. అక్కడ ధర్మకర్తలుగానున్న యాభిక్షావృత్తి మఠాధీశ్వరులు శ్రీనాథుని సత్కరించి కృతికోరిరి. మల్లికార్జునదేవుని ముఖమంటపమున సభ్యసీనుఁడయి శాంతభిక్షావృత్తియతీశ్వరుఁడు శివకథావినోదమునఁ బొద్దుపుచ్చుచుఁ దనభృత్యుఁడగు శాంతయ్యను శ్రీనాథునిచేఁ గృతి గొనుమని నిబోధించినట్టు శివరాత్రిమహాత్మ్యమందున్నది. శాంతభిక్షావృత్తి యతీశ్వరుని శాసనములు కొన్ని కర్ణాలుమండలమునఁగలవు. అతఁడు సరిగా శ్రీనాథునికాలమువాఁడే. ఆంధ్రకవిత్వమం దాతని కత్యంతాదరముండెను. ఆకాలమున నామఠాధీశ్వరు లాంధ్రులయి యుండిరేమో; కాని యిప్పటివారు కర్ణాటకులు. శాంతభిక్షావృత్తి తన భృత్యునికిఁ గృతి నిప్పించుటయేకాక తానుగూడ గౌరనమంత్రిచే నవనాథచరిత్రమును తెనుఁగుకృతి మల్లికార్జునదేవున కంకితముగాఁ జెప్పించుకొనిపోయెను.

నవనాథచరిత్రకారుఁడు గౌరన సరిగా శ్రీనాథుని కాలము వాఁడు. ఆతఁడు సంస్కృతమున లక్షణదీపికయను గ్రంథమును రచించెను. ఈతనిఁగూర్చి ''శ్రీనాథునికాలపుకవులు'' అను ప్రకరణ

మున విస్తరించి వ్రాయుదును. నవనాథచరిత్రమున శాంతభిక్షవృత్తి యతీశ్వరుని ప్రాభవము బాగుగా వర్ణింపఁబడినది. అనుబంధము చూడఁదగును. శివరాత్రి మాహాత్మ్యము కృతిగాంచిన ముమ్మడిశాంత స్వామి వీరశైవవర్తితుఁడు. వారిపూర్వులు జైనమతధ్వంసము చేసిన వారు. శివరాత్రిమాహాత్మ్యగ్రంథావతరణిక గ్రంథపాతములతోనున్నది. కావునఁ దెలియఁదగిన విశేషములు కొన్నిమఱుఁగుపడి యున్నవి. ''సత్కవిసార్వభౌముండగు శ్రీనాథకవివరేణ్యునిఁ గృపావిశేషంబునం గాంచి శ్రీమన్మల్లికార్జున మహాదేవ....అంచుగండముఖ్యరేవణా.... లోష్ఠయేకోరామేశ్వరపండితారాధ్యాదిచాతుర్వర్ణ్యజులుంగలిగినమ(హా సభ) యందు బందిన మల్లినాథగురుండు....'' ఉదాహృతగ్రంథ భాగమున గ్రంథపాతము లెక్కువగా నున్నవి. కృతిపతి జంగమదేవ రగాఁ దోఁచుచున్నాఁడు. ఆనాఁడు జంగములకుఁ ప్రాభవము హెచ్చు గానుండెనని నవనాథచరిత్రపీఠికయు శివరాత్రిమహాత్మ్యపీఠికయుఁ జెప్పుచున్నవి.

శివరాత్రిమహాత్మ్యకథాకవిత్వాదివిషయములను విమర్శించుట కిది చోటుకాదు. కాని గ్రంథమువడివడిగాఁ జెప్పఁబడినట్లు కానవచ్చు చున్నది. శ్రీశైలముమీఁదనున్నప్పుడే పది యిర్వదిదినములలో నది రచితమయియుండవచ్చును. శ్రీనాథుఁడట్టి గ్రంథమురచించుట కేండ్లును బూండ్లును ప్రయత్నింపఁవలసినవాఁడు కాఁడు, వాఁడిమీఱిన యాతని కవితాధార సహజమని పాఱువాఱఁగలదు. ఆగ్రంథము శీఘ్రతరముగా రచింపఁబడినదనుట కందుఁ గాదంబరీరచనముల తెలుఁగుచేతలు, కాశీఖండ భీమఖండరచనముల పరివర్తనములు తార్కాణము. క్రీడాభి రామము శ్రీనాథరచనమే యనుట కాతని గ్రంథములకును గ్రీడాభి రామమునకును గల రచనాసామ్యము నింతకుముందుఁ జూపియుంటిని.

శృంగారశ్రీనాథము

కాని యందుఁ శివరాత్రిమహాత్మ్యరచనములఁ జూపలేదు. ఆపత్కరణము నేను రచించునాఁటికి శివరాత్రిమాహాత్మ్యము బయల్పడ లేదు. క్రీడాభిరామమునకు శివరాత్రిమహాత్మ్యమునకుఁగల రచనాసామ్యముఁ గొంత యిక్కడఁ జూపుచున్నాఁడను:

సీ సరిగొన్న వెలిపట్టు జన్నిదంబులలుంగ యంటువాయంగఁ దా నటుత వైచి — వీథి.

సీ సరిగొన్న వెలిపట్టు జన్నిదంబులతోడ గత్నాలతారహారముధరించి

గీ. వాహకుండెక్కి విడిచిన వారువంపుఁ గొదమయునుబోలె — వీథి.

వ....చండాలకులవరారోహ వాహకుం డెక్కివిడిచిన వారువం బునుబోలె —శివరాత్రి.

''వీథీవిటంకము'' వీథీనాటకములో నాలుగుచోట్లనున్నది. శివరాత్రి మాహాత్మ్యమునఁగూడ నది నాలుగుచోట్లనున్నది. ''అందుకొని పుష్పలావికిఁ ద్యాగమిచ్చి'' (వీథి). ''దానధర్మంబు లొనరించి త్యాగ మిచ్చె'' (శివరాత్రి). ''ఆదియుగంబునం దావిర్భవించిన జిన నాథదేవుని శిరసువోలె'' (ఇత్యాది సీసము వీథి) ''ఆదికాలమున మాయావిలాసినియైన'' (ఇత్యాది శివరాత్రి). ''గంగమట్టియతోడి సాంగత్యమెడలిన, గంగమట్టి లలాటకమునఁ దీర్చి'' (వీథి) ''గంగ మట్టియమీఁదఁ గస్తూరిరసమున, - అప్పతితుఁడు గంగమట్టియయు, బ్రన్నని సున్నని''- (శివరాత్రి). శ్రీనాథుని సర్వగ్రంథసామాన్యము లైన యీ క్రింది పదసంవిధానములు వీథీనాటకమునను, శివరాత్రి మహాత్మ్యమునను గలవు. ''వ్యామగ్రాహ్య —'' ''కంకణ ఝణఝ ణాత్కారంబు,'' ''గంధలహరీపాణీంధమంబు,'' ''కలకంఠీ.....

కోమలకుహూకారంబు,'' ''చిఱుబంతిపసుపు,'' ''ఓలగందము,'' ''నీర్కావిదోవతి మొదలగునవి. ''జనంగమ్రమద, కర్ణాట తాటంకిని,'' ఇత్యాదులు కొన్ని యీగ్రంథములందుఁ గలవు.

మఱికొన్ని గ్రంథములు.

ఇంతవఱకుఁ బేర్కొనఁబడిన గ్రంథములుగాక శ్రీనాథుని గ్రంథములు మఱికొన్ని లక్షణగ్రంథాదులం దుదాహృతములయిన పద్యములఁబట్టి తెలియవచ్చుచున్నవి. అవి యేవయస్సున నెవరికంకితముగా రచింపఁబడినవో యెఱుఁగరాదు. పేర్కొనెదను.

నందనందన చరిత్ర.

శ్రీనాథుని నందనందన చరిత్రమందలివని రంగరాట్ఛందము నను ప్రయోగరత్నాకరమునను రెండు సీసపద్య పాదము లుదాహరింపఁబడినవి. అవి యిని :- ''రామానుజుండు నిరంతరము పదాఱువేల నూఁటెనమండ్రు వెలఁదులతమి''- ''శాశ్వతవిశ్వవిశ్వంభరాభార మీరాజకుమారుఁ దేలంగలండు.'' వీని నాధారముగాఁగొని నందనందన చరిత్రమును శ్రీనాథకృతి కలదని విశ్వసింపరాదని నాయభిప్రాయము. రంగరాట్ఛందము మొదలగు కొన్ని లక్షణగ్రంథములందు నన్నయభట్టారకాదుల యింద్రవిజయాదులందలివని కొన్ని పద్యము లుదాహరింపఁబడినవి. వాస్తవముగా నాయాకవు లాయాగ్రంథములను రచించిరాయని సందేహము కలుగుచున్నది. తనకిష్టమయిన భాషాచ్ఛందఃప్రయోగములను నిల్వరించుటకయి యాతఁడెక్కడివో కొన్నిపద్యములను ప్రాచీనప్రఖ్యాతకవికృతములుగా నుదాహరించుచు వచ్చినాఁడని నేను దలంచుచున్నాఁడను. ప్రసిద్ధములయియున్న యాయా కవీశ్వరుల

గ్రంథములందలి రచనలకును రంగరాట్పుందఃకర్త యుదాహరించుకొనిన యపరిజ్ఞాతప్రబంధపద్యముల రచనములకును బోలిక యుండదు. రంగరాట్పుందమందే గాక యాంధ్రకౌముద్యాదులగు మఱికొన్ని గ్రంథములందుఁ గూడ నిట్టితీరు గలదు. భాషాపరిణామవేదులీవిషయము నంగీకరింతురు. రంగరాట్పుందమున నుదాహరింపఁబడిన యూసీసచరణములలో మొదటిది కుంటిసడకతో నున్నది. రెండవది రేఫలకారముల యతిమైత్రికలది. అవి శ్రీనాథరచితములుగా నేను విశ్వసింపఁజాలకున్నాఁడను. విశ్వసించుట కితరప్రమాణము లిఁక గానరావు.

వల్లభాభ్యుదయము.

శ్రీనాథుని వల్లభాభ్యుదయమందలిదిగా నీక్రింది పద్యము పెదపాటి జగన్నాథకవి ప్రబంధరత్నావళిలో నుదాహరించినాఁడు.

సీ. రజనీవధూకర్ణ రత్నతాటంకంబు
వలరాజు ధవళోష్ణ వారణంబు

కామశాస్త్రము.

శ్రీనాథుఁడు కామశాస్త్రవిషయమున నేదోగ్రంథము రచించినట్లు తెలియుచున్నది. నెల్లూరిశివరామకవి కామకళానిధియను గ్రంథమున నావిషయమును బ్రస్తావించినాఁడు. పద్యైకదేశ ముదాహరింతును:

గీ. మఱియు శ్రీనాథుఁడాదియౌ సరసమతులు
ఎంతదుష్కరమతినైన వృద్ధనైన—

ఈ శ్రీనాథుఁడు మన శ్రీనాథుఁడగునో కాఁడోయని సందేహించుటకుఁగూడ నవకాశమున్నది.

ధనంజయవిజయము.

శ్రీనాథుఁడు ధనంజయవిజయమను పేరుగల గ్రంథమును దంతులూరి గన్నభూపాలునిపేర రచించినట్లు మూర్తిత్రయోపాఖ్యానమను ప్రబంధమునఁ గలదు. మూర్తిత్రయోపాఖ్యానము దంతులూరి బాపిరాజు రచించినది. ఆతఁడిప్పటికి నూఱేండ్లనాఁటివాఁడు.

సీ. ఆహితదుర్గాధ్వసు లద్భుతం బందంగఁ
గ్రీడికై వడి నిల్పె దాడినాడ
ఆశుద్రదాన విద్యాక్షాత్రములచేతఁ
బ్రతి యెవ్వరునులేక ప్రతిభగాంచె
తఁకీర్తి దశదిగంతరగీయమానమై
కనువట్ట ధర్మమార్గంబు నెఱపె
శ్రీనాథసుకవీంద్రుచే ధనంజయవిజ
యంబను సత్కావ్యమంది వెలసె

గీ. నృపతిమాత్రుండె నిజపాదసీరజాత
ఘటితకోటీరవై రిభూకాంతమాన
సాంతరభయాపహారి! శ్రీదంతులూరి
గన్నభూపాలమౌళి, దోర్గర్వశాలి.

—మూర్తిత్రయోపాఖ్యానము.

ధనంజయవిజయమునఁ గిరాతార్జునీయకథ వర్ణితమై యుండునేమో! పయిమూర్తిత్రయోపాఖ్యానమందే గన్నభూపాలుని పూర్వుఁడు హరిసీమ కృష్ణుఁడు ధాన్యవాటీపురాధిపతిగా వర్ణింపఁబడినాఁడు.

మ. కురియించెఁ బహుధాన్యవర్ష మఖిలక్షోణీప్రదేశంబునఁ
హరియించెఁ విమతాంధకారములు బాహాగ్రాసిసూర్యప్రభఁ

సిరిమించెఁ నృపవర్యులెంచ ఘనుఁడై శ్రీ ధాన్యవాటీపురీ
చిరసామ్రాజ్యరమానమాశ్రయరమాసింహాసనాసీనుఁడై.

గన్నభూపాలుఁడు గూడ ధాన్యవాటీపురాధిపతిగా నుండవచ్చును. ''క్రీడికైవడి నిల్చెఁ దాడినాడ'' నని కలదు; గాని యక్కడనిల్చుట యుద్ధకార్యార్థమయి కావచ్చును. తాడినాడ కయికలూరు తాలూకాలో నున్నది. పూర్వులు ధాన్యవాటీపురాధిపతులగుటచే నక్కడ నుండ కున్నను దర్వాతివారికి ''ధాన్యవాటీపురాధిపతి'' బిరుదము పరంపరా గతముగా నుండవచ్చును. ఒరయూరిపురవరాధీశ్వరేత్యాది బిరుదము లిట్టివి యితరరాజుల కున్నవి. బమ్మెరకేసయమల్లయలు రచించిన విష్ణుభజనానందమున నీ హరిసీమకృష్ణునిఁ గూర్చియు నాతనికిఁ దర్వాత బహుపురుషాంతరములఁ గూర్చియు గృత్యవతరణికలో వర్ణన మున్నది. ఉదాహరించెదను:

సీ కురియించె నేరాజకుంజరుం డింపొంద
ధరణీలకోటలో ధాన్యవృష్టి
ధరియించె నేధరాతలనాథుఁ డొగవెడ
ఘనమైన జగమెచ్చుగండబిరుదు
వరియించె నేచంద్రవంశపాలుఁ డష్ట
నమరేశ దేవకటాక్షలక్ష్మి
హరియించె నేభూపహంవీరుఁ డుబ్బొంగి
ప్రత్యర్థి రాజన్యపట్టణంబు

గీ. లతఁడు చెలువొందె జన్యరంగాగ్రజాగ్ర
రుగ్రఘనవిద్విషద్బలోదగ్రజఠర
పితరవక్కాగ్రజాత సర్వర్వీశేష
కృతవిఖ్యాతి హరిసీమకృష్ణనృపతి.

ఆతనివంశమం దనేకపురుషాంతరములతర్వాతివాఁడు:

ఉ. కొండమదేవి కృష్ణనృపకుంజరువల్లనుగాంచెఁ బుత్త్రిఁ గా
ఖండనభీము నన్నజనపాలుని సింధుధరాధినాథు నా
ఖండలతుల్యఁ బద్మనృపగణ్యుని శౌర్యకళాధురీణునిన్
గండరగండుధాన్యకటకస్థిరసద్బిరుదాంకధుర్యునిన్.

కృతిపతిని గూర్చి యాశ్వాసాంత పద్యమున :— ''గండర గండ! ధాన్యకటకప్రవణై కధురీణ!'' అని కలదు. ఈ గ్రంథము శ్రీనాథునికిఁ బిదప బ కాలమునకు రచింపఁబడినది. మూర్తిత్రయోపాఖ్యానకృతికారులు, విష్ణుభజనానందకృతిపతులు, నొక్కవంగడము వారగుదురు. కాని విష్ణుభజనానందకృతిపతులు ''పెనుముచ్చ'' ఇంటి పేరువారుగా నునారు.

శ్రీనాథునికాలమున ధాన్యవాటీపురాధిపతియనఁబడు గన్న భూపాలుఁడొకఁడు, మన కింతకుఁబూర్వ మెఱుకపడినాఁడు. ఆతఁడు పెదకోమటి వేమారెడ్డిమామ. సంతానసాగరశాసనమున ''భృకవారంబున శుభముహూర్తంబున శ్రీ ధాన్యవాటీపురాధిపతియుఁ, గృష్ణవేణ్ణా జలక్రీడా వినోదుండు నగు గన్నభూపాలునకుఁగుఁబుత్త్రి, వీరనారాయణుఁడు వేమనిభునిదేవి, భూరిసద్గుణ నికురుంబసూరమాంబ" అని కలదు. ధనంజయవిజయకృతిపతి గన్నభూపాలుఁ డీతఁడు కావచ్చునేమో! ఆగుననుటకు ధాన్యవాటీపురాధిపతిత్వము, శ్రీనాథకాలీనత్వము, సరిపోవుట సాధకము. దంతులూరివారు క్షత్రియులుగాను, రెడ్లు శూద్రులుగాను, నుండుట బాధకము. కాని సాధకము బలవంతముగాను బాధకము దుర్బలముగాను నున్నట్లు నేను దలంచుచున్నాఁడను. కోమటివేమారెడ్డి యాస్థానకవియగుటచే శ్రీనాథుఁ డాతనిమామకుఁ గృతి

మగును శ్రీనాథునికాలమున రాజ్యమేలుచున్న రెడ్డిరాజులకు ఋత్తియులతో జుట్టరికములు సడచినట్లు తెలియవచ్చుచున్నది. ఈ విషయమును శ్రీవీరభద్రరావుగారింతకు ముందు వెల్లడించియున్నారు. శ్రీవీరేశలింగముపంతులుగారు దాని ననువదించియున్నారు. ఆది యించుక పేర్కొనెదను. కోరుమిల్లిశాసనములో నీక్రిందిశ్లోకమున్నది:

శ్లో. పౌత్త్రీం కాటయవేమయక్షితిపతేః పుత్త్రీంచ కాటప్రభో
ర్దౌహిత్రీం చతురర్ణవీం హరిహరక్షోణీపతే ర్భాసితుః
తన్నామ్నా విదితాహ్వయాం హరిహరాంబాం చారు మంగాహయ
త్పాణౌ వేమమహీశమల్లనృపతిస్సామాజ్యలక్ష్మ్యా సమమ్

ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని వ్రాతపుస్తకములలో నీ శ్లోకమిట్లున్నది. శాసనము రాగిరేకులది. ఆరేకులు సీమ కేగినవి. శ్రీవీరభద్రరావుగారు ప్రాచ్యలిఖితపుస్తకశాలలోని వ్రాతప్రతినుండి యీ శ్లోకము సుద్ధరించి యిట్లేయుదాహరించిరి. శ్రీవీరేశలింగముగారు వీరభద్రరావుగారిపుస్తకమునుండి యెత్తికొనిరి. ఈశ్లోకమం దొక యసంగతికలదని నేను దలంచుచున్నాఁడను. కొంచెమాఁగి యాయసంగతిని దెల్పెదను. అల్లాడరెడ్డి పెద్దకుమారుఁడగు వేమారెడ్డికి హరిహరాంబ యనునామె భార్యయనియు, నాహరిహరాంబ కాటయవేమునకుఁ గొడుకుకూఁతురనియుఁ గాటయకుఁ గూఁతురనియుఁ జతుస్సముద్రములను నేలుచున్న హరిహరక్షోణీపతికిఁ గూఁతు కూఁతురనియుఁ బయిశ్లోకమునకర్థము. అప్పుడుచతుస్సముద్రముల నేలువాఁడనఁదగిన హరిహరక్షోణీపతి నిస్సంశయముగా విద్యాసగరాధీశ్వరుఁడే. ఆతఁడా కాలమువాఁడే. క్షత్త్రియుఁడే. కాటయవేమాదులు భూపులే. వీరిచుట్టుటికము సంగతము కాఁగూడదుగదా! ఇట్టిదే యిప్పుడు తెలుఁగుదేశమున

నొక తగవు రగులుచున్నది. అది కాకతీయుల విషయము. వారు క్షత్తియులగుట ప్రఖ్యాతముకదా! వారుభూద్రులతో జుట్టుటీకములు చేసిరనియు భూద్రులనుటకుఁగూడ నాధారములు గలవనియుఁ గొంద ఱును అట్లుకాదని కొందఱును వాదప్రతివాదములు చేయుచున్నారు. అది యెట్లేని యగుఁగాక! నాకిక్కడనంతగాఁ బ్రస క్తముకాదు. ఈరెడ్డి రాజులకును విద్యానగరరాజులకును సంబంధమునుదెలుపు రాస న శ్లోకమును ద్రోసిబుచ్చఁజాలము. రెండ్లందఱు సామాన్యముగా భూద్రు లనిపించుకొనుచు వచ్చినను రాజ్యాభ్యుదయము కలిగినపిదప రాజు లయినరెడ్లు క్షత్త్రియులనికూడ ననిపించుకొనిరనుట కాధారమున్నది. శ్రీనాథాదులందఱును రెడ్లు చతుర్థవర్ణజనితులని పేర్కొనిరి శివ లీలావిలాసకర్త నిశ్శంకుని కొమ్మనకూడ నట్లేపేర్కొనెను. కాని రాచటీకము నెఱపిన యల్లాడరెడ్డిని వర్ణించునప్పుడు మాత్ర మాతఁడు దిక్పాలకాంశోద్భవుఁడని చెప్పెను. ఇంతతో విశేషమేమియు లేదు గాని యటుతర్వాత రాజయిన వీరభద్రారెడ్డిని వర్ణించునప్పు డాతఁడు చెప్పిన యీక్రిందిపద్య మావీరభద్రారెడ్డి క్షత్తియుఁడయినట్లు తెలుపు చున్నది.

చ. వరకమలాప్తవంశమున వర్ణనగాంచి యమోఘమార్గణా
దరమునమించి శాంభకథాసరణి న్మదినుబ్బి యుల్లస
ద్ధరతమత్రపవర్తన ముదంబువహించి తనర్చు రింపుసొం
పరుగుగ రామభద్రుఁడును నల్లనృపాలకు వీరభద్రుఁడున్.

'పౌత్త్రీం కాటయవేమయే' త్యాది శ్లోకమునకొక యపంగతి కలదని కొంచెమాఁగి దానిని జెప్పెదనని వ్రాసియుంటిని. అది యిది: ఆశ్లోక మిప్పుడున్నట్లే యుండునేని, కాటయవేమునకుఁ గాటయయని

కుమారుఁడు కలఁడనియు, నాతఁడు హరిహరరాయల యల్లుఁడనియు, నాకాటయకూఁతురు హరిహరాంబయనియు నేర్పడును. హరిహరాంబను బెండ్లియాడిన వేమారెడ్డి యల్లయకుమారుఁడగుట, వీరభద్రారెడ్డియన్న యగుట, మనమింతకుముం దెఱుఁగుదుము. మఱియు నావీరభద్రారెడ్డి, కాటయవేమునికూఁతురగు ననితల్లికి భర్తయనికూడ నెఱుఁగుదుము. కాటయవేమారెడ్డి తనయల్లునియన్నకుఁ దనకొడుకుకూఁతునిచ్చి వివాహముచేసినవాఁడగును. ఇట్టిది యెక్కడనేని సంగతముగా నుండునా? ఆనితల్లికి మేసగోడలగు హరిహరాంబ తోడికోడలయినట్లు; అల్లయవేముని సంబంధమునుబట్టిచూడఁగా ననితల్లి వీరభద్రారెడ్డికిఁ బినతల్లి యగును. తల్లివరుస తలఁపరాదందురు. ఈశ్లోకమింత యసంగతముగా నున్నది. కాటయవేముఁడు క్రీ. 1416 వఱకు జీవించియున్నాఁడు. ఆతనికిఁ గుమారగిరితోఁబుట్టువగు దొడ్డాంబయం దనితల్లియను కూఁతురుఁలిగెను. మల్లాంబికయనునామె మఱొకరైకూడఁ గాటయవేమునకు భార్యకలదు. శ్రీవీరభద్రరావుగారు, వీరేశలింగముపంతులుగారు మొదలగువారు మల్లాంబికయే కుమారగిరితోఁబుట్టువని భావిసిరి. అది నిజముకాదు. కుమారగిరి తల్లాంబిక కుమారుఁడు.

ఈ విషయ మింతకుముందుఁగూడఁ దెలిపితిని. కాటయవేముని తర్వాత నాతని కొమారుఁడు కుమారగిరి కొన్నినాళ్లు మాత్రమే జీవించెను. కాటయవేముని వంశము నిర్వంశమగుటచే రాజ్య మనితల్లికి సంక్రమించెను. ఆమెభర్త వీరభద్రారెడ్డి రాజయ్యెను. ఇంతయేకాని కాటయవేమునకుఁ గాటయయను కొమారుఁ డున్నట్టుగా నేశాసనమందుఁగాని, యేగ్రంథమందుఁగాని కానరాదు. ఆతఁడేమో బాల్యమునే చనిపోయియుండవచ్చుననుటకును గుమరదు. ఆతఁడు హరిహరరాయని యల్లుఁడట; హరిహరాంబయను కూఁతునుగనెనట. శ్రీవీరభద్ర

రావుగారుకూడ నీ విషయమును విశ్వసించియు విశ్వసింపనట్లు వ్రాసిరి. ఈశ్లోకమున నొక చిన్నతప్పిదము దొరలినదని నేను దలంచుచున్నాను. అది శాసనము జెక్కువారివనలఁగాని, దానిఁజదివి వ్రాసిన వారివలనఁగాని ప్రసక్తించియుండును. శ్లోకమందలి ప్రథమచరణ మిక్రిందివిధముఁ నుండఁదగును:

శ్లో. పుత్త్రీం కాటయవేమయక్షితిపతేః పౌత్త్రీంచ కాటప్రభోః.

హరిహరరాయని యల్లుఁడే కాటయవేమనయని దీనివలన నేర్పడును. హరిహరాంబ కాటయపౌత్త్రి, కాటయవేముని పుత్త్రియగును. కాటయవేముని వంశక్రమమిది:-

శ్లో. నప్తా కాటయశౌరేః పౌత్త్రీ మారస్య కాటనృపసూనుః
వీరాన్నపోతనృపతే ర్జామాతా జయతి వేమభూపాలః.

తల్లాంబిక హరిహరరాయని కూఁతురగునేమో; ఒక శాసనము మల్లాంబిక సోదరుఁడు ముక్కంటిరాజనియున్నది. ఆశాసన మపరిశోధితము. కాటయవేముఁడు తన కుమార్తెల నిద్దఱను, వేమ వీరభద్రారెడ్లకిచ్చి పెండ్లిచేసెను. బాంధవముచేతనే రాజమహేంద్ర వరమున వారు కలిసియుండగలిగిరి. అక్కచెల్లెండ్ర నన్నదమ్ముల కిచ్చి వివాహముచేయ గూడదను నాక్షేపమున్నది. దానికిఁ దగిన సమాధానముకూడ నున్నది. ఒక్కతల్లికడుపునఁ బుట్టిన యక్కచెల్లెండ్ర నొక్క తల్లికడుపునఁ బుటిన యన్నదమ్ములకిచ్చి పెండ్లి చేయరాదుగాని వైమాత్రేయత యున్నప్పుడది తప్పుకాదు. అట్టి వివాహము లనేకములు జరుగుచున్నవి. కాటయవేముని తర్వాత రాజమహేంద్రవరరాజ్య మాతనియల్లుం డిర్రువరకును జెందఁదగుననరాదు. కాటయవేమునకు రాజ్యము పిత్ర్యముకాదు. భార్యయగు దొడ్డాంబిక

మూలమున నరణముగావచ్చినది. కావున నారాజ్య మనితల్లికినిఁ దద్ద్వారమున నామెభర్తకును మాత్రమే సంకల్పించినది. 'పుత్త్రిః పౌత్త్రిశ్చతజ్జశ్చ, పుత్త్రికా, పుత్త్రికేవచ-పుత్త్రికా, అనంతరం తత్పుత్త్రిః" అనిదాయాధ్యాలకల్పము. శ్రీనాథుఁ డీవిషయమును గాశీఖండమున సూచించినాఁడు. కలువచేరుశాసన మీవిషయమును స్పష్టపఱిచినది. అందిట్లున్నది :

శ్లో. దురితరహితచిత్తో దొడ్డయాల్లాడభూపో
భువమరిజనకళ్యాం భూయసాహ్యత్యదోష్టా
విమలగుణయుతాయాం వేమభూపాత్మజాయా
మవనిసురసుధాయా మన్నిశల్యాంవ్యధత్త.

కోరుమిల్లిశాసనము పార్నెటుదొరవారిచే నిటీవల సవ్యాఖ్యానముగాఁ బ్రకటింపఁబడినది. ఆదొరగారుకూడ ప్రాచ్యలిఖితపుస్తకశాలలోని వ్రాతప్రతిపాఠము విమర్శనచే ప్రకటించిరి. వా రాశాసనము ప్రతిబింబమును బ్రకటింపరయిరి. కాని మునకుఁ జిక్కుఁ దెచ్చిన పట్టుని వారు శ్లోకమునఁ గొంత (సజెషన్) ఊహాముల చేర్చిరి. మూల మెట్లున్నదో! సుదూరము పోయితిమి రెడ్లకును, క్షత్త్రియులకును పుట్టుకలు నడచె ననుటకు సంశయాస్పదమయిన సాధకము మఱి యొకటి కలదు. అదియుఁ జక్కఁగాఁ బరిశోధింపవలసియున్నది. వేమవీరభద్రారెడ్లతల్లి యనవేమక్షితిపాలుని పౌత్త్రియని కాశీఖండాదులం దున్నది. శివలీలావిలాసమున నిట్లున్నది:-

మ. భరి(రి)తశ్రీనిధియమ్మహీరమణుఁ డొప్పన్ జోళభత్తిక్షితీ
శ్వరసూనుండగు భీమలింగమనుజేంద్ర శ్రేష్ఠసత్పుత్త్రి భా
స్వరకారుణ్యదయాజనావనవిధాసంధాత్రి వేమాంబికన్
వరియించెన్ బతిభక్తి గౌరవదృఢవ్యాపారరీత్యంబికన్.

కోరుమిల్లి శాసనమం దిట్లున్నది.

శ్లో. శచీన శక్రవ్య శివేవ శంభోః పద్మేవ సా పద్మవిలోచనస్య,
వేమాంబికా చోళకులేందుభీమభూపాత్మజా భూస్మహితాస్య జాయా.

ఆనవేమక్షితిపాలునికూఁతును బెండ్లాడిన భీమలింగమనుజేం
ద్రుఁడు చోళవంశజుఁడట! బ త్తీశ్వరుని కొడుకటఁ! వీరెవరో! ఏ
చోళులో! తెలియవలెను. అల్లాడరెడ్డిభార్య యనవేమన్నపాలుని కొడుకు
కూఁతురని పూర్వము కొందఱు వ్రాసిరి. శ్రీమానవల్లి రామకృష్ణకవి
గారు శివలీలావిలాసమును జూచి కూఁతుకూఁతురుగాని కొడుకుకూఁతురు
గాదని తొలుత గు ర్తించిరి. ఆల్లాడరెడ్డివంశ్యులు ననవేమారెడ్డివంశ్యులు
వియ్యాలవా రనుతలఁపు దీనిచేఁ దొలఁగిపోయెను. శ్రీవీరభద్రరావుగా
రావల నారెండు కుటుంబములవారు చేసటివారనియు నొక్కయింటి
వారనియు గు ర్తించిరి. దేసటియనుసది యొకయింటిపేరో లేక యొక
తెగకుఁ బేరోయని నాకిక్కడ సంశయమున్నది.

ఇప్పు డల్లాడరెడ్డిమామయై మనయెఱుకకువచ్చిన భీమలింగమను
జేంద్రుఁడు సూర్యవంశక్షత్రియుఁడువోలె నున్నాఁడు. భీమలింగ
మనుజేంద్రునితండ్రి చోళబ త్తిగదా! పరిసంగ రత్నావళిలోని యీ
క్రింది శ్లోకము లింతకుముందుఁ బేర్కొనఁబడినవే:

శ్లో. సూర్యో యస్య కులేశ్వరో గుణనిధి శ్శ్రీచోళబ త్తిః పితా
నంత్రాణం శరణార్థినాం వదవనం షట్కాల మీశార్చనమ్
కించావారిత మన్నదాన మఖిలే నిత్యవ్రజం భూభుజాం (?)
ధన్యోఽయం చిర మన్నదేవనృపతిర్జాగ ర్త్యజయ్యః పరై ఃం.

శ్లో. రాజవేశ్యాభుజం గాంకో రాజన్యపరమేశ్వరః
ఆసి చోళోఽన్నదేవేంద్రో గండభేరుండలాంఛనః.

శృంగారశ్రీనాథము

ఈశ్లోకములం దభివర్ణితుఁడైనచోళబత్తి యనచేమారెడ్డివియ్యం కుం డగునేమో! కాలము సరిపోవుచున్నది. అల్లయరెడ్డి క్షత్రియ కన్యను బెండ్లాడుటచే వారికి జనించినవీరభద్రారెడ్డి "వరకమలాప్త వంశమున వర్ణనగాంచి" నాఁబడినాఁ డనఁదగును. శ్రీవీరభద్రరావు గారు రాజమహేంద్రవరపు వస్తుప్రదర్శనశాలలో నున్నదన్న తామ్ర శాసనము సుపరిశోధితమగునేని మఱికొంతవిషయము బయల్పడఁగల దనుకొనెదను.

ధనంజయవిజయము మనల నింతదూరమునకుఁ గొనివచ్చినది. భాషాచంక్రమణము చేసితిమి. ఇక్కడివిషయము కొంత రెడ్లచరిత్ర ప్రకరణమునకు సంబంధించినది. చర్వితచర్వణమగునని దీని నింతగా నక్కడఁ జెప్పలేయితిని. ఇక్కడ చెప్పుటయే యొక్కువ సంగతముగా నుండునని తలఁచితిని.

ఈనడిమికాలమునఁ గూడ మనతెనుఁగుదేశమున రాజ్యప్రాభవమున నున్నవారు క్షత్రియత నాదేశించుకొని ప్రఖ్యాతక్షత్రియులతో బాంధవము నెఱపినవారున్నారు. పేర్కొనుటేల! పూర్వకాలమునఁ గూడ నట్లుజరుగుచుండవచ్చును. క్షత్రియులు శూద్రస్త్రీలనుగూడఁ బెండ్లిచేసికొనుటయుఁ దన్మూలమున నాశూద్రులుకూడ క్షత్రియులగుటయు నాకాలమునఁగూడ సంభవించుచుండవచ్చును. ఈ విషయము నింతకంటె నెక్కువగా నిరూపింపఁబూనుట యనర్థహేతువని విడనాడుచున్నాఁడను.

❋

శృంగారశ్రీనాథము

నవమప్రకరణము

సీ. కాశికావిశ్వేశుఁ గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయఁడిచ్చు?
శైలాసగిరిఁ బంట మైలారువిభుఁ డుండె
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు?
రంభఁగూడఁ దెనుంగు రాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుడయ్యె విస్సనమంత్రి మఱి హేమ
పాత్రాన్న మివ్వనిపంక్తిఁ గలదు?

భాస్కరుఁడు మున్నె దేవునిపాలికరిగెఁ
గలియుగంబున నిఁకనుండఁ గష్టమనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గురనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.

—శ్రీనాథుఁడు.

అవసానము.

శ్రీనాథుఁడు సాంసారికసౌభాగ్యము సంతగా ననుభవించిన వాఁడు కానట్టున్నాఁడని యింతకుముందే చెప్పినాఁడను. కాని సంసార భారముమాత్రము మెండుగానున్నట్టున్నది. దౌహిత్రాదులు తనప్రాపునే కోరువారు పెక్కురుండిరిగాఁబోలును. పుత్త్రిలో దౌహిత్రులోయున్న

వారు ప్రయోజకులగుదురేని శ్రీనాథునకు వార్ధకమునఁగూడ సంపా రపుబరువు మోవఁజనియుండదు. వా రట్టివారు కారుగాన తాన సంపా రపుబండిని సాగిఁపవలసినవాఁడయ్యెను. ఆదరించెడు జేఁడు లేఁడ య్యెను. కొండవీడు రాజమహేంద్రరాజ్యములు కూలిపోయినవి. ఒడ్డె రాజులు వచ్చిపడ్డారు. వారురాజ్యమును స్థిరతిష్ఠతమునుజేసికొను గజి బిజిపాటుతో నుండిరి. అపుడు సాహిత్యవినోదమునకు సందెక్కడ దొరకును? మఱియు వారు తెనుఁగువారుకారు. అప్పటి ప్రభువు కపి లేశ్వరగజపతియో పురుషోత్తమగజపతియో యగును. ఆయన కొండ వీటఁ దుచున్నవాఁడుకాఁడు. కటకము నుండి యుదయగిరి పర్యం తమయిన దేశము నొక్కమొగిని వశపఱుచుకొని వ్యవహరించుటకుఁ దికమకలు పడుచున్నాఁడు. తిరుగులాడుచున్నాఁడు. పూర్వమంత్రుల ప్రాభవము పోయినది. పాత్రులు మహాపాత్రులు వెఱయుచుండిరి. కవితా వైభవమును జూచుకొనుచు శ్రీనాథుఁ డింతదాఁక ధనమును లెక్కగొనకయేయుండెనుగాని దానివలని యనర్థము నిప్పు డనుభవింప వలసినవాఁడయ్యెను. పెదకోమటి వేమారెడ్డియొద్ద, వీరభద్రారెడ్డియొద్ద, వారివారి మంత్రులయొద్ద, నింక నితరరాజులయొద్ద నీతఁ డెన్నియేని యగ్రహారములు సంపాదించియుండఁడగును. ఎందుకు? ఆకాలమున నారాజులకంటె, నారాగమంత్రులకంటె నీతఁడే యధికభోగముల ననుభ వించువాఁడుగ నుండెను. అయిపోయినది యది. ముదిసి యిప్పుడు ముప్పున మునిఁగినాఁడు. దేహాటనముచేయ దేహదార్ఢ్యములేదు. అంతకు ముందుఁ దనయెడ నత్యంతాదరము చూపిన రాజులు రాజమంత్రులు గూడ స్వర్గస్థులయిది. క్రొత్తప్రాపులింక నెక్కడ యార్జింపఁగలడు? వైదుష్యవైభవమును మెచ్చి ధనమిచ్చి పోయెడు ప్రభువులులేరయ్యెను. పుత్త్రులో దౌహిత్రులో పనిపాటులకు మాత్రము పనికివచ్చువారింట

నున్నారు కావలయు. వారిని జూచుకొని కృష్ణాతీరమున బొడ్డుపల్లెను గుత్తకుఁగొని కృషిచేయింప నారంభించెను. బొడ్డుపల్లె యెక్కడ నున్నదో నాకెఱుఁగరాలేదు. ఆది బెజవాడకు దిగువను కృష్ణా సాగరసంగముదాఁకఁగల దేశమునఁ గృష్ణదరి నుండవలెను. కృష్ణ వెల్లువవలనఁ బైరుపంటలు పాడుపడుట కది బెజవాడకు మిక్కిలి దిగువను గృష్ణదరిని నున్నదే కావలెనుగదా! శ్రీనాథునినాఁటికే యది చిన్న పల్లెయయియుండును. తర్వాతనది ''బేచిరా''కయి యుండవచ్చును. ఒక గ్రామమునే గుత్తకుఁగొనువాఁడు సామాన్యసంసారియై కాస్తకూస్తలతో నిలుగడవఁదగినవాఁడయి యుండఁడు శ్రీనాథున కెంతో పోష్యవర్గ మెక్కువగా నుండవలెను. అగ్రామమునకు సిస్తేడునూర్లుటంకములట! కృషి తిన్నగా నెఱవేటి పంట యింటికివచ్చెనేని యది యెంత గొప్ప సంసారమునకు సరిపడియుండునో, దాని విలువెంత యుండునో యప్పుడు? ఆది యిప్పు డెంతవిలువ యుండునో, మైలార రెడ్డి దినవెచ్చ మిచ్చువాఁడనఁగా నా వెచ్చము 'నేరుబియ్యము, చిట్టెఁడునెయ్యి' యయి యొకటిరెండు పొట్టలకు సరిపోదగినట్లుండదు. శిష్యసంఘము, బంధుసంగము మొదలుగా నాతనిబంతిని భుజించువారు పలువురుండితీఱుదురు. రేపటికని చూచుకోక యతఁ డేపూటకాపూట యిష్టోపభోగములతో ధనము వెచ్చించెడువాఁడు. గ్రామము కృషికి గుత్తకుఁగొనెననఁగా గమ్మతగాం డ్రెందఱో యందురు. పెద్దజంజాట మేర్పడినది. బ్రాహ్మణకృషి తిన్నగా నెఱవేఱదందురు; కవితా కృషియం దసమానుఁడయ్యును శ్రీనాథుఁ డీకృషిలోఁ గృతార్థుఁడు కాఁజాలకపోయెను. కృష్ణవెల్లువవలన నాపైరు పంటలు పాడుపడెను. ఉన్నదియుండఁగా నుయ్యూరు పైఁబడ్డదన్నట్లు గొడ్డువోయిన యా భూమికిఁ బన్నుగా నేడునూర్లుటంకములు (టంక మొక బంగరు

నాఁజెము) శ్రీనాథుఁ డాయొడ్డిరాజుల కీయవలసినవాఁడయ్యెను. ఎక్కడఁదెచ్చి యీయఁగలఁడుఁ విద్యాగౌరవములేక యారాజులో రాజమంత్రులో శ్రీనాథుని సిలుగులకుఁ బాల్పటిచిరి. శ్రీనాథకవి సార్వభౌముఁ డీక్రింది పద్యమునుజెప్పి యాంధ్రవాఙ్మయ మున్నంత కాలమును శాశ్వతమగున ట్లా రాజుల కపకీర్తి నెలకొల్పెను:

సీ. కవిరాజుకంఠంబుఁ గొగిలించెనుగదా
పురవీథినెదురెండ పొగడదండ
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసుముంజేత
వియ్యమందెనుగదా వెదుకుగొడియ
సార్వభౌమునిభుజాస్తంభ మెక్కెనుగదా
(1) నగరివాకిటనుండు నల్లగుండు

గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయెఁ దిలలు వెనలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్లుచెల్లింతుఁ డంకంబు లేదునూర్లు.

తలంచిన మిక్కిలి వ్యసనముకలుగుచున్నది. కటకటా! కర్ణాట రాజుల ముత్యాలశాలలోఁ గనకాభిషేక సత్కారమందిన మనకవిసార్వ భౌమునకా యిట్టికష్టదశ! ఆతఁడు తన నిర్యాణకాలమునఁ జెప్పికొన్న పద్యమునే నేనీప్రకరణప్రారంభమునఁ జేర్చినాఁడను. "దివిజకవి వరుగుండియల్ దిగ్గురనఁగ, నరుగుచున్నాఁడు శ్రీనాథుఁడమరపురికి." అపద్యమున బేర్కొనఁబడినవారిని గూర్చి యింతకుముందు మనము

(1) 'నాగరౌతువసించు నల్లగుండు' అని బ్రౌఁడొరగారి పాఠము.

కొంతయెఱుఁగుదుము. పీరభద్రారెడ్డి, పంటమైలారరెడ్డి, సంబురాయని తెనుంగురాయఁడు, విస్సనమంత్రి (రాయని) భాస్కరుఁడు, ననువారు. పెదకోమటివేమారెడ్డి, మామిడి సింగనామాత్యుఁడు మొదలగువారిప్పటికి నలుబదియేండ్లకుఁ బూర్వమే స్వర్గస్థులగుటచేత, శ్రీనాథుఁడువారి నీ పద్యమునఁ బేర్కొనలేదు. పయిపద్యమునఁ బేర్కొనఁబడిన వారికే గాక మఱియొందఱకో కూడ శ్రీనాథుఁడు తనపలుకుఁదేనియల నామె తలువెట్టి బహూపనమార్జించెను ఎంతయార్జించిననేమి? తుదకా మహా నీయుని మనువు కడతేఱువఱకయిన నిలుకడచెందదయ్యెను. ఆనాఁటి కానాఁ డేదోకృతిర్మిమపు ఘనతఁగూర్చు ధనమేమి ధనము! దంధనము! కీర్తిధనమే ధనము! శ్రీనాథుఁడు లేవడిచేఁ జివికి చీకాకుపడుచుండఁగా నాకాలమున నైశ్వర్యగర్వమున విశ్వము మఱచియున్న ధనోన్నతు లెందఱో యందురు గదా! వారి ధనమెక్కడపోయెనో? తనువులెక్కడ పోయెనో? ఊరా? పేరా? కీర్తిధనమార్జించుకొన్న శ్రీనాథుని వాఙ్మయ మూర్తి నాఁటికీ నేఁటికి, నేనాఁటికిఁగూడఁ గసుగందక కవితామహా రాజ్యభద్రాసనాసీనమై, కవిసార్వభౌమ బిరుదమున గవిలోకము నేలుచునేయుండునుగదా! బళిరాబళి! శ్రీనాథకవిసార్వభౌమా! నిప్పచ్చ రమును దలంచుకొని సి వెంతచప్పరింతలు వెట్టితివోగదా! చాటు నేయక చాటిచెప్పితివి! ఐశ్వర్యమత్తులను దలమొత్తుటకా? ఉసురు విడుచునప్పుడుకూడఁ గవితావిషయమున నీవెంతగండరగండఁడవోయి! 'దివిజ కవివరుగుండియల్ దిగ్గరనఁగ' నమరపురీప్రస్థానము కావించితివా?

స్వభావము.

శ్రీనాథుఁడు మహాభోగపరాయణుఁడు. ఈ విషయమున సమ కాలమువాఁడయిన పోతనామాత్యునకును, నీతనికిని మిక్కిలి ప్రాతి

కూల్యముకలదు. శ్రీనాథుఁడు నిర్వ్యాజముగా నొక్కగ్రంథమేని పారలౌకికఫలము నపేక్షించి భగవదంకితము చేసినట్లుకానరాదు. స్వర్ణ పాత్రభోజనములు, దీనారటంకాలతీర్థమాడుటలు, జాంబూనదాంబరాభరణ ధారణములు, కస్తూరికాసుగంధాంగరాగానులేపనములు, ఉద్యానవిహార ములు శ్రీనాథుఁ డపేక్షించెను. తదుపలబ్ధికయి గ్రంథముల రచించెను. ఆతనికీ యభిలిప్సయపారము: ''కావ్యములు పెక్కుచెప్పియుఁ గాంక్ష చనక, వెండియును గావ్యమొకటి నిర్మింపఁదలచి'' (భీమఖండము). పోతరాజుగా రీతిఱగువాఁడు కాఁడు:

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురస్కృలు వాహనమ్ములున్
సొమ్ములుఁ గొన్నిపుచ్చుకొని చొక్కి శరీరమువాసి కాలచే
సమ్మెటవ్రేటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.

ఈ పద్యము శ్రీనాథునుద్దేశించి చెప్పినది కావచ్చును. శ్రీనాథుఁ డెక్కడి కరిగినను గవితామహారాజ్యభద్రాసనాసీనుఁడయి శిష్యనంథ ముతోఁ గవితావిజయధ్వజముతో బయల్వెడలెడివాఁడు. అనుదినము చూచిన సుందరవిగూర్చియో, యనుభవించిన యానందమును గూర్చియో, కాంచినకష్టమును గూర్చియో, కవనము కట్టుచుం డెడివాఁడు. అట్టివాఁ డగుటచేతనే మన కాతనిచరిత్ర మీమా త్రము తెలియఁదగినదయినది. ఆతఁడు సౌందర్యాభిమాని. చిన్నారిపొన్నారి చిరుతకూకటినాడు, నూనూగుమీసాల నూత్నయౌవ నము, ప్రౌఢనిర్ఝరవయఃపరిపాకము ననుపదము లీవిషయమును దెలుపుచున్నవి. మఱియు నాతఁడు శృంగారిశేఖరుఁడు. భీమఖండ కాశీఖండ గ్రంథభాగములు, వీథీనాటకము, శివరాత్రి మాహాత్మ్యము,

చాటుధారలు, ఐతిహ్యములు, ఇతర కవిస్తుతులు, నీవిషయమును రాద్ధాంతపఱచుచున్నవి. ఈ విషయము నిరూపించుటకయి కొంత గ్రంథము వివరించ్రవాయ మనసొల్లకున్నది. కొందఱు శ్రీనాథుఁడు శృంగారియనుట కొప్పుకొనకున్నారు. అట్టివారు శ్రీనాథుని గ్రంథములను జదువనివారో, చదివినను గవితాతత్త్వము నెఱుఁగనివారో, యెఱిఁగినను గప్పిపెట్టఁదలంచువారో కావలెను. కడపటివిధమువారగుదురేని నారిసద్ధృదయమును సన్మానింతము. మన మిక్కడ శ్రీనాథునిఁ దిట్టుటలేదు. కవితాదర్పణమునఁ గన్నట్టుచున్న యావిషయమును కప్పిపెట్టిన మాసిపోదు. శ్రీనాథుని చాటుధారలనేకము లుదాహరింపఁజాలకున్నాను. వానిలోఁగొన్నింటిని ప్రాచీనులు లక్షణగ్రంథములందు శ్రీనాథునిపేరనే యుదాహరించినారు. అట్టివానినెల్ల నే నిక్కడనుదాహరింపకున్నను, జూచినట్లు సూచించియైన విడువవలెనుగదా! 'శ్రీనాథునిశృంగారవర్ణనము' అనుపేర నొకపెద్దప్రకరణము రచించియు నది పదుగురునుజదువఁదగినది కాదనుకారణమున దూరికరించితిని. ఇంతదాఁకలోకమున జీవించియున్న శ్రీనాథునిచాటుధారలిప్పుడు మన మచ్చునఁ దీర్చుకున్నంతమాత్రానఁ జచ్చిపోవు. వానియందుఁ గవితాగౌరవమున్నది. శ్రీకందుకూరి వీరేశలింగముపంతులుగారిసందర్భమున శ్రీనాథునిఁ గొంత యవగణించిరి. ఆతఁడు వార్ధకమున దారిద్ర్యమనుభవించుట పాపఫలమనికర్మవిపాకముచెప్పిరి. అట్లు చెప్పుట వారికేచెల్లినది. దాని నిఁకవిస్మరింతము. ఈసందర్భముననే భీమఖండముద్రాపకు లొకతప్పిదమును శ్రీనాథునిపై నారోపించిరి. అదియిది: సంస్కృతభీమఖండమున '' కాలకూటోపసంహారీ సమర్థస్సహి దేవరాట్''-అనియుండఁగా శ్రీనాథుఁడు ''కాలకూటోపసంహారకారియతఁడు, సంతతము దేవవేశ్యాభుజంగుడతఁడు'' అని తప్పుగాఁ

దెలిగించెనట! శ్రీనాథుఁడు దేవునికిఁగూడ నిక్కడబోగపుటాండ్రతో సంబంధము చెప్పెనట. శ్రీ వీరేశలింగముపంతులుగారును గతానుగతికులై కొంతయేదేని వ్రాసిరి. ఆ తప్పిదము శ్రీనాథునిదికాదు. శ్రీనాథుని తెలిఁగింపు సరియయినదే. దేవవేశ్యాభుజంగ రాజవేశ్యాభుజంగ పదము లనేకగ్రంథములం దున్నవి. రెండవది రాజుల కనేకులకు బిరుదుగానున్నది. రాజులనెడ వేశ్యలకు మిండఁడని దాని యర్థము. ''రాజవేశ్యాభుజంగస్య కుమారగిరిభూపతేఃl శశ్రీకాటయవేమస్య ప్రపగల్భా తత్ప్రదూతికా''– ఇత్యాదు లీయర్థమును స్పష్టపఱుచుచున్నవి. దేవవేశ్యాభుజంగపదముకూడ దేవతాధిపుఁడను నర్థముగలదే. ''దేవరాట్'' అనుపదమునకు నుచితమయిన పరివర్తనమే. వారనుకొని నట్లు గుడిబోగపుటాండ్రని యర్థముకాదు. స్థలాంతరములం దాతఁడట్లు చెప్పినది వాస్తవమేకాని యిది యట్టిదికాదు.

ఈక్రిందిపద్యములు శ్రీనాథునిస్వభావము నెఱిఁగించుచున్నవి.

క. ఎవ్వఁడు నిసర్గకథనుం
దెవ్వఁడు సన్మార్గరోధి యీర్ష్యావఱుఁడై
యెవ్వఁడు తన కధికునితోఁ
జివ్వకుఁజేసాఁచు వాని పిరు లధ్రువములే.

గీ. అతిథి కడు నల్పుఁడై నను నధికుడైన
నింటికేతేఱఁ బ్రియమందు నెవ్వఁడేని
వానిగౌరవ మది గౌరవంబుగాని
కాదు గౌరవ మాకారగౌరవంబు.

క. ఎవ్వనితో నెచ్చోటం
జివ్వకుఁజేసావవలదు చేసాఁచినచో

నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వకయుండంగఁ బగసనండీర్ప్ఁదగున్. —కాశీఖండము.

ఈకడపటిపద్యమునకు వెనుకముందులుగా నున్నపద్యత్రిని. ములు మటిరెండు డిండిమభట్టారకవివాదసందర్భమున నుదాహరించి పయిపద్యములందు గర్హింపఁబడిన దోషములు శ్రీనాథునికడ లేకుండవలెను. అతఁ డీర్ష్యాపరుఁడు కాఁడనుటకుఁ బెదకోమటివేమా రెడ్డికాలమునఁ జెప్పఁబడిన శాసనము లుదాహరణము. అందుఁ బ్రతిగ్రహీతలను శ్రీనాథుఁడు మిక్కిలి ప్రశంసించెను. మఱియు 'ఎవ్వడు నిసర్గకథినుం' డను పద్యమునఁ జేయఁబడిన గర్హణమునకు డిండిభట్టు మనస్సునమెదలుచుండఁదగును. రెండవది తనదేశాటనానుభవమును బట్టి చెప్పినది. మూఁడవది తన్నుఁగూర్చి చెప్పుకొన్నది.

కవులు వర్ణించిన వర్ణనములెల్ల ననుభూతములే కావలయునా యను నాక్షేప మెఱుఁగుదును. అయినను గవియొక్క భావములు కావ్యమునఁ బ్రతిఫలించుచుండుననియుఁ, గొన్ని పట్టులం దవి మిక్కిలి విస్పష్టమగుననియుఁ గవితాతత్త్వపరిశీలన పరాయణు లైకకంఠ్యముగా నంగీకరించుదురు. ఐతిహ్యములను వినకయే, చాటుధారలను పరికింపకయే, తక్కు తార్కాణముల గుర్తింపకయే, శ్రీనాథుఁడు శృంగారియను నంశము నాతని కబ్బములఁ బరికించి కవితాతత్త్వపరిశీలకులు నిర్ణయింపఁగల్గుదురు. ఆయావిషయములందుఁ గవితోజ్జ్వలణము కావవచ్చుటకు మానసికమగు ప్రవృత్తియే కారణమగుచుండును. ఏరుఁ బ్రాలకలమాహారము-కప్పురబోగి వంటకము-పెసరుఁబప్పు – నీతఁడు మక్కువతో బేర్కొనును. శ్రీనాథుని కృతులందు దివ్యములగు భోజనవర్ణనము లెన్నియేని పట్టులందుఁ గలవు. అట్లు దేశాటనముచేసియు, పర్యటనవ్యాపారమున నఖండపరిశ్రమముకావించియు

వైషయికవర్తనమున నగ్యకోటినధిష్ఠించియు, మొగ్గిగతిలఁబడక చిర జీవితము సాగించుకొనఁగల్గినవానికిఁ దిన్నని మేలయిన యాహార విహారములు పొసఁగకయెట్లు? కలవు చాటుపద్యము లీసందర్భమునఁ గొన్ని. ఉదాహరింప మనసొల్లకున్నది. ఒకానొక చాటుధార యాతఁడు విశాలోన్నతకాయుఁడని తెలుపుచున్నది. ఆతని భోజనప్రీతిని దెలుపు చాటుధారలును గ్రంథభాగములును గొన్ని చూపుచున్నాను :

గోధూమనేవికాగుచ్ఛంబు లల్లార్చి – (నైషధము) ఖండశర్క-రజున్ను – (భీమఖండము). ఇత్యాదిపద్యములును,

ఉ. పప్పును బిండివంటలును బానకముల్ ఘృతముల్ గుడంబులా
(?)గుప్పలుగాఁగఁ జుట్టునను గూర్చఁగఁగూడిన యేరుఁబ్రాలతె
ల్లప్పరతోగివంటకము గమ్మని తాలిపుసొజ్జెపిండితో
నొప్పులుగా భుజించిరి బుధోత్తము లాతటిచిచ్చు పెచ్చునన్.

ఆ. ద్రాక్షాపానకఖండశర్కరలతో రంభాఫలశ్రేణితో
గోక్షీరంబులతోడ మఁదెఁగలతోఁ గ్రొన్నేతితోఁ బ్రప్పుతో
నక్షయ్యంబగు నేరుఁబ్రాలకల మాహారంబు నిశ్శంకతన్
గుక్షుల్ నిండఁగ నారగించిరిమి యయ్యుద్దాముధాంతికిన్.

పీఠికనుండి :–

ఉ. కప్పరతోగివంటకముఁ గమ్మని గోధుమపిండివంటయున్
గుప్పెడు పఁచదారయును గ్రొత్తగఁగాచిన యాలనేపెస
ర్పప్పును గొమ్మనల్లనఁటిపండ్లును నాలుగు నైదు నంజులున్
లప్పలతోడఁ గ్రొంబెరుగు లక్ష్మణవల్లులయింట రూకకున్.

కాశీఖండమున :

"వ. అనంతరం భావిశాలాక్షీమహాదేవియును భావంబున నమ్మహామునుల ముందటఁ గనకరంభాపలాశపాత్రంబులయందు, విచిత్రంబుగాఁగల వంటకంబులు, నపూపంబులు, లడ్డువంబులు, నిడ్డెనలు, కుడుములు, నప్పడంబులు, నిప్పట్లు, గొల్లెఁడలు, జిల్లెడుకాయలు, దోసియలు, నేవియలు, నంగరపోలియలు, సారసత్తులు, బొంతర కుడుములు, జక్కిలంబులు, మడుఁగుఁబూవులు, మోరుండలుఁ, బుంద్రేక్షుఖండంబులు, పిండఖర్జూరదాక్షినారికేళకదళీపనసజంబూచూతలికుచదాడిమీకపిత్థకర్కంధూఫలంబులు, గసగసలు, పెసరుంబులుఁ గములు, చెఱకు గుడముఁ, నరిసెలు, బిసకిసలయముల వరుగులు, చిరుగడములు, బడిదెములు, బులుపలు, బులివరకలు, (నప్పడంబులు), బప్పరొట్టియలు, చాఁపట్లు, వాయసంబులు, కర్కరీకారవేల్ల కూశ్మాండ నిష్పావఘటోలికా కోశాతక్యలాబూసిగూదుంబరవార్తాక బింబికా కరవిందశలాటువులును గందయుం బొందయుఁ జారులుఁ దియ్య గూరలు బచ్చడులు బజ్జులు, గిజ్జిణులు వడియంబులు గడియబుంలు గాయంబులు, గంధతోయంబులు, నుండ్రిలు, నానుప్రాలును, ననుములు, మినుములు, బుగుకులు, నడు. కులు, నిలిమిడియును జలిమిడియును, ద్రబ్బెడయు, వడయును. నుక్కెరలు, చక్కెరలు, నేతులుఁ, దేనెతొలలు, బిట్టును, గట్టును, బాలతిమ్మనంబులును, దోఁపలుపూఁపలు, మోదకంబులు, గుదోద కంబులు, ముక్కులుముఱియని చొక్కంపుఁజెరుఁబాల మిలమిలని రాజనంపుమడుఁగు టోగిరంబులు, షాడబంబులతోడం బానకంబుల తోడం దిమ్మనంబులతోడ దధిపిండఖండంబులతోడ మీఁగడలతోడ మజ్జిగలతోడ నూరుఁగాయలతోడ నంబకబళంబులతోడ రసావళుల

తోడంగూడి బుగబుగమను బొగపుఁగంపులతోడం బ్రతిభటించు రామతామోదంబును, రామతామోదంబుతో మంతనంబాడు మెంతులనెత్తావులు, మెంతులనెత్తావులతో బిత్తరించు జీరకంబుల సౌరభంబును, జీరకంబుల సౌరభంబుతోడం ద్రస్తరించు కుస్తుంభరికిసలయ వాసనలును, గుస్తుంభరికి సలయ వాసనలతోడం బిసాళించు కఱివేఁ పాకుఁబరిమళంబును గఱివేఁపాకుఁ బరిమళంబుతో సంబంధించు, కమ్మకసింద గంధంబును, గమ్మకసిందగంధంబుతోడం దార్కొను నేలకుల సౌరభంబును, నేలకుల సౌరభంబులతో సాళగించు కాలాగురుకురంగనాభికాకర్పూర గంధ సారనీహారవాఃపూరంబులతోడం గలహించు మహిసాక్షిగుగ్గులు ధూపధూమంబుల కమ్మఁదనంబును భోజనాగార గవాక్షమార్గంబుల వెడలి కాశికానగరఘంటావీథులం బొరనాసికాపుట కుటీరములకుం గుటుంబకంబుగా మిరియంబు పెరిమెయుఁ, బసపుఁబసయు, సొంఠిసొబగు, నావతేవయు, సిందుప్పచాగయుఁ గరాం(?)బువుమవ్వంబును, బిప్పలి యొప్పను, సల్లంబు మొల్లంబును, జింతఁగొజ్జుర జ్జును, బేలపిండి యొప్పను, నిప్పపూమొగ్గల యగ్గలికయు, వెన్నపెన్నాటకఁబును, గలిగి యొక్కొకమఱియుఁ దనకుందాన నులివేఁడికట్టావితో నావిర్భవించిన"—

మతము.

శ్రీగురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు తిక్కనను గూర్చి వ్రాయుచు శ్రీనాథునియోగ్యత నిట్లు వెదుకఁగొట్టినారు:

"ఇదియునుగాక వేదవేదాంతార్థములు కేవలము తెలిసినను దదుక్తకర్మాచరణము లేనివార ల కట్టిపట్లు తెలిఁగింప సమర్థతయుండదని శ్రీనాథుఁడు తానట్టివాఁడు కాకుండుటంబట్టి యూహించియుండును.

శ్రీనాథుఁడేగాక యాతని తండ్రియుఁ దాతయుగూడ వైదికసంపత్తి లేనివారే. తిక్కనసోమయాజివంశ మట్టిదిగాదు. తిక్కనసోమయాజి తండ్రి సాంగవేదవేది యనియుండె. తిక్కనసోమయాజి వేదవేదాంగముల నేర్చినవాఁడేగాక వైదికమార్గనిష్ఠమగు వర్తనమును నిర్వహించునట్టి యజ్వగానుండెను. కావునఁ బైవిషయములో శ్రీనాథుఁడు తనకంటెను భారతామ్నాయమును దెనిఁగించుటకుఁ దిక్కన యొక్కఁడే లౌక్యవైదికములు రెండింటను సమర్థుఁడని యెంచి యారీతిగా వర్ణించెను.''

శ్రీనాథుఁడు వైదికాచారదూరుఁడనుటకుఁ దగిన యాధారము లేదు. ఆతని తాతతండ్రులనుగూర్చి మనకేమియు నెఱుఁగరాదు. నిరాధారముగా శ్రీరామమూర్తిగారు నెలకొల్పిన పయివిషయము మనకు నిరాకరింపఁదగినది. శ్రీనాథుఁడు వేదాదివిద్యాసంపన్నుఁడనుట కనేకాధారము లున్నవి. హరవిలాసమున –'పరమపుణ్య' 'కులపవిత్ర' 'అఖిలపురాణవిద్యాప్రవీణ' 'అధ్వర్యువేదశాఖాధీతినిష్ణాత' 'ఆగమజ్ఞాననిధి' 'తత్త్వార్థఖని' 'బహుపురాణజ్ఞ' పదము లున్నవి. నైషధమున 'ఈశ్వరార్చనకళాశీలుఁ' డనియున్నది. కాశీఖండమందీతని వైదికవిద్యాసంపత్తిని దెలుపు భాగము లనేకములున్నవి. పంచబ్రహ్మషడంగమంత్రములతోఁ బ్రాసాదపంచాక్షరి నీతఁడు బహువారములు స్మరించినాఁడు. పట్టెసక్షేత్రవాసియగు భీమయదేశికున కీతఁడు శిష్యుఁడుగదా! శ్రీనాథుఁడుపనిషద్వాక్యములు పెక్కులు కాశీఖండమందుదాహరించినాఁడు. శబ్దశాస్త్రజ్ఞుల సోలాదివాదముల నెఱిఁగినాఁడు. పాతంజలయోగదర్శనమం దీతనికిఁ బరినిష్ఠ హెచ్చు. శివపారమ్యమందాదరమెక్కువ. కాని విష్ణుద్వేషముగల వీరశైవుల ద్రోవవాఁ డీతఁడుగాఁడు. ఒక రీతఁడు లింగధారినియోగిబ్రాహ్మణుఁడని తలంచిరి.

నాకది యంగీకారార్హముగాఁ దోఁపదు. లింగధారులకు విష్ణుద్వేషము విహితము. ఈతని కదిలేదు. అద్వైతమందే యాస్థకానవచ్చును. బహుభేదములతోఁ బరస్పర ద్వేషములతో నుండు తాంత్రికమంత్ర ములం దీతనికిఁ దత్పరత యున్నట్టు తోఁపదు. "బహుధావిప్రతిపత్తి ధీవిషయమున్ పాడైనశాస్త్రార్థముల్-" "బ్రహ్మాండాది మహాపురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత బ్రహ్మజ్ఞాన కళానిధానమువు" అనుపలుకు లీభావములను బలపఱుచుచున్నవి. ఈతని నాదరించిన రాజులు, రాజ మంత్రులు, శైవమతాభివిష్టులగుటచేత వారి యభిమానము చొప్పున నీతఁడు వీరశైవగ్రంథమగు పండితారాధ్య చరిత్రమును రచించినాఁడు. దానిఁ బట్టియే యాతఁడు లింగధారియనరాదుగదా!

ఇతర కవులుచేసిన ప్రశంసలు.

నాగ్నజిత్పరిణయము – వల్లూరి నరసింహకవి:

మ. ధనరాజ్యంబులుమాని నెమ్మదిఁ బ్రమోదంబంది తన్నోరున
బ్టి వ్యపాలాగ్రణి కోర్కితీర్పుట కకుంఠీభూతచేతస్కుఁడై
చని సాధించిన సత్కవిప్రవరు రాజన్యాగ్రణీమాన్య నే
ర్పణుతింతున్ బహుశైవసంగదిత శుంభద్ధాము శ్రీనాథునిన్.

తారకబ్రహ్మరాజీయము – రాధామాధవకవి:

శా. సూనాస్త్రప్రమదామదస్ఫురిత వక్షోజాతకాఠిన్యమున్
మానంజాలు వధూవిలాసముల నింపుల్మీఱఁ గర్ణాటక
క్ష్మానాథేంద్రసభం గవిత్వవిజయోత్సాహంబునైకొన్న మా
శ్రీనాథుం గవిసార్వభౌముఁ గొలుతున్ సేవాంఘులల్ గీల్కొనన్

మొల్లరామాయణము - కుమ్మరమొల్ల:

సీ. గీ. స్తుతగుణోద్దాము నాచనసోము భీము
నవ్యమంజుల వాగ్దుర్య నన్నపార్య్య
రసికుడై నట్టి శ్రీనాథు రంగనాథు
దిక్కకవిరాజును నుతించి ధీమించి.

వసుచరిత్రము - బట్టుమూర్తి:

మ. మహిమఁ వాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుండు త
న్మహనీయస్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహులై సోముఁడు భాస్కరుండు వెలయింపన్ సొంపువాటిల్లు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్యమూహించెదన్.

శృంగార శాకుంతలము - పినవీరన:

సీ. నన్నపార్యుని ప్రబంధప్రౌఢశాసనసంపత్తి సొంపు పుట్టింపనేర్చు
దిక్కన యజ్వనాగ్నిక్కి కామోదంబు చెలువు కర్ణుల వాసింపనేర్చు
నాచిరాజునిసోము వాచామహత్త్వంబు సౌరభంబులు వెదచల్లనేర్చు
శ్రీనాథభట్టు భాషానిగుంభంబుల పరిమళంబులంగూడఁ బఱచనేర్చు

గీ. మహితగుణశాలి పిల్లలమఱిపీర నార్యుఁ డాయింటఁ బ్రేతామహాంబగుచును
వెలయుచున్నది నేఁడు కవిత్వలక్ష్మి, యఖిలవత్కవినికరంబు నాదరింప॥

సాంబోపాఖ్యానము - రామరాజు రంగప్పరాజు:

సీ. అభివందనవహస్రమర్పించి నన్నయభట్టుమార్గము కొంత పరిధవిల్లి
తిక్కనమఖిసూక్త వక్కిక యొకకొంత పెనుపొంద నెఱ్ఱనప్రెగడఫణితి
యొకకొంత తులకింప నొకకొంత నాచన సోమగీర్విభవంబు సొంపుమీఱ
త్రిపురాంతకుని వచస్స్తోమంబు నొకకొంత కొరలశ్రీనాథోక్తికొంతనిగుడ

గీ. మఱియుఁదక్కి నసుకవుల మధురవచనరచనలనుగొంతరాఁపఁ రసనిబంధ
బంధురముగాఁగ నేనిచ్చు భవ్యకావ్య, హిరమునకుఁగథాక్రమంబెట్టులనిన.

పట్టమెట్ట సోమనాథసోమయాజి – సూతసంహిత:

సీ. సర్వజ్ఞమౌళిభూషణమైన శబ్దశాసనను బహుముఖ రవజ్ఞతఁ దలంచి
యోగ్య శ్రుతిహితప్రయోగుఁడౌ సోమయాజులరీతి వృత్తిసంశుద్ధినెన్ని
నిర్దోష సుసమాధినియతోక్తియగు శంభుదాసు ప్రసాదపాత్రత నుతించి
నిస్తులౌఁకాంతినిధురైన సోమభాస్కరుల శబ్దగణప్రవక్తిఁబొగడి

గీ. రుచిరపదసిద్ధధారానిరూఢమహిమఁ, దగిన శ్రీనాథు నమ్యుత్తత్వము గసంచి
తత్కవిత్వకథాసుధాననంత । రావధానైకచిత్తుఁడనైకడంగి.

చారుచంద్రోదయము (చెన్నమరాజు).

సీ ప్రకృతికృదవ్యయ ప్రత్యయ సుప్రతిష్ఠాదను శబ్దశాసను భజించి
సరసమౌళిప్రియంకర పదాలంకారవృత్తి సాంద్రుని గుఁగలించ్రుగనెంచి
సర్వజ్ఞగణమనస్సు పీతికరకవిత్వవిలాసు నలశంభుదాసుఁ బొగడి
బహుముఖప్రఖ్యాత మహితశయ్య విశేషసనాథు శ్రీనాథు నమ్మతించి

గీ. అధికలక్షణసంపన్నులై తనర్చు । భైరవు ననంతు భీముఁడు ప్రణుతిచేసి
పృథివినెంతయు వాణీధురీణులయినఁయద్యతనసత్కవీంద్రుల నాత్మఁదలఁతు.

బహుభాష్యచరిత్ర – (సవరము చిననారాయణకవి):

ము. ఉపమానైపుణిఁ గాళిదాసు లలితార్థోత్పాదనా భారవుల్
సుపదస్థాపనరూఢి దండికవిరాజుల్ జాతివార్తారస
ర్థిపదోజ్జృంభణశబ్దజృంభణకళా శ్రీనాథులేకాక యే
కపదభ్రామ్యదసంప్రదాయకవులా ఘర్షింప మాబోంట్లకున్.

జానకీరాఘవము - [బేతపూడి కృష్ణయ]:

శా. వాగీశుండు తెనుంగుపద్యకవితా వారాశిఁగల్పింప వి
ద్యాగణ్యుండగు కుండలీంద్రుఁడు గుణాధ్యత్వమ్మునన్ మీఱ నా
నాగీర్వాణ వచస్తుతిన్ మెలఁగు శ్రీనాథుండు కావ్యామృత
శ్రీ గైకొంచు బుధాళి కిచ్చు మహితోత్సేకము వర్ణించెదన్.

పృథుచరిత్రము - పట్టమెట్ట సరస్వతిసోమయాజిః

ఉ. నన్నయభట్టుఁ దిక్కమఖినాథుని నెఱ్ఱయ ప్రెగ్గడన్ వచఃవన్నగసార్వభౌముఁని భక్తిఁ దలంచి మహాప్రబంధముల్
చిన్నటనాఁటనుండియును జేసిన సత్కవిసార్వభౌమునిన్
సన్నుతిచేసెదన్ సరససాహితికావ్యము లాకలించుచున్.

చంద్రరేఖావిలాపము - కూచిమంచి జగ్గకవి :

క. భీమకవి రామలింగని
శ్రీమన్మథుఁడై వెలుంగు శ్రీనాథకవిన్
రామకవి ముఖ్యులను బ్రో
ద్దామగతిం జిత్రపీఠిఁ దలఁచి కడంకన్.

బాలభాగవతము - కోనేరునాథుఁడుః

క. నన్నయభట్టార్యుని భీ
మన్నం దిక్కయ్య నెఱ్ఱయాహ్వయు శ్రీనా
థున్నుతియించెద మిగుఁ బ్ర
సన్నాత్ముల నంద్రకావ్యజలజాసనులన్.

ఇందుమతీపరిణయము-కుమారధూర్జటి :

సీ .....
.....
.....

తనదుశ్రీనాథత్వ మనుపమనృపసభాంతర చిత్రరచనబంధురతమెఱయ

శృంగారశ్రీనాథము

గీ. నఁటు నన్నప దిక్కానాఖ్యాంధ్రకవిని। నెల్లనామాత్యు నిషధరాజేంద్రసుచరి
తాంధ్ర కవననవీనవాగమృతలీల । నతిశయించిన నెఱజాణ నభినుతింతు.

ప్రబంధరాజవిజయవేంకటేశ్వరవిలాసము.

—గణపవఱపు వేంకటకవి:

సీ. ఆల విన్నకోట పెద్దన లక్షణజ్ఞత.

అరుణాచలపురాణము: — పెదపాటి సోమయ:

సీ. ప్రతిభావిలంఘిత భారతబహుకథాపట్టు నన్నయభట్టుఁ గడుభజించి
ఉభయభాషాప్రౌఢిమోద్యన్మహారాజ్యభాజిఁ దిక్కనసోమయాజిఁబొగడి
వాక్ప్రతోషితదక్షవాటీమహాస్థానభీము వేములవాడభీముఁగొలిచి
భావబంధనిబంధ పరమేశబిరుదప్రభర్మ నెఱ్ఱయశర్మ సన్నుతించి

గీ. భారతీహారు భవదూరుఁ బణుతిచేసి । సుకవికులసోము నాచనసోము నెన్ని
నవ్యకవితాసనాథుశ్రీనాథుదలఁచి । సరససకలాంధ్రకవుల కంజలియొనర్చి.

రాజరాజాభిషేకము — ఆంగర రామకృష్ణకవి

క. పాథోధిపయోధర ని
ర్మాధచలద్ధ్వమఘుమాయమానలహరికా
పాధేయదాయిసూక్తి స
నాథుఁ శ్రీనాథు నెమ్మనంబునఁ గొలుతుఁ.

మఱియు "నచ్యుతైకనమాఖ్య నంచితపదధారఁ బ్రకటించు శ్రీనాథ సుకవివరుని" నని కోడూరువేంకటాచలకవి శివరహస్యఖండమున శ్రీనాథునిఁ బ్రస్తుతించినాఁడు. సిరిపెగడ ధర్మనాదులు కూడ పెక్కురుకవులు శ్రీనాథునిఁ బ్రస్తుతించిరి. మొత్తమునకు శ్రీనాథునిఁ

గూర్చి ప్రాచీనకవులుచేసిన ప్రస్తుత లాతనిశబ్దరచనాచాతుర్యమును ప్రకటించుచున్నవిగా నున్నవి.

సమకాలము కవులు.

బమ్మెరపోతన, నిశ్శంకుని కొమ్మన, దగ్గుబల్లి దుగ్గన, నాగనాథుడు, గౌరన, పినవీరభద్రుడు, చెన్నమరాజు, భైరవుడు, జక్కన, మడికిసింగన, అనంతామాత్యుడు, గోపురాజు, తాళ్ళపాక అన్నమయ్య, అయ్యలార్యుడు, నందిమల్లయ ఘంటసింగయలు మొదలగువారు తెలుగు గవీశ్వరులును, మల్లినాథుడు, విశ్వేశ్వరకవి చంద్రుడు, బొమ్మకంటి అప్పయాచార్యుడు, వామనభట్టబాణుడు, కాటయవేముడు, డిండిములు మొదలగువారు సంస్కృత కవులును శ్రీనాథుని కాలమువారు. ఇందు మొదటి యయిదుగురు శ్రీనాథుని సమకాలమువారగుట యిదివఱకే నిరూపింపబడెను. గౌరన, హరిశ్చంద్రచరిత్ర [ద్విపద], నవనాథచరిత్ర [ద్విపద], లక్షణదీపిక [సంస్కృతము] యను గ్రంథముల రచించినాడు. నవనాథచరిత్రము శాంతభిక్షవృత్తిప్రేరణముచే నాతడు రచించెను. ఈశాంతభిక్షవృత్తి ప్రేరణముననే శ్రీనాథుడుగూడ ముమ్మడిశాంతయ కంకితముగా శివరాత్రిమాహాత్మ్యమును రచించినాడు. అనుబంధమున నవనాథచరిత్ర కృత్యవతరణికాభాగమును జూడదగును. పినవీరభద్రుడు శ్రీనాథుని శిష్యుడని ప్రతీతిగలదని యిదివఱకే వ్రాసితిని

చెన్నమరాజకవి :- ఈతడు శ్రీనాథుని శిష్యుడే. వేంకటపతిరాయల కాలమందున్న చెన్నమరాజకవి (చారుచంద్రోదయకారుని) కీతడు తాత. వీరేశలింగముపంతులుగారు ముత్తాతయని తప్పుగా వ్రాసిరి. దానినెల్ల నిక్కడ నిరూపింపనేల ? చారుచంద్రోదయము

జూచినఁ దెలియఁగలదు. అమ్మల చింతల చెన్నమరాజునకు లక్ష్మీపతి, కొండయ, కృష్ణయ యని మూఁగురు కొడుకులు. లక్ష్మీపతికి వెంకట, చెన్నమరాజ, రామచంద్ర, తాయనాఖ్యులు నల్గురు కొడుకులు. ఇందు రెండవవాఁడగు చెన్నమరాజే శ్రీనాథుని శిష్యుఁడు. పద్యమిది చదువఁ దగును.

క. సన్నుత కవిత్వవిద్యా
భున్నతి శ్రీనాథసుకవిపుంగవు కరుణఁ
జెన్నమరుఁ లక్ష్మీపతి
చెన్నమరాజ ప్రధానశేఖరుఁ డెంతిఁ.

—చారుచంద్రోదయము

ఈచెన్నమరాజునకు శేషాద్రికొడుకు. శేషాద్రికి తిమ్మన, లక్ష్మీపతి, చెన్నయ, తాయన యనువారు కొడుకులు. మూఁడవవాఁడగు చెన్నయయే చారుచంద్రోదయకారుఁడు.

భైరవుఁడు:— ఈతఁడు శ్రీరంగమాహాత్మ్యరత్నశాస్త్ర కవి గజాంకుశము లనుగ్రంథముల రచించినవాఁడు. ద్విపదహరిశ్చంద్ర చరిత్రకర్తయగు గౌరనకుఁ గుమారుఁడే కావచ్చును.

జక్కన:— ఈతఁడు శ్రీనాథుని సమకాలమువాఁడో, లేక కొంచెము పూర్వకాలమువాఁడో యగును. జక్కనవిక్రమార్కచరిత్రలో శ్రీనాథుని రచనములఁబోలిన రచనములున్నవి.

మడికి సింగన:— తఁడు సరిగా శ్రీనాథుని సమకాలము వాఁడే.

అనంతామాత్యుడు :- ఈతడును సరిగా శ్రీనాథుని సమకాలమువాడే. అంతేకాక, శ్రీనాథుని జన్మదేశమునకు మిక్కిలి దగ్గరగానున్న పెరమకూరుపురము నందున్నవాడుకూడను.

గోపురాజు:-ఈతడు పినవీరన కింకుక తర్వాతివాడు. ద్వాత్రింశత్సాలభంజికల కథల రచించినవాడు.

తాళ్లపాక అన్నమయ్య:- తిరుపతి తామ్రశాసనములచే నీతడు శ్రీనాథుని సమకాలమువాడుగా దెలియబడుచున్నాడు.

అయ్యలార్యుడు.- ఈతడు వేదగిరినాయనింగారి ప్రేరణమున రామాయణారణ్యకాండశేషమును బూరించినాడు. వేదగిరినాయనింగారు శ్రీనాథున కింకుక పూర్వులు. నందిమల్లయ్య ఘంటసింగయలు శ్రీనాథున కింకుక తర్వాతివారు. వీరుగాక బైచరాజు వేంకటనాథకవి, దూబగుంట నారాయణకవి, తాతంభట్టు, హరిభట్టు, మొదలగువారు [అంధ్రీభాగవతమందలి లుప్తభాగములను బూరించినవారు] అయ్యంకి మాడయప్రభృతులుగూడ శ్రీనాథున కింకుక తర్వాతి కాలమందున్నవారే యగుదురు. మల్లినాథాదులగు సంస్కృతకవులు శ్రీనాథుని సమకాలమువారగుట యిదివరకే నిరూపింపబడెను.

పరిసమాప్తి.

శ్రీనాథకవిసార్వభౌముడాంధ్రలోకమునఁ జిరప్రతిష్ఠ గడించినవాడు. శృంగారనైషధాది గ్రంథము లెందాక లోకమున వ్యాపించియుండునో యందాక నాకవీశ్వరుడవినశ్వరమగు ప్రతిష నందియే యుండును. ఆయనగ్రంథములే యాయన స్మారకచిహ్నములు. కాని చారిత్రకముగా నాకవీశ్వరుడు జన్మించినపట్టును.

గవితాప్రభవముఁ గన్పఱచిన పట్టును మనకిప్పుడు తెలియవచ్చినవి. కావున శాశ్వతనిర్మాణ మొకటి యాస్థలములం దెందేనొకచోట వెలయించి యప్పుడప్పు డాయనవాఙ్మయమూర్తి నారాధించుచుండుట మనకావశ్యకకార్యమని నేను దలంచుచున్నాఁడను. జన్మదేశము కృష్ణామండలమును, బ్రీఢానముగా విద్యావిలాసములను వెలయించినదేశము గుంటూరుమండలమును నగుటచే మచిలీపట్టణమునఁగాని, గుంటూరునఁగాని యట్టిప్రతిష్ఠాపనమును నెలకొల్పుట యుక్తముగానుండును. శ్రీనాథుని జన్మగ్రామము కాకినాడపట్టణమయినను గలపటమయినను మచిలీపట్టణమునకు మిక్కిలి చేరువనే యున్నవి. విద్యావిలాసములుచూపిన కొండవీడుగూడా గుంటూరికిఁ జేరికగలిగియున్నది. అచ్చటి యంధ్రభాషాభిమానుల యాలోచనముఁ కిది వచ్చుఁగాకయని కోరుచున్నాఁడను.

ఇప్పటికి నా కుపలబ్ధములయిన చరిత్రసాధనములఁబట్టి శక్యమయినంతవఱకు శ్రీనాథకవిసార్వభౌముని జీవితవిషయమును విస్తరించి ప్రస్తుతింపఁగల్గితి ననుకొనుచున్నాఁడను. కాని యింకను నాకిప్పటికి గోచరింపని ప్రధానవిషయము లెన్నియున్నవో! ఉపలబ్ధవిషయములనుగూడ నపరిజ్ఞానముచే నెన్నింటి నన్యథాకరించితినో! కొంకనేల? కోవిదులున్నారుగదా సరిపఱుపఁగలరని సంతోషించుచున్నాఁడను.

సమాప్తము.

శృంగారశ్రీనాథము

అనుబంధము

శ్రీరామాభిషేకపద్యములు

ఉ. ఆమునినాథువంశకలశాంబుధిపూర్ణసుధాకరుల్ గుణ
స్తోములు సత్యసంధు లతిశోభితచిత్తు లుదారులున్ మహో
ద్దాములు పుట్టి రందు నొకధన్యునివంశములోన నొక్కఁడున్
ప్రేమతొ కొండపీట నరిభీషణుఁడై తనరారుచుండియున్.

శా. పాథోరాశిగభీరుఁ డుజ్జ్వలకళాపారీణుఁడై నట్టి శ్రీ
నాథుండన్న కవీశ్వరోత్తముసతన్ నందనుంగాఁ బెండ్లియై
సాధుస్తోత్రగులైన సూనులను ధాస్వత్తేజులంగాంచె భూ
నాథుల్ మెచ్చఁ బపంచశాలులను సన్మార్గక్రియాలోలులన్

క. వారలమాతామహుఁ డతికూరిమితో నింటనుంచుకొని పెంచుటచే
నారూఢిగ శ్రీనాథునివారై వర్ధిల్లిరొగిని వసుధాస్థలిలోన్.

క. వారలవంశపరంపర లారూఢిగ విస్తరించె నతివిభవమునన్
వారిలొ మాధవమంత్రియు ధారుణిలోఁబొగడుగనియె ధన్యతమెఱయన్
ఈ మాధవమంత్రి కైదవతరమువాఁడు శ్రీరామాభిషేకకర్త.

వెలుగోటివారి వంశచరిత్ర.

ఉ. దన్నడకోటముందర నుదగ్రబలోన్నతి గంగదాఁటి సం
పన్నబలుండు సింగజనపాలునిమాదఁడు రెడ్డిపోతనిన్

బన్నినసేనలం దునిమి పాఱఁగఁ ద్రోలె విరాటుపీట న
త్యున్నతవిక్రమంబున సుయోధనుఁ ద్రోలు కిరీటి కైవడిన్.

మ. ఘనశౌర్యుండగు మాధవాధిపునిఢాకన్ఢీతిఁ బ్రభ్రష్టసా
ధనుఁడై దన్నడకోట వద్ద నసపోతారెడ్డి మానంబు సి
గ్గును బోనాడి రయంబునం బరవ నాక్షోణీస్థలిన్ జూడ నే
డును నచ్చో నడియాలమై కసపుపాటున్ లేదు త్రోవౌటచేఁ....

దన్నాల కోటకడ రెండుమార్లు రెడ్డివారిని గెలిచి జగనొబ్బగండ, సంగ్రామధనంజయ, రాజవేశ్యాభుజంగ బిరుదు దెచ్చినవారు రావు అసపోతానేడున్ను మాదానేడున్ను రాజుకొండ, వేపరకొండ రెండుపురంబులు పంచుకొని రాజుకొండ అసపోతానేడు, వేపరకొండ మాదానేడు వుంచుకొనిరి. ఆమాదానేని కొమారుడు పెదవేదగిరినేడే వేములకొండకడ సత్యగదేవుని చాకిక్యదేవుని కన్నడదేవుని కాకాళదేవుని ఉదయనదేవులఁగొట్టి వేములకొండ రణరంగస్థలవైరి రాజజీమూతపవన ఏకశిలానగరసమీపవాత్రవరాజన్యదహనదావానల బెండపూడివిభాళబిరుదువహించినవాడు రావుపెదవేదగిరినేడు. ఆపెదవేదగిరినేనికి రామచంద్రుడున్ను కుమార మాదానేడు పుట్టిరి.... ....ఆమాదానేనికి పినవేదగిరినేఁడు లింగమనేడు పుట్టి రందగ్రజుండు....

ఉ. వేమనతోడఁబుట్టువట వింతలనేఁ డదిగాకమానెఁబో
కోమటివానిబిడ్డఁడటగోళకుఁడఁట గృషిసేయువాఁడఁటన్
భూమిఁ గుమారవేదగిరిపుణ్యపరుండవు నీసమక్షమం
దేపుని చెప్పవచ్చు గుణహీనునిఁ గోమటిరెడ్డిమాచనిన్–

ఆ కొమార వేదగిరినేడే అనవేమారెడ్డితమ్ముని మాచారెడ్డిని గొట్టి తమ్మపడిగానంబొదిగించిన యా అనవేమారెడ్డి పినవేదగిరిన్నేని జంపి తమ్మపడిగాన బొదిగించి సింహతలాటబిరుదున్ను

బుచ్చుకొని యుండిన వేదగిరినేనితమ్ముఁడు లింగమనేడ్డే ద్వాదశ వర్షంబులనాడై యుండితనబంధువర్గంబుల హితపరిజనంబులఁగూర్చుక అమరులకు వెక్కసంబగు యుద్ధంబుచేసి అనవేమారెడ్డిని గొట్టి తమ్మ పడిగానబొదిగించి సింహతలాటబిరుదును తనచేత శ్రీనాథుండడిగి కొంచుబోయిన నందికంతపోతరాజనే కథారిని బుచ్చుకొనెను. అంతకు ముందే అనవేమారెడ్డికి పెద్దలు పెదవేదగిరినేన్నితమ్మపడిగాన బెట్ట వద్దని బుద్ధిక్రమంబుగా జెప్పిన విధంబెట్టనిన - (పెదకోమటివేమా రెడ్డియని యుండవలసియుండగా నిందుఁ దప్పగా ననవేమారెడ్డియని కలదు.)

సీ దన్నాలకోటోద్ద నన్నపోతారెడ్డి తా విరుగుతలంపు తలఁపవైతి
సింగయమాధవుఁజీరిన యనవేముఁ డోడి పాఱుకొఱంత చూడవైతి
కొమరగిజ్జెడ్డికి కోరిసింగయమాదు తనరబెట్టినబొమ్మ తలఁపవైతి
సురధాను మన్నన చూపుకొంటివిగాని వారితో దొరయుట వలవదనవు

గీ. అనుపమఁబుగఁ గొమరవేదాద్రి నిట్లు ఘనతరఁబుగఁదమ్మపద్గమునఁబెట్టి
యెరుల బుద్ధులివిని యిటు దొరలఁబడియుఁవిన్నబడితిని పెదకోమటన్న
వేమ.

ఈలింగమనేనిచేత శ్రీనాథుఁడు నందికంతపోతరాజనేకథారిని కొంచుపోయినపద్ధతి:- జగనొబ్బగండాంక - ఇదియుదాహృతమే. ఆలింగమనేడే సోమకులము రాజులు మొదలయిన రాచవారినెల్లఁగొట్టి కాలిపెండాన పొదిగించెను. అనవేమారెడ్డి మొదలయినవారినెల్లఁ గొట్టి తమ్మపడిగాన బొదిగిన పంటరెడ్లున్ను తమలోతమరు భాషింపుచున్న విధంబెట్టిదనిన:-

శృంగారశ్రీనాథము

శా. శ్రీలాలిత్యుఁడు రావులింగనృపతి శ్రీపాదపద్మంబునన్
వ్రేలేరాజులు కొందరళ్యసుతున్ వీరాంకుఁజూపింప్రతు వీ
డేలాకంపమునొందె భీతి, నదిగా దీకాపుజాణండు దాఁ
గాలాంజంచల తమ్మ మెక్కి-వణకున్ గర్వ్వారవన్నెక్కి-నన్.

ఉ. అంచితరాయరావు బిరుదాంకము రాజుల గొట్టి యందె గీ
లించిన మాదభూపతిని లింగనృపాలున కొప్పుగాక గ
ర్వించిన నీకుఁజొప్పడునె వేమడు నల్లయవేమరెడ్డి పో
కొంచెపు దమ్మదిండితిను గూళకు సింహతలాటమేటికిన్?

ఉ. ఆజిముఖాతిభీతులగు నల్లయవేమనవీరభద్రుఁడున్
రాజకులాభిరామ రణరాఘవలింగనృపాల నీమహా
రాజితపాత్రతమ్మదిని రాజ్యమునిల్పిరి యింకయేమనన్
రాజమహేంద్రదుర్గములు రాజులు గైకొనకుండ జూతురే?

ఉ. వాడులు వాదవిద్యల సువర్ణము గాంచుట యద్భుతంబె యీ
మాదయలింగశౌరి గరిమంబుగ నల్లయ వీరభద్రుడున్
వాదముచేసి దేహము సువర్ణమయంబుగ వానియందియఁ
భేదముదక్కి-యుండ్రు దలక్రిందయి వ్రేలుము విష్ణుపీఠమున్.

ఆపినసింగమనేని వంశ తారం బెట్టిదనిన : సీ. వీరాగ్రగణ్యుండు వెన్నభూపాలుండు ఖ్యతి నేరాజుము త్తాత - ఈ పద్యమిదివఱకుదాహృతమే—

ఉ. మేదిని రాయరావనెడు మేటిమహాబిరుదప్రతాప సం
పాదన మన్నవోతజనపాలుఁడు జేసినఁజెల్లుగాక యీ
పాదరిమన్నెబందలక పాత్రపురాజుల కేలగల్గునే
ఆదటఁదాండవంబు శివుఁడాడిన జోగులకాదఁ జెల్లునే!

అనుబంధము

సీ. భప్పన్న రాజన్య సంగరస్థలిలోన వాఁడెరాజని కానవచ్చు నిన్ను
విభుదునూపురరాజ భీకరస్థలిలోన వాఁడెరాజని కానవచ్చు నిన్ను
పరభేదనాటోపపట్టభద్రులలోన వాఁడెరాజని కానవచ్చు నిన్ను
సర్వ పర్వంసహాచక్రవర్తులలోనె వాఁడెరాజని కానవచ్చు నిన్ను

గీ. చండభుజదండఖండితసకలవైరి । మండలేశ్వరనుతకీర్తివుండరీక
పరిమళాపూర్ణదిగ్దంతిబలవిహార । అహితనిర్వాత రాయరాయన్నవోత!

క. ఒక మెతుకున నొకనాఁకలి । ప్రకటితముగ దీర్చరాదు పదివేపుర నీ
వొకమెతుకున రక్షింతువు । ఆకలంకా రాయావు అవవోతాంకా ।

క. సమ్మెటసోమని లేపలి । తిమ్మని నల కొండవీటి దిక్కునమెరయం
దమ్మటమువేసిగెలిచితి । నమ్మక్కా రాయావు తనవోతాంకా!

ఆయనవోతమనేనికి సర్వజ్ఞసింగమనేడున్నూ వసంతరాయడు పుట్టిరం దగ్గిఱుండు:

సీ. సకలవిద్యాభ్యాస సాహసగరిమంబు సూటిమీఱగ దోడు చూపినాఁడు.... ఇత్యాదిపద్య ముదాహృతమే. సీ. రాధేయుదానంబు ప్రాభవం బంటిమా (పూటలో దాటలోవు?) రాదు । సురభూజముల వార్త సొబగుపొమ్మంటిమా యెండునో పండునో యెఱుఁగరాదు । జలజంబు చాగంబు చర్చింతమంటిమా మెఱచునో వఱచునో మెచ్చ రాదు । కామధేనువు నీవి గణుతింతమంటిమా కట్టునో పట్టునో కాన రాదు । తోలుచూపక యుడివోక తూలివోక । కొమ్మ్రగ్రువ్వక కయి కొండు కోర్కులనుచు । ప్రధనవిజయుండు ఖడ్గ నారాయణుండు । ఇచ్చుకవులకు శింగభూమీశ్వరుండు. శ్రీనాథుఁడు సర్వజ్ఞుని సముఖ నకుపోతూ శారదాంబను ప్రార్థనచేసిన పద్యం : సీ. దీనారటంకాల–

ఇత్యాదిపద్య ముదాహృతమే. సీ. ఏమిచ్చె రావోరి యెమ్మెలిచ్చె దధీచి యెమ్మె లర్థులకు దా సొమ్ములగునె । మహిమచే నెదవోరి మాంస మిచ్చెను శిబి కండలర్థులకు బంగారమగునె జీమూతవాహనుం డేమిచ్చెరా వోరి యడిగిన ప్రాణముల్ విడిచెనపుడు । కర్ణునితేగంబు వర్ణించెదవు భట్ట చర్మమర్థికి పట్టుసాలువగునె । గీ. పూని కలిఁజెప్పఁ జూపఁగా రాని యీవు । లెన్నఁడో నాఁటి వార్త లిఁకేమిచెప్ప । ప్రధనవిజ యుండు ఖడ్గనారాయణుండు । ఇచ్చుకవులకు సింగభూమీశ్వరుండు. సర్వజ్ఞసింగమనేడు శ్రీనాథునకు సమస్యయిచ్చిన పద్యము:– 'తక్కక రావుసింగ' ఇత్యాదిపద్య ముదాహృతమే. ఉ. ఇమ్మహి రావుసింగ మనుజేంద్రు వసంతుని యీవులెన్నుచో । గమ్మి దధీచిభానుసుత కల్పకమేఘులఁ జెప్పనేలయా । బొమ్మిక వెట్టులాటలును బూని కలా నపు మొత్తలాటలున్ । దుమ్ముల చల్లులాటలును తూకొని నీళ్లుల చల్లులాటలున్. అతని యనుజుండు: క. భట్టనగ రుద్రరూపము। భట్ట నగా రావవేల్పు పాటించని యా।తొట్టరిరాజులకబ్బునె। రట్టడిసతీ్కర్తి కాంతరావువసంతా ! చ. నడవడిచక్కగాద యొకనాడును పుక్కిటిచేదు మానదేఁ ర్పడ వినఁ జెప్పలేదు, పెనుబండువునందును గాలిద్రావునీ। బడుగనినేలపొంద నని పాసివెసన్ జనుదెంచికాదె యా । పుడమి వరించె వేడ్కసృపపుంగవు రావువసంతరాయనిన్.

శ్రీనాథునిగ్రంథముల కాలనిర్ణయము

అను వ్యాసముకుండి. —(ఇది గ్రంథాలయసర్వస్వమున గలదు. శ్రీ కొ. వెం. లక్ష్మణరావుగారిచే రచింపబడినది.)

"పైని చెప్పినదంతయు హరవిలాసముయొక్క నిర్మాణకాల మునుబట్టి చేయఁబడిన యూహ. కాని హరవిలాసము కుమారగిరిరెడ్డి కాలమునందు రచింపఁబడలేదనియు, శ్రీనాథుని చరమదశయందు వ్రాయఁబడియెననియుఁ జెప్ప పూర్వపక్షమొకటికలదు. ఇదివఱకు

శ్రీనాథుని గుఱించి వ్రాసిన వారందరును ఇట్లే వ్రాసినారు. కాని ఇందుకు వారు కారణములను ఇచ్చియుండలేదు. మన మాకారణములను ఊహించి నివారింపవచ్చును. హరవిలాసము చివర గ్రంథముగ నెంచుటకును 1400 లో రచింపఁబడినది కాదనుటకును హరవిలాస గ్రంథమునందు నేవిధమైన యాధారమును కానఁబడదు. అది కుమార గిరియొక్క పెద్దనెట్టికి నంకితము చేయఁబడినది. కావున నది కుమార గిరికాలమునందే రచింపఁబడె ననుకొనుట స్వాభావికము. కుమారగిరి చనిపోయినతరువాత 30 సం॥లకో 40 సం॥లకో వ్రాయబడిన దనుకొనుట యస్వాభావికము. ఇదియుఁగాక యీ గ్రంథమునందు, కృతిపతిని అతని బంధువులను గుఱించి వ్రాసిన యీ క్రింది గద్యపద్యముల వలన కుమారగిరిసేవలో వీరుండగ నీగ్రంథమును వ్రాసినట్లు మన మూహింపవలయును. కాని, కుమారగిరి చచ్చిపోయినతరువాత నలు బదియేండ్లకు వెనుకటి సంగతులు జ్ఞాపకము తెచ్చుకొని వ్రాసెననుట పొసఁగ నేరదు ....'కొమరగిరి నృపాలువలన నాందోళికాచ్ఛత్ర చామరతురంగాది రాజ్యచిహ్నములు వడసి యమ్మహారాజునకుం బ్రతి సంవత్సరోత్సవంబునకుఁదగిన ..... సుగంధద్రవ్యంబు లొడఁ గూర్చియుఁ జీనిసింకోళతవాయిహురుమంజిజలనోగి ప్రభృతి నానాద్వీపనగరాకరంబులగు ధన....గాణిక్యంబులు తెప్పించియు.... సదాచారుండును నన విఖ్యాతిగాంచిన యవచిదేవయ తిప్పప్రభుం దొక్కనాఁడాస్థానమండపమున సుఖోపవిష్టుండై:'

మ. ఋసిమారన్ సురధాణి నిండు కొలువై కూర్చున్నచో నీకరా । భ్యసనంబు న్నుతియించురా యవచితిప్పా.... చ. కుమార గిర్యధీ। శ్వరుని వసంత వైభవముసర్వము నొక్కఁడ నిర్వహించు చున్. క.కొమరగిరిరాజ దేవేంద్రకూర్మహితుడు. కొమరగిరి వసంత

నృపా గమకవివరగంధసార కస్తూరీ కుం కుమకర్పూరహిమాంభ స్సముదంచిత బహుసుగంధి శాలాధ్యక్షా! ఇట్లుహరవిలాసము వ్రాయు నప్పుడు, కుమారగిరి బతికియుండెననియు, కొండపీటిలో రాజ్యము చేయుచుండెననియు ఆతని యొద్ద పెద్దసెట్టిగా అవచితిప్పయ యుండె ననియు జూపువాక్యము లీగ్రంథమునందుఁ బెక్కులుగలవు. ఇట్టి వాక్యములున్నను, కుమారగిరి చనిపోయినతరువాత తిప్పనఅధికార ముడిపోయినపిదప, హరిహరరాయలు కీర్తిశేషులైన యెన్నియో వత్సరములకుఁదరువాత నీకావ్యము రచింపఁబడియెనని చెప్పుటకంటె విపరీతమైన సిద్ధాంతము మఱియొకటి యుండదు. ఇది కుమారగిరిరెడ్డికాలమున రచింపఁబడలేదని చెప్పుటెదల నైషధము పెదకోమటి వేమారెడ్డి కాలమున వ్రాయలేదనియు, భీమఖండము అల్లాడవేమవీరభద్రులు బ్రతికియుండగఁ జెప్పఁబడలేదనియు. నొప్పు కొన వలసివచ్చి విపరీతసిద్ధాంతపర్యంగము ప్రాప్తించును....''

శాసనములు.

లోకల్ II వాల్యూం....పెద్దాపురంతాలూకా .. కిమ్మూరులో తిరుపతి అనే గ్రామములోనున్న శృంగారవల్లభరాయని ఆలయములో ...శి నెం. దీనికి ఉత్తరంపువైపునను న్న స్తంభంమీది శాసనము:

శ్రీశకవరుషంబులు గతంబగు నేటి సర్వధారి సంవత్సర మార్గ శిర శు ౧ సోమవారము కొమరగిరిపురం శృంగారరాయనికి ముక్కంటి రాజుగారు కాటమరెడ్డి వేమారెడ్డింగారిదేవులు అయి తమతోబుట్టువులయిన మల్లసానమ్మ గారికిన్ని తమతండ్రి ఎన్నిభరాజుగారికిన్ని సుకృతము గాను నగరికి కాలోచిత మూల్యము సమర్పించి పెట్టించిన బృందా వనము నేసినవారికి క్షేత్రము ఖ ౨. ఈ కైంకర్యము శృంగార రాయఁడు ఆ చంద్రార్కముగాను అవధరించువారు.

అనుబంధము

లోకల్ 11 వాల్యూం 217 పేజి (చాళుక్యభీమవరంలో) దీనికి ఉత్తరంవైపున రెండోస్తభంమీదవున్న శాసనం:

స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౩౫౬ అగునేటి ఆనంద సం॥ పుష్య బ ౧౩ బుధవారము ఉత్తరాయణ మకరసంక్రాంతి పుణ్యకాలమందు శ్రీమత్కుమారారామచాళుక్యభీమేశ్వరశ్రీమన్మహాదేవరలకు అల్లాడ భూపాలుని కుమారుడు వేమారెడ్డిగారిదేవులు జయమ్మసానమ్మ తమకు నక్షయమౌనట్టుగాను వీరారెడ్డింగారిఆనతిక్రమాననుకుమారారామచాళుక్య భీమేశ్వర స్థానసమ్మతిని భీమవరము పుత్తర సమీపాననుకుమారీనది పశ్చిమదరిని నానాతోయాలపుష్పాల ఫలవృక్షాలతోటపట్టు... సర్వ కరపరిహారముగాను ఆచంద్రార్కస్థాయిగాను భీమేశ్వరదేవరకు జయ మ్మసానమ్మ సమర్పించెను.

లోకల్ 11 వాల్యూం (125పేజి) దాక్షారామంలో తూర్పు స్తంభంపైనున్న శాసన:

నప్తాకాటయశారేః – ఇటువంటి కాటమరెడ్డి వేమారెడ్డింగారికి నిజభృత్యుడైన కడియంమాచినేనింగారు తనకు స్వామియయిన కాటమరెడ్డి వేమారెడ్డిగారికొమారుడు కొమరగిరిరెడ్డిగారికిన్ని వారి దేవులకున్ను అక్షయసుకృతమౌనట్టుగాను దాక్షారామ శ్రీభీమేశ్వర మహాదేవరకు అస్థానశిలామండపము కట్టించి సమర్పణచేసెను. స్వస్తిశ్రీ శకవరుషంబులు ౧౩౩౬ అగు నేటి జయసంవత్సరకార్తిక శు ౧౫ భానువారం.

లోకల్ 11 వాల్యూం 161 పేజి.

అనపోతప్రభోః పత్నీసపత్నీధరణీశ్రియోః । అనేకసుగుణైశ్చార్వ్యో ర్వీరంబికా మనుమాంబికా – కుమారగిరిభూపాలరత్నాకరసుధాకరః।

శృంగారశ్రీనాథము

అనపోత కుమారేంద్రో లోకానందాయ వర్ధతేఁ శ్రీమత్కుమారగిరి భూమిపతేఁ కుమారోపీరాన్నపోతనృపతిఁ-ఈమీదరాయి పగిలిపోయినది.

11 [స్వ]స్తిశ్రీజ[యాభ్యుదయశాలి [వా][2][హన] శకవరు షంబులు ం (4652) అగు నేంటి శోభకృత్సంవత్సర ఆ [శ్వీ]జ బ ం౧ బు నూంతు[5]ల[పాటి] కేశవనాథనికిన్నీ రఘు[6]నాథనికిన్నీ శ్రీమఁమహామండ[7][లేశ్వ]ర ధరణీవరాహ మేది[8]నీ మీసరగండ కఠారి సాళ్వస [9]ంబురాయని తెలుంగురాయని తిరుమలయ్యదేవ [11][మహా]రాజులుంగారు దండం [12] సమర్పించియిచ్చిన భూదాన ధర్మశాసనము. తిమ్మరుసయ్యవారు మానాయంకరానకు పాలించి యీ నవధరించిన వినికొండసీమలోని నూఁతులపాడు అనిగ్రామానను, ఈ రెండు దేవళ్ళకమృతపళ్ళకున్ను అంగరంగ వైభవాలకును సమ ర్పించి ....ఇత్యాది – ఈపుణ్యము రాజుంగారికి విన్నపముచేసి యీ దేర్చినవాండు పొన్నపురాజుంగారు.

111 స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ంళఒఁఅగునేంటి శోభకృత్ సంవత్సర ఆశ్వీజ బ ం౧ బు నూంతుల పాటి ఛాయామల్లిఖార్జునికిన్నీ, వీరేశ్వరునికిన్నీ శ్రీమహామండలేశ్వర ధరణీవరాహమేదినీ మీసరగండకఠారి సాళువసంబురాయని తెలుంగు రాయని తిరుమలయదేవ మహారాజులుంగారు దండం సమర్పించి యిచ్చిన భూదానధర్మశాసనము. తిమ్మరుసయ్యవారు మానాయంక రానకు పాలించి యానవధరించిన వినికొండసీమలోని నూంతులపాడు అనిగ్రామానను యీరెండుదేవళ్ల అమృతపళ్లకున్ను అంగరంగ వైభ వాలకున్ను సమర్పించి యిచ్చినభూమి.... ఈపుణ్యం రాజుంగారికి విన్నపముచేసి యీదేర్చినవాండు పొన్నమరాజుంగారు.

IV స్వస్తిశ్రీ శకవర్షంబులు గఉఓళ అగునేంటి దుందుభి సంవత్సర వైశాఖ శు గఽ గు శ్రీమన్మహామండలేశ్వర మీసరగండ కప్పెరు సాళువ తెలుంగురాయ దేవరాయనింగారి నూఁతులపాటి అధికారి పోలమరాజు తిరుపరాజుంగారు నూఁతులపాటను పూనూరిసందుకట్టునను రాజుంగారి ధర్మంగా ప్రజలధర్మంగా ఆచంద్రార్కస్థాయిగాను చెఱువుకట్టించి ప్రతిష్ఠచేసిరి. మంగళమహాశ్రీంజేయు.

సింహాచలంమీద దేవాలయందగ్గఱ హంసమూల పెద్దశాసనం దిగువది:

స్వస్తిశ్రీ శకవరుషంబులు గఽఽం అగు నేటి ప్లవ సం।।రఫాల్గున కృష్ణ ఽగురువారాను కనడదేశమందుల సంబురాయనికొడ్కు తెలుంగు రాయండు తనకు అభీష్టార్థసిద్ధిగాను శ్రీ నరసింగనాథునికి నిత్యమును సన్నిధిని వెలుంగను అఖండదీపాలు రెండుసమర్పించెను. ఇందుకై వడ్డాదిదేసమందు ప్రాంత వీటు గొల్లగార నరసబోయండు పల్లయబ్బబోయండును ఈ ఽ రు వసాసను మోదాలు గంం పెట్టిరి– ఇత్యాది.

బజ్జేపల్లిలో చావలి వెంకటేశ్వర్లుగారియొద్దనున్న తామ్రశాస నము నకలు (వారిదగ్గర దీని మూలము చూచి నేను వ్రాసికొన్నాను.):

1. కళ్యాణం జగతాం, 2. లీలాద్యూతజితాం, 3. తమో హరేతాం, 4. భవతు భవతాం ఫలాప్తయే, 5. యన్మౌళౌ, 6. విష్ణోః పాదాదుదీర్ణే సురసరిత ఇవస్రోతసి స్వచ్ఛవృత్తౌ వర్ణే జాతస్సుజన్మా శరణభవవచ్ఛక్తిమాన్ ప్రోలభూపః। తస్మాన్మాచఱితీంద్రో జనివహ

తిథువం యద్భుజేయచ్చరిత్ర శ్లాఘామాత్రే ముఖానాం వహతి దశ శతీం వ్యాపృతాం భోగిరాజః॥ 7 తస్యాసీ దనుజో హరేరివ హరి ర్నిస్సీమవిశ్వంభరా। దానాధఃకృతభర్గ (సూను) విజయీ వేమక్షమా వల్లభః । యేన శ్రీగిరిసానుసీమ్ని విహితా పాతాళగంగాజుషాం సోపా నావళి రూర్జితా తనుభృతాం స్వర్గాప్తి నిశ్రేణికా॥ 8 మాచక్షోణిపతి. 9. వేమాధిపో 10. తస్యానుజోవేమనృపస్య మాచక్షితీశ్వరో లబ్ధమహీ విభాగః ।శ్రీకొండపల్లీం నిజరాజధానీం కృత్వా సుఖీ దీవ్యతి ధర్మ ధుర్యః. 11 కులమివ విపులం యశో యదీయం త్రిజగతి వేష ఇవో జ్వలః ప్రతాపః। వితరణమివచ శ్రుతం విశాలం భవతిచ వాక్య మివోర్జితం చరిత్రం. 12 జ్ఞాతాయది నహిదాతా దాతాచేత్కోపి భువి నచ జ్ఞాతా, జ్ఞాతా దాతాచభవన్ పెదకోమటి మాచభూపతిర్జయతి. 13 నస న్వాం పాలయ న్నుర్వీ ముర్వీశకులశేఖరః యం దత్తవా నగ్రహారం తద్దానప్రక్రియోచ్యతే । శాకాబ్దే రసరామరామవసుధా సంఖ్యే జయే వత్సరే। మార్గే కృష్ణ బుధాన్విత ప్రతిపది ప్రాప్తే రవౌ కార్తుకం। స్వర్గాప్త్యై పెదకోమటి క్షితిపతేః శ్రీబల్యపల్లీపురం। ప్రాదాత్తూర్క్య పోతనాఖ్యవిదుషే మల్లేశ్వరస్యాంతికే । అకలంకసకలభాషా కవితా మూర్ధాభిషిక్తాయ, విద్వన్నిరూఢరాజాస్థానసుధాంభోధి పూర్ణచంద్ర మసే. గద్యశ్రీబాణకవేః పద్యేపి తథైవ కాళిదాసకవేః, తూర్క్య బన్నయ సుధియః పౌత్త్రీయ యజుర్విధిజ్ఞాయ। ఉజ్జ్వలతరాష్టభాషా కవితాసామ్రాజ్యపట్టబంధస్య, పుత్త్రీయాన్నయ సుకవేః శ్రీభారద్వాజ గోత్రాయ, ఆనుజ్ఞేన పాణిబదరీకృత పాణినిఫణిత ఫణితిమార్గేణ, త్రిపురారిసుకవిమణినా సంస్మరయిత్రే సలక్ష్మణం రామం పాల్గుమి శ్రీకంఠగురోః పంచాక్షరమంత్ర పౌనరుక్తస్య, శిష్యాయ శిష్యపరిష ద్రక్ష దాక్షిణ్యసత్కృటాక్షస్య, దత్వాగ్రహారం వెల్నాండౌ సాహ్లేశ్వర్యం

నృపాలకః తస్య శ్రీపెదకోమటి పురనంజ్ఞా మకల్పయత్, లబ్ధ్వాసపోత నారోపి గ్రామం శ్రీమాచభూవరాత్ । శ్రీకృష్ణాపృష దున్మేష ముషితాశేషకల్మషం।పంచాశీత్యంశరూపేణ విభజ్యాస్మి న్నదాత్కృతీ। తృతీయాంశం పితృప్రీత్యై విద్వద్బ్రాంధవరాజయే। సీమాచిహ్నాని దేశభాషయా లిఖ్యంతే..... స్వదత్తా మిత్యాది ॥ విద్యాన్నావయ నారణ్ణనామా శ్రీమాచ భూపతేః॥ ఆకరోద్వచసాం భూమిః నిర్మలం ధర్మశాసనం। శ్రీజగ నొబ్బగండస్య.

లోకల్ 48 వాల్యం చెఱుకుమిల్లిలో దొరికిన తామ్రశాసనము:

ఈ శాసనము మీదిశాసనమందు దాతయయిన పెదకోమటి మాచారెడ్డి కుమారుడగు తిప్పయరెడ్డిది. ఇది పెద్దశాసనము. దీని నుండి యించు కంత యుదాహరించుచున్నాను:

శాకాబ్దే గిరిరామవిశ్వగణితే భాద్రే గురౌ మాస్మధే, కృష్ణాయాం పులినే గణాధిపచతుర్థ్యా మేకమూరుం పురం।మాచాఖ్యం విదితాష్టభోగమతులం శ్రీతిప్పభూపాలకః। ప్రాదాదెల్లయ బుక్క (బంక?) మల్లపమహీభృత్యాయ నిత్యాదరాత్..... మలాపహారిణీ భీమరథ్యంతర్వేది సంస్థితమ్। భోగైశ్వర్యాష్ట సంయుక్త మేకమూరుం పురోత్తమమ్। ప్రతాపరుద్ర దేవస్య భాండాగారాధిపస్యచ । యల్లమా మల్లనార్యస్య పౌత్రాయ గుణశాలినే। యల్లయామాత్యచంద్రస్య సూనవేనయశాలినే। శ్రీపరాశరగోత్రాయ యజుశ్శాఖాయధీమతే। బంక మల్లాఖ్య విప్రాయ దేవార్చన పరాయచ। ఆచంద్రతారకం ప్రాదాత్ శ్రీమాన్ తిప్పమహేశ్వరః ..... పెదకోమటి మాచేంద్ర నూనోస్తి

వ్వమహీపతేః । విద్వాన్నరహరిస్స్వస్తు (?) మకరో ద్ధర్మశాసనం । శారీమాత్రక్షేత్రం శాసనం భవనార్థమేకాంశం। భావయ నరహరి విదుషేప్రాదా ద్భీబంకమల్లయామాత్యః

కల్వపాముల శాసనము.

1. శ్రీనాథస్య వరాహదివ్యవపుషో వః పెతు దంష్ట్రా చిరం
న్యాతోస్నీతమహీతలోపరితటీ నిర్యాత శృంగాంకురా
యామాత్మీయ జలోదితాం శశికలా మాశంక్య జాతః క్షణం
సౌహార్దేన విజృంభమాణసలిలారంభో మహాంభోనిధిః.

2. లీలాద్యూతజితాం 3. భవతుభవతాం 4. తమోహరేతాం 5. యన్మౌళౌ 6. తస్మాదధూత్ ప్రోలయవేమనామా 7. వేమక్షితీశో వృషమేకపాదం 8. మాచక్షోణిపతిః 9. వేమాధిపో మాచవిభుశ్చ 10. చూడామణిర్నృపాణాం 11. అభిమన్యుకరగ్రాహ్యం 12.సోయం వేమమహీపాలో 13. శాకాబ్ధే రసనేత్రాగ్ని చంద్రసంఖ్యముపేయుషి। తారణేవత్సరే పౌషే రాహుగ్రస్తే దివాకరే। పితుః పితామహోయస్య బ్రహ్మవిద్యా పితామహః । ఆసీ ద్భీమేశ్వరోవిద్వానగ్రణీస్సోమపాయినామ్। వషట్కృత పురోడాశే శ్రీభీమేశ్వరయజ్వని। కృష్ణవేణ్ణా తటా న్యాసన్నావసాత్రిదివౌకసామ్।షట్కర్మకర్త్ర శాలావప్రక్రియా పరమేశ్వరః।పోతయాఖ్యో మహావిద్వా నాసీదస్యపితామహః।పుండరీకదృశో విద్యాఖండచంద్రభృతోభిధా । గుండయార్యఃపితా యస్య మండనం బ్రహ్మసంతతేః। బ్రహ్మ సూర్యాదిసిద్ధాంత సింధుమంథన కాదిణా। జ్యోతిషజ్యోతిషా యేన త్రైకాల్య మవరోషితం। తారకబ్రహ్మ తత్త్వార్థస్తాపించదళమేచకం। లక్ష్మణానుచరంధామ రామాఖ్యం యస్య

దైవతం అహర్నిస పతంతూనాం యేన గోదావరీతటే। శూలాని పాప చోరాణాం యూప స్తంభాः ప్రతిష్ఠితాः। తన్మైహరితగోత్రాయ యజురాహ్నాయవేదినే, నిత్యాన్నదాన వ్రతినే శ్రీమతే పెద్దియజ్వనే, ప్రదాత్రీ లింగవిషయే ఖండవాటాహ్వయేస్థలే । కల్వచములునామానాం గ్రామ మాచంద్రతారకం। శ్రీరాఘవేశ్వర ప్రీత్యై ధారా పూర్వం ధరాధిపః॥ అస్యగ్రామస్య సీమాచిహ్నాని దేశభాషయా లిఖ్యంతే—కలువపాములు వేమవరానకుం దూర్పునకు వంటిపెగడ పొలిమేరదగ్గఱిన కుంట తూర్పుగట్టుమీందిరావి. అందుండి దక్షిణమై పోంగ జమ్మిచెట్టున్ను పుట్టను, ఆపుట్టకు దక్షిణముఖమైన కునినుండి తీగకోడు దాంటి ఆగ్నేయముఖమై పోంగాను నల్లఁబుట్టమీందంగాను, ఆగ్నేయాన వన్నేఱుమోచె. ఆవన్నేటిదరే పడుమఱుముఖమై రాంగా నంత నుండి కునిగా నుత్తరపుముఖమై రాంగా నంతనుండి కునిగా నప్పడిన్ని పడుమటిముఖమైవచ్చి బెల్లంకుల పుట్టమోచెను, ఆ పుట్టమోచేకునిగా నుత్తరముఖమైవచ్చి పంటకోఱు మోచెను. దక్షిణానకు కాటూరిపొలము సందునకు ఆపంట కోట ఆవలిదరి నై ఱుతికి కాటూరికిఁబోయీ బండి దెరువుదాంటి ఆకోటి అద్దరే పడుమటికి వన్నేటి మూలను కోడు ఉత్తర ముఖమై దాంటి నందమూరి పొలిమేర శిలా స్తంభము – వాయవ్యా నకు నాగులచింత ఉత్తరానకు కుంటాను ఇట్టిక నూయిన్ని ఈశాన్యా నకు మట్టికోటి అద్దరిని ఒఱలనూయి, సీమలు, స్వదత్తా – విద్యాధి కారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేः – శ్రీవీరనారాయణస్య –

కసుకుఱ్ఱు తామ్రశాసనము.

1. కళ్యాణం జగతాం, 2. లీలాద్యూతజితాం, 3. భవతు భవతాం, 4. తమోహరేతాం 5. యన్మౌళినిహితం 6. తస్మాదభూత్

7. వేమక్షితీశో, 8. మాచక్షోణిపతిః 9. వేమాధిపో మాచవిభుశ్చ, 10. చూడామణి ర్నృపాణాం. 11 యత్కీర్తిగాన 12 సోయంవేమ మహీపాలః (ఇటుతర్వాత కొంత చాటుక్యశాసనము చేరియున్నది.) శాకాబ్దేశర నేత్రాగ్ని చంద్ర సంఖ్యముపేయుషి, తారణే వత్సరే పౌష్యే రాహుగ్రస్తే దివాకరే, ప్రాదాత్త్రిలింగ విషయే వెల్నాండౌ పుణ్యసీమని, తుంగభద్రా తరంగిణ్యాః ప్రతీరే పర్యవస్థితం, గ్రామం కసువుకుట్టాఖ్యం సాష్టభోగాష్టభూతికం.....అస్యగ్రామస్య అష్టదిక్సీమా చిహ్నాని శిలా స్తంభాః, పూర్వతః తుంగభద్రా, దక్షిణతః పొటికవాగు, పశ్చిమతః తుంగభద్రా, ఉత్తరతః తుంగభద్రా - స్వదత్తా దిత్యాది - విద్యాధి - విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీ వేమ భూపతేః, అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనమ్.

పొన్నుపల్లి తామ్రశాసనము.

1. కళ్యాణం జగతాం, 2. లీలామృత, 3. భవతుభవతాం, 4. తమోహరేతాం, 5. యన్మౌళా, 6. తస్మాదభూత్ 7. వేమక్షితీశో 8. మాచక్షోణిపతిః, 9. వేమాధిపో, 10. చూడామణిర్నృపాణాం 11. అభిమన్యుకరగ్రాహ్యం 12. యత్కీర్తిగాన సమయే – సోయం వేమమహీపాలో భూపాల పరమేశ్వరః, భూదానవీరమూర్ధన్యో ధీరో దాత్త గుణోత్తరః, శాకాబ్దేరసనేత్రాగ్ని చంద్రసంఖ్యముపేయుషి, తారణే వత్సరే పౌష్యే రాహుగ్రస్త దివాకరే, పుణ్యాయాం కృష్ణవేణ్యాం శ్రీసోమేశ్వరసన్నిధౌ, సమక్షమగ్రహారేభ్యస్సమాయాత ద్విజన్మనామ్, మండూక శల్యవ్యధిత సర్పప్రాణాభిరక్షణాత్, అనేదుషాం పండితానాం కులేపరహితాభిధామ్, జాతాయాప స్తంభసూత్రే సూత్రమార్గానుసారిణి, కాశ్యపాయ యజుశ్శాఖాధ్యాయినేసుకృతాత్మనే, భూలోక

ధన్వంతరయే సతః పరహితస్య చ। పుత్త్రీయ భాస్కరార్యాయ పండితేంద్రాయ ధీమతే। శ్రీకొండవీటి సీమాయాం వెలనాటిస్థలే శుభే। కృష్ణవేణ్ణా మహానద్యా దక్షిణే రోధసి స్థితమ్। పొన్నుపల్ల్యాహ్వయం గ్రామం సర్వసస్యసమన్వితమ్। వాపికూపాది సహితం సాక్షోదక పూర్వకమ్। భుజ్యతాం త్వత్పుత్త్రిపౌత్రపారంపర్యా దితి బ్రువన్। కర్మణా మనసా వాచా ప్రాదా దచంద్రతారకమ్. ఆస్య గ్రామస్య చిహ్నాని దేశభాషయా లిఖ్యన్తే: పొన్నుపల్లివేమవరానకు తూర్పునను మూలనూతులకుంట, గంగులవానికుంట వాగునదిమి కలువలవాని కుంటను, గరుడని జువ్విన్ని, ఆగ్నేయానకు మోటవర సందివాగున్ను, దక్షిణానకు నెమ్మిళ్లకుంటవాగున్ను, నక్కతిప్పలున్ను, నైఋతికి గోనెల కుంటలసందుకు వచ్చేవాగున్ను, వదిరెవాగున్ను పడమటికి గుళ్లపల్లిచెరువున్ను, మల్లమచెరువున్ను, చవటకుంటలు రెండున్ను, వాయవ్యానకు గురువుకుంట, వుత్తరానకు కర, యీశాన్యానకు బండ్లదొంక, మొగదొంకను రాంగాను వాగర్తను వెలగకుంటాను తొగకుంటాను సీమా చిహ్నాలు—స్వదత్తామిత్యాది. విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః ఆకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనం॥

పొన్నుపల్లె తామ్రశాసనము. II

1 కళ్యాణం జగతాం, 2. లీలాద్యూత, 3. భవతుభవతాం, 4. తమోహరేతాం, 5. యన్మౌళౌ, 6. తస్మాదభూత్, 7. వేమక్షితీశో, 8. మాచక్షోణిపతిః 9. వేమాధిపో !0. చూడామణిర్న్నృపాణాం 11. యత్కీర్తిగానసమయే 12. సోయం వేమమహీపాలో భూపాల పరమేశ్వరః। భూదాన వీరమూర్ధన్యో ధీరోదాత్త గుణోత్తరః। ఖరామరామేందుమితే శకాబ్దే సర్వధారిణి। ఉపరక్తే సహస్రాంశౌ మాసే

చాశ్వయుజాహ్వయే। నప్తేర్ శ్రీ పెర్యవిళ్లన్య కళ్యాణగుణశాలినః। ఆర్ష్టికాణాం సాంగానా మాద్యానాం వచసాం విధేః। శ్రీభటభాస్కరా
ర్యస్య పౌత్రాయబహ్మవాదినః। అష్టాదశానాం విద్యానా మధ్వన్యన్య
మహద్వసు। పుత్రాయవిళ్లయార్యస్య వేద వేదాంగ వేదినః। ఆయుర్వే
దంచ సాష్టాంగం నిర్మిరోధమధీతినే॥ 16 ఫణిరాజ మహాభాష్యఫక్కి-కా
వర మేష్ఠినే । కర్మబ్రహ్మపరామర్శ మీమాంసా మాంసళాత్మనే । 17. కణభుగ్గర్ధిత గ్రంథి సింధుమంథానభూభృతే । అక్షపాదమత
పేర్ష పక్ష్మలీకృతచేతనే। 18. తనై్మ కాశ్యపగోత్రాయ సింగనార్యాయ
ధీమతే। శాంతాయ శివభక్తాయ యజురామ్నాయవేదినే। 19 ప్రాదా తిక
లింగవిషయే వేల్నాండోర్వీవిసీమని। కృష్ణవేణ్ణాంతరంగిణ్యాః ప్రతీరే
పర్యవస్థితమ్। 20. పొన్నుపల్ల్యాహ్వయం గ్రామం నిధానం సస్యసంప
దామ్। సాష్టైశ్వర్యం సాష్టభోగం ధారాపూర్వం ధరాధిపః 21. అస్య
గ్రామస్య చిహ్నాని దేశభాషయాలిఖ్యంతే..... ఈశాన్యానకు పిన్న
కుంటసీమలు-శ్రీనాథభట్టరుశాసనాచార్య దక్షిణభాగం వకటి - స్వదత్తా
మిత్యాది. విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః ॥

నందమూరు తామ్రశాసనము.

1. కళ్యాణంజగతాం 2. లీలాద్యూతజితాం 3. భవతుభవతాం
4. తమోహరేతాం 5. యన్మౌళానిహితం 6. తస్మాదభూత్ 7. వేమ
క్షితీశో 8. మాచక్షోణిపతిః 9. వేమాధిపో 10. చూడామణిర్నృపాణాం
పెదకోమటి వేమభూపతిర్జయతి 11. సోయంవేమమహీపాలో భూపాల
పరమేశ్వరః। భూదానవీరమూర్ధన్యోధీరోదాత్తగుణోత్తరః। శ్రీశాకాబ్దే
రామరామరామవంద్రాభిసమ్మితే। ఖరమార్గతిథియోదశ్యాం సితాయాం
చావగేరవౌ, పరవాదీభసింహస్య నృసింహస్యమహాత్మనః। ప్రణమ్తే వేద

వేదాంగ విద్యావిద్యోతితాత్మనః సోమసుత్సార్వభౌమస్య శ్రీభీమేశ్వర యజ్వనః। పావనోభయదంశస్య పౌత్రాయామితౌజసః। అకర్తృకాణాం సాంగానామాద్యానాం వచసాంనిధేః। పౌత్త్రీయపోతిభట్టస్య పవిత్రాచారశాలినః। పుత్త్రీయ గుండయార్యస్య పాండిత్యేంద్రపురోధసః। మండితస్య యశోహారైః శరకాండవిపాండుభిః। బ్రహ్మసూర్యాది సిద్ధాంతజ్ఞాన వైజ్ఞానికాత్మనేశ్రీరామ మంత్రోపనిషద్విద్యా విష్కృతి వేశ్మనే। నిత్యాన్నదాన శౌండాయ బ్రహ్మవర్చస శాలినే। అస్మై హరిత గోత్రాయ ధీమతే పెద్దియజ్వనేపాదాత్త్రిలింగ విషయే కంద్ర వాటాఖ్యసీమని। శ్రీనందమూరు నామానం గ్రామం పారే మలాపహం అస్య గ్రామస్య సీమా చిహ్నాని దేశభాషయా లిఖ్యన్తే .... విద్యాధికాగ్ శ్రీనాథో వీర శ్రీవేమభూపతేః। అకరోదాకరో వాచాం నిర్మలం ధర్మశాసనమ్॥ వీరనారాయణస్య.

ఆలపాటివేమవరం తామ్రశాసనము.

1. కళ్యాణంజగతాం 2 లీలాద్యూత 3. భవతుభవతాం 4. తమోహరేతాం 5. యన్మౌళినిహితం 6. తస్మాదభూత్ 7. వేమక్షితీశో 8. మాచక్షాణి 9. వేమాధిపో 0. చూడామణిః 11. సోయం వేమమహీపాలో 12. శ్రీశాబ్దే పయోరాశి రామరామేందు సమ్మితే। నందనే మాసిమాఘ్యే శివరాత్ర్యాం రవిగ్రహే। పితుః పితామహో యస్య మహనీయ యశోనిధేః। మాధవో నామ మేధావీ విశ్వవిద్యావిహారథూః। పితామహో మహావిద్వాన్ యస్య శ్రీగుండయార్యధీః। వేదాదీనాం విశుద్ధానాం విద్యానాం జన్మమందిరం। శాపానుగ్రహదక్షో లక్ష్మీనరసింహమంత్రసంసిద్ధః। సకలకవిసార్వభౌమో మాధవభటః పితా యస్య। శ్రీవిశ్వేశ్వర విదుషే భారద్వాజాన్వయావతంపాయ

స్మయనిరహితాయ తస్మై విద్యావినయాన్వితాయ పుణ్యాయ। ప్రాదాత్త్రిలింగవిషయే వెల్నాండౌ మనోరమే। తుంగభద్రాతరంగిణ్యాః ప్రతీరే పర్యవస్థితం। ఆలపాడురితిఖ్యాతం గ్రామమాచంద్రతారకం। సాష్టైశ్వర్యం సాష్టభోగం ధారాపూర్వం ధరాధిపః। అస్య గ్రామస్య సీమాచిహ్నాని దేశభాషయాలిఖ్యన్తే....స్వదత్తాత్. విద్యాధికారీ శ్రీనాథో పీంశ్రీ వేమభూపతేః। అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనమ్॥ వీరనారాయణస్య.

రుద్రవరం తామ్రశాసనము

1. కళ్యాణంజగతాం 2. లీలాద్యూతజితాం 3. మానుషాకార 4. తమోహరేశం 5. యన్మౌళౌ 6. తస్మాదభూత్ 7. వేమక్షితీశో 8. మాచక్షోణిపతిః 9. చూడామణిర్న్నృపాణాం 10. అభిమన్యుకర గ్రాహ్యం 11. యత్కీర్తిగానసమయే 12. శ్రీశైలేస్థిరమూలతాం 13. శాకాబ్దేశశివార్థివిశ్వగణితేవర్షే వికార్యాహ్వయే। మాసే మార్గశిరో భిధే గ్రహపతౌ చాపంపమానేదుషి। సోయం విప్రగణాయ వేదవిదుషే ధారాపయఃపూర్వకం। గ్రామం రుద్రవరాహ్వయం గుణనిధి శ్రీవీర నారాయణః॥ (క్రియాపదములేదు.) 14 అథాస్మిన్ వేమభూపతినా సాష్టైశ్వర్యం సాష్టభోగంచ సర్వమాన్యతయా దత్తే కోటభూమి విభూషణే రుద్రవరనామనిగ్రామే వేదశాస్త్రపారంగతాః శ్రౌతస్మార్త అనుష్ఠాననిష్ఠా అనూపానసంతతయః ప్రతీగ్రహీతారో వర్ణ్యంతే 15 బ్రహ్మ సూర్యాది సిద్ధాంతరహస్యార్థైకవేదినా। జ్యోతిషజ్యోతిషాయేనతై త్రికాల్య మపరోషితం 16. సోయం పోతయభట్టస్య నప్తా గుండయభట్టస్య పౌత్త్రిఃపెద్దియజ్వనఃపుత్త్రిఃగంగాధరజ్యోతిషికాగ్రజన్మా రామచంద్ర

జ్యోతిషికః హరితగోత్రః త్రయస్త్రింశద్యాగః ఖత్యాది – గ్రామసీమా చిహ్నాలు.స్వదత్తామిత్యాది – విద్యాధికారీ శ్రీనాథోవీరశ్రీ వేమభూపతేః.

మూలఁగూరమ్మ కొండమీఁది శాసనము.

ఈ శాసనమును అమీనాబాదుకుపోయి, నేనే పరిశీలించి వచ్చితిని. అది కొండమీద గుడికడ జారుబండపై చెక్కబడియున్నది. ఇరువది బంతులున్నవి. 8 1/2 బఁతులు స్పష్టముగా చెక్కఁబడినవి. అవి యిం దుదాహరింపఁబడిన రెండుపద్యములు. 11 1/2బంతులు అక్షరములు పయిపయినిజెక్కఁబడినవి గావున కొంతకొంత చెఱిగిపోయినవి, చదువరాకున్నవి. అందు పడిదరము మూలఁగూరు పలకలూరు గ్రామముల సీమాచిహ్నాలు వ్రాయఁబడినట్టు కొంతకొంత చదువఁదగియుండుటచేఁ దెలిసికొనఁగల్గినాను. "విశ్వోత్తరుం డన్నవేమభూపాలుండు" అని స్పష్టముగా శాసనమునఁ గానవచ్చుచున్నది. ఆ రెండు సీస పద్యములు నొక్కనిచేఁ జెక్కఁబడినవే. పెదకోమటి వేమారెడ్డినాటివే మొదటిపద్యము అనవేమారెడ్డిధర్మమును జెప్పునదే.

సీ. శాకాబ్దములు సహస్రమును నిన్నూంట తొం
బదియెనిమిది యగు భవ్యసంఖ్య
గలిగి యొప్పారెడు నలవత్సరంబున
మాఘమాసము పూర్ణిమా దినమున
విశ్వోత్తరుం డన్న వేమభూపాలుండు
తమకులస్వామిని కమ్మతకిరణ
రేఖావతంసకు శ్రీమూలఁగూరమ్మ
కఖిలజగన్మాత కంగరంగ

శృంగారశ్రీనాథము

గీ. భోగసంసిద్ధికై ధారవోసియిచ్చె
గ్రామములు మూఁడు శ్రీకోటభూమియందుఁ
బదిదరము మూలగూరంబ (న) పల్కలూరు
దానఖచరేంద్రు డాచంద్రతారకముగ.

సీ. కర్మపరిపాప్త సామ్రాజ్యసింహాసనా
ధ్యాసియై యఖిలరాజాధిరాజ
పరమేశ్వరుం డాజిపార్థుండు పెదకోమ
టన్న వేమాధీశుఁ డర్థిసురభి
తనకూర్మి పినత్రండి యనవేమభూపతి
చేసినపుణ్య మూర్జితముగాఁగ
నీ గ్రామములుమూఁటి కెల్లకాలంబు భో
గైశ్వర్యసర్వమాన్యతల నొనఁగె

గీ॥ నంబికకు మూలఁగూరమ్మ కఖిలజనని
కర్థిఁగట్టించె భువన మోహనముగాఁగ
సమధికోన్నతి నఖంకషంబులైన
గుడియుఁబ్రాకారవలయంబుఁ గొమరుమిగుల.

కొండూరు శాసనము.

ఇది గొప్పత్రమశాసనము. అముద్రితము. ఓరియంటల్ లైబ్రరీలోనున్నది. విస్తరభీతిచే సమగ్రముగా నుదాహరింపఁ జాల కున్నాడను. శ్లో. మఱిచి బ్రహ్మణఃపూర్వం బ్రహ్మణ్యం కాశ్య పోఽజని । జగత్పితామహో యస్య సాక్షాద్దేవఃపితామహః.... తద

న్వయే సముత్పన్నా బ్రహ్మణ్యాబ్రహ్మవాదినః । యజ్ఞానస్సర్వ్వ యజుషాం దృష్టాంతా దృష్టివావనాః । తేషాం మహోన్నతే వంశే సంజాతో రాజభూషణః। సువృత్తో రుచిరః కశ్చిన్ముక్తామణిరివద్విజః । సర్వజ్ఞతా మనితరాస్పద మీశ్వరత్వం । లోకోత్తరం సుచరితం జిత మన్మథత్వం । ఆతుప్రసాదమపి సత్ఫలదం విలోక్య । యం చంద్ర భూషణమితి ప్రవదంతి లోకాఃఃఃవిశ్వం విస్తయతే య స్స్వగుణ గ్రామైః ప్రతిక్షణం ససర్వజ్ఞః క్రియాశక్తి రాత్మా యస్య తపోమయః ....తస్య శ్రీచంద్రభూషణాచార్యస్య చరణసరసిజ ... రాజాధిరాజో మహారాజ పరమేశ్వర శ్రీమన్మహామండలేశ్వర శ్రీగిరిబుక్క భూపాలః ... చంద్రభూషణాచార్యాయ.... రిపుబలారణ్యసమున్మూలన నిజభుజశ్రమవిజయమహోత్సవం . .సమర్పితవాక్-కించ శ్రీగిచంద్ర భూషణాచార్యపదపంకజయో స్తథా గ్రామం కొండూరునామానం బుక్కక్ష్మాపతిరార్పయత్. .. యతీంద్రస్య క్రియాశక్తిగురోః ప్రీతయే శ్రీచంద్రభూషణాచార్యాఃఃఃకొండూరునామానం గ్రామం ద్విపంచాశ ద్బ్రాహ్మణేభ్యఃప్రజాయ క్రియాశక్తి గురోరుపదేశయతి నామ్నా తస్య గ్రామస్య దేవేశపురమితి నామ కృత్వాక్.

నవనాథచరిత్ర పీఠికనుండి.

ద్వి. ఒకనాఁడు మద్గ్రాగ్యయోగంబుకతన, శ్రీమహనీయ ప్రసిద్ధిఁ బెంపెసఁగు, శ్రీమల్లికార్జున శ్రీమహాలింగ, సర్వలోకోత్తమ సామ్రాజ్యభార, నిర్వాహకప్రౌఢనీతికోవిదుఁడు, కుహనావిరుదజైన కోలాహలుండు, మహితబిజ్జలరాయమానమర్దనుఁడు, సన్మతశైవ దీక్షగురుం డసమ, సన్నాహగజపతిసప్తాంగహరుఁడు, శ్వేతాంబర ప్రాణవితతజీమూత, జాతమహోదగ్ర జంఝూవిలంబు, పరసమయాం

భోధి బడబానలుండు. వరశరణాగత వజ్రిపంజరుఁడు, మలయ మౌక్తిక కంఠమాలిక మెఱయఁ, గరభూషణంబుల గలవజ్రిరుచులు, పరగి నభోమణిప్రభలపై నడఁగతళతళ మను నవతంస మాణిక్య, లలిత కాంతులు కపోలములపై బొలయ, సవరగాఁ జుట్టిన జడల నెట్టె మునఁ, జివురుకెంజాయమించిన పాగమెరయ, పొలుపుగాఁ గర్పూర ముగ మేళవించి, పలుచగా నలఁదిన భసితాంగరాగ, సన్నుతోజ్జ్వల కాంతిచంద్రికల్ జనుల, కన్నులఁగల్వలకు వికాసంబు నెఱప, పరిమళ వర్గము గొల్వ రజితాద్రిమీఁద పరిమదమారఁగనున్న పరమేశుఁడనగ ....రూఢికెక్కిన మునీంద్రులు తత్త్వవిదులు, మఱి పదవాక్యప్రమాణ జ్ఞులగుచు, బరగువిద్వాంసులు బహువిధకావ్య, నాటకాలంకారనైపుణీ జాల, జాటువ కెక్కిన సత్కవీశ్వరులు, నలరాగదోషంబు లాఱు నెన్నిదియుఁ, దొలఁగించి గుణము లైదును రెండునెలమిఁ, దలకొని గాతర్యంతర్యిమ్ములనేర్పు, గలిగి వానికి నెక్కు గాయకోత్తములు,... దొరలు భృత్యులు సమాత్యులు పురోహితులు, పరిచారకులు రాయ బారులు వైద్య, వరులు దైవజ్ఞులు వరుసతోఁ గొలువ ... నిరుపమ శివతత్త్వ నిర్మలమతికి, పావనునకు సర్వభాషావిశేష, కోవిదునకు రాయగుణశిఖామణికి, దుర్వారజైనసింధురమృగేంద్రునకు, సర్వజ్ఞు నకు ముకిశాంతరాయనికి.

దాక్షారామ శాసనము.

''శకవర్షంబులు ౧౩౦౩గు నేంటి వైశాఖ శు ౧౦గు''

సీ. నందిదీపావళి నాట్యకల్యాణహో
మ శనివారగయార్క మండపములు
తిరు చుట్టుమాలియ దివ్యలింగంబులు
గుళ్లు వజ్రింపు శాకోటగోపు

రములు పాతాళగేహములు సోపానభాం
డాగార వివిధధాన్యాలయములు
వంటయిండ్లు (?) సతుర్ద్వారవాటములు (ను)
ప్రేమదాక్షారామ భీమనాథు

గీ. నగరనాచందర్శితారకోన్నతులు దిశల
వెలయజేయించె ననవేము (వేచురాను?)
విజయచండర్థమునిఁ జగనొబ్బగండఁ
డహిత ఖండనోద్ధతదోర్దండమండనుండు.

సీ. అమరాద్రిభీమేశ్వరావాస మబ్ధిస
ప్తకము శ్రీసప్తగోదావరంబు
వలయాచలేంద్రింబు వజ్రిపుత్రాకోట
కులపర్వతంబులు గోపురములు
తిరుచుట్టుమాలియ యరవిందజాండ మ
మర్త్యలోకము నాట్యమండపంబు
పరివారదేవతా భవనంబు లీచతు
ర్దశభువనమ్ములు (దా) రకములు

గీ కనకకుంభతతులుగాఁగ దాక్షారామ
మన్నవీ (పోతఁ) వేమనానుజుండు
కడు నపూర్వసృష్టిగావించి వాసన
కెక్క (శ్రీవేమ నియతయశుఁడుఁ)

—ప్రకాశభారతీయోగి కావ్యము.



శృంగారశ్రీనాథము

కొన్ని సవరణలు

	పుట.	పంక్తి
శృంగారశ్రీనాథము	9	
సౌష్ఠవము	20	2
నుద్బోధ	20	18
బోషించె	58	2
సాధకము	65	23
ప్రధాన	80	23
సుగంధ	81	2
గృతి ఇచ్చుట సంగత.	240	23
మగును	241	1
ధారము	260	13
మిన్నం	264	18

ఈ గ్రంథము

ఆంధ్రప్రదేశ ప్రభుత్వమువా రొసగిన

ఆర్థిక సహాయము మూలమున ముద్రింపబడినది